

www.andhrajyothy.com


ఆంధ్రజ్యోతి

పేజీలు: 16 + 20



గురువారం | 31-8-2017 | సంపుటి: 14 సంచిక: 52 | వెల: రూ. 5.00 | శ్రీహేవళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, బాద్రపదమాసం, శుక్లపక్షం; తిథి: దశమి పూర్తి; నక్షత్రం: మూల తె. 4.47 తదుపరి పూర్వాషాఢ; వర్జ్యం: ఉ. 10.51-12.39, రా. 2.59-4.47; దుర్ముహూర్తం: ఉ. 10.12-11.02, మ. 3.09-3.58; అమృతఘడియలు: రా. 9.37-11.25; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.05; సూర్యాస్తమయం: 6.27 | నిజామాబాద్ సిటీ*

Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tanuku | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai



మోదీ.. నల్లధనం ఏదీ?

నోట్ల రద్దు ఫలితం.. హళ్లికి హళ్లికి సున్నకు సున్న

- ఫలితమివ్వని పెద్దనోట్ల రద్దు
- వెనక్కిరానిది ఒక్క శాతమే
- మిగిలిన రూ.16 వేల కోట్లకు
- కొత్త నోట్ల ముద్రణ ఖర్చుకు సరి

2 నెలలు జనానికి నరకం.. వచ్చింది నల్లధనమే కావచ్చు: జైట్లీ

న్యూఢిల్లీ, ఆగస్టు 30: 2017 నవంబరు 8వ తేదీ.. రాత్రి 9 గంటల సమయం! 'నేటి నుంచి పెద్దనోట్లు రద్దు' అని ప్రధాని మోదీ ప్రకటించగానే... సామాన్యులు సంబరపడ్డారు. ఇక 'డబ్బున్నోళ్ల పని అయిపోయినట్లే' అని అనుకున్నారు. ఆ డబ్బును ప్రధాని మోదీ తమ జన్‌ధన్ ఖాతాల్లోకి వేస్తారని ఆశపడ్డారు. అయితే... ఆ ఆశలన్నీ అడియాసలే అయ్యాయి. 'పెద్దనోట్ల రద్దు ఒక విఫల ప్రయోగం కానుంది' అని జాతీయ, అంతర్జాతీయ ఆర్థిక నిపుణులు చేసిన విశ్లేషణే ఇప్పుడు నిజమవుతోంది. రద్దయిన నోట్లు 99 శాతం తిరిగి బ్యాంకులకు చేరాయని ఆర్బీఐ ప్రకటించింది. రాని సొమ్ము విలువ కేవలం రూ.16 వేల కోట్లేనని తేల్చింది. అంటే ఉన్న వాడి డబ్బు పోలేదు. సర్కారు వద్దకు చేరలేదు. లేని వాడి వద్దకు రాలేదు. అసలు నల్లధనమన్నది ఉందో లేదో తెలియని మాయగా మారింది. రద్దయిన పాత 500, వెయ్యి నోట్ల విలువ 15.44 లక్షల కోట్ల రూపాయలు! ఇందులో కనీసం 3లక్షల నుంచి

మిగతా 11వ పేజీలో...


11

రద్దైన నోట్లలో 99% బ్యాంకుల్లోకి

- నోట్ల రద్దు ప్రకటించే నాటికి చలామణిలో ఉన్న నోట్ల విలువ రూ. 15.44 లక్షల కోట్లు
- వెనక్కి వచ్చింది రూ. 15.28 లక్షల కోట్లు
- **బ్యాంకింగ్‌లోకి రానిది 16,050 కోట్లే**
- నోట్ల లెక్కలు విప్పి చెప్పిన రిజర్వుబ్యాంకు

విద్యుత్ సంస్థల్లో ఔట్ సోర్సింగ్ ఔట్!



- విధానాన్ని రద్దు చేసిన ప్రభుత్వం
- సీఎండీ ప్రభాకర్‌రావు ఉత్తర్వు
- వాళ్లూ ఇక కాంట్రాక్ట్ కార్మికులే
- ఒకటో తారీఖునే నేరుగా జీతాలు

5

70 సంవత్సరాలకే క్వాంటమ్ పింఛన్!

- వయో పరిమితి కుదింపు.. కదిలిన ఫైలు
- పెన్షనర్లకు బస్సు చార్జీల్లో 50% రాయితీ!

5

ప్రైవేటు పాఠశాలల జమా ఖర్చులివ్వండి

- డీఈవోలకు విద్యాశాఖ ఆదేశం
- సెప్టెంబరు 15 వరకు గడువు

5

ఎక్సైజ్ పాలసీ రెండేళ్లే!

- లైసెన్సు ఫీజులు పెరగకపోవచ్చు



ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో రజత పతకాన్ని గెలుచుకున్న షట్లర్ సింధును, కోచ్ గోపీచంద్‌ను సన్మానిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్; చిత్రంలో హైదరాబాద్ మేయర్ బొంతు రామ్మోహన్ తదితరులు

బై నంబర్లకు స్వస్తి

- భూముల సర్వే నంబర్లకు స్పష్టత
- రైతుల ఆమోదంతోనే రికార్డుల శుద్ధి
- కోర్ బ్యాంకింగ్ విధానంలో నిర్వహణ
- రుణాలకు పాస్‌బుక్కులు అక్కర్లేదు
- ప్యూరిఫికేషన్‌పై సమీక్షలో కేసీఆర్

హైదరాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా భూ రికార్డుల ప్రక్షాళన జరగాలని ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపునిచ్చారు. లెక్కలన్నీ సవరించాకే రైతుల ఆమోదం తీసుకొని జాబితాను గ్రామాల్లో ప్రదర్శించాలని స్పష్టం చేశారు. భూమి రికార్డుల సమగ్ర ప్రక్షాళన ఆసాంతం

మిగతా 5వ పేజీలో...

గ్రామ సమితిలో రైతులంతా సభ్యులే!

- రేపటి నుంచే ఏర్పాటు
- సాగు అధికారులతో నేడు కేసీఆర్ భేటీ

5

రికార్డుల నవీకరణ ప్రాజెక్టు డైరెక్టర్‌గా వాకాటి కరుణ





పీఎస్‌యూల్లో క్రీమీలేయర్!

- గ్రూప్- ఏ,బీ ఉద్యోగస్థులకు ఓబీసీ రిజర్వేషన్ వర్తించదు
- కేంద్ర కేబినెట్ నిర్ణయం
- చిన్న ఉద్యోగులకు ఊరట

14











గుండె కోతలో అమెరికా తర్వాత మనమే

- ఏటా 1.40 లక్షల బైపాస్‌లు
- రోగుల్లో 87 శాతం పురుషులే
- మహిళ గుండెకు ఈస్ట్రోజన్ రక్ష
- సజ్జా ఫౌండేషన్ అధ్యయనం
- గుండె చికిత్సలో మనం ప్రపంచానికే గురువులం
- డాక్టర్ లోకేశ్వరరావు వ్యాఖ్యలు



హైదరాబాద్ సిటీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): అమెరికా తర్వాత భారతదేశంలోనే అత్యధికంగా ఏటా 1.4 లక్షల మందికి కరోనరీ ఆర్టరీ బైపాస్ ఆపరేషన్లు జరుగుతున్నాయని స్టార్ ఆస్పత్రి సీనియర్ కార్డియాక్ సర్జన్ డాక్టర్ లోకేశ్వరరావు సజ్జా వెల్లడించారు. వారం క్రితం న్యూయార్క్‌లో జరిగిన అంతర్జాతీయ కరోనరీ ఆర్టరరీ సదస్సులో పాల్గొని వచ్చిన ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. దేశంలో పది లక్షల మంది కరోనరీ ఆర్టరీ సమస్యతో బాధపడుతున్నారని, వారిలో కనీసం 4-5 లక్షల మందికి శస్త్ర చికిత్స అవసరమని చెప్పారు. 1-2 లక్షల మంది స్టంట్లతో, మిగిలిన వారు మందులతో కాలం వెళ్లదీస్తున్నారని ఆయన చెప్పారు. పెరిగిన సాంకేతిక వైద్య పరిజ్ఞానంతో దేశంలో హృద్రోగ మరణాలు తగ్గుముఖం పట్టాయని, శస్త్ర చికిత్సలు సత్ఫలితాలను ఇస్తున్నాయని తెలిపారు. గతంలో కరోనరీ ఆర్టరీ బైపాస్ శస్త్ర చికిత్స చేయించుకోవాలంటే విదేశాలకు వెళ్లే వాళ్లమన్నారు. ఇప్పుడు మన దేశంలో అవలంబిస్తున్న గుండె శస్త్రచికిత్స విధానాలను ఇతర దేశాల వారు అనుసరిస్తున్నారని, మన మార్గదర్శకాల ప్రకారం నడుచుకుంటున్నారని చెప్పారు. సజ్జా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు దశాబ్దాల కాలంలో 11,697 మందికి కరోనరీ శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు వెల్లడించారు. కరోనరీ ఆపరేషన్ల మీద తమ ఫౌండేషన్ ఒక అధ్యయనం నిర్వహించగా బాధితుల్లో 87 శాతం పురుషులేనని తేలిందన్నారు. శస్త్రచికిత్స చేయించుకున్న వారిలో 28 నుంచి 58 వయస్సు వారు ఉన్నట్టు చెప్పారు. ఇందులో మరణాల సంఖ్య 0.7 శాతం ఉంటోందని, ఉత్తమ వైద్య విధానాలే దీనికి కారణమని చెప్పారు. మహిళల్లో ఇస్ట్రోజన్ వల్ల కరోనరీ ఆర్టరీ జబ్బులు తక్కువగా వస్తున్నాయని చెప్పారు. పురుషుల్లో పొగ తాగడం, శారీరక శ్రమ తక్కువగా ఉండడం, అధిక బరువు, మద్యం కరరోరీ జబ్బులు ఉద్భతికి కారణమవుతుందని చెప్పారు. గుండెకు రక్తం సరఫరా చేసే నాళాలు చిన్నవిగా ఉండడం, మల్టిపుల్ బ్లాక్స్, గుండె పంపింగ్ సామర్థ్యం తక్కువగా ఉండడం వల్ల కరోనరీ ఆర్టరీ జబ్బులు పెరుగుతున్నాయన్నారు. గుండె పంపింగ్ సామర్థ్యం 60 శాతం ఉండాల్సి ఉండగా, 40 శాతం లోపే ఉంటోందని తెలిపారు. చాలామంది గుండె పంపింగ్ సామర్థ్యం తగ్గిన తరువాత వైద్యుల వద్దకు వస్తున్నారన్నారు. పరిస్థితి ఆపరేషన్ వరకు వచ్చిన వారిలో 40 శాతం మందికి మధుమేహం, 10 శాతం మందికి కిడ్నీ సమస్యలు, 20 శాతం మందికి ఉబకాయం, 30 శాతం మందికి బీపీ, కొలెస్ట్రాల్ సమస్యలు ఉన్నట్లు తెలిపారు.



ఆన్, ఆఫ్ పంపింగ్ రెండు సరైనవే

సజ్జా ఫౌండేషన్ నిర్వహించిన అధ్యయనంలో కరోనరీ ఆర్టరీ సర్జరీలో ఆన్ పంపింగ్, ఆఫ్ పంపింగ్... రెండు విధానాలూ మంచివేనని డాక్టర్ లోకేశ్వర్‌రావు సజ్జా వివరించారు. తాము చేసిన 11,697 కరోనరీ ఆర్టరీ సర్జరీల్లో ఆఫ్ పంపింగ్‌కు 4,433 మంది, ఆన్ పంపింగ్‌కు 4,433 మందిని ఎంపిక చేసి చికిత్సలు అందించినట్టు వివరించారు. 40 మంది డయాలసిస్ రోగులకు కూడా కరోనరీ ఆర్టరీ సర్జరీలు చేసినట్లు తెలిపారు. రెండు విధానాల్లో సమానమైన ఫలితాలు వచ్చాయన్నారు.



తొలి స్వదేశీ స్నైపర్ రెడీ!

పశ్చిమ బెంగాల్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో తయారీ

పరీక్షిస్తున్న కోల్‌కతా పోలీసులు.. సీఆర్పీఎఫ్, రాజస్థాన్, హరియాణాల నుంచి ఆర్డర్లు

కోల్‌కతా, ఆగస్టు 30: ఇక దేశ రక్షణకు మన కమాండోలు స్వదేశీ స్నైపర్ రైఫిళ్లను చేపట్టబోతున్నారు. ఉగ్రవాదులను తుదముట్టించేందుకు, వీవీఐపీల రక్షణకు స్నైపర్లే కీలకం. ఏళ్లుగా విదేశీ స్నైపర్లను వాడుతున్న భారత్‌కు ఇక ఆ అవసరం ఉండబోదు. తొలిసారిగా పశ్చిమ బెంగాల్‌లోని ఈశాపూర్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ స్వదేశీ స్నైపర్ రైఫిల్‌ను తయారుచేసింది. కోల్‌కతా పోలీసులు ఈ రైఫిళ్లను పరీక్షిస్తున్నారు. త్వరలోనే ఆ రాష్ట్రంలోని కమాండోలకు వీటిని అందిస్తారు. ఈ స్నైపర్ల కోసం ఇప్పటికే సీఆర్పీఎఫ్, హరియాణా, రాజస్థాన్ పోలీసు శాఖల నుంచి ఆర్డినెన్స్ ఫ్యాక్టరీకి ఆర్డర్లు అందాయి. ఈ స్నైపర్ తయారీ కోసం ఈశాపూర్ ఆయుధ కర్మాగారం దాదాపు ఏడాది పాటు పరిశోధనలు సాగించింది. ఎట్టకేలకు స్వదేశీ స్నైపర్ కలను సాకారం చేసింది.

స్వదేశీ స్నైపర్ వివరాలు

- ఈశాపూర్ స్నైపర్ సామర్థ్యం: 7.62 మిల్లీమీటర్లు
- రైఫిల్ బరువు: 6.7 కిలోలు
- లక్ష్యం ఛేదన దూరం: 800 మీటర్లు
- స్నైపర్ ధర: రూ.2.5 లక్షలు, పన్నులు అదనం.

నామినేటెడ్ పదవి దక్కలేదని టీఆర్ఎస్ నేత ఆక్రోశం

ఒంటికి నిప్పంటించుకుని..

- మంత్రి మహేందర్‌రెడ్డి ముందే ఆత్మహత్యాయత్నం

తాండూరు, ఆగస్టు 30: ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో మొదటి నుంచి పార్టీలో క్రియాశీలకంగా పాల్గొన్నా టీఆర్ఎస్ అధిష్ఠానం తనకు గుర్తింపు ఇవ్వడం లేదనే అసంతృప్తితో ఓ నేత ఒంటికి నిప్పంటించుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. సాక్షాత్తు మంత్రి మహేందర్ రెడ్డి సమక్షంలో వికారాబాద్ జిల్లా తాండూరులో చోటుచేసుకుందీ ఘటన. పట్టణంలోని సమద్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం తాండూరు పట్టణ టీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి మంత్రి మహేందర్‌రెడ్డి హాజరయ్యారు. పలువురు పార్టీ ప్రతినిధులు మాట్లాడుతుండగా, పట్టణ మాజీ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ వేదిక వద్దకు వెళ్లి మైక్ తీసుకున్నారు. 2004 నుంచి ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో పార్టీ తరఫున తాను చురుగ్గా పాల్గొన్నానని, పార్టీ కోసం అహర్నిశలు శ్రమిస్తున్నానని, అయినా ఇప్పటివరకూ తనకు ఏ నామినేటెడ్ పదవీ ఇవ్వలేదన్నారు. విషయాన్ని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. ప్రసంగాన్ని ముగించి బయటికి వెళ్లిన ఖాన్ అప్పటికే వెంట తెచ్చుకున్న కిరోసిన్‌ను ఒంటిపై పోసుకుని నిప్పంటించుకున్నారు. శరీరానికి అంటుకున్న మంటలతోనే అరుస్తూ సమావేశంలోకి వచ్చారు. కార్యకర్తలు, పోలీసులు మంటలను ఆర్పివేశారు. ఆయనకు ముఖం, ఛాతీ భాగాల్లో గాయాలయ్యాయి. మంత్రి ఆదేశాల మేరకు కార్యకర్తలు ఆయనను తాండూరులోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడితో సమావేశాన్ని రద్దు చేసిన మంత్రి వెంటనే హైదరాబాద్‌కు వెళ్లిపోయారు.





ఒంటికి నిప్పంటించుకున్న తాండూరు పట్టణ మాజీ అధ్యక్షుడు అయూబ్ ఖాన్



మగ్గంపైనే ఒరిగిన నేతన్న

భట్టిప్రోలు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): బతుకు బండిని లాగడానికి మగ్గాన్ని నమ్ముకున్న ఓ చేనేత కార్మికుడు చివరకు ఆ మగ్గంపైనే తుదిశ్వాస విడిచాడు. గుంటూరు జిల్లా భట్టిప్రోలులో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళగిరికి చెందిన మాచర్ల భావనారుషి(65) చేనేత కార్మికుడిగా జీవనం సాగిస్తున్నాడు. చెమటోడ్చి సంపాదించిన నగదు మొత్తాన్ని అగ్రిగోల్డ్‌లో డిపాజిట్ చేశాడు. ఆ డబ్బులు తిరిగి రాకపోవడంతో తీవ్ర ఆవేదన చెందాడు. కొద్దికాలంగా ఇతడి కుమార్తె ఉంటున్న భట్టిప్రోలులోనే ఇల్లు అద్దెకు తీసుకుని నివసిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో అద్దె కూడా కట్టడం భారంగా మారింది. ఈ క్రమంలో స్థానిక కొత్తపేట మగ్గాల షెడ్డులో నేత పనికి కుదిరాడు. ఇతడి భార్య కూలీ పనులకు వెళ్తోంది. బుధవారం పనికివెళ్లిన భావనారుషి... మగ్గం నేస్తూ ఒక్కసారిగా కుప్పకూలిపోయి మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.



మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ ముందే వాగ్వాదానికి దిగిన వంశీరెడ్డి

మంత్రి జగదీశ్‌రెడ్డి బామ్మర్దిని!

- మలక్‌పేట పీఎస్‌లో వ్యక్తి హల్‌చల్
- మహిళా ఏఎస్సై పట్ల అనుచిత ప్రవర్తన
- కన్నీటి పర్యంతమైన అధికారిణి

చాదర్‌ఘాట్/హైదరాబాద్, ఆగస్టు 30: ప్రమాదానికి గురైన కారు ఇన్సూరెన్స్ క్లెయిమ్ కోసం పోలీసుల నుంచి ధ్రువీకరణ పత్రం పొందేందుకు వచ్చిన వ్యక్తి పోలీస్ స్టేషన్‌లో నానా గలాటా సృష్టించాడు. తాను మంత్రి జగదీశ్ రెడ్డి బామ్మర్దినంటూ హల్‌చల్ చేశాడు. స్టేషన్‌లోని మహిళా ఏఎస్సై పట్ల అనుచితంగా ప్రవర్తించాడు. దరఖాస్తును పరిశీలించి ధ్రువీకరణ పత్రం ఇస్తామంటూ ఓపిగ్గా చెప్పినా వినకుండా ఆమెను ఉద్దేశించి నోటికొచ్చినట్టు మాట్లాడాడు. బుధవారం మలక్‌పేట పోలీస్‌స్టేషన్లో ఈ ఘటన చోటుచేసుకుంది. తోక తొక్కిన తాచులా నానా వీరంగం సృష్టించిన ఆ వ్యక్తి నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన జొన్నలగడ్డ వంశీరెడ్డి (35). ఫిర్యాదుదారుతో కలిసి స్టేషన్లోకి అడుగుపెడుతూనే రిసెప్షన్ కౌంటర్‌లో ఉన్న మహిళా ఏఎస్సై అనూరాధ పట్ల వంశీరెడ్డి దురుసుగా ప్రవర్తించాడు. అప్పటికీ ఆమె ఓపికతో.. "కూర్చోండి.. కేసు వివరాలను చూసి సర్టిఫికెట్ తయారు చేయిస్తాను" అని చెప్పినా విన్లేదు. ఇదివరకు ఇచ్చిన ఫిర్యాదు పత్రాల కాపీలను విసురుగా ఆమె ముందు పెట్టారు. తనకు మలక్‌పేట క్రైం ఇన్‌స్పెక్టర్ స్నేహితుడని, ఆయన ఫోన్ నంబరు ఇవ్వాలని గద్దించారు. సారు పైఅంతస్తులో ఉన్నారని చెప్పినా వినిపించుకోకుండా తాను మంత్రి జగదీశ్‌రెడ్డి బామ్మర్దినంటూ కేకలేశారు. ఠాణాలో ఉన్న మిగతా పోలీసులను ఉద్దేశించి.. ఇదేనా ఫ్రెం డ్లీ పోలీస్? అంటూ అరిచారు. వంశీరెడ్డి తీరుకు ఏఎస్సై అనూరాధ తీవ్ర మనస్తాపానికి గురై కన్నీరుపెట్టుకున్నారు. అక్కడే ఉన్న మలక్‌పేట అడ్మిన్ ఎస్సై ఎన్.రంజిత్‌కుమార్, ఎస్సై రమేశ్‌కు విషయాన్ని చెప్పారు. వారి వద్ద కూడా వంశీరెడ్డి తాను మంత్రి బామ్మర్దిననంటూ చెప్పుకొని, తన విషయంలోనే ఇంత నిర్లక్ష్యమా? అంటూ హల్‌చల్ చేశారు. అంతలో సీఐ గంగారెడ్డి రాగా ఆయనతోనూ వంశీరెడ్డి అదేవిధంగా మాట్లాడారు. ఈ మేరకు ఆయనపై కేసు నమోదు చేసినట్టు సమాచారం.

10 కోట్లతో తెలుగు ప్రవాసీ పరార్!

- కువైత్‌లో పోలీసులకు అరబ్బుల ఫిర్యాదు
- అతడికే పాపం తెలియదంటున్న స్నేహితులు

ఆంధ్రజ్యోతి, గల్ఫ్ ప్రతినిధి : కువైత్‌లో వ్యాపారం చేసే ఓ తెలుగు ప్రవాసీయుడు రూ.10 కోట్ల మేర అక్కడి వారిని మోసగించి పరారైనట్లు తెలుస్తోంది. ఏపీలోని తిరుపతికి చెందిన సదరు వ్యక్తి కువైత్ జాతీయుల నుంచి 1.6 మిలియన్ దినార్లు తీసుకుని మోసగించినట్లు చెబుతున్నారు. సదరు బాధితులు అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేసి, ఇంటర్‌పోల్ సాయంతో ఏపీ పోలీసులను కలిసేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. కువైత్‌లోని ఒక ప్రముఖ కాంట్రాక్టు సంస్థకు సామగ్రి సరఫరా చేయగా వచ్చిన బిల్లుతో పాటు పలువురు తెలుగు ప్రవాసీయుల నుంచి సేకరించిన డబ్బుతో అతడు అదృశ్యమైనట్లు తెలుస్తోంది. కువైత్‌లో వడ్డీ, వ్యాపార భాగస్వామ్యం కోసం తెలుగు ప్రవాసీయులు చాలా మంది అధిక మొత్తంలో దినార్లను ఇతడికి అందజేశామని బాధితులు వెల్లడిస్తున్నారు. కాగా, అతడి స్నేహితుల వాదన మరోలా ఉంది. అతను ఎక్కడికీ పారిపోలేదని.. తిరుపతిలోనే ఉన్నాడని, సరైన సమయంలో కువైత్‌కు తిరిగి వస్తారని చెబుతున్నారు. సామగ్రి సరఫరా చేసిన సంస్థ నుంచి అతడికి బిల్లు అందలేదని అంటున్నారు. తిరుపతికి వెళ్లకముందు తెలుగు ప్రవాసీయులకు 35 వేల దినార్లు తిరిగి చెల్లించాడని వెల్లడిస్తున్నారు.

మోకీలు ఇంప్లాంట్స్ ధరలపై పునరాలోచించాలి: ఉత్పత్తిదారులు

న్యూఢిల్లీ, ఆగస్టు 30: మోకీలు ఇంప్లాంట్స్ ధరల నియంత్రణపై కేంద్రం పునరాలోచించాలని వైద్యపరికరాల ఉత్పత్తిదారుల సంస్థ ఎమ్‌టాయ్ కోరింది. మోకీలు ఇంప్లాంట్స్ ధరలను జాతీయ ఔషధ ధరల ప్రాధికార సంస్థ(ఎన్‌పీపీఏ) నియంత్రించడంపై ఆందోళన వ్యక్తం చేసింది. ధరలపై సీలింగ్ విధిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని పునరాలోచించాలని ఎన్‌పీపీఏను కోరింది. ధరలను నిర్ణయించే సమయంలో ఇంప్లాంట్స్ సరైన వర్గీకరణను పరిగణనలోకి తీసుకోలేదని అభిప్రాయపడింది. ఈ నెల 25న ఇచ్చిన ఆదేశాల్లో మోకీలి ఇంప్లాంట్ చార్జీల్లో బోన్ సిమెంట్ చార్జీలు కూడా ఉంటాయని ఎన్‌పీపీఏ పేర్కొంది.

ఆపరేషన్ థియేటర్‌లోనే వైద్యుల వాదులాట



- గర్భిణీకి శస్త్ర చికిత్స చేస్తూనే తిట్ల దండకం
- నవజాత శిశువు మృతి.. డాక్టర్లపై వేటు

జోధ్‌పూర్, ఆగస్టు 30: ఓ నిండు గర్భిణీకి శస్త్ర చికిత్స చేయాల్సిన డాక్టర్లు ఆపరేషన్ థియేటర్‌లోనే పరస్పరం తిట్టుకున్నారు. ఆమె పొట్టను కోసిన విషయాన్ని మర్చిపోయి మరీ వాదులాడుకున్నారు. దీంతో శిశువు పుట్టిన కొద్దిసేపటికే మృతి చెందింది. ఈ ఘటన రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో మంగళవారం జరిగింది. ఉమ్మైద్ ఆస్పత్రిలో డెలివరీ కోసం అనిత అనే మహిళ చేరింది. సర్జరీ తర్వాత కడుపులోని శిశువు పల్స్‌రేట్ పడిపోతుండటంతో బీపీ చెక్ చేయడంపై గైనకాలజిస్టు అశోక్ నేనివాల్, అనస్తీషియన్ ఎంఎల్ తక్‌ల మధ్య వాదోపవాదాలు జరిగాయి. ఈ గందరగోళంలో నవజాత శిశువు పుట్టిన కొద్దిసేపటికే ప్రాణాలు విడిచింది. బాధ్యులైన డాక్టర్లను యాజమాన్యం సస్పెండ్ చేసింది.

ముగ్గేస్తున్న బాలికను ఎత్తుకెళ్లి..

గదిలో బంధించి అత్యాచారం.. యువకుడి ఘాతుకం

దుండిగల్/హైదరాబాద్: ఘోరం! ఉదయం వాకిట్లో ముగ్గేస్తున్న బాలికను అపహరించిన ఓ యువకుడు ఆమెను గదిలో నిర్బంధించి దారుణంగా అత్యాచారానికి ఒడిగట్టాడు! హైదరాబాద్ దుండిగల్ పరిధిలోని సూరారం కాలనీలో ఆలస్యంగా వెలుగుచూసిందీ ఘటన. నిందితుడు ఒడిగట్టిన దారుణాలపై బాధిత బాలిక పోలీసుల ఎదుట కన్నీటి పర్యంతమైంది. బాధితురాలు, పోలీసుల వివరాల ప్రకారం.. సూరారం కాలనీకి చెందిన బాలిక (13) మంగళవారం ఉదయం తమ ఇంటి ముందు ముగ్గు వేస్తుండగా మహేశ్ అనే యువకుడు అక్కడికి వచ్చి ఆమెను అపహరించాడు. ఓ గదిలో నిర్బంధించి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం బాలికను అదే గదిలోనే ఉంచి తాళం వేసి పారిపోయాడు. బాలిక కేకలు వేయడంతో గమనించిన ఓ వ్యక్తి దుండిగల్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు బుధవారం బాలికను స్టేషన్‌కు తీసుకెళ్లి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. గతంలోనూ మహేశ్ తనను వేధింపులకు గురిచేశాడని చెబుతూ ఆమె పోలీసుల విచారణలో కన్నీటిపర్యంతమైంది. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మహేశ్‌పై అత్యాచారం, వేధింపుల కేసు నమోదు చేసినట్టు సీఐ శంకరయ్య తెలిపారు. బాలికను వైద్యపరీక్షల నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలిస్తామన్నారు.

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
ఆదిలాబాద్	20.1	32.6
హైదరాబాద్	22.3	32.0
సంగారెడ్డి	23.0	31.0
నిజామాబాద్	23.9	28.9
నల్లగొండ	24.0	32.6
ఖమ్మం	26.0	33.0



లోక్‌పాల్‌కోసం మరో ఉద్యమం

"మోదీ ప్రభుత్వం వచ్చి మూడేళ్లు అయిపోయింది. లోక్‌పాల్, లోకాయుక్తల నియామకం కోసం ఆయనకు అనేక సార్లు లేఖలు రాశా. అంతేకాక రైతుల కష్టాలను తొలగించడానికి స్వామినాథన్ కమిటీ చేసిన సూచనలనూ అమలు చేయాలని కోరా. అయినా మోదీ స్పందించలేదు. ఇకనైనా త్వరితగతిన లోక్‌పాల్‌ను నియమించకపోతే మరోసారి ఉద్యమబాట పడతా"

- సామాజిక ఉద్యమకర్త అన్నా హజారే



అమెరికా సాయం పల్లీలతో సమానం

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆరోపిస్తున్నట్లు ఉగ్రవాదులకు అడ్డాగా మారిన ప్రాంతాలు పాకిస్థాన్‌లో లేవు. పాకిస్థాన్‌కు కోట్లాది రూపాయలు సాయం చేస్తున్నట్లు ఆయన చెబుతున్నారు. అది సరికాదు. నిజానికి అమెరికా చేస్తున్న సాయం పాకిస్థాన్‌కు టైంపాస్ పల్లీలతో సమానం. ఉగ్రవాదంపై పోరుకు ఇవ్వాల్సిన నిధులను కూడా అమెరికా చాలా నెలలనుంచి ఇవ్వడంలేదు.

- పాక్ హోంశాఖ మాజీ మంత్రి నిస్సార్

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్	డీజిల్
పాత ధర రూ.73.18	పాత ధర 61.94
కొత్త ధర రూ.73.22	కొత్త ధర 61.98
పెరుగుదల 4 పైసలు	పెరుగుదల 4 పైసలు

పెయిన్‌కిల్లర్స్‌తో కండరాల ముప్పు!

వాషింగ్టన్, ఆగస్టు 30: ఏ చిన్న నొప్పి వచ్చినా వెంటనే పెయిన్ కిల్లర్స్‌ను, ముఖ్యంగా ఐబ్రూఫెన్ మాత్రను వాడుతున్నారా? అయితే తస్మాత్ జాగ్రత్త! ఐబ్రూఫెన్ వంటి నొప్పి నివారణ మందులను తరచుగా తీసుకోవడం వల్ల కండరాల పెరుగుదల మందగిస్తుందట. స్వీడన్‌లోని కరోలిన్‌స్కా ఇనిస్టిట్యూట్ పరిశోధకులు ఈ విషయాన్ని వెల్లడించారు. ముఖ్యంగా కండరాల పెరుగుదల కోసం వ్యాయామం చేసే వారు తప్పనిసరిగా ఐబ్రూఫెన్ వంటి నొప్పి నివారణ మందులకు దూరంగా ఉండాల్సిందేనని వారు తేల్చిచెప్పారు. కఠినతర వర్కవుట్ల తర్వాత కండరాల పెరుగుదలను ఐబ్రూఫెన్ నియంత్రిస్తోందని తెలిపారు. మరికొన్ని ఇతర నొప్పి నివారణ మాత్రలు కూడా కండరాల పెరుగుదలకు అవరోధకాలుగా మారుతున్నాయని వెల్లడించారు.

నెమ్మదిగా నడిచేవారిలో గుండెపోటు ముప్పు!

లండన్, ఆగస్టు 30: స్వతహాగా నెమ్మదిగా నడిచే లక్షణం కలిగి ఉన్న వ్యక్తులు భవిష్యత్తులో గుండెపోటుతో మరణించే ప్రమాదం ఎక్కువని తాజా అధ్యయనంలో తేలింది. వేగంగా నడిచేవారితో పోల్చుకుంటే నెమ్మదిగా నడిచే వ్యక్తులు గుండెపోటు బారిన పడే ప్రమాదం రెండు రెట్లు ఎక్కువని ఆ అధ్యయనం వెల్లడించింది. 2006-2010 మధ్య సేకరించిన సమాచారం ప్రకారం యూకే బయోబ్యాంక్ ఈ విషయం బయటపెట్టింది. 4.2 లక్షల మందిని ఆరున్నర సంవత్సరాల పాటు పరిశీలించింది. వీరిలో నెమ్మదిగా నడిచే 8,598 మంది వ్యక్తులు హృద్రోగ జబ్బులు, కేన్సర్ల కారణంగా మరణించారని తెలిపింది. వేగంగా నడిచేవారిలో గుండెపనితీరు, రక్తప్రసరణ మెరుగ్గా ఉంటాయని, అవి వారిని హృద్రోగ ముప్పునకు, వివిధ కేన్సర్లకు దూరం చేస్తున్నాయని వెల్లడించారు.



కీచక హెచ్‌ఎం సస్పెన్షన్

హాలియా, ఆగస్టు 30: విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన ప్రధానోపాధ్యాయుడు గుండా కృష్ణమూర్తిని సస్పెండ్ చేస్తూ డీఈవో చంద్రమోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. నల్లగొండ జిల్లా అనుముల మండలం, హాలియా ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడని విద్యార్థినులు మంగళవారం డీఈవో, ఎంఈవోలకు ఫిర్యాదు చేశారు. స్పందించిన డీఈవో సీసీఏ రూల్ 1, 1991 ప్రకారం హెచ్‌ఎంను సస్పెండ్ చేస్తున్నట్లు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడన్న సమాచారం తెలుసుకున్న జిల్లా చైల్డ్ హెల్ప్ లైన్ సభ్యులు పాఠశాలను సందర్శించారు. విద్యార్థినులు వారి తల్లిదండ్రులతో విచారణ నిర్వహించారు. బాలికలకు ఎలాంటి సమస్యలు ఉన్నా1098కు ఫోన్ చేస్తే తక్షణమే స్పందిస్తామని సభ్యులు తెలిపారు.

కేసీఆర్ మాట నిలబెట్టండి

- జనవరికి భగీరథ నీళ్లివ్వాలి: కడియం
- రైతు సంక్షేమమే ధ్యేయం: అల్లోల
- రైతుల సమన్వయంతోనే సంఘాలు: జూపల్లి
- జనవరి నుంచి ఇంటింటికీ నీళ్లు: జగదీశ్‌రెడ్డి
- యాసంగికి 24 గంటల విద్యుత్: పోచారం
- మనుగడ కోసమే ప్రతిపక్షాల ఆరాటం: లక్ష్మారెడ్డి
- మా పాలన చూసి కాంగ్రెస్‌కు జ్వరం: తుమ్మల
- మత్స్య సహకార సంఘాలకు కొత్త కమిటీలు
- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్





మాట్లాడుతున్న కడియం, కళాశాలను ప్రారంభిస్తున్న పోచారం

ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్: కొత్త సంవత్సరం కానుకగా తెలంగాణ ప్రజలకు మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందిస్తానన్న ముఖ్యమంత్రి మాటను నిజం చేయడానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారు. బుధవారం హన్మకొండలో ప్రజాప్రతినిధులు, అధికారుల సమీక్షలో మాట్లాడుతూ డిసెంబర్ 31నాటికి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, అందులో భాగంగానే రైతు సమన్వయ సమితులను ఏర్పాటు చేస్తుందని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం వేంపల్లిలో ఏర్పాటు చేసిన రైతు కమిటీల సమావేశంలో మంత్రి మాట్లాడారు. సెప్టెంబర్ 1 నుంచి 9లోపు రెవెన్యూ గ్రామాల్లో రైతు సమన్వయ సమితుల ఏర్పాటు జరుగుతుందన్నారు. రైతుల సమన్వయంతోనే రైతు సంఘాలు పని చేస్తాయని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. వనపర్తి జిల్లా మదనాపురంలో మాట్లాడుతూ ప్రతి గ్రామంలో 15 మంది రైతులతో ఒక రైతు సంఘాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. వచ్చే ఏడాది జనవరి 1 నుంచి మూడు జిల్లాల పరిధిలో ప్రతి ఇంటికీ మిషన్ భగీరథ పథకం ద్వారా మంచి నీటిని సరఫరా చేయనున్నట్లు మంత్రి జగదీశ్ రెడ్డి తెలిపారు. సూర్యాపేట కలెక్టరేట్‌లో సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రి- భువనగిరి జిల్లాల కలెక్టర్లతో మిషన్ భగీరథ పనుల ప్రగతిపై మంత్రి సమీక్ష నిర్వహించారు. గడువులోగా పనులను పూర్తి చేసేందుకు క్షేత్ర స్థాయి ఉద్యోగులు పాటు పడాలన్నారు. వచ్చే యాసంగి నుంచి వ్యవసాయానికి 24గంటల విద్యుత్‌ను సరఫరా చేస్తామని మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా రుద్రూరులో 16.26కోట్ల వ్యయంతో నిర్మించిన ఆహార శాస్త్ర సాంకేతిక విజ్ఞాన కళాశాలను ఎంపీ బీబీపాటిల్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ దేశంలో ఆహార శాస్త్ర సాంకేతిక విజ్ఞాన కళాశాలు 12మాత్రమే ఉన్నాయని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన వెంటనే రుద్రూరులో ఈ 13వ కళాశాలను ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. మనుగడ కోసమే ప్రతిపక్షాలు ఆరాటపడుతున్నాయే తప్పా రైతులపై ప్రేమతో కాదని మంత్రులు జూపల్లి కృష్ణారావు, లక్ష్మారెడ్డి ఆరోపించారు. మహబూబ్‌నగర్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. ప్రాజెక్టులు పూర్తయితే పాలమూరు జిల్లాలో తమ ఉనికి ఉండదనే భయంతోనే ప్రతిపక్ష పార్టీల నాయకులు ధర్నాల పేరుతో ప్రజలను రెచ్చగొడుతున్నారని దుయ్యబట్టారు. కేంద్రం మంత్రిగా పనిచేసిన జైపాల్‌రెడ్డి సైతం తన స్థాయిని దిగజార్చుకొని, ప్రాజెక్టులపై మాట్లాడడం సరికాదని హితవు పలికారు. ప్రభుత్వ పాలన చూసి ఇక తమకు భవిష్యత్తు లేదనే బెంగతో ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్ నాయకులకు జ్వరం పట్టుకుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. ఖమ్మం రూరల్ మండలం, పెద్దతండాలో మాట్లాడుతూ రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులు నిర్మాణానికి ప్రభుత్వం కృషి చేస్తుంటే కాంగ్రెస్ నాయకులు వాటిని అడ్డుకుంటూ కోర్టులో కేసులు వేస్తున్నారన్నారు. రాష్ట్రంలో మత్స్య సహకార సంఘాలకు కొత్త కమిటీలను ఏర్పాటు చేస్తామని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సంగారెడ్డిలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గంగపుత్రులు, ముదిరాజు, తెనుగు జాతిలో పుట్టిన ప్రతి ఒక్కరికీ ఈ సహకార సంఘంలో సభ్యత్వం ఇవ్వడమే ప్రధాన లక్ష్యమన్నారు. సంగారెడ్డి జిల్లా పుల్‌కల్‌లో మాట్లాడుతూ మంత్రులు, ఎమ్మెల్యేలు మాతో టచ్‌లో ఉన్నారంటూ భట్టి విక్రమార్క ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నాయకులు సైతం టీఆర్ఎస్‌లోకి వచ్చే అవకాశాలున్నాయన్నారు.

నిజామాబాద్‌లో ఐటీ టవర్

- ఎంపీ కవిత



నిజామాబాద్: నిజామాబాద్ జిల్లాలో ఐటీ టవర్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని ఎంపీ కల్వకుంట్ల కవిత అన్నారు. బుధవారం నిజామాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించిన ఆమె.. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం మాట్లాడుతూ రాజధానితో పాటు జిల్లాలలో కూడా ఐటీ పార్కులు ఏర్పాటు చేసేందుకు సీఎం కేసీఆర్ నిర్ణయించారన్నారు. ఆయా జిల్లాల పరిధిలోని నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకే ఈ నిర్ణయమన్నారు. మొదట 25 కోట్ల రూపాయలతో ఐటీ టవర్‌ను జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేస్తామన్నారు. ఇంజనీరింగ్, ఇతర కోర్సులు చదివిన విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా జిల్లాలోనే ఉపాధి కల్పిస్తామన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ఉపాధి కల్పనే ధ్యేయంగా సీఎం కేసీఆర్ ముందుకు పోతున్నారన్నారు. నిజామాబాద్ జిల్లాను కూడా పారిశ్రామిక రంగంలో అభివృద్ధి చెందే విధంగా నిర్ణయం తీసుకున్నామన్నారు. వ్యవసాయ ఆధారిత జిల్లాలో ఫుడ్‌ప్రాసెసింగ్ ఇండస్ట్రీలను ఎక్కువగా తీసుకురావాలని నిర్ణయించామన్నారు. పతంజలి సంస్థను కూడా జిల్లాకు తీసుకువస్తామన్నారు. 200 ఎకరాల్లో 100 కోట్లతో యూనిట్ పెట్టేందుకు పతంజలి యాజమాన్యం ఒప్పుకుందన్నారు. జిల్లాలో పసుపుసాగు ఎక్కువగా ఉన్నందున ఆ పరిశ్రమలను నెలకొల్పాలని ప్రధాని నరేంద్రమోదీని కలిసి విన్నవించామన్నారు. జిల్లాలో పసుపు బోర్డును ఏర్పాటు చేయాలని కోరామన్నారు. జిల్లాలోని వ్యాపారవేత్తలు పరిశ్రమలు పెట్టేందుకు ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు.

టీఆర్ఎస్ సభలా ప్రజాభిప్రాయ సేకరణ

- మాజీ మంత్రి శ్రీధర్‌బాబు
- ప్రభుత్వాలవి ఉత్త మాటలే: పొంగులేటి సుధాకర్‌రెడ్డి

కాళేశ్వరం/ ఖమ్మం అర్బన్: కాళేశ్వరం ప్రాజెక్టు పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ సభలు టీఆర్ఎస్ పార్టీ సభల్లా సాగాయని మాజీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు విమర్శించారు. బుధవారం కాళేశ్వరంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వానికి రైతులపై ప్రేమ ఉంటే భూములు కోల్పోతున్న వారికి సరైన నష్టపరిహారం ఇచ్చి తమ ప్రేమను చాటుకోవాలని అన్నారు. ప్రజాభిప్రాయ సేకరణతో సభ పెట్టి టీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలతో మాట్లాడించారని, రైతులు సభలో మాట్లాడేందుకు ప్రయత్నిస్తే వారిపై కేసులు పెట్టారని, రైతులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లాలో రైతులకు ఒక రేటు, అన్నారం, సుందిళ్ల, కన్నెపల్లి, మేడిగడ్డ ప్రాంతంలో మరో రేటు కట్టి నష్టపరిహారం ఇస్తున్నారని, ప్రాజెక్టుకు అతి ముఖ్యమైన ప్రాంతమైన మేడిగడ్డ, కన్నెపల్లి, సుందిళ్ల ప్రాంతాల్లో రైతులకు కూడా సిద్దిపేటలో ఇచ్చిన విధంగా నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం రైతులకు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. నామినేటెడ్ పద్ధతిలో రైతు సమన్వయ సమితిలను ఏర్పాటు చేసి టీఆర్ఎస్ పార్టీ వారిని ఈ పదవుల్లో ఉంచేలా ప్రభుత్వం కుట్ర పన్నిందన్నారు.



శ్రీధర్‌బాబుకు పత్రాలు చూపిస్తున్న రైతులు

ప్రజా వ్యతిరేకతను తప్పించుకునేందుకే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాలను ప్రవేశపెడుతున్నాయని కాంగ్రెస్ శాసన మండలి నేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం ఖమ్మంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంపై వ్యతిరేకత నేపథ్యంలో ప్రజల దృష్టిని మరల్చేందుకు ప్రధాని మోదీ నోట్ల రద్దు, జీఎస్టీ వంటి అంశాలను తెరపైకి తేగా, ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలో కుంభకోణాలను కప్పిపుచ్చేందుకు రైతు కమిటీలు, సమగ్ర భూ సర్వే తదితర పథకాలను తెరపైకి తెస్తున్నారన్నారు. ఆంధ్రా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన లాబీయింగ్ ద్వారా ఆ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుతుండగా ముఖ్యమంత్రి కేసీఆర్ ఆ దిశగా కేంద్రం వద్ద ప్రయత్నించటం లేదన్నారు. కృష్ణా, గోదావరి జలాలను ఆంధ్ర రాష్ట్రం వినియోగించుకుంటోందన్నారు. బ్రిజేష్ ట్రిబ్యునల్ చివరి నివేదిక రాబోతున్న తరుణంలో రాష్ట్రానికి రావాల్సిన కృష్ణానీటి వాటా కోసం ముఖ్యమంత్రి గట్టిగా ప్రయత్నించాలన్నారు. తనకు ఉత్తమ రైతు అవార్డు వచ్చిందని గర్వంగా చెపుతున్న ముఖ్యమంత్రి రైతుల సంక్షేమం కోసం పటిష్ట చర్యలు చేపడితేనే ఆ అవార్డుకు సార్ధకత అన్నారు. పోలవరం ముంపు ప్రాంతాలు మరింత పెరగకుండా తెలంగాణ ప్రభుత్వం అడ్డుకోవాలన్నారు.

కోటి లాటరీ తగిలిందని టోకరా

- వ్యాపారి నుంచి 11 లక్షలు వసూలు.. నిందితుడి అరెస్టు

హైదరాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): లాటరీ పేరిట మోసాలు కొనసాగుతూనే ఉన్నాయి! కోటి రూపాయల లాటరీ తగిలిందని ఓ అజ్ఞాత వ్యక్తి ఫోన్ చేయడంతో ఉబ్బితబ్బిబ్బయిన ఓ వ్యాపారి వెనుకా ముందూ ఆలోచించకుండా దఫదఫాలుగా రూ.11 లక్షలు సమర్పించుకున్నాడు. మోసపోయానని తెలియడంతో సీఐడీ పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు కేరళకు చెందిన అంజా ఒత్‌కుమ్ పురత్ నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా నారాయణపేటకు చెందిన ఓ వ్యాపారికి ఇటీవల పురత్ ఫోన్ చేశాడు. రూ.25 లక్షల లాటరీ తగిలిందని, ప్రాసెసింగ్ ఫీజుగా రూ.25వేలు చెల్లిస్తే.. ఆ మొత్తం ఇస్తామని చెప్పాడు. విశ్వసించిన ఆ వ్యాపారి.. నిందితుడు సూచించిన ఖాతాలో రూ.25వేలు డిపాజిట్ చేశాడు. కొద్దిరోజులకు పురత్ మళ్లీ ఫోన్ చేసి.. లాటరీ మొత్తం రూ.కోటికి పెరిగిందని, ప్రాసెసింగ్ ఫీజుగా రూ.11 లక్షలు చెల్లించాలంటూ ఊరించాడు. అప్పటికీ ఏమాత్రం అనుమానం రాని వ్యాపారి.. అడిగినంత మొత్తాన్ని నిందితుడు చెప్పిన వేర్వేరు ఖాతాల్లో డిపాజిట్ చేశాడు. ఆ తర్వాత ఎలాంటి సంప్రదింపులు జరగకపోవడంతో సదరు ఫోన్ నంబరుకు ఫోన్ చేయగా స్విచాఫ్ వచ్చింది. దీంతో మోసపోయానని తెలుసుకున్న బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సైబర్ క్రైం కావడం, నిందితుడు విదేశాల్లో ఉండటంతో కేసు తదుపరి దర్యాప్తును సీఐడీకి బదిలీ చేశారు. ఐటీ చట్టంలోని వేర్వేరు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన సీఐడీ.. సాంకేతిక ఆధారాలతో నిందితుడి జాడ తెలుసుకుంది. నిందితుడు అంజా ఒత్‌కుమ్ పురత్ గత కొంతకాలంగా ఖతార్‌లో ఉంటున్నట్లు గుర్తించి లుక్ అవుట్ నోటీసుల జారీ చేశారు. చెన్నై నుంచి మలేషియా వెళ్లే ప్రయత్నంలో ఉండగా ఇమిగ్రేషన్ అధికారులు అతడిని రెండు రోజుల క్రితం అదుపులోకి తీసుకుని సీఐడీ పోలీసులకు సమాచారం అందించారు. చెన్నై వెళ్లిన సీఐడీ ప్రత్యేక బృందం పురత్‌ను అదుపులోకి తీసుకుంది. ఈ తరహా మోసాలకు పాల్పడి గతంలో సీఐడీకి పట్టుబడ్డ గ్యాంగులతో పురత్‌కు సంబంధం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడి నుంచి సెల్‌ఫోన్, బ్యాంకు పుస్తకాలు, పాస్‌పోర్టు స్వాధీనం చేసుకుని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని సీఐడీ చీఫ్ గోవింద్ సింగ్ వివరించారు.

ఎట్టకేలకు శాంతి

రెండు దేశాలను రెండున్నర నెలలుగా కుదిపేస్తున్న వివాదం ఇంత నిశ్శబ్దంగా సమసిపోయిందేమిటి? సరిహద్దులకు అటూ ఇటూ సైన్యాన్ని మోహరించి యుద్ధానికి కూడా సిద్ధమన్న దేశాలు ఇంత సులభంగా ఎలా రాజీపడ్డాయి? డోక్లామ్ వివాదంపై భారత్–చైనాలు గుట్టుచప్పుడు కాకుండా అవగాహనకు వచ్చేయడం ఉభయదేశాల ప్రజలనే కాదు, మిగతా ప్రపంచాన్ని కూడా ఆశ్చర్యపరిచింది. చైనాలో మరోవారంలో బ్రిక్స్ సదస్సు జరగబోతున్నందున, దానికి ప్రధాని నరేంద్రమోదీ హాజరు కావాలి కనుక ఇరుదేశాలు వేగంగా రాజీకి వచ్చాయన్నది ఒక వాదన. పది రోజుల క్రితమే, అంటే, తీవ్రత హెచ్చుస్థాయిలో ఉంటూ ఇరుదేశాల మధ్యా చర్చల సూచనలు ఏమాత్రం కనిపించనప్పుడే, హోమ్ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ త్వరలోనే ఈ సమస్య పరిష్కారం కాబోతున్నదని ఓ మాట అన్నారు. అంతకువారం క్రితమే చైనా లద్దాఖ్‌లో ఉద్రిక్తత సృష్టించిన నేపథ్యంలో ఈ ప్రకటన అనేకులకు ఆశ్చర్యం కలిగించింది. కారణాలు, అవసరాలు ఏమైనా కావచ్చును కానీ, డోక్లామ్‌లో దీర్ఘకాలం కొనసాగిన ఉద్రిక్తత తాత్కాలికంగానైనా సద్దుమణిగినందుకు ఇప్పటికైతే సంతోషించాలి.

యుద్ధంలోనే విజేతలు, పరాజితులు ఉంటారు. యుద్ధాన్ని నివారించుకున్నప్పుడు ఇద్దరూ విజేతలే. ఉభయదేశాల తొలి ప్రకటనల్లో ఎంతో తేడా ఉండి వుండవచ్చు. అనంతరకాలంలో వివరణలు, సవరణలు చేరివుండవచ్చు. ఇరుదేశాలూ ఈ ఉద్రిక్తతను చల్లార్చాలని ఒక నిర్ణయానికి వచ్చిన తరువాత ఎవరి ప్రయోజనాలకు అనుగుణంగా వారు ప్రకటనలు చేసుకోవడం సహజం. కానీ, ఒక నిర్ణయానికి వచ్చిన తరువాత ఇంతటి ఘర్షణలోనూ ఇరువురూ దానికి కట్టుబడటమే ముఖ్యమైన విషయం. ప్రకటనల విషయంలోనూ ఇరుదేశాలూ ఇతరుల అవసరాలను గుర్తించి గౌరవించుకున్న విషయం కనబడుతూనే ఉన్నది. ఎట్టకేలకు ఎవరిస్థానాల్లోకి వారు పోవడంతో పూర్వస్థితి ఏర్పడింది. రోడ్డునిర్మాణానికి సంబంధించిన పరికరాలన్నింటినీ చైనా అక్కడ నుంచి తరలించేయడం భారతదేశం ఒత్తిడి ఫలితమేనని చెప్పుకోవాలి. వాతావరణం అనుకూలించని కారణంగా ఈ ప్రతిపాదనను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు చైనా చెప్పుకుంది. రాబోయే రోజుల్లో ముఖ్యంగా వేసవికాలంలో చైనానుంచి సరిహద్దు వివాదాలు మరిన్ని తలెత్తవచ్చునని ఇప్పటికే అనుమానిస్తున్న నేపథ్యంలో, ఈ రోడ్డునిర్మాణం ప్రతిపాదన మళ్ళీ ముందుకు రావచ్చును. డోక్లామ్ వివాదంలో భూటాన్ తొలి ప్రకటనకు, మలి ప్రకటనకు తేడావున్నట్టుగానే, రాబోయే కాలంలో అది ఎలా వ్యవహరిస్తుందని చెప్పడమూ కష్టమే. భారత్–చైనా ఆధిపత్య పోరాటంలో ఇప్పటికే చైనావైపు భూటాన్ మొగ్గుతున్న సూచనలు కనిపిస్తున్నాయి.

డోక్లామ్ విషయంలో ఒక అవగాహన కుదరగానే, బ్రిక్స్ సదస్సుకు ప్రధాని నరేంద్రమోదీ హాజరవుతారని భారతదేశం ప్రకటించింది. ఈ వివాదం నేపథ్యంలో, ప్రధాని చైనాలో అడుగుపెట్టే అవకాశాలు లేవన్న ఊహాగానాలకు దీనితో తెరపడింది. బ్రిక్స్ సదస్సును కాదనుకొని పలురకాలుగా నష్టపోయే బాధ భారత్‌కు తప్పింది. ఈ సదస్సులో మోదీ జిన్‌పింగ్ భేటీతో ఇరుదేశాల మధ్యా పూర్వపు వాతావరణం ఒక్కసారిగా నెలకొనే అవకాశాలు లేవు కానీ, తిరిగి మెరుగుపడిన వాతావరణాన్ని కొంతకాలం కొనసాగించడానికి అది ఉపకరిస్తుంది. ఈ రెండున్నర నెలలూ రెండుదేశాల మధ్యా గతంలో ఎన్నడూ లేనంత అగాధాన్ని సృష్టించాయి. సర్వసాధారణంగా చిన్న విషయాలను కూడా పెద్దదిచేసే భారతదేశ టెలివిజన్ చానెళ్లు డోక్లామ్ విషయంలో ఆదిలో కాస్త హడావుడి చేసినా ఆ తరువాత ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా వ్యవహరించడం ఆరంభించాయి. మన సైనికాధికారులు కూడా మాట్లాడటం మానేశారు. కానీ, చైనా అధికారులు, దాని అధికారిక మీడియా మిగతా దేశాలను భయపెట్టినట్టుగానే భారతదేశాన్నీ చివరివరకూ బెదిరించే ప్రయత్నం సాగించాయి. నాధులా మార్గాన్ని మూసివేసి మానససరోవర యాత్రికులను కష్టాలపాల్జేయడంతో పాటు బలాలు, యుద్ధాలు, బలహీనతలు, పాఠాలు, పాటవాల గురించి పదేపదే గుర్తుచేస్తూ సరిహద్దులు కాపాడుకోవడానికి ఎంతకైనా తెగిస్తానంటూ చైనా బెదిరిస్తూ వచ్చింది. కానీ, ఈ కవ్వింపు చర్యలకు భారత్ కదలలేదు, ఒత్తిళ్ళకు లొంగలేదు. వెనక్కుతగ్గేది లేదన్న మాట మీద చివరివరకూ నిలబడిందే తప్ప నోరుపారేసుకోలేదు. చైనా–భూటాన్ మధ్య డోక్లామ్‌కు సంబంధించిన వివాదం కొలిక్కిరాకుండా, యథాతథస్థితిని కొనసాగించే స్థితిలోనే ఉన్నది కనుక, భూటాన్‌కు రక్షణగా నిలుస్తున్న తాను చైనా దూకుడును ఏమాత్రం సహించనని భారతదేశం చెబుతున్నది. సరిహద్దు వివాదాల కారణంగా పరిమితస్థాయి యుద్ధాలు చేయవలసి వచ్చినా వాణిజ్యం దెబ్బతిని ఆర్థికంగా తమకు తీవ్రనష్టం తప్పదని ఇరుదేశాలకూ తెలుసు. లద్దాఖ్ గొడవలో చైనా సైనికులు రాళ్ళే వాడారు తప్ప, బుల్లెట్లు కాదు. ఒక్క బుల్లెట్ పేలినా ఇక కాలు వెనక్కుతీసుకొనే వీలుండదన్న స్పృహ కోల్పోనంత కాలం ఇరుదేశాల మధ్యా ఈ తరహా స్వల్పస్థాయి ఘర్షణలు హద్దులు దాటవు. డోక్లామ్ కారణంగా భారత్–చైనా మధ్య ఉన్న పలు అంశాలు మళ్ళీ తెరమీదకు వచ్చాయి. సిక్కింతో సహా అనేకం ఈ కాలంలో అస్త్రాలుగా మారిపోయాయి. లద్దాఖ్‌లో చైనా వ్యవహారం గమనించినప్పుడు అది సరిహద్దుల విషయంలో ఇంతకాలమూ పాటించిన నియమాలను ఇక ఏమాత్రం గౌరవించదల్చుకోలేదని అర్థమవుతున్నది. అందువల్ల, భారత్–చైనా–భూటాన్‌లకు సంబంధించిన 2012 అవగాహన, భారత్–చైనా మధ్య మూడున్నరవేల కిలోమీటర్ల సరిహద్దు అభివృద్ధికి సంబంధించి 2013లో కుదిరిన అవగాహనల విషయంలో మళ్ళీ కృషి ఆరంభించక తప్పదు. ఇరుదేశాలూ వాటి కట్టుబడేందుకు పునరంకితం కావాలి. త్రైపాక్షిక, ద్వైపాక్షిక అవగాహనలు, ఒప్పందాల విషయంలో ఉదాసీనత ఏమాత్రం పనికిరాదు. చైనాతో స్నేహంగా ఉంటూనే జాగ్రత్తలో ఉండకతప్పదు.

సంచారజాతులకు ప్రత్యేక రిజర్వేషన్లు

రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులకు నోచుకోని దైన్యజీవులు... కులాల మధ్య అంతరాలు పోవాలని, సమాజం సమానంగా చూడాలని కోరుకున్నా అటు ప్రభుత్వాలు, ఇటు పార్టీలకు పట్టని అనాథ జాతులు... సమస్త సబ్బండ కులాలకు సామాజిక న్యాయం కలిగినా అదీ ఎరుగని అమాయక జాతులు... 70 ఏళ్ల భారత ప్రజాస్వామ్య చరిత్రలో సంచార జాతుల్లోని కులాలు విముక్తి కోసం తల్లడిల్లుతున్నాయనే చేదు నిజాన్ని ఇవాళ చరిత్ర గుర్తుచేస్తున్నా ఓటు బ్యాంక్ దిశగానే ఆలోచించే రాజకీయ పార్టీలు ఆలోచన చేయని వైనంపై ఇవాళ చర్చ జరగాల్సిన అవసరం ఉన్నది. బ్రిటిష్ కాలంనాటి చట్టాలకు బూజు దులపకపోవడం ఫలితంగా దశాబ్దాల తరబడి సమాజం వారిపై నేరగాళ్ల ముద్ర వేస్తూనే ఉంది. నేరగాళ్లుగా పుట్టకపోయినా, ఆ నేపథ్యం ఎరుగకపోయినా చేయని తప్పులకు వారిని ఇంకా బలిచేసే సాంప్రదాయం కొనసాగుతుండడం అవమానకరం. కేవలం బిచ్చగాళ్లనే నేరస్థులుగా ఎందుకు చూస్తున్నారనే సూదంటు ప్రశ్నలు సంధిస్తున్నా సూటి సమాధానాలు లేవు. ఆగస్టు 31 అనేది సంచార జాతుల్లోని విముక్తి జాతులకు ఓ సుదినం. వారి గురించి ఓ కమిషన్ చర్చించి వారంతా విముక్తి జీవులు అని చెప్పిన రోజు. విముక్తి జాతులపై అనేక అధ్యయనాలు, కమిషన్లు వేసి సానుకూల నివేదికలిచ్చినా ఏ ప్రభుత్వం వీరికి న్యాయం చేయలేదు. ఎందుకంటే వీరికి స్థిర నివాసాలు లేవు. ముఖ్యంగా ఓటు బ్యాంకు లేదు. అందుకే ఏ రాజకీయ పార్టీ అంతగా పట్టించుకోవడం లేదన్నది నగ్నసత్యం. తమకు అన్యాయం జరిగింది మొర్రో అని శతాబ్దాల తరబడి మొత్తుకుంటున్నా కొన్ని తరాలలోని అంతరాలు మారుతున్నా ఎందుకో ఆ చట్టాలు సంచార జాతులపై ఏనాడూ ఇసుమంతైనా ఆలోచించలేదు. ఒకవేళ ఆలోచన చేసినా రవ్వంత న్యాయం జరుగలేదు. పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణలు చేసినా సంచార జాతుల మీద ఇంతవరకు సెకను కూడా చర్చకు రాలేదు. ఏలిన నాటి పాలకులు, ఏలుతున్న పార్టీలు సబ్బండవర్గాల మేలు కోరుతున్నాయా అంటే అదీ లేదు. ఈ సమాజంలో సంచార జాతులం అని సగర్వంగా చెప్పుకునే వీలులేని దైన్య స్థితి ఇవాళ కనపడుతున్నది. ఆ జాతులను ఉద్ధరించలేకపోయినా ఫర్వాలేదు కానీ కనీసం జీవించే స్వేచ్ఛ పాలకులు హరింపచేస్తున్నారంటే మనం ఎక్కడున్నామని ఒక్కసారి చర్చించుకోవాల్సిన అవసరం ఉన్నది. ఏ పాపం చేయలేకపోయినా వారు శిక్షను అనుభవిస్తున్నారు. ఏ నేరం

సంచార జాతుల వారందరికీ రేషన్ కార్డులు, ఓటరు కార్డు, ఆధార్ కార్డులు జారీచేసి కనీసం వారిని సమాజంలో ఓ భాగమని గుర్తించాలి. వారి సంస్కృతీ సాంప్రదాయాలను పరిగణనలోకి తీసుకుని వారి కళలను ప్రోత్సహించి ఆ జాతుల పరిరక్షణకు తోడ్పడాలి.

చేయకపోయినా ఇప్పటికీ నేరగాళ్ల ముద్రే వేసుకుంటున్నారు. ఇవాళ సమాజంలో అందర్నీ మార్చుతున్న మనం సంచార జాతుల పట్ల ఎందుకు ఇంతవరకు ఆలోచన చేయలేదో పాలకులు ఆలోచించాలి.

తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా వెయ్యికోట్లతో ఎంబీసీ కార్పొరేషన్ ఏర్పాటుచేసినా సంచార జాతులకు అన్యాయం జరుగుతోంది. ఎంబీసీలో బలమైన కులాలకు ప్రాధాన్యం ఉన్నప్పుడు సంచార జాతులకు చోటెక్కడ లభిస్తుందో ఒక్కసారి అర్థం చేసుకోవాలి. అందుకే తెలంగాణ ప్రభుత్వం సంచార జాతుల కోసం ఓ ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుచేస్తే దాదాపు 80కి పైగా అనాథ కులాలను చేరదీసినట్లవుతుంది. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ కమిషన్ తరహాలో సంచారజాతుల కమిషన్ వేసి ఆ జాతుల స్థితిగతుల అధ్యయనానికి శ్రీకారం చుట్టాల్సిన అవసరం ఉన్నది. మహారాష్ట్ర, తమిళనాడు మాదిరిగానే సంచార జాతులకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలన్న వారి డిమాండ్‌ను ఆలకించాల్సిన అవసరం ఉన్నది. సంచార జాతుల వారి పిల్లలకు ప్రత్యేక రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటుచేసి, ఉచిత నిర్బంధ విద్య అమలుపరిస్తే విద్య పరంగా వృద్ధి చెందే అవకాశం ఉన్నది. సంచార జాతుల వారందరికీ, రేషన్ కార్డులు, ఓటరు కార్డు, ఆధార్ కార్డులు జారీచేసి కనీసం వారిని సమాజంలో ఓ భాగమని గుర్తించాలని ఆ జాతులు కోరుకుంటున్నాయి. వారి సంస్కృతీ సాంప్రదాయాలను పరిగణనలోకి తీసుకుని వారి కళలను ప్రోత్సహించి ఆ జాతుల పరిరక్షణకు తోడ్పడితే బాగుంటుంది.

తెలంగాణలో సంచార విముక్త జాతులు: బీసీ(ఏ) గ్రూపు : 1. బాలసంతు, బహురూపి 2. బుడుబుక్కల 3. దాసరి 4. దొమ్మర 5. గంగిరెద్దుల 6. జంగం 7. జోగి 8. కాటిపాపల 9. మేదర/మహేంద్ర 10. మొండివారు, మొండిబండ, బండ 11.వంశరాజ్ 12. పాముల 13. పార్ధి 14. పంబాల 15. పెద్దమ్మలవాళ్లు 16. ఎల్లమ్మల వారు, ముత్యాలమ్మల వారు 17. వీరభద్రియ/వీరముష్టి 18. వాల్మీకి బోయ (బోయ, బేదర్, కిరాతనిషాది, పెద్దబోయ, తలయారి, చుండ్రువాల్లు) 19. కంజరబట్ట 20. కెంపుమారే/రెడ్డిక 21. మొడిపట్ట 22. పరికి ముగ్గుల 23. యాటా 24. కైకాడి 25. జోషినందివాల 26. వడ్డెర (వడ్డి, వడ్డెలు, వడ్డీలు) 27. మందుల 28. కూమపులి 29. పట్రా 30. రాజన్నల/రాజన్నలు 31. గోత్రాల 32. కాశికాపడి/కాశికపుడి 33. సుక్ లీగర్ 34. పూసల. బీసీ(బీ) : ఆరెమరాఠీ/తోలుబొమ్మలవాల్లు/మరాఠీ బుడుబుక్కల. బీసీ(డీ) : కృష్ణ బలిజ. బీసీ(ఇ) : ఫకీర్, అత్తర్ సాయిబులు, జింకసాయిబులు, బోరేవాలె, పత్తర్ ఫోడా (కాశోళ్ల), తురకబుడిబుడికి, ఘంటి, ధర్వేష్, గారడి సాయిబులు, గుడ్డేలుగు సాయిబువు, ఎలుగుబంటి సాయిబులు, కీలుగుర్ర సాయిబులు, బొంతల సాయిబులు, కక్కుకొట్టే సాయిబులు. ఎస్సీ : 1. బేడబుడగ జంగం 2. దొంబార, పైడి, పానో, డోమ్ 3. సిందోళ్లు 4. డక్కలి 5. మాస్టీన్ 6. హోలియా దాసరి 7. రెల్లి 8. కొలుపువాళ్లు/పంబాల 9. గోసంగి 10. ఎల్లమ్మ వారు

గుర్తింపులేని జాతులు : 1. బాగోతుల 2. బొప్పలవారు 3. గంజికూటి వారు 4. శ్రీ క్షత్రీయ రామజోగి 5. ఏనూటి 6. గుర్రపువారు 7. అద్దపు వారు 8. కడారి/తైదరోల్లు 9. సరగాని 10. ఓడ్ 11. మాసకయ్యలు/ పరంవారు 12. సాధనాసూరులు 13. రుంజ, పనస 14. పెక్క 15. పాండవుల వారు 16. గౌడజెట్టి 17. ఆదికొడుకులు 18. తెరచీరల 19. కాకిపడగల 20. గపులి 21. బండార 22. సన్నాయి వాళ్లు, మొదలైనవారు.

■ **గుంటిపల్లి వెంకట్**

సీనియర్ జర్నలిస్ట్, సంచార జాతుల సంఘం జాతీయ కో కన్వీనర్

(నేడు సంచార జాతుల దినోత్సవం)

‘రాజధర్మా’నికి కొత్త దిక్సూచికలు

చరిత్రలో ఆయా ఘటనలు, సన్నివేశాల మధ్య పోలికలు చిత్రంగా ఉంటాయి. 2002లో గుజరాత్‌లో మతకల్లోలాల మారణహోమాన్ని పురస్కరించుకుని అప్పటి ప్రధాని అటల్ బిహారీ వాజపేయి ‘రాజధర్మా’న్ని పాటించమని నాటి ముఖ్యమంత్రి నరేంద్ర మోదీని ఆదేశించారు. ఇప్పటికీ ఈ మాట తరచూ ప్రస్తావనకు వస్తూనే ఉంటుంది. విచిత్రంగా ఇప్పుడు రాజధర్మాన్ని పాటించమని ఆదేశించవలసిన హోదాలో మోదీ ఉన్నారు. కానీ, రాష్ట్ర ప్రభుత్వాల తీవ్ర నిర్లక్ష్య వైఫల్యాలకు అద్దం పట్టిన ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్, హర్యానాలోని పంచకుల బాబా గుర్మీత్ సింగ్ ఉదంతాలలో ఆయన ఆ ఆదేశం ఇవ్వలేకపోయారు. వాజపేయి ఆదేశించిన రాజధర్మాన్ని తాను పాటించలేదన్న విమర్శ ఉంది కనుక ఇప్పుడు అలాంటి ఆదేశం ఇవ్వడం ఆ పాత చరిత్రను కెలకడమవుతుందని సంశయించారా, లేక వరస విజయాలను కట్టబెడుతున్న తన ఇమేజ్‌కి, పార్టీ, ప్రభుత్వాల ఇమేజ్‌కి దెబ్బ తగులుతుందని సందేహించారా అన్నది మనకు తెలియదు. ఇవి గాక వేరొక మౌలిక కారణం ఉండనే ఉంది. గత డెబ్బై ఏళ్ళుగా ఈ దేశప్రజలు అలవాటు పడిన రాజకీయ నైతిక ప్రమాణాలతో సహా అన్నిరంగాలకు చెందిన విలువలనూ, వ్యవహారశైలినీ బీజేపీ పునర్నిర్వచిస్తోంది. కేంద్రంలో మొదటిసారి లభించిన తిరుగులేని అధికారం, రాష్ట్రాల్లో సాధిస్తున్న అప్రతిహత విజయాలు, ఈ విజయాలకు మూలవిరాట్టుగా నిలిచిన నరేంద్ర మోదీ చుట్టూ నిర్మిస్తున్న కాంతివలయం ఈ పునర్నిర్వచన ప్రక్రియకు ఊతమిస్తున్నాయి. దీనిని అర్థం చేసుకోడానికి గోరఖ్‌పూర్, హర్యానా ఉదంతాలు రెండూ ముఖ్యమైన సూచికలు. గత మూడేళ్ళ పైచిలుకు పాలనలోనే మొదటిసారిగా అవి నరేంద్ర మోదీ ముందు అతి పెద్ద నైతిక ప్రశ్నను నిలబెట్టాయి.

అరవయ్యేళ్ళ క్రితం తమిళనాడులోని అరియలూరులో జరిగిన పెద్ద రైలు ప్రమాదానికి అప్పటి రైల్వే మంత్రి లాల్ బహదూర్ శాస్త్రి నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయడం ఇన్నేళ్లలోనూ రాజకీయ నైతికతకు, జవాబుదారీకి ఒక ముఖ్య కొలమానంగా ఉంటూ వచ్చింది. అప్పట్లో ఇప్పుడున్నంత విస్తృతీ, వైవిధ్యం కలిగిన మీడియా లేదు, పార్లమెంట్‌లో గట్టిగా గొంతెత్తి నిలదీసే ప్రతిపక్షం లేదు, ఇప్పటిలా ప్రజాభిప్రాయం పదునెక్కే అవకాశమూ లేదు. తనపైన ఎలాంటి ఒత్తిడీ లేకపోయినా లాల్ బహదూర్ రాజీనామా చేశారంటే కారణం, వ్యక్తిగత నైతిక ప్రబోధాన్ని అనుసరించడమే. కానీ ఇప్పుడు జవాబుదారీకి సంబంధించి మీడియా, ప్రతిపక్షం, ప్రజాభిప్రాయ రూపంలో రాజకీయనేతలపై ఎంతైనా ఒత్తిడి ఉంటోంది. అయినాసరే, అరవైమందికి పైగా పసిపిల్లల ప్రాణాలను బలిగొన్న గోరఖ్‌పూర్ ఉదంతంలో ముఖ్యమంత్రి కాకపోయినా కనీసం సంబంధిత మంత్రి అయినా రాజీనామా చేయలేదు. ఆపైన ఈ దారుణ శిశు మరణాలకు దారితీయించిన కారణాల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ పారదర్శకంగా వ్యవహరించలేదు. ప్రభుత్వం బకాయిలు చెల్లించనందువల్ల ఆక్సిజన్ సరఫరా నిలిచిపోవడమే పిల్లల మరణానికి కారణమన్న అభిప్రాయం ఆధారసహితంగా వ్యక్తమైనప్పటికీ నిజ నిర్ధారణకు స్వతంత్రప్రతిపత్తి గల దర్యాప్తునకు ఆదేశించలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో ‘దర్యాప్తు’ జరిపించి ఆక్సిజన్ సరఫరా లోపం మరణాలకు కారణం కాదని తేల్చి చేతులు దులుపుకున్నారు.

అలాగే, 36మంది మరణానికీ, వందల సంఖ్యలో గాయపడడానికీ, పెద్ద ఎత్తున ఆస్తి నష్టానికీ దారితీయించిన బాబా గుర్మీత్ సింగ్ ఉదంతంలో అడుగడుగునా రాష్ట్రప్రభుత్వ వైఫల్యం మరింత స్పష్టంగా కనిపించింది. ఆ వైఫల్యాన్ని హైకోర్టు వంటి ఉన్నత న్యాయస్థానం నిర్ద్వంద్వంగా ఎత్తిచూపి ప్రభుత్వాన్ని అభిశంసించింది. కర్తవ్యాన్ని ఆదేశించింది. ప్రధాని మొత్తం దేశమంతటికీ ప్రధాని తప్ప బీజేపీకి ప్రధాని కాదని అతి తీవ్రవ్యాఖ్య చేసింది. మీడియా నిప్పులు చెరిగింది. ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ తప్పుకోవాలనీ, లేదా తప్పించాలని ముక్తకంఠంతో డిమాండ్ చేసింది. ప్రజాభిప్రాయమూ రాష్ట్ర ప్రభుత్వాన్ని దోషిగా వేలెత్తి చూపించింది. అయినా ముఖ్యమంత్రి రాజీనామా చేయలేదు, పార్టీ నాయకత్వం చేయించలేదు. చేయించకపోగా ఆయన పరిస్థితిని సమర్థంగా ఎదుర్కొన్నారని కితాబు ఇచ్చింది. లాల్ బహదూర్ అనంతర కాలంలో అందరు రాజకీయ నాయకులూ, మంత్రులూ తమ వైఫల్యాలకు బాధ్యత వహిస్తూ రాజీనామా చేసి గొప్ప నైతిక నిష్ఠను చాటుకున్నారని నమ్మే అమాయకులు ఎవరూ లేరు. కానీ లాల్ బహదూర్ నెలకొల్పిన కొలమానం ఇప్పటికీ ఉనికిలో ఉండి తరచు చర్చలోకి వస్తూనే ఉంది. అవినీతి, ఇతర వైఫల్యాల గురించిన ఆరోపణలు వెల్లువెత్తినప్పుడు స్వచ్ఛందంగా కాకపోయినా అన్నివైపుల నుంచీ వచ్చే ఒత్తిడులకు తలవంచి మంత్రులు రాజీనామా చేసిన ఉదంతాలూ ఉంటూనే ఉన్నాయి. గత యూపీఏ ప్రభుత్వంలోనే ఇందుకు అనేక ఉదాహరణలున్నాయి. ఇప్పుడు కూడా ఉత్తరప్రదేశ్‌లో జరిగిన



రెండు రైలు ప్రమాదాలను పురస్కరించుకుని, తనపై పెద్ద ఒత్తిడి లేకపోయినా రైల్వే మంత్రి సురేశ్ ప్రభు రాజీనామా చేశారు కానీ ప్రధాని దానిని ఇంకా ఆమోదించలేదు. విచిత్రం ఏమిటంటే, తీవ్రతలో పై రెండు రైలు ప్రమాదాలను మించిన గోరఖ్‌పూర్, హర్యానా ఉదంతాలలో ఏ మంత్రీ రాజీనామా చేయలేదు. కనుక సురేశ్ ప్రభు రాజీనామాను వ్యక్తిగత నైతికత దృష్ట్యా తీసుకున్న చర్యగానే భావించాలి. ప్రత్యేకించి హర్యానా ఉదంతంలో రాజధర్మ విస్మరణ పతాకస్థాయికి చేరింది. హర్యానా–పంజాబ్ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని అతితీవ్ర పదజాలంతో అభిశంసించింది. అయినా ముఖ్యమంత్రి రాజీనామా చేయకపోవడం, కేంద్ర నాయకత్వం రాజీనామా చేయించకపోవడం, చేయించకపోగా ఆయనకు కితాబు ఇవ్వడం ఇంతవరకూ మనం అలవాటుపడిన రాజకీయనైతికతా ఊహల్ని పూర్తిగా తలకిందులు చేసి షాకిస్తున్నాయి. న్యాయస్థానాల వ్యాఖ్యలను కానీ, తీర్పులను కానీ లక్ష్మణరేఖలుగా భావించే ఆనవాయితీ నుంచి చూసినప్పుడు ఈ ధిక్కారం దిగ్భ్రాంతి కలిగిస్తుంది.

గత డెబ్బై ఏళ్ల అనుభవాల నుంచి రొటీన్‌గా చూసినప్పుడు, బీజేపీ కేంద్ర నాయకత్వ వ్యవహార సరళి ఎందుకిలా ఉందన్న ప్రశ్నకు సమాధానం దొరకదు. రాజకీయ నైతికతతో సహా అన్నింటినీ పునర్నిర్వచించడానికి పూనుకున్న ఆ పార్టీ భావజాలం నుంచి, రాజకీయ వ్యూహం నుంచి; వాటితో గాఢంగా అల్లుకున్న నరేంద్ర మోదీ మనస్తత్వం నుంచి చూసినప్పుడు సమాధానం దొరుకుతుంది. అవినీతికి అనేక ముఖాలు ఉంటాయన్న సంగతిని కాసేపు పక్కన పెట్టి, కేవలం ఆర్థికానికే పరిమితమై చెప్పుకుంటే వ్యక్తిగా మోదీ నీతి నిజాయితీలు, నిస్వార్థత ఇంతవరకు ఎవరూ వేలెత్తి చూపనివే, సందేహం లేదు. కానీ ఆయన ఒక అతి పెద్ద పార్టీ, ప్రభుత్వ యంత్రాంగాలకు సారథ్యం వహిస్తున్నారు. ఈ రెండింటికీ చెందిన అంచలంచెల వ్యవస్థలలో ఉన్న అందరి నీతినిజాయితీలకు, సామర్థ్యాలకు ఆయన హామీ ఇవ్వలేరు. సారథ్యం వహించే వ్యక్తిలో ఈ లక్షణాలు ఉన్నప్పుడు సహచరులలోని లోపాలను ఉపేక్షించవచ్చునన్నది ఆయన భావనగా కనిపిస్తుంది. రాజకీయ అవసరాలు, ఇతర దీర్ఘకాలిక లక్ష్యాలు కూడా ఈ ఉపేక్షకు ఎలాగూ దోహదం చేస్తాయి. తను గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పలువురు మంత్రివర్గ సహచరులపై వచ్చిన ఆరోపణలను మోదీ పట్టించుకోలేదు. ఇది అంతిమంగా వ్యక్తి ప్రాధాన్యవాదం. వ్యక్తినిర్మాణాన్ని నొక్కిచెప్పే ఆర్‌ఎస్‌ఎస్ భావజాలంలో దీని వేళ్ళు ఉన్నాయి. ఆయా వ్యవస్థల సారథ్యాన్ని అన్నివిధాలా ఉత్తముడైన వ్యక్తి చేతికి అందిస్తే అవి ఉత్తమంగా పనిచేస్తాయన్న ఫార్ములా దీని వెనుక ఉంటుంది. రకరకాల రీతి రివాజులు, నియమనిబంధనలతో ఆయా వ్యవస్థలను నిర్మించి, వాటి అదుపాజ్ఞలలో వ్యక్తిని ఉంచి పనిచేయించడం, పైదానికి భిన్నమైన ప్రక్రియ. మొదటిదానిలో వ్యవస్థలోని వక్రతను వ్యక్తి సరిచేస్తాడనుకుంటే రెండోదానిలో వ్యక్తిలోని వక్రతను వ్యవస్థ సరిచేస్తుందన్నమాట. బీజేపీ తనను భిన్నమైనపార్టీగా చెప్పుకోవడంలోని కీలకం, దాని వ్యక్తినిర్మాణవాదమే.


వ్యక్తి, వ్యవస్థలలో పూర్తిగా ఎటు ఒరిగిపోయినా తప్పే. వాటి మధ్య ఉండవలసింది సమతూకం. దానిని దెబ్బతీసే స్థాయిలో వ్యక్తిగత నైతికతాదృష్టి విశ్వరూపం ధరించినప్పుడు అది అహంకారంగా ప్రకోపించి వ్యవస్థలను ఆరోవేలుగా మార్చి అణగార్చివేసే ప్రమాదం తలెత్తుతుంది. యూపీఏ రెండో విడత పాలనలో పౌరసమాజం నుంచి పెద్ద ఎత్తున వచ్చిన లోక్‌పాల్ డిమాండ్‌ను అప్పట్లో బీజేపీ సమర్థించి కూడా ఇంతవరకు ఆ వ్యవస్థను ఏర్పాటు చేయకపోవడం ఒక ఉదాహరణ. గుజరాత్ ముఖ్యమంత్రిగా మోదీ లోక్ ఆయుక్త విషయంలోనూ ఇలాంటి ఆరోపణే ఎదుర్కొన్నారు. తమ ప్రభుత్వంలో, లేదా ప్రభుత్వ సారథ్యంలో ఉన్నవారు అందరూ నీతిమంతులు కనుక ఇలాంటి వ్యవస్థలు అవసరం లేదన్నది అందులోని సందేశం. యూపీఏ హయాంలో సుప్రీం కోర్టు సీబీఐని పంజరంలో చిలకగా వర్ణించినప్పుడు దానిని ప్రభుత్వంపై దాడికి వాడుకున్న బీజేపీ; ఇప్పుడు సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్, రిజర్వ్ బ్యాంక్ సహా ఆయా వ్యవస్థలను అలాగే పంజరంలోని చిలుకలుగా మార్చిందన్న విమర్శకు తావివ్వడం మరో ఉదాహరణ. గవర్నర్లతో సహా ఏ వ్యవస్థా ఇలాంటి విమర్శలకు అతీతంగా లేవు. సారథ్యం వహించే వ్యక్తి తప్పు చేసేవాడు కానప్పుడు వ్యవస్థల బాగోగులను పట్టించుకోనవసరం లేదన్న వైఖరి దీనికి మూలం.

వ్యక్తిప్రాధాన్యవాదం వికటించి వ్యవస్థలను నీరుగార్చినప్పుడు రాజధర్మం కూడా తారుమారు అవుతుంది. జనం ఊహలో ఉన్న నైతిక ప్రమాణాలను కూలదోసి అనైతికతనే నైతికతగా చలామణి చేయించే ధోరణి పుంజుకుంటుంది. గోరఖ్‌పూర్, పంచకుల ఉదంతాలలో జరిగింది, జరుగుతున్నది అదే. వ్యవస్థలను ఆరోవేలుగా మార్చే వైపరీత్యం చివరికి ఉన్నత న్యాయస్థానాలకు సైతం విస్తరించిన సంగతినే హర్యానా ఉదంతం వెల్లడిస్తోంది. వ్యక్తి, వ్యవస్థల ప్రాధాన్యాల మధ్య సమతూకాన్ని పాటించవలసిన అవసరాన్ని ఇప్పటికైనా గుర్తించకపోతే, వ్యవస్థలకు జరిగే నష్టం అనూహ్య ప్రమాణంలో ఉంటుంది. అవినీతిని ఆర్థికానికే కుదించి చెప్పుకున్నా అధికారంలో అలాంటి అవినీతి మరక అంటని నరేంద్ర మోదీలే కాదు, యడ్యూరప్పలూ ఉంటారన్న వాస్తవాన్ని గుర్తించినప్పుడు వ్యవస్థలను కాపాడుకోవలసిన అవసరం మరింతగా స్పష్టమవుతుంది.

■ **భాస్కరం కల్లూరి**

అన్నయ్యే కాదు... గురువు కూడా!

‘బాపు’ కలం పేరు కాదు, మానాన్నగారు గాంధీగారి మీద ఉన్న గౌరవంతో ముద్దుగా ఆ పేరుతో పిలిచేవారు. ఆ పేరు, ఆ మనిషి తెలియని తెలుగువారు లేరంటే అది అతిశయోక్తి కాదు.



నేను, మా అన్నగారు బాపు, రమణగార్ల తోపాటు చిన్నప్పటి నుంచి సుమారు 25 సంవత్సరాలు కలిసే వున్నాను. అది నా అదృష్టం. ఎంతో గర్వంగా భావిస్తూ వుంటాను. వాళ్ళిద్దరూ ఏ నిర్వచనానికి లొంగనివారు. వారి దగ్గర నేర్చుకొన్నవి ఎన్నో. బాపు నాకు అన్నయ్యే కాదు గురువు కూడా. ఎవరిలోనైనా ఒక మంచితనంగాని, టాలెంట్‌గాని ఉందని తెలిస్తే గుర్తించి వాళ్ళని ప్రోత్సహించడం వాళ్ళిద్దర్లో ఉన్న గొప్ప విషయం. అలాగే ఏదైనా కోపం తెచ్చుకున్నా వెంటనే సారీ చెప్పడం. వాళ్ళది విడదీయలేని స్నేహం, అనుబంధం. విడివిడిగా ఎవరికి వాళ్ళ ప్రత్యేకత ఉన్నా విడివిడిగా వాళ్ళ గురించి చెప్పటం కష్టం. రాత, గీత సమన్వయం. వాళ్ళు ఇద్దరూ మనమధ్య లేకపోయినా, సంవత్సరాలు దొర్లుతున్నా వాళ్ళ కృషిని, వాళ్ళ ప్రభావాన్ని మనం మరువలేము. బాపుగారు మనల్ని విడిచి వెళ్ళినా ఆయన చిరునవ్వు, అప్యాయత, నిరాడంబరత కొట్టొచ్చినట్లు గుర్తు చేసుకోని రోజంటూ నాకు లేదు. మరో గొప్ప చిత్రకారులు గొప్పగా అన్నట్లు అటువంటి గొప్ప చిత్రకారుడు, వ్యక్తి ప్రపంచంలోనే అరుదు. అలాంటి వ్యక్తులు మన తెలుగువారవడం మనం చేసుకున్న అదృష్టం. వారిని వారి కృషిని ఎల్లప్పుడూ స్మరించుకోవడం మన ధర్మం.

■ **సత్తిరాజు శంకరనారాయణ**

(నేడు బాపు వర్ధంతి)

అసలు లెక్క ప్రజలు తేలుస్తారు!

‘తెలంగాణకు ద్రోహం అంటే...?’ శీర్షికన ప్రొఫెసర్ హరగోపాల్ ఆగస్టు 19న రాసిన వ్యాసానికి సమాధానంగా శ్రీధర్‌రావు దేశ్‌పాండే, నల్లా విజయకుమార్ ఆగస్టు 24న ‘లెక్కతప్పిన ప్రొఫెసర్’ శీర్షికన వ్యాసంతో ప్రజలను తప్పుదారి పట్టించారు. ఇవాళ అధికారం చలాయిస్తున్న టీఆర్ఎస్ పార్టీ కానీ, తెలంగాణ ఇంజనీర్లు కానీ చాలా ఆలస్యంగా తెలంగాణ ఉద్యమంలోకి వచ్చారు. మహబూబ్‌నగర్ ప్రజలు కృష్ణానదిలో న్యాయమైన నీటి వాటా కోసమే 1995లోనే తెలంగాణ ఉద్యమం ప్రారంభించారు. ప్రజలంటే లెక్కలేని ప్రభుత్వాలతో ప్రొఫెసర్ హరగోపాల్ గారు ప్రత్యక్షంగా కృష్ణా జలసాధన పోరాటాలలో భాగమైనారు. తెలంగాణ ప్రభుత్వం ఏకపక్షంగా తలకిందులుగా పనులు ప్రారంభించింది. ఈ తప్పుడు చర్య వల్ల తలెత్తిన సమస్యల పరిష్కారానికే, ప్రొఫెసర్ గారు పాలమూరు ప్రజల ఆకాంక్షలనూ డిమాండునూ గుర్తించినందువల్ల ప్రజల పట్ల బాధ్యతతో, ఈ పథకాన్ని ఫేజ్–1, ఫేజ్–2 రెండు భాగాలుగా చేపట్టాలని డిమాండ్ చేశారు. న్యాయం, నెనరు లేని ఇంజనీర్ జేఏసీ నేతలకు ఈ సారాంశం బోధపడలేదు. పాలమూరు జిల్లాలోనే భీమా ఎత్తిపోతల పథకం ఫేజ్–1, ఫేజ్–2గా అమలవుతున్న విషయం, భీమా పథకం నీటిని కృష్ణా తీరం వెంట పడమర మక్తల్ తూర్పున కొత్తకోట, వనపర్తి ప్రాంతంలో అందిస్తున్న విషయం తెలుసుకుని వుంటే పాలమూరు పథకం విభజించాలని కోరిన సారాంశం బోధపడి వుండేది. .

ఈ వ్యాసంలో ప్రొఫెసర్ హరగోపాల్ నారాయణపేట – కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని చర్చించలేదు. ఆ పథకాన్ని గత ప్రభుత్వంలోని ఇంజనీర్లే ప్రతిపాదించారు. భీమా నికర జలాల పథకం కనుక, కేంద్రం నిధులందే అవకాశం వుంది గనుక ఇంజనీర్లు తెలివిపరులే అనుకుని ప్రజలు పోరాడారు. పదకొండు రోజులు వందలాది మంది పాదయాత్రలు చేశారు. అన్ని ప్రతిపక్ష పార్టీలు ప్రజల వెంట నడిచాయి. తెలంగాణ ప్రభుత్వం కానీ, ప్రభుత్వంలోని ఇంజనీర్లు కానీ ఇప్పటివరకు నారాయణపేట – కొడంగల్ ప్రాంత ప్రజలకు ఈ పథకంలోని మోసం వివరించలేదు. అధికారికంగా ఈ పథకాన్ని రద్దు చేసినట్టు కూడా ప్రకటించలేదు. గత ప్రభుత్వాలకు తెలివిలేదు సరే. మరి ఈ ప్రభుత్వం తెలివి ఏమైనట్టు? పోరాడే ప్రజలతో ఎందుకు ఆడుకున్నట్లు? పాలమూరు – రంగారెడ్డి పథకం ఫేజ్–1తో మాత్రమే ప్రస్తుత మహబూబ్‌నగర్, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోని రైతాంగానికి మేలు, న్యాయం జరుగుతుంది.

మేము పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ఫేజ్–2గా చేపట్టి కల్వకుర్తి పథకంలో భాగం చేయమంటున్నాం. ఇది ఇంజనీర్లు పరిష్కరించలేని లేదా వాళ్ళకి అర్థంకాని సమస్యేమీ కాదు. ఇది ఇంజనీర్లకు అర్థంకాని రాజకీయ సమస్య అయితే టీఆర్ఎస్ పార్టీకి ప్రభుత్వానికి అర్థం కావాలి. ప్రజలకు అర్థమైంది పాలకులకు అర్థంకాకపోతే ఆ పాలకులు అధికారాన్ని దబాయింపుతో నిర్వహిస్తారు తప్పితే ప్రజాస్వామికంగా, న్యాయంగా వ్యవహరించలేరు. 1990ల నుంచి చేసిన పోరాటాల ఫలితంగా కల్వకుర్తి ఎత్తిపోతల పథకం వచ్చింది. అది కూడా క్రమంగా నాలుగున్నర లక్షల ఎకరాలకు నీరివ్వగల స్థాయికి పెరిగింది. అయిదేళ్ళలో పూర్తికావలసింది. మన ప్రభుత్వం ఏర్పడి కూడా మూడేండ్లు దాటినా పూర్తి కాలేదు. ఈ జిల్లా నించి అప్పటి మంత్రిగారే ఇప్పటికీ పర్యవేక్షిస్తున్నారని మనం గుర్తించాలి. కల్వకుర్తి పథకంలో ఒక్క రిజర్వాయర్ కూడా నిర్మించలేదు. కాలువలు, డిస్ట్రిబ్యూటరీలు, మైనర్లు ఏవీ సరిగా లేవు. ఇదీ ఆయకట్టు అని గ్రామాల వారీగా నిర్ధారణలూ లేవు. రెండు పంపులు మాత్రమే పనిచేయగా కాలువలలో పారుతున్న నీటిని రైతులు పాత చెరువులకు మలుపుకున్నారు. ఏ కల్వకుర్తి పథకంతో 1.60 లక్షల ఎకరాలకు నీరిచ్చామని ప్రభుత్వం వలె ఈ ఇంజనీర్లు చెబుతున్నారో ఆ నీరు పారే భూమిని పాలమూరు – రంగారెడ్డి పథకాన్ని శ్రీశైలానికి మార్చి చేపట్టి ముంచేస్తున్నారు. నార్లాపూర్ – డిండి పథకంతో రైతులకు భూమే మిగలకుండా చేస్తున్నారు.

కల్వకుర్తి ఎత్తిపోతల పథకం అసంపూర్తిగా వున్నది కనుక, దాని మీద రిజర్వాయర్లు లేవు గనుక ఇప్పుడు ప్రభుత్వం పాలమూరు –రంగారెడ్డి పథకంలో నిర్మిస్తున్న రిజర్వాయర్లను కల్వకుర్తి పథకంలో భాగం చేయాలి. నార్లాపూర్ రిజర్వాయర్ నిర్మించకుండా, ఏదులి, వట్టెం, కరివెన, ఉద్దండాపూర్ రిజర్వాయర్ల స్థాయి తగ్గించాలి. కల్వకుర్తి పథకాన్ని పాల



గోదావరి నీరు అందే అవకాశం పుష్కలంగా ఉన్న నల్లగొండ జిల్లాకు కృష్ణ నీరు తగ్గించి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలకు అధిక వాటా ఇవ్వాలని మేం డిమాండ్ చేస్తున్నాం. అందుకే మా భూముల కోసం, న్యాయమైన నీటి వాటా కోసం నార్లాపూర్ - డిండి పథకాన్ని వ్యతిరేకిస్తున్నాం. లెక్క ఇంకేమైనా మిగిలితే ప్రజలు వివరిస్తారు. ఈ ప్రభుత్వం మహబూబ్‌నగర్ విషయంలో ఎలా వుందో తెలంగాణ ప్రజలకు హరగోపాల్ తన వ్యాసంలో వివరించారు.

మూరు – రంగారెడ్డి పథకాన్ని అనుసంధానం చేసే విధంగా రీడిజైన్ చేసి నిర్మాణం పూర్తి చేసి తూర్పు మహబూబ్‌నగర్ అంటే ప్రస్తుత వనపర్తి (తూర్పు), నాగర్‌కర్నూల్, రంగారెడ్డి (తూర్పు) జిల్లాలకు నీరివ్వాలి. ఇదెలా సాధ్యమవుతుందో వీరికి అర్థం కాకపోతే రైతులు అర్థం చేయిస్తారు. ఇంజనీర్లు, ప్రభుత్వమూ ఇష్టారాజ్యంగా చేస్తున్నారు కనుక నార్లాపూర్ నుంచి డిండి మీదుగా నల్లగొండకు నీరు తరలించే విధానం వద్దని, నల్లగొండ జిల్లాకు నాగార్జునసాగర్ నుంచి నీరివ్వమని ఆచార్యుడు సూచిస్తున్నారు.

ప్రొఫెసర్ గారి పట్లనే కాదు దశాబ్దాల బాధిత ప్రజల మీద కూడా బాధ్యత లేకుండా ఏ లెక్కలూ పరిశీలించకుండా ఇంజనీర్లు తమ విన్యాసం ప్రదర్శించారు. కృష్ణానది నీటిలో తెలంగాణకు 299 టీఎంసీ నీరుందన్నారు. ఈ నీటిలో మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలకు దక్కిన నీరెంతో లెక్కలు పరిశీలించారా? కాయితాల మీద దక్కిన నీరు కూడా నేలకు చేరలేదని అర్థం చేసుకున్నారా? నల్లగొండ జిల్లా కోసం కృష్ణానది నీటి నుంచి తీసుకునే వాటా ఏనాడో అయిపోయింది. కృష్ణా నది నీటి వాడకపు లెక్కలతో ఈ ఇంజనీర్లు ప్రభుత్వంతో మహబూబ్‌నగర్ వైపు నించి వాదించవచ్చు కదా! ప్రభుత్వానికి సాగునీటి శాఖకు నిజాయితీ వుంటే ఒక శ్వేతపత్రం ప్రకటించమంటున్నాం. ప్రత్యామ్నాయ అవకాశాలున్నపుడు బలమున్నదని మలిపే నీటిని నాగార్జునసాగర్ నుంచి మలిపి మా బడుగు రైతుల భూములు కాపాడమని మొత్తుకుంటున్నాం. అర్థం కావడం లేదంటే మీరు మాకు వ్యతిరేకంగా కుట్రలో వున్నారని మేం ప్రకటించక తప్పదు. నీటి రుచి తెలిసి పాలనాధికార నిర్వహణ మర్మం తెలిసిన నల్లగొండ నేతల ధాటికి మా జిల్లా నేతలు నిలువలేరు. ‘నార్లాపూర్ – డిండి పథకం చేపడితే పాలమూరు, రంగారెడ్డి జిల్లాలలో రాజకీయ అశాంతి చెలరేగుతుందని’ కేబినెట్ మంత్రి జూపల్లి కృష్ణారావు లెటర్‌హెడ్‌పై 2016, ఫిబ్రవరి 22న పన్నెండు మంది అధికారపార్టీ ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రికి లేఖ రాశారు. ఆ లేఖ ఏమైందో? మా నేతలకు సోయిలేదు. ఇప్పుడు ఆ మంత్రి స్వయంగా నాగర్‌కర్నూలు భూములు మునిగి నల్లగొండకు నీరుపోతే తప్పేమిటి? అని అడుగుతున్నారు. నేతల ఈ దుర్బలత్వమే మా జిల్లాకు నగుబాట్ల జీవితం, వలసజీవితం మిగిల్చింది. ఇప్పుడు దీర్ఘకాలంగా ప్రజలం పోరాడుతున్నాం. పాలకులు దళారీ పని చేస్తున్నారు. ఈ పన్నెండు మంది విజ్ఞతతో వున్నా దృఢంగా వున్నా పాలమూరు – రంగారెడ్డి పథకం మాకు ద్రోహం చేసే విధంగా భారీ మార్పులకు గురయ్యేది కాదు. నార్లాపూర్ – డిండి తెరమీదికి వచ్చేది కాదు. నక్కలగండి ఎత్తిపోతల పథకం డీపీఆర్ దశకే వచ్చేది కాదు. నక్కలగండి ఎత్తిపోతల పథకం కూడా మహబూబ్‌నగర్ భూములు, గ్రామాలు ముంచే పథకమే. దాన్ని వ్యతిరేకిస్తే నార్లాపూర్ – డిండి ముందుకు తెచ్చారు. కొంతకాలం జూరాల – పాకాల అని భయపెట్టారు. ఎస్ఎల్‌బీసీకి కేటాయించిన 30 టీఎంసీ నీరు అంటే నక్కలగండి ఎత్తిపోతల నీరు ఇదివరకే ఎ.ఎం.ఆర్. ఎత్తిపోతల ద్వారా వాడుతూనే వున్నారు. ఎస్ఎల్‌బీసీ కాలువల్లో ఆ నీరు పారుతూనే వుంది. అయినా అబద్ధపు లెక్కలతో రాజనీతి శాస్త్రం లోతులు తెలిసిన ప్రొఫెసర్‌ను ఈ ఇంజనీర్లు దబాయిస్తున్నారు. ప్రేమ, గౌరవం అని మసిపూసేందుకు తండ్లాడుతున్నారు. తామే ప్రభుత్వమన్నట్లు రాస్తున్నారు.

బచావత్ ట్రిబ్యునల్ ప్రాజెక్టుల వారీగా నీరు కేటాయిస్తూనే ఆయా రాష్ట్రాలు తమ అవసరాల మేరకు సర్దుబాటు చేసుకోవచ్చునన్నది. అందువల్లనే మా జిల్లాకు భీమా పేరున 20 టీఎంసీల నీరు దక్కింది. అది భూమికి చేరటానికి మూడు దశాబ్దాలు పట్టింది. ఇంతలో ఆర్డీఎస్ నీరు మాకు దక్కకుండా పోయింది. ఈ అన్ని అనుభవాలతోనే గోదావరి నీరు అందే అవకాశం పుష్కలంగా వున్న నల్లగొండ జిల్లాకు కృష్ణ నీరు తగ్గించి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలకు అధిక వాటా ఇవ్వాలని మేం డిమాండ్ చేస్తున్నాం. అందుకే మా భూముల కోసం, న్యాయమైన వాటా నీటి కోసం నార్లాపూర్ – డిండి పథకాన్ని మేం వ్యతిరేకిస్తున్నాం. కృష్ణలో నీరు పారుతుంటే 30 రోజులు 60 టీఎంసీలు తీసుకోవాలని మా డిమాండ్. కొత్త పథకమైతే వివాదమవుతుందని జూరాల నుంచి పాత పథకంలో సగం నీటితో చేపట్టమంటే మీ తలలు ఎందుకు పగిలిపోతున్నాయి? నది ఒడ్డున నారాయణపేట ప్రజలకు నీరివ్వాలంటే పాలమూరు పథకాన్ని భీమాలాగా తూర్పు పడమర భూముల కోసం రెండు భాగాలుగా విభజించవలసిందే. మరో మార్గం లేదు.

లెక్క ఇంకేమైనా మిగిలితే ప్రజలు వివరిస్తారు. ఈ ప్రభుత్వం మహబూబ్‌నగర్ విషయంలో ఎలా వుందో తెలంగాణ ప్రజలకు ప్రొఫెసర్ గారు వివరించారు. ఇద్దరు ఇంజనీర్ల చొరవతో ప్రొఫెసర్ హరగోపాల్ గారి వ్యాసం నిజమని, శాస్త్రీయమని వారు తమ నించి తెలుసుకుని తమ మేలు కోరారని ప్రజలకు అర్థమైంది.

■ **ఎం. రాఘవాచారి**

కన్వీనర్, పాలమూరు అధ్యయన వేదిక

2 వేల మంది నిరుద్యోగులకు ట్యాక్సీలు

- **ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు మాత్రమే అవకాశం.. ఉబెర్ సహకారంతో అమలు : ప్రభుత్వ నిర్ణయం**

హైదరాబాద్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు చెందిన రెండు వేల మంది నిరుద్యోగ యువకులకు ఈ ఆర్థిక సంవత్సంలో ట్యాక్సీలను అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు సంబంధించి అమలవుతున్న స్వయం ఉపాధి పథకాల తీరుపై ప్రభుత్వ సలహాదారు ఏ.రామలక్ష్మణ్ బుధవారం సచివాలయంలో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. స్వయం ఉపాధి పథకాల అమలుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన అధికారులను కోరారు. ట్యాక్సీ కార్లు అందించేందుకు 'ఉబెర్' సంస్థ సహకారం తీసుకోనున్నట్లు తెలిపారు. 2017-18 సంవత్సరానికి సంబంధించి ఎస్సీ కార్పొరేషన్ ఇప్పటికే 1.19 లక్షల దరఖాస్తులను స్వీకరించిందని, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరగాల్సి ఉందని పేర్కొన్నారు. ఇతర కార్పొరేషన్లు కూడా ఈ విషయంలో చర్యలు చేపట్టాలని సూచించారు.



పింఛన్‌దారులకు బస్సు చార్జీల్లో 50% రాయితీ

- **త్వరలో ప్రభుత్వ ఉత్తర్వులు**

హైదరాబాద్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): పింఛన్‌దారులకు త్వరలో ఓ వెసులుబాటు కలగనుంది. బస్సు చార్జీల్లో 50 శాతం మేరకు రాయితీ పొందే అవకాశాన్ని ప్రభుత్వం వారికి అందించనుంది. పింఛన్‌దారులకు బస్సు ఛార్జీల్లో 50 శాతం మేర రాయితీ ఇవ్వాలంటూ కొంత కాలంగా తెలంగాణ పింఛన్‌దారుల ఐక్య కార్యాచరణ సమితి పోరాడుతోంది. ఈ క్రమంలో పింఛన్‌దారులకు బస్సు చార్జీల్లో 50 శాతం రాయితీ ఇస్తే పడే భారంపై ప్రభుత్వం లెక్కలు వేస్తోంది. ఇందులో భాగంగా మరికొన్ని వివరాల కోసం ఆర్టీసీని సంప్రదిస్తోంది. ఈ ప్రక్రియ పూర్తి కాగానే బస్సు చార్జీల్లో రాయితీపై ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉంది.

70 ఏళ్లకే క్వాంటమ్ పింఛన్!

- **వయో పరిమితి కుదింపు.. రాష్ట్ర ప్రభుత్వం సానుకూలం**

హైదరాబాద్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో పింఛన్‌దారులకు ఊరట కలిగే పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రత్యేకించి 'క్వాంటమ్ పింఛన్'కు సంబంధించి వయో పరిమితిని కుదించాలంటూ ఎన్నో ఏళ్లుగా వెల్లువెత్తుతున్న విజ్ఞప్తులపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ఈ క్రమంలో త్వరలో ఉత్తర్వులు జారీ కానున్నాయి. 'ఎన్నాళ్ళు బతుకుతామో ఏమో. ఎప్పుడేమవుతుందో ఏమో. ఎప్పటికప్పుడు విపరీతంగా పెరిగిపోతున్న కాలుష్యం ఒకవైపు, మరోవైపు ఒత్తిళ్లు... ఈ పరిస్థితులను అర్థం చేసుకోండి. ఎప్పుడో ఇచ్చే అదనపు పింఛన్‌ను ఇప్పుడే ఇవ్వండి' అంటూ తెలంగాణ రాష్ట్రంలో 70 ఏళ్లు దాటిన పింఛన్‌దారులు కొన్నేళ్లుగా అభ్యర్థిస్తున్నారు. 'ప్రస్తుతం 75 సంవత్సరాలు దాటిన పింఛన్‌దారులకు మాత్రమే 15 శాతం మేరకు అదనంగా ఇస్తున్నారు. కొద్ది రోజుల క్రితం పింఛనుదారుల జేఏసీతో సమావేశం నిర్వహించిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్... క్వాంటమ్ పింఛన్ విషయంలో సానుకూలంగా స్పందించారు. ఆర్థిక శాఖ నుంచి సంబంధిత ఫైలు సిద్ధమైంది. ముఖ్యమంత్రి ఆమోదం పొందిన తర్వాత ఉత్తర్వులు జారీ కానున్నాయి. ఈ పరిణామాలపై పింఛన్‌దారుల సంఘం నేతలు విశ్వాస్‌రెడ్డి, లక్ష్మయ్య హర్షం ప్రకటించారు. పంజాబ్, హర్యానాల్లో 65 సంవత్సరాలకు క్వాంటమ్ పింఛన్ అమలు చేస్తుండగా, వయోపరిమితి కుదించనున్న మూడో రాష్ట్రం తెలంగాణ కానుంది.

ప్రైవేటు స్కూళ్ల ఆదాయ, వ్యయాలు ఇవ్వండి

- **డీఈవోలకు విద్యాశాఖ ఆదేశం.. 15 వరకు గడువు**

హైదరాబాద్,ఆగస్టు30(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు స్కూళ్ల ఫీజుల నియంత్రణ చర్యల్లో భాగంగా విద్యాశాఖ మరో ముందడుగు వేసింది. ప్రైవేటు స్కూళ్లలో ఫీజుల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు ఇచ్చేందుకు మాజీ వీసీ ప్రొఫెసర్ తిరుపతిరావు అధ్యక్షతన వేసిన కమిటీ సలహాలను పాటించనుంది. ప్రైవేటు స్కూళ్లలో ఫీజులు నియంత్రించాలంటే ఒక్కో పాఠశాల వారిగా ఆదాయ వ్యయాలు సేకరించాలని తిరుపతిరావు కమిటీ సూచించింది. ఈ నేపథ్యంలో 2015-16, 2016-17 విద్యా సంవత్సరాల్లో ప్రైవేటు స్కూళ్ల ఆదాయ, వ్యయాల సమాచారం సేకరించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి.కిషన్ జిల్లా విద్యాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రైవేట్ పాఠశాలలు నిర్ధారించిన ఫీజుల పట్టికను కూడా సేకరించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. సేకరించిన వివరాలు అప్‌లోడ్ చేసేందుకు పాఠశాల విద్యా వెబ్‌సైట్‌లో ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను సిద్ధం చేశారు. ఈమేరకు పాఠశాలలకు వచ్చే నెల 15 వరకు గడువు ఇచ్చారు.

స్వచ్ఛ విద్యాలయకు ఎంపికైన ఒక్కో స్కూల్‌కు రూ.10 వేలు

కేంద్ర ప్రభుత్వ పథకం 'స్వచ్ఛ విద్యాలయ' కోసం రాష్ట్ర విద్యాశాఖ తెలంగాణ వ్యాప్తంగా మొత్తం 40 పాఠశాలలను ఎంపిక చేసింది. వీటిల్లో 14 స్కూళ్లకు కేంద్రం రూ.50 వేల ప్రోత్సాహకం అందించనుంది. దీనికి అదనంగా రాష్ట్ర స్థాయిలో ఎంపికైన 40 పాఠశాలలకూ రూ.10 వేల బహుమతిని సెప్టెంబర్ 5న అందించనుంది.

ఐచ్ఛిక సెలవులు స్కూళ్ల వారీగానే ఉండాలి

- **టీఎస్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్**
- **లోపాలను సవరించాలి : పీఆర్‌టీయూ టీఎస్**

హైదరాబాద్, ఆగస్టు30(ఆంధ్రజ్యోతి): ఐచ్ఛిక సెలవులను ఉపాధ్యాయులు వ్యక్తిగతంగా కాకుండా పాఠశాలల వారీగా వినియోగించుకునే విధంగానే ఉండాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అధ్యక్షుడు నర్సిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రవి బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యా క్యాలండర్‌లో ఇచ్చిన ఆదేశాలను సవరించి పాత పద్ధతిలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కాగా, అకడమిక్ క్యాలండర్‌లోని లోపాలను సవరించాలని పీఆర్‌టీయూ టీఎస్ అధ్యక్షుడు పి.సరోత్తంరెడ్డి, ప్రధాన కార్యదర్శి జి.చెన్నకేశవ రెడ్డిడిమాండ్ చేశారు. ఎలాంటి చర్చ లేకుండానే అకడమిక్ క్యాలండర్ విడుదల చేయడంపై నిరసన వ్యక్తం చేశారు.

ఔట్ సోర్సింగ్ అవుట్!

విధానాన్ని రద్దు చేసిన సర్కారు.. ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు ఆదేశాలు

- **వాళ్లూ ఇక కాంట్రాక్ట్ కార్మికులే**
- **ఒకటో తారీఖునే నేరుగా జీతాలు**

హైదరాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సంస్థల్లో ఔట్‌సోర్సింగ్ వ్యవస్థను రద్దు చేసింది. తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కో, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్‌లలో పని చేస్తున్న 23 వేల మందికి పైగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను కాంట్రాక్ట్ కార్మికులుగా గుర్తిస్తూ బుధవారం ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు ఉత్తర్వులు ఇచ్చారు. కొత్త విధానం గడచిన జూలై 28 నుంచే అమల్లోకి రానుంది. సీఎండీ ఉత్తర్వులకు అనుగుణంగా గురువారం ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్‌లు ఉత్తర్వులు ఇవ్వనున్నాయి. 20,903 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను అబ్జార్షన్(విలీనం) చేసుకుంటూ విద్యుత్ సంస్థలు ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు కొట్టేసిన సంగతి తెలిసిందే. దాంతో వీరందరికీ నేరుగా వేతనాలు ఇస్తామని, అర్టిజాన్లుగా గుర్తిస్తామని న్యాయస్థానానికి రాష్ట్ర ప్రభుత్వం నివేదించింది. అందుకు నిబంధనలు ఒప్పుకోకపోవడంతో ఔట్‌సోర్సింగ్ వ్యవస్థకు మంగళం పలికి, ఆ విధానంలో పనిచేస్తున్న వారందర్నీ కాంట్రాక్ట్ కార్మికులుగా మార్చేశారు. వీరంతా ఇక ముందు ఒకటో తేదీన వేతనాలు పొందనున్నారు. నిర్దేశించిన వేతనాల కన్నా రూ.1000లు



అదనంగా ఇవ్వనున్నారు. తాజా ఉత్తర్వుల ప్రకారం ట్రాన్స్‌కోలో 4371 మంది, జెన్‌కోలో 2911 మందికి కాంట్రాక్ట్ ప్రాతిపదికన వేతనాలు దొరకనున్నాయి. వీరంతా ఏడాదిలో 365 రోజులు ఉంటే... 364 రోజుల వేతనాన్ని పొందనున్నారు. ఏడాది గడువు పూర్తయిన వెంటనే కాంట్రాక్ట్‌ను తదుపరి ఏడాదికి పొడిగించుకుంటూ ప్రామిసరీ నోట్‌ను సమర్పించాల్సి ఉంటుంది.

రెండు దశాబ్దాల వ్యవస్థకు చెల్లుచీటీ

రెండు దశాబ్దాల కిందట ఔట్ సోర్సింగ్ వ్యవస్థ విద్యుత్ సంస్థల్లోకి వచ్చింది. తెలంగాణలో 1100 మంది కాంట్రాక్టర్లు విద్యుత్ సంస్థల్లో నమోదై ఉన్నారు. వీరి కింద 23,667 మంది ఉద్యోగులు పనిచేస్తుండగా... ప్రతీనెలా ఉద్యోగి పేరు మీద రూ.1000-1100 దాకా సంస్థ కాంట్రాక్టర్లకు ఇస్తోంది. ఇదేకాక ఉద్యోగుల నుంచి నెలకు రూ.1000 దాకా కాంట్రాక్టర్లు వసూలు చేసుకుంటున్నారు. సంస్థ తన వాటాగా ఇచ్చే పీఎఫ్ సొమ్మును కూడా కాంట్రాక్టర్లు జేబుల్లో వేసుకున్నట్లు పలు సందర్భాల్లో బట్టబయలయింది. పాత మహబూబ్‌నగర్ జిల్లాలో ఓ కాంట్రాక్టర్ పదేళ్లుగా రూ.78 లక్షలకు పైగా కాంట్రాక్ట్ కార్మికుల పీఎఫ్ సొమ్మునంతా మాయం చేసినట్లు తేలింది. ఔట్‌సోర్సింగ్ వ్యవస్థ రద్దుతో రూ.3 కోట్ల సొమ్ము మిగలనుంది.

కోర్టు ఆదేశాలకు లోబడే

"ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను విలీనం చేయరాదనే హైకోర్టు ఉత్తర్వులకు లోబడే ఆ ఉద్యోగులకు నేరుగా వేతనాలు ఇవ్వడానికి వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నాం. గత జూలై 28 నుంచి కొత్త విధానం ప్రకారం ఉద్యోగులకు వేతనాలు అందుతాయి. కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేయాలనే నిర్ణయంలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నాం... ఉద్యోగులకు నేరుగా వేతనాలు ఇవ్వనున్నాం.

– డి.ప్రభాకర్‌రావు, సీఎండీ ట్రాన్స్‌కో

తాజా ఉత్తర్వులతో వేతనాలు ఇలా! (రూ.లలో)
(ఉద్యోగులు గ్రేడ్‌ల వారీగా) సంస్థల వాటా

ఆర్టిజాన్	గ్రేడ్-1	గ్రేడ్-2	గ్రేడ్-3	గ్రేడ్-4
ఈపీఎఫ్(13.75%)	2565	2119	1784	1562
ఈఎస్ఐ (4.75%)	927	766	645	564
మొత్తం వేతనం	23,000	19,000	16,000	14,000
ఉద్యోగి వాటా				
ఈపీఎఫ్ (12%)	2341	1934	1629	1425
ఈఎస్ఐ(1.75%)	341	282	237	208
వృత్తి పన్ను	200	150	150	150
చేతికొచ్చే వేతనం	20,118	16,634	13,984	12,217

స్పెషల్ డ్రైవ్‌కు పైసా ఇవ్వం

- **భూముల రీ సర్వే చేపడితేనే నిధులు**
- **రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం స్పష్టీకరణ**
- **రికార్డుల ప్యూరిఫికేషన్‌కు రాష్ట్ర నిధులే**

హైదరాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన రెవెన్యూ రికార్డుల ప్యూరిఫికేషన్/అప్‌డేషన్ కోసం తాము ఒక్క పైసా కూడా ఇవ్వబోమని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. స్పెషల్ డ్రైవ్‌గా చేపట్టే ఈ కార్యక్రమానికి ఎలాంటి సహకారమూ అందించబోమని పేర్కొంది. తెలంగాణ భూభాగమంతా కొలిచి.. ఏ భూమికి ఎవరు యాజమానులో తేల్చే రీసర్వేకు మాత్రమే నిధులు ఇస్తామని స్పష్టం చేసింది. అలా కాకుండా ఇతర ప్రయోజనాలకు కేంద్ర నిధులను వాడరాదని తేల్చి చెప్పింది. దీంతో స్పెషల్ డ్రైవ్‌కు కేంద్రం నుంచి నిధులు రాబట్టుకోవాలనుకున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాలకు గండి పడింది. కేంద్ర ప్రభుత్వ ప్రతినిధిని పిలిపించి ఒప్పించే ప్రయత్నం చేసినా.. నిర్దేశిత లక్ష్యానికి ఉద్దేశించిన నిధులను ఇతర ప్రయోజనాలకు వాడటం నిబంధనలకు విరుద్ధమే అవుతుందని ఆయన స్పష్టం చేసినట్లు సమాచారం. వాస్తవానికి జాతీయ భూమి రికార్డుల నవీకరణ పథకం (ఎన్ఎల్ఆర్ఎంపీ) కింద తెలంగాణలోని అన్ని జిల్లాల్లో సర్వేకు 2014లోనే కేంద్రం అంగీకారం తెలిపింది. దీనికి రూ.500 కోట్ల దాకా వ్యయం అవుతుందని అంచనాలు వేసినా.. కేంద్రం రూ.256.02 కోట్లకు కుదించి మొదటి విడతలో రూ.83 కోట్లను విడుదల చేసింది. అప్పటి సీసీఎల్ఏ రేమండ్ పీటర్ అభ్యర్థన మేరకు పూర్తి స్థాయి నిధులు ఇచ్చేందుకు కేంద్రం అంగీకరించింది. ఈ మేరకు ప్రభుత్వానికి సీసీఎల్ఏ ఫైలు పంపించగా.. అప్పటినుంచి పెండింగ్‌లో ఉంది. తాజాగా మళ్లీ సర్వే కోసం అంచనాలు సవరించి.. భూముల రీ సర్వేకు రూ.556 కోట్లు అవుతాయని లెక్కగట్టారు. అయితే ఇందుకు ఏడాదిన్నర దాకా సమయం పడుతుందని భావించిన సీఎం కేసీఆర్.. స్పెషల్ డ్రైవ్‌కే మొగ్గు చూపారు. పలు సాంకేతిక సంస్థలతో సమావేశం నిర్వహించి చివరికి రికార్డుల ప్యూరిఫికేషన్/అప్‌డేషన్ చేపట్టాలని నిర్ణయించారు. కానీ, దీనికి సహకారం అందించబోమని కేంద్రం నిర్దేశించడంతో సొంత నిధులతోనే ముందుకెళ్లనున్నారు.



బై నంబర్లకు స్వస్తి

ప్రగతిభవన్‌లో భూ రికార్డులపై సమీక్ష నిర్వహిస్తున్న సీఎం కేసీఆర్.

(మొదటి పేజీ తరువాయి)

సులభంగా, సరళంగా, పారదర్శకంగా ప్రజలకు అర్థమయ్యే రీతిలో జరగాలనీ చెప్పారు. ప్రక్షాళనలో భాగంగా తొలుత ఎలాంటి చిక్కులు, సమస్యలు లేని భూముల వివరాలు సరిచేయాలన్నారు. భూరికార్డుల ప్యూరిఫికేషన్/అప్‌డేషన్ కోసం చేపట్టనున్న స్పెషల్ డ్రైవ్‌పై ముఖ్యమంత్రి రెవెన్యూ అధికారులతో బుధవారం ఉదయం ప్రగతి భవన్ లో సమీక్ష జరిపారు. పహాణి, సేత్వారీ లాంటి పాతకాలపు పదాలకు బదులు తెలుగులో సరళంగా, సులభమైన భాషల్లో రికార్డుల పేర్లు పెట్టాలన్నారు. అనేక రకాల లెక్కలు రికార్డుల్లో ఉన్నాయని, వీటిని తొలగించి, పహాణిలో అక్కర్లేని కాలమ్లను కుదించాలన్నారు. రికార్డుల్లో వివాదాలు తలెత్తే అంశాలన్నీ తీసేయాలని చెప్పారు. రికార్డుల్లోని అస్తవ్యస్త లెక్కలు వివాదాలకు దారితీస్తున్నాయన్నారు. సర్వే నెంబర్లకు బై నంబర్ల విధానం తొలగించి, సర్వే నెంబర్లతో ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. రైతుకు న్యాయపరమైన చిక్కులు పూర్తిగా పోయి, ప్రశాంతంగా వ్యవసాయం చేసుకునే పరిస్థితి కల్పించాలని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల్లో రైతులను గౌరవిస్తున్నారని, ఆహారరంగంలో స్వావలంబన ఉండాలన్న ఆలోచనే దీనికి కారణమని తెలిపారు. తెలంగాణలో సమశీతోష్ణ వాతావరణం ఉండటం వల్లే పంటలు బాగా పండుతున్నాయన్నారు. వచ్చే సంవత్సరం నుంచి కాళేశ్వరం ద్వారా గోదావరి నీళ్లు పుష్కలంగా లభ్యం కానున్నాయని తెలిపారు. "గోదావరి నీళ్లతో చెరువులు నింపుకుంటాం... పూర్వపు ఏడు జిల్లాలకు కాళేశ్వరం నీళ్లు ఉపయోగంలోకి వస్తాయి. పంటలు బాగా పండటంతో అన్ని రకాలుగా రైతులు బాగుంటారు" అని వ్యాఖ్యానించారు. శిస్తు తీసుకోవడానికి బదులుగా ప్రభుత్వమే ఎకరానికి 8 వేలు ఇస్తున్నందున భూమికి సంబంధించిన దృక్పథమే మారిపోయిందన్నారు.

భూరికార్డులకు కోర్ బ్యాంకింగ్ విధానం

కోట్లాది బ్యాంకు ఖాతాలను పకడ్బందీగా నిర్వహిస్తున్న "కోర్ బ్యాంకింగ్" విధానాన్నే భూ రికార్డుల నిర్వహణలో అనుసరించాలని సీఎం ఆదేశించారు. భూ రికార్డుల ప్రక్షాళన జరిగిన తరువాత కోర్ బ్యాంకింగ్ తరహాలో ఎప్పటికప్పుడు మార్పులు చేర్పులు రికార్డుల్లో చేరిపోవాలన్నారు. భూముల రిజిస్ట్రేషన్ జరగ్గానే వెనువెంటనే రికార్డుల్లో పేర్లు చేర్చే(మ్యుటేషన్ ప్రక్రియ) జరగాలని చెప్పారు. రైతులు తమ క్రయవిక్రయాల కొరకు రిజిస్ట్రేషన్ ఆఫీసుకు ఒక్కసారికి మించి వెళ్లాల్సిన అవసరం రాకూడదని చెప్పారు. రిజిస్ట్రేషన్ పూర్తికాగానే రికార్డుల మ్యుటేషన్ జరిగి, వెనువెంటనే పట్టాదార్ పాస్ పుస్తకాలు కొరియర్ ద్వారా రైతుల ఇంటికే చేరాలన్నారు. ఆన్‌లైన్‌లో ఎలాంటి సమాచారమైనా పట్టాదారులకు లభ్యమయ్యే విధంగా రికార్డులు ఉండాలని సూచించారు. భూ ప్రక్షాళన పూర్తయ్యే సరికి ఐటీ నిపుణుల నియామకం, కంప్యూటర్ల కొనుగోలు, వెబ్‌సైట్ల అనుసంధానం పూర్తి కావాలన్నారు.

పాస్ పుస్తకం లేకుండానే పంట రుణం

బ్యాంకుల్లో రైతుల పాస్ బుక్కులు కుదువ పెట్టించుకుని పంట రుణం ఇచ్చే విధానం పోవాలని, రైతుల ఖాతా నెంబర్‌తో భూముల వివరాలు వెబ్‌ల్యాండ్‌లో చూసుకునేలా బ్యాంకులకు రికార్డులను అనుసంధానం చేయాలని సీఎం ఆదేశాలిచ్చారు. కంప్యూటర్ ఆధారిత సమాచారం ఆధారంగా రైతులకు రుణాలు మంజూరు చేయాలన్నారు. భూ సంబంధ వ్యవహారాలలో రాష్ట్ర ప్రభుత్వానికే సంపూర్ణ అధికారాలుంటాయని చెప్పారు. తహసీల్దార్, ఆర్డీవో కోర్టులు రద్దు చేయాలన్నారు, కలెక్టర్ వద్దే కోర్టు ఉండాలన్నారు. ప్యూరిఫికేషన్, అప్‌డేషన్‌లో కీలక భూమిక పోషించిన తహసీల్దార్‌లతో పాటు ఆర్డీవోలు, జిల్లా అధికారులకు ప్రోత్సాహకాలు ఇవ్వనున్నట్లు సీఎం ప్రకటించారు. భూరికార్డుల స్పెషల్ డ్రైవ్ కోసం 1193 బృందాలను ఏర్పాటు చేసి, ఒక్కో బృందానికి 9 గ్రామాలు కేటాయించి, రికార్డుల ప్రక్షాళన చేయాలని చెప్పారు.

రైతులంతా గ్రామ సమితిలో సభ్యులే!

- **రేపటి నుంచి రైతు సమన్వయ సమితుల ఏర్పాటు**
- **నేడు వ్యవసాయ అధికారులతో సీఎం కేసీఆర్ సమావేశం**

హైదరాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మంత్రులు నామినేట్ చేసే గ్రామ రైతు సమన్వయ సమితి.. గ్రామ రైతు సంఘంలో భాగంగానే ఉంటుందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. గ్రామ రైతు సంఘంలో ఆయా రెవెన్యూ గ్రామంలోని భూమి ఉన్న రైతులంతా సభ్యులుగానే ఉంటారని, వారి నుంచి 15 మందిని ఎంపిక చేసి రైతు సమన్వయ సమితిని ఏర్పాటు చేయనున్నామని అంటున్నారు. ఇక మండల, జిల్లా రైతు సమన్వయ సమితులను 24 మంది చొప్పున సభ్యులతో ఏర్పాటు చేస్తున్నారు. అయితే పలు జిల్లాల్లో మండలాల సంఖ్య 24 కంటే తక్కువగా ఉంది. దీంతో మండల సమితికి సభ్యులుగా నామినేట్ అయ్యేవారు.. గ్రామ రైతు సమితుల్లోను, జిల్లా సమితికి నామినేట్ అయ్యేవారు మండల సమితుల్లోనూ సభ్యులుగా ఉండాలన్న నిబంధనను ప్రభుత్వం చేర్చలేదు. ఈ చొప్పున గ్రామ రైతు సమన్వయ సమితిలో సభ్యత్వం లేని రైతు కూడా మండల, జిల్లా రైతు సమన్వయ సమితుల్లో సభ్యత్వం పొందేందుకు అవకాశం ఉంది. ఇదిలా ఉండగా.. రైతు సమన్వయ సమితుల ఏర్పాటు శుక్రవారం ప్రారంభం కానుంది. ప్రభుత్వం నియమించిన ఇన్‌చార్జి మంత్రులు, అధికారులు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. కాగా సీఎం కేసీఆర్ గురువారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వ్యవసాయ అధికారులు (ఏవోలు), ఆ పైస్థాయి అధికారులతో జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సమావేశం కానున్నారు. అనంతరం ప్రగతిభవన్‌లో కలెక్టర్లు/ఆర్డీవోల సదస్సు జరుగనుంది.

రికార్డుల నవీకరణకు ప్రాజెక్టు.. డైరెక్టర్‌గా వాకాటి కరుణ

భూమి రికార్డుల నవీకరణ/ప్యూరిఫికేషన్ ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేయడానికి వీలుగా ల్యాండ్ రికార్డ్స అప్‌డేషన్ ప్రాజెక్టును ఏర్పాటు చేసింది. దీనికి సీనియర్ ఐఏఎస్ అధికారిణి వాకాటి కరుణను డైరెక్టర్‌గా నియమిస్తూ పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించింది.

ఎక్సైజ్ పాలసీ రెండేళ్లే!

లైసెన్సు ఫీజులు పెరగకపోవచ్చు

- **షాపుల సంఖ్య పెరిగే అవకాశం లేదు**
- **మిగిలిపోయిన 72 షాపుల సర్దుబాటు**
- **సీఎంతో చర్చించాకే పాలసీ ఖరారు**
- **సెప్టెంబరు తొలి వారంలో నోటిఫికేషన్**

హైదరాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ పాలసీపై అధికారులు ఒక అవగాహనకు వచ్చి, ముసాయిదాను సిద్ధం చేశారు. ఇందులో పాలసీని రెండేళ్లపాటే అమలు చేయాలని నిర్ణయించారు. అయితే సీఎం కేసీఆర్‌తో చర్చించిన తర్వాత సమగ్ర పాలసీని ఖరారు చేయనున్నారు. ఆ తర్వాతే నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. బహుశా సెప్టెంబరు మొదటి వారంలోనే నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉంది. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక... రెండేళ్ల ఎక్సైజ్ పాలసీని రూపొందించింది. అంతకు ముందు ఉమ్మడి ఏపీలో ఏడాది పాలసీ మాత్రమే అమల్లో ఉండేది. ఇక లైసెన్సు ఫీజులపైనా ఎక్సైజ్ అధికారులు ఒక నిర్ణయానికి వచ్చారు. ఈసారి ఫీజులను పెంచకుండా ఉండడమే మంచిదని భావిస్తున్నారు. ఇప్పటికే పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే రాష్ట్రంలో ఎక్కువ లైసెన్సు ఫీజులు ఉన్నాయన్న విమర్శలున్నాయి. ఈ కారణంగానే 2015లో యజమానులు ముందుకురాక.. 72 షాపులు మిగిలిపోయాయి. ఇక షాపుల సంఖ్యను కూడా పెంచే అవకాశాలు లేవు. మిగిలిపోయిన 72 షాపులను సర్దుబాటు చేసే యోచనలో ఉన్నారు.



500 మీటర్ల నిబంధన...

మద్యం విక్రయాలపై సుప్రీంకోర్టు తాజా ఆదేశాలతో ఎక్సైజ్ శాఖ ఊపిరి పీల్చుకుంది. ఇదివరకు జాతీయ, రాష్ట్ర రహదారులకు 500 మీటర్ల లోపు ఎలాంటి మద్యం విక్రయాలు ఉండకూడదన్న సుప్రీంకోర్టు.. మూడు రోజుల క్రితం ఇచ్చిన ఆదేశాల్లో నగర పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలోని షాపులకు మినహాయింపు నిచ్చింది. కాగా రాష్ట్రంలోని మొత్తం 2216 మద్యం షాపుల్లో 623 షాపులు జాతీయ రహదారులకు 500 మీటర్ల లోపు, 561 షాపులు రాష్ట్ర రహదారులకు 500 మీటర్ల లోపు ఉన్నట్లు గుర్తించారు. మొత్తం 852 బార్లలో ఎన్‌హెచ్‌ల పక్కన 265, స్టేట్ హైవేల పక్కన 155 ఉన్నట్లు తేల్చారు. కోర్టు ఆదేశాల మేరకు వీటన్నింటినీ తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో రాష్ట్ర రహదారులను డీ-నోటిఫై చేసే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇంతలోనే సుప్రీంకోర్టు నుంచి స్పష్టత వచ్చింది.



70 కోట్ల చేప పిల్లల పెంపకమే లక్ష్యం: తలసాని


రాష్ట్రంలో ఈ ఏడాది 70 కోట్ల చేపపిల్లలను పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని పశుసంవర్ధక, సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ చెప్పారు. గత ఏడాది 27కోట్ల చేపపిల్లలను పెంచామని వివరించారు. ఉచిత చేపపిల్లలను వదిలే కార్యక్రమాన్ని ఆయన సంగారెడ్డి జిల్లా పుల్‌కల్ మండలం సింగూరు ప్రాజెక్టులో బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆందోల్ ఎమ్మెల్యే బాబూ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

– సంగారెడ్డి టౌన్/పుల్‌కల్

రైల్వేకు వెంటనే ఎన్‌వోసీ ఇవ్వండి

- **తెలంగాణకు ప్రధాని సూచన**

హైదరాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వేకు వీలైనంత తొందరగా ఓపెన్ యాక్సెస్‌లో కరెంట్ తీసుకోవడానికి వీలుగా నిరభ్యంతర పత్రం(ఎన్‌వోసీ) జారీ చేయాలని ప్రధాని మోదీ తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష చేశారు. ఎన్‌వోసీ జారీ చేయడానికి ఉన్న ప్రతిబంధకాలు తొలగించాలన్నారు. దక్షిణ మధ్య రైల్వేకు ఎన్‌వోసీ ఇవ్వడానికి అభ్యంతరం లేదని, దీని కోసం మరికొన్ని ఏర్పాట్లు చేయాల్సిన అవసరం రైల్వేకు ఉందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీసింగ్ గుర్తు చేశారు.



డీఆర్‌ఎంలకు మరిన్ని అధికారాలు!

వరుస ప్రమాదాల నేపథ్యంలో డివిజనల్ రైల్వే మేనేజర్లకు (డీఆర్‌ఎం) మరిన్ని అధికారాలు ఇవ్వాలని రైల్వే కమిటీ పేర్కొంది. ముఖ్యంగా అత్యవసర సమయాల్లో డివిజన్ స్థాయిలో రైళ్ల నిలుపుదల, మళ్లింపు వంటి నిర్ణయాలు తీసుకునే అవకాశం కల్పించాలని సూచిస్తోంది. అలాగే రోజువారీ కార్యకలాపాల మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు వీలుగా ఆర్థికపరమైన, కార్యనిర్వాహక అధికారాలనూ కట్టబెట్టాలని కమిటీ భావిస్తోంది. 'డివిజన్లను వ్యూహాత్మక వాణిజ్య కేంద్రాలు'గా తీర్చిదిద్దేందుకు సూచనలు చేయాల్సిందిగా రైల్వే మంత్రి సురేశ్ ప్రభు జూన్‌లో సిబ్బంది నియామకాల డైరెక్టర్ జనరల్ నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేశారు. కాగా రైల్వేల కోసం టారిఫ్ నియంత్రణ సంస్థను ఏర్పాటుకు కేంద్ర డీవోపీటీ నియమనిబంధనలను రూపొందించింది.

కాంగ్రెస్ నేతలకు మెదడు లేదు

- మంత్రులు, ఎమ్మెల్యేలు చేరతారనడం హాస్యాస్పదం: తలసాని
- టీఆర్ఎస్ వార్డు మెంబర్ కూడా కాంగ్రెస్‌లో చేరడు: భానుప్రసాద్

పుల్‌కల్/హైదరాబాద్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాంగ్రెస్ నేతలకు మెదడు లేకనే ఇష్టానుసారం మాట్లాడుతున్నారని పశు సంవర్ధక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఎద్దేవా చేశారు. ఆయన పుల్‌కల్ సభలో మాట్లాడుతూ.. మంత్రులు, ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నారని, కాంగ్రెస్‌లో చేరతారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టివిక్రమార్క అనడం హాస్యాస్పదమన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులే టీఆర్ఎస్‌లోకి వచ్చే అవకాశముందని, వారిని చేజారకుండా చూసుకోవాలన్నారు. కుల వృత్తులను నాశనం చేసింది కాంగ్రెస్సే అని, వారికి కేసీఆర్ అండగా నిలుస్తున్నారన్నారు. కాగా, మంత్రులు, ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరతారని భట్టి విక్రమార్క కన్న రంగుల కలను మీడియా ముందు వెల్లడించాడని టీఆర్ఎస్ ఎమ్మెల్సీ భానుప్రసాద్ ఎద్దేవా చేశారు. కనీసం టీఆర్ఎస్ గ్రామ వార్డు మెంబర్ కూడా కాంగ్రెస్‌లో చేరబోడన్నారు. టీఆర్ఎస్‌లో కాంగ్రెస్ కోవర్టులు లేరని, భట్టిది తెలంగాణ ఉద్యమానికి వ్యతిరేకంగా కోవర్టుగా పని చేసిన చరిత్ర అన్నారు. కాంగ్రెస్ మరో 20 ఏళ్ల దాకా అధికారం దరిదాపులకు కూడా రాలేదన్నారు.

దిక్కుమాలిన మైండ్‌గేమ్

కాంగ్రెస్‌కు 2019లో ప్రతిపక్షహోదా కూడా రాదు.. ఆ పార్టీలో రాజీనామాలే తప్ప.. చేరికలు ఉండవు

- వారివి దిగజారుడు ఆరోపణలు.. పగటి కలలు
- రాజకీయాలకతీతంగా రైతు సమన్వయ సమితులు
- రికార్డుల ప్రక్షాళన చేస్తే బినామీ భూములు
- పోతాయని కాంగ్రెస్ నేతలకు భయం: హరీశ్



హైదరాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నేతలు ఉనికి కోల్పోతామని తెలిసి.. నైరాశ్యంలో రాజకీయంగా దిగజారుడు ప్రకటనలు చేస్తున్నారని మంత్రి టి.హరీశ్‌రావు అన్నారు. టీఆర్ఎస్ మంత్రులు, ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నారంటూ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. హస్తం పార్టీ నేతలు పగటికలలు కంటున్నారని, ప్రజల నమ్మకాన్ని, కార్యకర్తల బలాన్ని కోల్పోతూ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారని ఎద్దేవా చేశారు. మునిగిపోతున్న కాంగ్రెస్ నావలో టీఆర్ఎస్‌కు చెందిన ఏ నేత కూడా ఎక్కడని, ఆ పార్టీలో రిటైర్మెంట్లు తప్ప.. రిక్రూట్‌మెంట్లు, రాజీనామాలు తప్ప.. చేరికలు ఉండవని అన్నారు. 'పొద్దున లేస్తే మీ వెంట ఎవరున్నారో, ఎవరు పోయారో అని వెనక్కి చూసుకోవాల్సిన దుస్థితిలో మీరున్నారు. ఇప్పుడున్న పది మందైనా చివరి వరకు ఉంటారో లేదో చూసుకోండి. మీ దిక్కు మాలిన మైండ్ గేమ్ ఇక చాలించండి.' అని హరీశ్‌రావు హితబోధ చేశారు. 'నిజాం కాలంలో భూ సర్వే జరిగింది. ఆ తర్వాత దశాబ్దాలు గడిచినా ఇప్పటివరకు మళ్లీ జరగలేదు, రికార్డులు ప్రక్షాళన కాలేదు. అందుకే గ్రామ సభలు పెట్టి రైతు భాగస్వామ్యంతో ప్రభుత్వం రికార్డులు సరిచేయాలనుకుంటోంది. భూ వివాదాలకు శాశ్వతంగా చరమగీతంపాడటమే టీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యం. ఇంత మంచి లక్ష్యంతో చేపడుతున్న కార్యక్రమానికి కాంగ్రెస్ నేతలు ఎందుకు అభ్యంతరం చెబుతున్నారో అర్థం కావడంలేదు' అని మంత్రి హరీశ్‌రావు అన్నారు. భూ రికార్డుల ప్రక్షాళనపై కాంగ్రెస్ నేతలు చేస్తున్న విమర్శలను బుధవారం ఒక ప్రకటనలో ఆయన ఖండించారు. అస్తవ్యస్త రికార్డులు లేకుంటే మీరు చేసిన భూ కుంభకోణాలు, దందాలు బయటకువస్తాయని జంకుతున్నారా? అని ప్రశ్నించారు. తమ బినామీల పేరిట ఉన్న భూములను కోల్పోతామని కాంగ్రెస్ నేతలు వణికిపోతున్నారని ఆరోపించారు. కోర్టుకెళ్లి మరీ భూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమాన్ని అడ్డుకుంటామని కాంగ్రెస్ నేతలు ప్రకటించటం వారి నైరాశ్యానికి నిదర్శనమన్నారు. కోర్టు కేసులతో అభివృద్ధి పనులను కాంగ్రెస్ నేతలు అడ్డుకుంటున్నారని తాము చేసిన ఆరోపణలు అక్షరసత్యాలని దీంతో రుజువైందన్నారు. రాజకీయాలతో సంబంధం లేకుండా రైతు సంఘాల ఏర్పాటు జరుగుతోందని స్పష్టంచేశారు.

కాంగ్రెస్ నేతలకు భయం పట్టుకుంది..

జాతీయ స్థాయిలో ఇప్పటికే ప్రతిపక్ష హోదా కోల్పోయిన కాంగ్రెస్ 2019 ఎన్నికల్లో తెలంగాణలోనూ ప్రతిపక్ష హోదాను కోల్పోతుందని ఆయన జోస్యం చెప్పారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్నిరంగాల్లో ప్రగతి పథంలో దూసుకుపోతోందని, ప్రతి సమస్యకూ శాశ్వత పరిష్కారం లభిస్తోందని తెలిపారు. 'అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఛాయలు ఏ కోశానా కనిపించడం లేదు. కాంగ్రెస్ నాయకులు కోర్టు కేసులు వేసి అడ్డుకుంటున్నా.. రాష్ట్రం శరవేగంగా అభివృద్ధిలో ముందుకు పోతోంది.' అని వివరించారు. ఇక ఎప్పటికీ అధికారంలోకి రాలేమేమోనని కాంగ్రెస్‌కు భయం పట్టుకుందని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు.

మహారాష్ట్రకు మంత్రి హరీష్

కాళేశ్వరం ప్రాజెక్టుపై మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చల నిమిత్తం రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ మంత్రి హరీష్‌రావు, అధికారుల బృందం బుధవారం ఉదయం ముంబయి వెళ్లారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఢిల్లీలోని ఎన్‌జీటీలో కేసు కొనసాగుతున్న విషయం తెలిసిందే. విచారణలో భాగంగా మహారాష్ట్ర ప్రభుత్వం పలు అభ్యంతరాలు లేవనెత్తిన నేపథ్యంలో మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరపనున్నారు. అక్కడ మహారాష్ట్ర అధికారులు, ప్రజా ప్రతినిధులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమైనట్లు సమాచారం.

ఏఐసీసీ కార్యదర్శిగా విజయశాంతి!

క్రియాశీలం కానున్న మాజీ క్రికెటర్ అజరుద్దీన్

- నవంబరు నుంచి కాంగ్రెస్ ప్రచార కార్యక్రమాలు
- అక్టోబరు వరకు సంస్థాగత నిర్మాణం పూర్తి
- ఏఐసీసీలో తెలంగాణ నేతలకు పదవులు
- టీపీసీసీకి మరో వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బీసీ నేత
- కర్ణాటక, గుజరాత్ తరహా ఫార్ములా అమలు
- 2019 ఎన్నికలు లక్ష్యంగా కాంగ్రెస్ కార్యాచరణ





హైదరాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ 2019 ఎన్నికలు లక్ష్యంగా పావులు కదపడం మొదలు పెట్టింది. అక్టోబరు నాటికి సైలెంట్‌గా సంస్థాగత ఎన్నికలు పూర్తి చేసుకొని నవంబరు నుంచి పూర్తి స్థాయి కార్యకలాపాలకు దిగనుంది. ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా నవంబరు నుంచి కార్యక్రమాల రూపకల్పన జరగనుంది. ఈ క్రమంలో సినీ నటి విజయశాంతి, మాజీ క్రికెటర్ అజరుద్దీన్‌లతో తొలిదశ ప్రచార కార్యక్రమాలు మొదలు పెట్టాలని పార్టీ భావిస్తున్నట్లు తెలిసింది. గాంధీభవన్ వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం.. సినీనటి విజయశాంతిని తిరిగి పార్టీలో క్రియాశీలం చేయాలని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. ఆమెతో అధిష్ఠానం కూడా ఇప్పటికే చర్చలు జరిపినట్లు, ఆమెకు ఏఐసీసీ కార్యదర్శి హోదా కూడా దక్కే అవకాశం ఉన్నట్లు సమాచారం. దీంతోపాటు సీడబ్ల్యూసీలోనూ తెలంగాణ నుంచి ఒక నేతకు అవకాశం దక్కనుంది. వీరే కాకుండా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా ఒకరికి, కార్యదర్శులుగా ఇద్దరికి అవకాశం దక్కనున్నట్లు తెలిసింది. జాతీయ అధికార ప్రతినిధిగా కూడా ఏఐసీసీ ఒకరికి అవకాశం ఇవ్వనున్నట్లు సమాచారం. ఇక టీపీసీసీకి మరో వర్కింగ్ ప్రెసిడెంట్ కూడా వస్తున్నట్లు గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి. సామాజిక కూర్పులో భాగంగా బీసీ నేతకు ఈ పదవి దక్కనున్నట్లు, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ పేరు ఇందుకు పరిశీలనలో ఉన్నట్లు తెలిసింది. అయితే మరో ఏడెనిమిది మంది కూడా దీని కోసం పోటీ పడుతున్నట్లు సమాచారం. కాగా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, కార్యదర్శుల పదవులకు కూడా పోటీ ఉన్నా.. ఎవరెవరికి ఇవ్వాలనే విషయంపై అధిష్ఠానం ఇప్పటికే నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. కర్ణాటక, గుజరాత్‌ల తీరులో రాష్ట్రంలో కూడా సాధారణ ఎన్నికలకు కొద్ది రోజుల ముందు ఏఐసీసీలో ఎక్కువ మందికి చోటు కల్పించడంతో పాటు, పార్టీ పదవులను కూడా పలువురికి పంచటం అనే ఫార్ములాను అనుసరించనున్నట్లు కాంగ్రెస్ ముఖ్యనేత ఒకరు తెలిపారు. ముందుగా పార్టీని బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సంస్థాగతంగా బలోపేతం చేయాల్సిందిగా ఏఐసీసీ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ చెప్పారని తెలిపారు. రాష్ట్రంలో పార్టీ కార్యకలాపాల పట్ల ఆయన సంతృప్తిగా ఉన్నారని, సంస్థాగతంగా నిలదొక్కుకుంటే పార్టీకి తిరుగులేదని ఆయన నమ్ముతున్నారని అన్నారు. తాము కూడా అదే పనిలో ఉన్నామని, సంస్థాగత బలోపేతం పూర్తయ్యాక ప్రచార కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని పేర్కొన్నారు. ప్రచార కమిటీలో విజయశాంతి, అజరుద్దీన్‌లకు కీలక భాగస్వామ్యం కల్పిస్తామని, ప్రచార కమిటీ చైర్మన్‌ను కూడా నియమిస్తామని వెల్లడించారు. అజరుద్దీన్ కూడా దీనికోసం సంసిద్ధులవుతున్నానని తెలిపారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, కాంగ్రెస్ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకుపోయేందుకు రాహుల్ సందేశ యాత్రలకు తొలి దశలో శ్రీకారం చుడతామన్నారు.



గాంధీభవన్‌లో మాట్లాడుతున్న పీసీసీ చీఫ్ ఉత్తమ్. చిత్రంలో ఎమ్మెల్యే సంపత్‌కుమార్ తదితరులు

కేసీఆర్ అవార్డు బోగస్

- ప్రైవేటు దాన్ని కేంద్ర అవార్డుగా ప్రచారం
- గవర్నర్‌ను కూడా తప్పుదోవ పట్టించారు
- ఏసీఎఫ్ఏ ఒక ప్రైవేటు విత్తన కంపెనీ
- రైతు కమిటీలు నామినేటెడ్ పద్ధతిలోనా?
- పార్టీ కోసం ప్రజాధనం ఖర్చు: ఉత్తమ్

హైదరాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): సీఎం కేసీఆర్‌కు గ్లోబల్ లీడర్‌షిప్ అవార్డు ఓ బోగస్ అని టీపీసీసీ అధ్యక్షుడు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఈ విషయంలో కేసీఆర్.. రాష్ట్ర ప్రజలతోపాటు గవర్నర్‌ను కూడా తప్పుదారి పట్టించారని ఆరోపించారు. బుధవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇండియన్ కౌన్సిల్ ఫర్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ (ఐసీఎఫ్ఏ) అనే ప్రైవేటు సంస్థ ఇచ్చిన అవార్డును కేంద్ర ప్రభుత్వం ఇచ్చినట్లుగా ప్రచారం చేసుకున్నారని తెలిపారు. గవర్నర్ కార్యాలయం కూడా ఈ అవార్డును కేంద్రం ఇచ్చినట్లుగా ప్రకటిస్తూ అభినందనలు తెలపడమేంటని ప్రశ్నించారు. ఏసీఎఫ్ఏ ఒక ప్రైవేటు కంపెనీ అనీ, దాని అధినేత ఎంజె ఖాన్ బీజేపీకి చెందిన వ్యక్తి అని చెప్పారు. ఆ కంపెనీ గత ఏడాది చేసిన ఖర్చు రూ.20 వేలని, అలాంటి కంపెనీ జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మక అవార్డును ఎలా ఇవ్వగలుగుతుందని ప్రశ్నించారు. నిజానికి కేసీఆర్ ఆ అవార్డుకు కూడా అర్హుడు కాదని, ఆయన పాలన రాష్ట్రానికి శాపంగా మారిందని అన్నారు. మూడున్నరేళ్ల పాలనలో 3500 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, ఖమ్మంలో మిర్చి రైతులు గిట్టుబాటు ధర అడిగితే వారికి బేడీలు వేశారని తెలిపారు. ఇక రైతు సమన్వయ సమితుల గురించి ఇచ్చిన జీవో హాస్యాస్పదంగా ఉందని ఉత్తమ్ అన్నారు. రైతు కమిటీలను నామినేటెడ్ పద్ధతిలో ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. కేసీఆర్ ఎన్నికల గిమ్మిక్కులు చేస్తూ అందుకోసం రూ.2 వేల కోట్లు ఖర్చు చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ప్రజాధనాన్ని టీఆర్ఎస్ కోసం ఖర్చు చేయడాన్ని తాము సహించబోమన్నారు. రైతు సమితులను గానీ, భూసర్వేను గానీ రాజకీయాలకు అతీతంగా చేయాలని డిమాండ్ చేశారు.



'కార్ల్ మార్క్స్ దాస్ క్యాపిటల్' పుస్తక వార్షికోత్సవ సభలో మాట్లాడుతున్న సురవరం

మోదీది బోగస్ జాతీయవాదం

- సంఘటితంగా ఎదుర్కొంటాం
- ఉద్యోగుల పక్షాన పోరాడతాం: సీపీఐ

హైదరాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ తీసుకొస్తోంది బోగస్ జాతీయవాదమని సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. మోదీ పాలనలో ముస్లింలు, దళితులు, మైనారిటీలు, మేధావులు, కమ్యూనిస్టులపైన దాడులు పెరిగిపోతున్నాయన్నారు. వాటిని ఎదుర్కోవాలంటే లౌకికవాద శక్తులతో కలిసి కమ్యూనిస్టులు పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. బుధవారం ఇక్కడ 'కారల్‌మార్క్స్ - పెట్టుబడి గ్రంథం' 150వ వార్షికోత్సవ సభలో ఆయన ప్రసంగిస్తూ.. ఎన్నికల్లో ఓటమి పాలైనంత మాత్రాన మార్క్సిజానికి కాలం చెల్లిందనడం సరికాదన్నారు. కాగా, సీపీఎస్ విధానాన్ని ఉపసంహరించుకొని, 2004కు ముందున్న పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీపీఐ రాష్ట్ర కార్యవర్గం డిమాండ్ చేసింది. ఉద్యోగులకు అండగా ఆందోళన చేపట్టాలన్న తీర్మానం ఆమోదించారు.

టీఆర్ఎస్.. ఓటు బ్యాంకు రాజకీయాలొద్దు

- తెలంగాణకు సామాజిక న్యాయ శాఖ నిధులు: దత్తాత్రేయ



న్యూఢిల్లీ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): టీఆర్ఎస్ ఓటు బ్యాంకు రాజకీయాలు మానుకోవాలని, సెప్టెంబరు 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని కేంద్ర కార్మిక శాఖ మంత్రి బండారు దత్తాత్రేయ డిమాండ్ చేశారు. ఆయన బుధవారం నాడిక్కడ విలేకరులతో మాట్లాడుతూ.. ఇది ముస్లింలకు సంబంధించిన అంశం కాదని, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి గెలిచిన సందర్భంగా జరుపుకొనే ఉత్సవమన్నారు. మరోవైపు, తన చొరవతో కేంద్ర సామాజిక న్యాయ, నైపుణ్యాభివృద్ధి శాఖ బుధవారం తెలంగాణకు భారీ నిధులు విడుదల చేసిందన్నారు.


ఆశాజనకంగా నైరుతి!

- లోటు పూడ్చిన ఆగస్టు చివరి వారం
- తెలంగాణలో సాధారణం
- ఏపీలో అధిక వర్షపాతం నమోదు
- ప్రత్యామ్నాయ సాగుకు అనుకూలం

విశాఖపట్నం/అమరావతి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వర్షాల కోసం ఎదురుచూస్తున్న తెలుగు రాష్ట్రాల రైతులను ఆగస్టు చివరి వారం ఆదుకుంది. తెలంగాణలోని ఒక్క ఆదిలాబాద్ తప్ప మిగిలిన అన్ని జిల్లాల్లో సాధారణం లేదా అంతకంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. ఆగస్టు తొలి వారంలో వరుసగా ఉపరిత ఆవర్తనాలు ఏర్పడి రుతుపవన ద్రోణి దక్షిణాది వైపునకు రావడంతో వర్షాలు పెరిగాయి. అనంతరం అల్పపీడనం ఏర్పడి పశ్చిమంగా పయనించే క్రమంలో తెలుగు రాష్ట్రాల్లో విస్తారంగా, అక్కడక్కడా భారీ నుంచి అతి భారీవర్షాలు కురిశాయి. కాగా నైరుతి సీజన్‌లో జూన్ ఒకటి నుంచి ఆగస్టు 30 వరకు చూస్తే.. తెలంగాణలో సాధారణంగా, ఆంధ్రప్రదేశ్‌లో సాధారణం కంటే ఎక్కువగా వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. తెలంగాణలోని మహబూబ్‌నగర్‌లో 112, మెదక్‌లో 155, రంగారెడ్డిలో 126 శాతం, హైదరాబాద్‌లో 261 శాతం ఎక్కువ వర్షపాతం నమోదైంది. మిగిలిన జిల్లాల్లో కూడా వర్షాలు పెరిగినా వర్షాభావ పరిస్థితులు అధిగమించే వాతావరణం నెలకొనలేదు. ఈ సీజన్‌లో బుధవారం వరకు తెలంగాణాలో మూడు నెలల కాలానికి 586.1 మిల్లీమీటర్లకు గాను 543.1 మిల్లీమీటర్ల (ఏడు శాతం తక్కువ) వర్షం కురిసింది. ఆదిలాబాద్ జిల్లాలో మాత్రం సాధారణం కంటే 22 శాతం తక్కువగా నమోదైంది. కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లోనూ వర్షాభావ పరిస్థితులు కొనసాగుతున్నాయి. సెప్టెంబర్‌లో కూడా సాధారణ వర్షపాతం నమోదవుతుందని వాతావరణ శాఖ ఇప్పటికే వెల్లడించింది. కాగా, ఆంధ్రప్రదేశ్‌లో 352.1 మిల్లీమీటర్లకు గాను 434 మిల్లీమీటర్లు కురిసి సాధారణం కంటే 23 శాతం ఎక్కువ నమోదైంది. గత వారం సాధారణం కన్నా నెల్లూరు జిల్లాలో 268 మిల్లీమీటర్లు, విజయనగరంలో 158, విశాఖపట్నంలో 208, శ్రీకాకుళంలో 156, ప్రకాశంలో 176, తూర్పుగోదావరి జిల్లాలో 105, కర్నూలులో 263, కడపలో 377, చిత్తూరులో 110 శాతం ఎక్కువ వర్షపాతం నమోదైంది. ఆగస్టు చివరిలో ఆశాజనకంగా వర్షాలు కురవడంతో ఉభయగోదావరి, శ్రీకాకుళం, కృష్ణా జిల్లాల్లో వరినాట్లు పుంజుకున్నాయి. అయితే తొలకరి పంట వేయని ప్రకాశం, నెల్లూరు, అనంతపురం, కర్నూలు, చిత్తూరు, కడప జిల్లాల రైతులు ఈ వర్షాలతో అపరాలు, చిరుధాన్యాల పంటలు వేసేందుకు భూములు సిద్ధం చేసుకుంటున్నారు. అయితే సెప్టెంబరు తొలి వారంలో నైరుతి రుతుపవనాలు వాయవ్య భారతం నుంచి వైదొలుగుతాయని వాతావరణ నిపుణుడు ఆర్.మురళీకృష్ణ తెలిపారు. ఈ నేపథ్యంలో రుతుపవనద్రోణి దక్షిణాది వైపునకు మరలి వాయుగుండం ఏర్పడుతుందని, దీంతో వర్షాలు కురుస్తాయని అంచనా వేశారు.

కొత్త జీవోతో మళ్లీ పటేల్-పట్వారీ వ్యవస్థ

- సమన్వయకర్తల అర్హతలేంటి?: టీడీపీ
- భూములపై తొలుత ఫిజికల్ సర్వే: బీజేపీ
- భూ సమస్యను జటిలం చేస్తున్న సర్కారు: సీపీఐ



హైదరాబాద్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉండగా పటేల్ - పట్వారీ వ్యవస్థను రద్దు చేసి తెలంగాణకు నిజమైన స్వాతంత్ర్యం ప్రసాదిస్తే.. ఇప్పుడు టీఆర్ఎస్ సర్కారు జీవో నెం.39 తీసుకొచ్చి ఆ వ్యవస్థను మరోసారి తేవాలనుకుంటోందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి విమర్శించారు. ఈ జీవో రైతులకు వచ్చిన ఆస్తి హక్కును టీఆర్ఎస్ కార్యకర్తలు నిర్ణయించేలా ఉందన్నారు. రైతుల భూముల రికార్డులను సమీక్షించే అధికారం కట్టబెట్టే రైతు సమన్వయ సమితి సభ్యుల అర్హతలేంటన్నారు. కేబినెట్ నిర్ణయం కాకుండా ముఖ్యమంత్రి నామినేట్ చేస్తే రికార్డ్స్ ఆఫ్ రైట్స్ చట్టం, రెవెన్యూ మ్యానువల్స్ ఏమవుతాయని నిలదీశారు. కేంద్రం ఇచ్చే నిధులను రైతు సమన్వయ సమితుల ద్వారా ఖర్చు చేయిస్తామంటున్నారని, అదే జరిగితే స్థానిక ప్రజాప్రతినిధుల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతుందన్నారు. జీవోనెం.39ని టీడీపీ వ్యతిరేకిస్తోందని, న్యాయ పోరాటం చేస్తుందన్నారు. కాగా, తొలుత ఫిజికల్ సర్వే నిర్వహించి, సర్వే నెంబర్లతో కూడిన ప్రతి గ్రామ నక్షను రూపొందించాకే భూ సమగ్ర సర్వే చేపట్టాలని సీఎం కేసీఆర్‌కు బీజేపీ జాతీయ నేత ఎన్.ఇంద్రసేనారెడ్డి సూచించారు. గ్రామంలోని రైతు కమిటీ అభిప్రాయాన్ని సర్వేలో ఫైనల్‌గా భావించరాదన్నారు. భూముల రికార్డుల డిజిటలైజేషన్ కోసం కేంద్రం రూ.85 కోట్లు విడుదల చేసినా ఆ నిధులను రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి పట్టించిందన్నారు. భూ సమగ్ర సర్వే పేరుతో జటిలం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గం విమర్శించింది. గ్రామాల్లో అనేక భూవివాదాలు పరిష్కారం కాకుండా ఉన్న తరుణంలో రాజకీయ నేతలతో నామినేటెడ్ కమిటీలు వేసి ఏం సాధిస్తారో చెప్పాలని ప్రశ్నించింది.

నలుగురికి చికిత్స అవసరం లేదు

- మరోఇద్దరు వైద్యానికి నిరాకరణ: 'నేరెళ్ల'పై కోర్టుకు సర్కారు

హైదరాబాద్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా నేరెళ్లలో దళితులపై పోలీసుల దాడిలో గాయపడిన ఆరుగురిలో ఇద్దరు వైద్యానికి నిరాకరిస్తున్నారని, మరోనలుగురికి వైద్యం అవసరం లేదని హైకోర్టుకు రాష్ట్రప్రభుత్వం నివేదించింది. ఆరుగురినితీసుకెళ్తేనే వైద్యం చేయించుకుంటామని ఆ ఇద్దరు కోరుతున్నారని, అందుకే వైద్యం చేయించలేకపోయామని ఏజీ ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. ఈ ఘటనపై హోంశాఖ ముఖ్యకార్యదర్శి, డీఐజీ, జైళ్లశాఖ అధికారులు నివేదిక సమర్పించారని, అఫిడవిట్ దాఖలుకు గడువు కోరడంతో విచారణను ధర్మాసనం వచ్చేనెల 5కు వాయిదా వేసింది.

మెడికల్ సీట్ల భర్తీ వివాదానికి హైకోర్టు తెర

హైదరాబాద్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీల్లో సీట్ల భర్తీ వివాదానికి హైకోర్టు తెరదించింది. జీవో 550లోని క్లాజ్ 5(2) నిబంధనను నిలిపివేస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.రామసుబ్రమణియన్ ధర్మాసనం బుధవారం ఆదేశాలు జారీచేసింది. ఓపెన్ కేటగిరిలో మెరిట్ ప్రకారం సీటు పొందిన రిజర్వు కేటగిరి అభ్యర్థుల వైదొలిగితే ఆ సీటును రిజర్వు కేటగిరి అభ్యర్థితోనే భర్తీ చేయాలన్న నిబంధనతో మెరిట్ విద్యార్థులకు నష్టం జరుగుతోందని పలువురు విద్యార్థులు కోర్టులో వ్యాజ్యాలు వేశారు.

ప్రాజెక్టుల అనుమతులకు ముమ్మర కసరత్తు

హైదరాబాద్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టుల అనుమతులకు ముమ్మర కసరత్తు చేస్తున్నట్లు కేంద్ర అటవీ పర్యావరణ శాఖ ప్రాంతీయాధికారి రాంగోపాల్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ ప్రాజెక్టులు-అటవీ అనుమతులకు సంబంధించిన తాజా స్థితిపై హైదరాబాద్‌లో బుధవారం అటవీ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు.రోడ్లు, భవనాలు, విద్యుత్, సింగరేణి, సాగునీటి ప్రాజెక్టులు, జాతీయరహదారులకు సంబంధించి 179 పనులకు అనుమతులు జారీ అయినా తర్వాతి ప్రక్రియలో జాప్యం జరగడంతో తుదిదశ అనుమతులు నిలిచిపోయాయని అధికారులు తెలిపారు.

రుణమాఫీకి మరో 19.22 కోట్లు విడుదల

హైదరాబాద్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): పంట రుణాల మాఫీ పథకానికి మరో రూ.19.22 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. పంట రుణాల మాఫీ పథకం కోసం ఈ ఏడాది ప్రభుత్వం రూ.4వేల కోట్లు విడుదల చేసిన సంగతి తెలిసిందే. అయితే మాఫీ పథకం అమలుకు మరో రూ.19.22 కోట్లు విడుదల చేయాలని వ్యవసాయశాఖ ప్రభుత్వానికి ప్రతిపాదించింది.

వంతెనల నిర్మాణానికి రూ.2782 కోట్లు

హైదరాబాద్ ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 532 వంతెనల నిర్మాణానికి రూ.2,782 కోట్లు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర ఏర్పాటు తర్వాత రహదారులు, భవనాల శాఖ ఆధ్వర్యంలో 14,000 కి.మీ. మేర రహదారుల నిర్మాణం చేపట్టింది. మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు, జిల్లా కేంద్రాల నుంచి రాష్ట్ర రాజధానికి రహదారులను అనుసంధానిస్తూ రూ.15,000 కోట్ల అంచనాలతో ప్రణాళికలు రూపొందించారు.532 వంతెనలను పటిష్టపరచడం, పునర్నిర్మించేందుకు రూ.2,782 కోట్లు అవవసరమని గుర్తించినట్లు మంత్రి తుమ్మల తెలిపారు. సీఎం కేసీఆర్ సూచన మేరకు 532 వంతెనల నిర్మాణంలో టెక్నికల్‌గా వీలున్న ప్రాంతాల్లో చెక్ డ్యాంలను కూడా నిర్మించాలని ఆర్అండ్‌బీ శాఖ నిర్ణయించింది.

నల్సార్‌లో అంతర్జాతీయ న్యాయ సదస్సు

హైదరాబాద్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ న్యాయ సంస్థ(ఐడీఐ-ఐఐఎల్) 'ఇన్‌స్టిట్యూట్ డె డ్రాయిట్ ఇంటర్నేషనల్ 78వ సదస్సును నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్నట్లు యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఓ ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 3 నుంచి 10 వరకు నిర్వహించే ఈ సమావేశాల్లో అంతర్జాతీయ న్యాయశాస్త్రంలో లోతైన అవగాహన కలిగిన 60దేశాల నిపుణుల చర్చలకు నల్సార్ వేదిక కానుంది. ఐక్యరాజ్య సమితి నిర్ణయాల అమలుకు సంబంధించి రూపొందించాల్సిన అంతర్జాతీయ న్యాయ సూత్రాలు, పెద్దఎత్తున సాగుతున్న అంతర్జాతీయ వలసలతో తలెత్తుతున్న న్యాయ సమస్యలు, అంతర్జాతీయ వివాదాల పరిష్కార ట్రైబ్యునళ్ల ముందుకు తీసుకువెళ్లే అంశాల విధి విధానాలపై చర్చ జరుగుతుంది.

'ఐచ్ఛిక సెలవులు స్కూళ్ల వారీగానే ఉండాలి'

హైదరాబాద్, ఆగస్టు30(ఆంధ్రజ్యోతి): ఐచ్ఛిక సెలవులను ఉపాధ్యాయులు వ్యక్తిగతంగా కాకుండా పాఠశాలల వారీగా వినియోగించుకునే విధంగా ఉండాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అధ్యక్షుడు నర్సిరెడ్డి, ప్రధాన కార్యదర్శి చావ రవి డిమాండ్ చేశారు. ఐచ్ఛిక సెలవులను పాఠశాలల వారీగా వినియోగించుకునేలా విద్యాశాఖ 20 ఏళ్ల క్రితం ఇచ్చిన ఆదేశాలను ఇప్పుడు వ్యక్తిగతంగా వాడుకోవాలనడం సరికాదన్నారు.

ఉపాధి పనుల్లో వేగం పెంచండి: కేంద్రం

న్యూఢిల్లీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనుల్లో వేగం పెంచాలని, నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుతాన్ని కేంద్రం ఆదేశించింది. రాష్ట్రంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులపై కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సంయుక్త కార్యదర్శి అపరంజితసారంగి రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ నీతూ కుమారి ప్రసాద్‌కు లేఖ రాశారు. కార్మికులకు వేతనాల చెల్లింపులో జాప్యం జరుగుతున్న విషయాన్ని గుర్తించామన్నారు. ఆలస్యమైన వేతనాలకు సంబంధించి రూ.4 కోట్లకుపైగా పరిహారం చెల్లించాల్సి ఉందని గుర్తు చేశారు. తాజాగా మరో రూ.4 కోట్ల పరిహారానికి సంబంధించి ధ్రువీకరణను పూర్తి చేసి చెల్లింపులు చేపట్టాలని ఆదేశించారు.

టీజీటీ మెయిన్స్ పరీక్షకు 78.14% హాజరు

హైదరాబాద్, ఆగస్టు30(ఆంధ్రజ్యోతి): ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్(టీజీటీ) పోస్టుల భర్తీలో భాగంగా బుధవారం నిర్వహించిన మెయిన్స్ రాత పరీక్షకు 78.14శాతం మంది అభ్యర్థులు హాజరైనట్లు టీఎస్‌పీఎస్సీ ప్రకటించింది. 3,006 మంది మెయిన్స్ పరీక్షకు ఎంపిక కాగా, 2,349 మంది అభ్యర్థులు హాజరైనట్లు టీఎస్‌పీఎస్సీ సెక్రటరీ వాణి ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మాజీ ఐపీఎస్ డీవీఎల్ఎన్.రామకృష్ణ మృతి

హైదరాబాద్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మాజీ పోలీస్ అధికారి డీవీఎల్ఎన్.రామకృష్ణరావు(83) ఊపిరితిత్తులవ్యాధితో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో బుధవారం మృతి చెందారు. 1957 బ్యాచ్‌కు చెందిన రామకృష్ణరావు ప్రింటింగ్ అండ్ స్టేషనరీ డైరెక్టర్‌గా, ఇండో టిబెట్ బార్డర్ పోలీస్ డీజీపీగా, హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అడిషనల్ కమిషనర్‌గా విధులు నిర్వర్తించారు. ఆయన మృతికి సీఎం కేసీఆర్ సంతాపం తెలిపారు. అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని సీఎస్ ఎస్‌పీ.సింగ్‌ను ఆదేశించారు. కాగా, డీజీపీ అనురాగ్ శర్మ, తెలంగాణ ఐపీఎస్ అధికారుల సంఘం సభ్యులు సంతాపం తెలిపారు.

డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్‌కు జైలు, జరిమానా

హైదరాబాద్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే కేసులో ఫ్యాక్టరీస్ డిపార్ట్‌మెంట్ బాయిలర్స్ విభాగంలో డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన బి.యోగేశ్వర్ రావుకు ఏసీబీ కోర్టు శిక్ష ఖరారు చేసింది. 2002లో కేసు నమోదు చేసిన ఏసీబీ 2006లో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసింది. ఆయనకు ఏడాది జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. ఆదాయానికి మించి ఏసీబీ గుర్తించిన రూ.46,48,268 విలువైన ఆస్తులకు సరిపడా మొత్తాన్ని 4 నెలల్లో కోర్టులో డిపాజిట్ చేయాలన్నది.

ప్రవాస కిరణం




మన వ్యవస్థ కుళ్లిపోయింది అని అందరిలా అంటూ కూర్చోలేదు ఆ ఎన్నారై. అమెరికా వెళ్లినా సరే సొంతూరి కోసం ఆలోచించాడు. బడి కోసం, పక్కూరి చెరువుకోసం, ప్రభుత్వ ఆసుపత్రిలో మార్పుకోసం అమెరికానుంచే ఆన్‌లైన్‌లో పోరాటమే చేశాడు. సామాజిక సేవలో ప్రత్యక్షంగా ఆటుపోట్లు ఎదురైనా సరే ఎదురుగా నిలబడ్డాడు. సర్కారు బడి బావుండాలనే ఉద్దేశంతో 'టీ విత్ హెడ్‌మాస్టర్' అనే వినూత్న కార్యక్రమంతో అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నారు జలగం సుధీర్. ఆయన కృషికి మెచ్చి జాతీయస్థాయిలో 'వారియర్ అవార్డ్' వరించింది. ఆయన జీవన ప్రయాణం విశేషాలు..



వెరైటీ పోరాటం!

... మంచి సమాజం కోసం!!

కళ్ల ముందు అవినీతి, అక్రమాలు కనిపిస్తే నేను ప్రశ్నిస్తాను. ఈ ప్రశ్నించే గుణం మా తాతయ్య ద్వారా అలడిందేమో! నా చిన్నప్పుడు మా తాతయ్య రచ్చబండపై కూర్చుని తీర్పులు చెప్పేవారు. సమస్యను చాలా డిప్లమాటిక్‌గా పరిష్కరించేవారు. మా నాన్న రైతు. సాయం చేసే గుణం ఆయనలో మెండు. అలా తాతయ్య, నాన్న నుంచి కొన్ని మంచి లక్షణాలు వచ్చాయి. మాది సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం వెంకట్రామపురం. ప్రైవేట్ స్కూల్‌లో చదువుతున్నప్పుడు.. సర్కారు బడిలో చేర్పించమన్నాను మా నాన్నతో. 'చదువు బాగోదు బిడ్డా' అన్నారాయన. బిటెక్ తర్వాత ఎంబిఎ చేసి సాఫ్ట్‌వేర్ కొలువు సంపాదించా. ఆపై అమెరికా వెళ్లాను. మంచి జీతం, మ్యారేజ్, పిల్లలు. అయినా ఏదో మనసులో వెలితి వెంటాడేది.

అనుభవమే ఆలోచనగా..

అమెరికాలో ఐదేళ్లు పడ్డాకే ప్రభుత్వ పాఠశాల్లో చదవటానికి అర్హత ఉంటుంది. నా పెద్దకొడుకు దేవాన్ష్‌ను గతేడాది స్కూల్‌లో చేర్పించటానికి మేం వెళ్లాం. అక్కడ ప్రభుత్వ పాఠశాల బిల్డింగ్స్, క్రమశిక్షణ, టీచింగ్ మెథడ్స్ చూశా. మన ప్రభుత్వ పాఠశాలలు నా కళ్ల ముందు మెదిలాయి. ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతుంటే చాలా విషయాలు తెలిసాయి. లోకల్ మున్సిపాలిటీకి వచ్చిన డబ్బుల్లో కొంత ప్రభుత్వ పాఠశాలల మెరుగుదలకు కేటాయిస్తారని ఆయన చెప్పారు. 'కాఫీ విత్ ప్రిన్సిపాల్' అనే కార్యక్రమం ఉందన్నారు. ఏంటని అడిగితే.. ఆసక్తిగా చెప్పారాయన. ఈ కార్యక్రమం నెలకు ఓసారి జరుగుతుంది. ఆ సమయంలో తల్లిదండ్రులు ఎలాంటి టీచింగ్ మెథడ్స్‌ను బోధించాలో టీచర్లకు చెప్పాలి. బడిలో ప్లంబర్ వర్క్, ఎలక్ట్రికల్ వర్క్, కిచెన్‌లో సమస్యలు, ఉదయాన ఫలానా సిగ్నల్స్ దగ్గర జాగ్రత్తగా పిల్లలను స్కూల్ బస్సులో ఎక్కించటానికి వాలెంటీర్ల అవసరం.. ఇలాంటి సమస్యలు స్కూల్ ప్రిన్సిపాల్ చెబుతారు. వెంటనే ఎవరికి వారు వాలెంటరీగా పనులు చేయటానికి ముందుకొచ్చి సమస్యల్ని పరిష్కరిస్తారు. ఇలా తల్లిదండ్రులు ఇన్వాల్వ్ కావటం వల్ల స్కూల్‌కు బడ్జెట్ మిగులుతుంది. ఆ మిగిలిన బడ్జెట్‌ను రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌కు వెచ్చిస్తారు' అని ప్రిన్సిపల్ చెప్పుకొచ్చారు. ఇదేదో బావుందనిపించింది. ఇలాంటి కార్యక్రమాన్ని మా ఊళ్లో చేయాలనుకున్నా. దానికి 'టీ విత్ హెడ్ మాస్టర్' అనే పేరు పెట్టాను.

ఇరవై పాఠశాల్లో...

ప్రభుత్వం ఒక సర్కారు బడిలో చదివే పిల్లవాడికి సంవత్సరానికి పుస్తకాల దగ్గరనుంచి, బట్టలు, మధ్యాహ్న భోజన పథకం, మాస్టారు నెలజీతం వరకూ.. మొత్తం కలిపి 28 వేలు ఇస్తుందని తెలిసి షాకయ్యాను. కొన్నాళ్ల తర్వాత మా ఊరి హెడ్‌మాస్టర్‌తో 'కాఫీ విత్ హెడ్‌మాస్టర్' మన ఊరిలో ప్రారంభిద్దామని ఫోన్ చేసి చెప్పాను. 'అక్కడలా ఇక్కడ కుదరద'న్నారు. పిల్లల తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడాను. 'మాకెందుకూ ప్రభుత్వం చూసుకుంటుంది' అన్నారు. ఎమ్‌ఇ, డిఈఓ, కలెక్టర్ కు కూడా ఈ కాన్సెప్ట్ చెబితే అందరూ బావుందన్నారు. వాళ్లంతా ముందుకు తీసుకెళ్లటానికి నిత్యం మెయిల్స్, ఫోన్స్‌తో కన్విన్స్ చేశా. గతేడాది కొన్నాళ్లు అమెరికాలో ఉద్యోగానికి సెలవు పెట్టి జూలైలో మా ఊరికి వచ్చాను. మా వేదాన్ష్‌ను ఊళ్లోని సర్కారు బడికి పంపించాను, మా అబ్బాయి అక్కడ సమస్యలను ఓ కాగితంపై రాశాడు. నాకొచ్చి చెప్పాడు. వెంటనే బడికి రంగులు వేయించా. టీవీలు కొనిచ్చాను. ప్రహారీగోడను నిర్మించాను. బడి బాగుకోసం లక్షా పాతికవేలు ఖర్చుపెట్టాను. 2016 నవంబర్‌లో 'టీ విత్ హెడ్‌మాస్టర్' కార్యక్రమం ప్రారంభమైంది. ప్రభుత్వం మా ఊరి బడిని పట్టించుకుంది. ఇపుడు 'టీ విత్ హెడ్‌మాస్టర్' కార్యక్రమానికి తల్లిదండ్రులు కొంతమంది వచ్చి ఉపాధ్యాయులను ప్రశ్నిస్తున్నారు. సొంత పనిలా బడి పనుల్లోనూ భాగస్వాములవుతున్నారు. ప్రస్తుతం వివిధ జిల్లాల్లోని 25 పాఠశాలల్లో ఈ కార్యక్రమం అమలవుతోంది.

ఇంటి మీదకి వచ్చారు!

పాఠశాలలో ఇలాంటి కార్యక్రమాన్ని చేయటం బావుందని కరీంనగర్, మహబూబ్‌నగర్ జిల్లాల కలెక్టర్లు కితాబు ఇచ్చారు. మా ఊరి స్కూల్ దగ్గర బెల్ట్ షాప్ వద్దని పోరాడాను. కలెక్టర్ నుంచి ఆదేశాలు వచ్చినా అధికారులు పట్టించుకోలేదు. సమాజంపై రాజకీయ ప్రభావం చూసి బాధేసింది. నేను అమెరికాలో ఉండే సమస్యలపై పోరాడుతుంటే కొందరు మా ఇంటికొచ్చి మానాన్నను తిట్టి, బెదిరించి, వార్నింగులు ఇచ్చారు. దీంతో 'ఇవన్నీ మనకెందుకూ' అని మా నాన్న బాధపడ్డారు.

చెరువు బాగు కోసం..

ఓసారి పనిపడి అమెరికానుంచి మా ఊరొచ్చినపుడు.. మా కోదాడ చెరువును చూశా. మనసు తరుక్కుపోయింది. ఆ చెరువు జాడంతా కనుమరుగైంది.

> **ప్రస్తుతం అమెరికాలో ప్రాజెక్ట్ మేనేజర్‌గా పని చేస్తున్నా. నా భార్య సుష్మ సహకారం మరువలేనిది. నా పోరాటంలో ఇబ్బందులు వచ్చినా 'మీరు తప్పుచేయలేదు. భయపడకండి' అని ప్రోత్సహిస్తుంది. మాకిద్దరు పిల్లలు. పెద్దబ్బాయి వేదాన్ష్ రెండో తరగతి. రెండో అబ్బాయి జేష్ణవ్ కు మూడేళ్లు.**



కనీసం మిగిలిన చెరువు కబ్జా కాకుండా ఏదోటి చేయాలనుకున్నా. అమెరికానుంచే ఆన్‌లైన్‌లో సమాచారహక్కు చట్టం ద్వారా ప్రశ్నించాను. కోదాడలో 750 ఎకరాల చెరువుండేదని తెల్సింది. అందులో 250 ఎకరాల్లో పెద్ద బిల్డింగులు, రాజకీయపార్టీల ఆఫీసులు వెలిసాయనే విషయం అర్థమైంది. మెయిల్స్‌తోనే ప్రభుత్వంతో మాట్లాడాను. అప్పటి జిల్లా కలెక్టర్ స్పందించి వెంటనే చెరువును కాపాడమని ఆదేశించారు. అయినా సరే నాయకుల భయంతో అధికారులు దాని ఛాయలకు పోలేదు. కొందరు నాకు డబ్బులు ఆఫర్ చేశారు. మా నాన్నమీదకి భారీ ఎత్తున గొడవకు వచ్చారు. ఈసారి నేను దేనికీ బెదరలేదు. ఓ రోజు మంత్రి హరీష్‌రావుగారితో ఓ చానెల్ లైవ్‌లో కోదాడ చెరువు గురించి మాట్లాడాను. ఆ తర్వాత 325 పేజీల డాక్యుమెంట్లు తయారు చేసి హరీష్‌రావుగారికి ఇచ్చాను. దాంతో ప్రభుత్వం 5.5 కోట్ల రూపాయల్ని కోదాడ చెరువు చుట్టూ ట్యాంక్ బండ్ కట్టడానికి మంజూరు చేసింది. విచిత్రమేంటంటే.. దాని కాంట్రాక్ట్ కోసం పొలిటీషియన్లు పోటీ పడ్డారు. దాన్ని నాసిరకంగా కడుతుంటే.. ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చాను. ఏం జరుగుతుందో చూడాలి?

ప్రభుత్వ ఆసుపత్రుల తీరు ఇదీ..

మా కోదాడ గవర్నమెంట్ ఆసుపత్రిలోని డాక్టర్లపై ఓ పోరాటమే చేశాను. వారు గవర్నమెంట్ ఆసుపత్రి నుంచి ప్రైవేట్ ఆస్పత్రికి కొందరిని రిఫర్ చేస్తున్నారని తెలిసింది. ఇలా ఎందుకు రెఫర్ చేశారు అని అడిగాను. ఎవరూ స్పందించలేదు. దీంతో సీఎమ్ గారికి ఉత్తరం రాశాను. పదిరోజుల తర్వాత కలెక్టర్‌కి ఆదేశాలు ఇచ్చారాయన. వెంటనే గవర్నమెంట్ ఆసుపత్రిలో వసతులు మెరుగయ్యాయి.

అదే నా కల!

మిషన్ కాకతీయకోసం ఎన్నారైలు ఇచ్చిన సొమ్మును తినేశారు కొందరు. దీన్ని వదలిపెట్టలేదు. గట్టిగా పోరాడాను. ఆ తర్వాత ఎట్టకేలకు ప్రభుత్వం ఓ అకౌంట్ నంబర్ ఇచ్చి అందులో ఎన్నారైలు డబ్బులు వేయాలని చెప్పింది. 'ఎమ్మెల్యే టికెట్ ఆశించి ఇవన్నీ చేస్తున్నావా' అని కొందరు నన్ను అడుగుతున్నారు.. సమాజం బాగుండాలనేదే నా స్వార్థం. నా పనులను చూసి 'ఎన్నారై ఆఫ్ ది ఇయర్' అనే అవార్డ్‌తో ప్రభుత్వం సత్కరించింది. 'టీ విత్ హెడ్‌మాస్టర్' కార్యక్రమాన్ని గుర్తించి ఓ సంస్థ ఇటీవలే ఢిల్లీలో 'టీచర్ వారియర్' అనే అవార్డుతో సన్మానించింది. ఈ అవార్డులు సామాజిక బాధ్యతను మరింత పెంచాయి. అందరికీ విద్య, వైద్యం అందాలి. సమాజం, ప్రశ్నించే సమాజం చూడాలన్నదే నా కల.

● రాళ్లపల్లి రాజావలి

పేరంటచ్

పిల్లల్లోనూ ఆత్మగౌరవం ఎక్కువే..



తల్లితండ్రులు చాలాసార్లు పిల్లల సామర్థ్యాన్ని తక్కువగా అంచనా వేస్తుంటారు. ఇది పిల్లల పెరుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఈ మాటలు సాక్షాత్తు మానసిక నిపుణులు చెప్తున్నారు. పెద్దవాళ్లలో మాదిరిగా పిల్లల్లో కూడా తమదైన శక్తియుక్తులు, సామర్థ్యం పుష్కలంగా ఉంటాయి. వాటిని గుర్తించి పిల్లలను ప్రోత్సహించాలే తప్ప 'నీ వల్ల కాద'ంటూ చిన్నారులను నిరుత్సాహపరచకూడదు. మరో విశేషమేమిటంటే చిన్నతనం నుంచే చిన్నారుల్లో వ్యక్తిగత సామర్థ్యాలు, శక్తియుక్తులు రూపుదిద్దుకుంటాయి. తమలోని సామర్థ్యాన్ని వాళ్లు ఎంతో హేతుబద్ధంగా గుర్తిస్తారు. అదే సమయంలో వైఫల్యాలు సైతం చిన్నారులను పెద్దవాళ్లల్లాగే నిరుత్సాహపరుస్తాయి. అంతేకాదు పెద్దవాళ్లలో మాదిరిగా వీళ్లల్లో ఆత్మగౌరవం పాళ్లు కూడా ఎక్కువే. ఈ విషయాన్ని చాలామంది తల్లితండ్రులు గుర్తించరు. 4 నుంచి 7 సంవత్సరాల వయసున్న పిల్లలపై చేసిన ఒక స్టడీలో అధ్యయనకారులు పిల్లలకు కొన్ని సవాళ్లు ఇచ్చి చేయమన్నారు. వాటిల్లో కొన్ని సులభంగా ఉన్నాయని పిల్లలు భావించారు. మరికొన్నింటిలో వైఫల్యం చవి చూశారు. కష్టమైన దానికన్నా సులభమైన దాంట్లో వైఫల్యం చెందారని పిల్లలతో అన్నపుడు వాటిని పరిష్కరించడంలో తమ అంచనాలు తప్పయ్యాయని మాత్రమే పిల్లలు పేర్కొన్నారు తప్ప తమ సామర్థ్యాన్ని వాళ్లు తక్కువ అంచనా వేయలేదు. ఈ స్టడీ పెద్దలకు మల్లే పిల్లల్లోనూ ఆత్మగౌరవం పాళ్లు ఎక్కువేనని స్పష్టంచేస్తోంది. సో... ఇంట్లో అమ్మానాన్నలూ, బడిలో టీచర్లూ పిల్లలతో వ్యవహరించేటప్పుడు ఈ విషయాన్ని మరువద్దు.

బ్యూటీ

వ్యర్థాలు పోతే వన్నె పెరిగినట్టే

శరీరం డిటాక్సిఫై అయితే చర్మం మృదువుగా....పట్టులా ఉంటుంది. శరీరంలోని వ్యర్థాలు పోయి శుభ్రంగా ఉంటుంది. దీనికి కొన్ని టిప్స్ ఉన్నాయి. అవి...

- ఉదయం లేచిన వెంటనే గోరువెచ్చటి నీటిలో నిమ్మరసం, తేనె కలిపి తాగితే ఎంతో మంచిది. అలాగే ఉడకబెట్టిన కూరలు తీసుకుంటే ఒంటికి మంచిది.
- రోజులో రెండు మూడు సార్లు గ్రీన్ టీ తాగితే మంచిది. ఇందులోని పోలీఫెనాల్స్ శక్తివంతమైన యాంటాక్సిడెంట్లుగా పనిచేస్తాయి.



- మంచినీళ్లు బాగా తాగాలి. ఆడవాళ్లయితే రోజుకు కనీసం 2.2 లీటర్ల నీటిని తాగాలి. ప్రధాన శరీర భాగాల్లోని విషపదార్థాలను నీరు బయటకు పంపేస్తుంది. అంతేకాదు పలు పోషక విలువలను శరీరంలోని కణాలకు అందిస్తుంది.
- పీచుపదార్థాలు ఎక్కువగా ఉన్న డైట్ తీసుకోవాలి. అలా చేయడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. గుండెజబ్బులు రావు. డయాబెటిస్, కేన్సర్, ఊబకాయం వంటి సమస్యలు తలెత్తవు.
- శరీరంలోని టాక్సిన్స్ పోయే వ్యాయామాలు కూడా చేయాలి.
- శరీరాన్ని డిటాక్సిఫై చేసేటపుడు కాఫీ, ఆల్కహాల్ జోలికి వెళ్లకూడదు.
- డైరీ ఉత్పత్తులు, గ్లూటెన్, మాంసం, కొవ్వులాంటి వాటికి దూరంగా ఉండాలి. వీటికి బదులు కొబ్బరినీళ్లు, పళ్లు, కూరగాయలు, జ్యూసులు, సలాడ్లు, స్మూదీస్, క్లియర్ సూప్, గ్రీన్ టీ, లెమొనేడ్, కొబ్బరినీళ్లు వంటివి తీసుకోవాలి.

చిట్కా

దద్దుర్లు దరిచేరకుండా...


వర్షాకాలంలో చర్మంపై దద్దుర్లు బాగా వస్తాయి. ఒకవైపు ఎండ, మరో వైపు వర్షాల వల్ల చర్మం మీద దద్దుర్లు తలెత్తుతుంటాయి. ఇవి రాకుండా నిరోధించేందుకు సహజ చిట్కాలు కొన్ని ఉన్నాయి. అవి....

- అలోవెరా జెల్‌లో యాంటి-ఇన్‌ఫ్లమేటరీ గుణాలు బాగా ఉన్నాయి. అందుకే దద్దుర్ల నివారణంలో ఇది ఎంతో శక్తివంతంగా పనిచేస్తుంది. ఇందులో విటమిన్-ఇ కూడా పుష్కలంగా ఉంది.
- మంజిష్టాలో వేప పొడి, కొబ్బరినూనె వేసి పేస్టులా చేసి చర్మంపై రాసుకుంటే దద్దుర్ల సమస్య ఉండదు. మంజిష్టాలో యాంటి-ఇన్‌ఫ్లమేటరీ సుగుణాలు ఉన్నాయి.
- వేప సహజసిద్ధమైన క్లీన్సర్. ఇది రక్తాన్ని కూడా శుద్ధిచేస్తుంది. యాంటి-ఫంగల్, యాంటి-బాక్టీరియల్ సుగుణాలు ఉన్న క్విర్‌సెటిన్ లాంటివి ఇందులో బాగా ఉన్నాయి. ఇవి దద్దుర్లు రాకుండా చర్మంపై మందులా పనిచేస్తాయి.
- శాండల్‌వుడ్ పౌడర్‌లో కొద్దిగా రోజ్‌వాటర్ కలిపి పేస్టులా చేసి దాన్ని చర్మంపై రాసుకుని 5 నుంచి 10 నిమిషాలు అలాగే ఉంచుకోవాలి. ఆ తర్వాత చల్లటి నీటితో కడిగేసుకోవాలి. ఇలా చేస్తే చర్మంపై దద్దుర్లు రావు.
- పసుపులో యాంటి-ఎలర్జిక్, యాంటిసెప్టిక్ సుగుణాలు పుష్కలంగా ఉన్నాయి. శాండల్‌వుడ్ పౌండర్ లేదా ముల్తాని మిట్టిలో చిటికెడు పసుపు వేసి పేస్టులా చేసి చర్మంపై రాసుకుంటే దద్దుర్లు రాకుండా నిరోధించవచ్చు.
- టీ ట్రీ ఆయిల్‌లో యాంటి ఫంగల్ సుగుణాలు బాగా ఉన్నాయి. అందులో కొద్దిగా కొబ్బరి నూనె వేసి బాగా కలిపి తలస్నానం చేసిన తర్వాత చర్మానికి రాసుకోవాలి. ఇలా చేయడం వల్ల చర్మం మీద దద్దుర్లు రాకుండా నివారించవచ్చు.
- పుచ్చకాయ ముక్కలను గుజ్జులా చేసి దాన్ని చర్మంపై రాస్తే చర్మానికి కావాలసిన తేమ అందుతుంది. అంతేకాదు చర్మానికి కావాల్సిన చల్లదనాన్ని కూడా ఇది పంచుతుంది.



ప్రాణాలు నిలబెట్టే ప్రయత్నం





కిల్ ది వేల్

ఆట ఆడవిడుపుగా ఉండాలిగానీ ప్రాణాలతో చెలగాటం ఆడేలా ఉండకూడదు. ఇటీవలి బ్లూ వేల్ ఛాలెంజ్ అనే ఆన్‌లైన్ గేమ్ ఆ కోవకు చెందినదే! చిత్రవిచిత్రమైన మలుపులతో, పరీక్షలతో సాగి చివరికి గేమర్స్‌ను ఆత్మహత్యకు పురిగొల్పే ఈ ఆట వల్ల ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. మరీ ముఖ్యంగా కేరళలో ఈ ఆట యావలో పడి టీనేజర్లు ఆత్మహత్యలు చేసుకుంటూ ఉండటంతో ఆలోచనలో పడిన కొందరు స్టూడెంట్స్ ఈ ఆటకు విరుగుడు కిల్ గి వేల్ ఛాలెంజ్ పేరిట మరో కొత్త గేమ్‌ను రూపొందించి బంధాలు, బంధుత్వాల విలువలను చాటి చెబుతున్నారు.


ప్రాణాలు బలిగొనే గేమ్

రష్యాలో అతిపెద్ద సోషల్ నెట్‌వర్క్ వికె నుంచి స్ఫూర్తితో రూపొందించిన గేమ్ బ్లూ వేల్. రష్యన్ టీనేజర్ రీనా పలెంకోవా కూడా ఆట చివరి ఘట్టంలో ఆత్మహత్యకు పాల్పడుతూ ఈ ఆటను సోషల్ మీడియాలో షేర్ చేసింది. దాంతో ఈ ఆట మీద ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి మొదలైంది. వేలంవెర్రిగా ఈ ఆటను డౌన్‌లోడ్ చేసుకుని ఆడేయటం మొదలుపెట్టారు టీనేజర్లు. తమని తాము గాయపరుచుకునే సూచనలతో మొదలయ్యే ఈ ఆట చివరికి వారిని ఆత్మహత్యకు పురిగొల్పుతుంది. ఆటలో మునిగి తిండీ తిప్పలు మానేయటమే కాదు కుటుంబ సభ్యులు, స్నేహితులతో సంబంధాలను పూర్తిగా వదిలేసుకున్న వాళ్లున్నారు. ఇంతటి ప్రమాదకరమైన ఆట మన దేశానికీ పాకింది. ఇంటర్నెట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు ఉండటంతో అందరూ ఈ ఆట మోజులో పడి ప్రాణాల మీదకు తెచ్చుకోవటం కేరళలోని కొందరు కాలేజీ విద్యార్థులను ఆలోచింపజేసింది.

యాంటీ బ్లూ వేల్ గేమ్

కోళిక్కోడ్‌లోని సెయింట్ జోసెఫ్స్ కాలేజి బిజినెస్ మేనేజ్‌మెంట్ విద్యార్థుల సృష్టే ఈ బ్లూ వేల్ గేమ్‌కు విరుగుడైన యాంటీ బ్లూ వేల్ గేమ్...కిల్ ది వేల్. బ్లూ వేల్ గేమ్ అయిన కిల్ ది వేల్ ఛాలెంజ్ మన చుట్టూ ఉన్న పరిసరాలను, మనుషులను మరిపించి భయంకరమైన సవాళ్లను మన ముందుంచుతుంది. ఇందుకు పూర్తి భిన్నంగా మేం తయారుచేసిన యాంటీ బ్లూ వేల్ గేమ్‌లో మనల్ని మనం తెలుసుకోవటంతోపాటు ఇతరులతో అనుబంధాలు పెంచుకోవడానికి తోడ్పడుతుంది, స్వయంశక్తితో ఎదగటానికి తోడ్పడే 30 సవాళ్లతో మా గేమ్ సాగుతుంది. 40 ఏళ్ల లోపు వయసున్న ఎవరైనా ఈ ఆటను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ ఆన్‌లైన్ ఆట ఓ వ్యసనంగా కాకుండా వ్యక్తిత్వ నిర్మాణానికి తోడ్పడే ఓ కౌన్సిలింగ్ థెరపీగా ఉపయోగపడుతుంది అంటున్నారు ఈ ఆట రూపకల్పనలో భాగస్వాములైన మేనేజ్‌మెంట్ స్టూడెంట్ శ్రీలక్ష్మి సురేష్. ఈ సరికొత్త ఆటలో ఇచ్చిన సవాళ్లను పూర్తి చేసినా ఇంకా ఆట కొనసాగించే వీలు కూడా ఉండటం ఈ ఆట ప్రత్యేకత. ఆ ఆటను విడుదల చేసిన వారం రోజుల్లో కొన్ని వందల మంది ఈ ఆటకు సైనప్ చేసుకున్నారు. దాంతో, తాము పడ్డ శ్రమకు ఫలితం దక్కిందని సంతోషపడుతున్నారు మేనేజ్‌మెంట్ విద్యార్థులు.

> **ఈ సరికొత్త ఆటలో ఇచ్చిన సవాళ్లను పూర్తి చేసినా ఇంకా ఆట కొనసాగించే వీలు కూడా ఉండటం ఈ ఆట ప్రత్యేకత**



సమాజ సేవలో కూడా!

ఈ కిల్ ది వేల్ ఛాలెంజ్ గేమ్ రూపకర్తలు సేవా కార్యక్రమాల్లో కూడా పాలుపంచుకుంటూ ఉంటారు. అనాథ శరణాలయాలను సందర్శిస్తూ తమకు తోచిన సహాయం చేస్తూ ఉంటారు. తాము రూపొందించిన కిల్ ద వేల్ గురించి మరి కొన్ని విశేషాలున్నాయి. ఆ ఆటలో దశలవారీగా ఎదురయ్యే సవాళ్ల ప్రభావం పిల్లల మీద నెగిటివ్‌గా ఉండకుండా ఉండటం కోసం ఆట రూపకల్పనకు ముందు ఈ బిజినెస్ మేనేజ్‌మెంట్ స్టూడెంట్స్ మానసిక నిపుణులను, పోలీసు అధికారులను సంప్రతించి వారి సూచనలు, సలహాలు కూడా తీసుకున్నారు. అన్ని రకాలుగా సురక్షితమైనదని నిర్ధారణకొచ్చిన తర్వాతే ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచారీ విద్యార్థులు. అయితే రెండు ఆటల పేర్లలో సారూప్యత ఉండటంతో కిల్ ద వేల్ ఆటను డౌన్‌లోడ్ చేసుకుని ఆడుతున్న పిల్లల్ని చూసి తల్లితండ్రులు కంగారుపడి తమను సంప్రదించిన సందర్భాలు కూడా ఉన్నాయంటున్నారు వాళ్లు. అలా తమ దగ్గరకొచ్చిన తల్లితండ్రులకు ఆట ఫలితాన్ని, ప్రభావాన్ని వివరించి చెప్పి పంపించేవారట. మొత్తానికి పిల్లల ప్రాణాలతో చెలగాటమాడే ఆటకు విరుగుడు కనిపెట్టి సంబంధ బాంధవ్యాల విలువలను పెంచే ప్రయత్నం చేస్తున్న ఈ విద్యార్థులను అభినందించాల్సిందే!

ఆ క్షణం షాకయ్యా!

సెలబ్రిటీ



పర్యటన

లైఫ్

సంచారం జీవితానికి కొత్త బాటలు వేస్తుంది. నవ జీవనగానం వినిపిస్తుంది. పర్యటన ఆనంద మార్గాల్లో ఒకటంటున్నారు పరిశోధకులు. పశ్చిమ హిమాలయాల్లోని బద్రీనాథ్ క్షేత్రానికి చేరువలో వున్న అనంత సౌందర్యరాశి వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్, సిక్కుల పుణ్యధామం హేమ్‌కుండ్ సాహెబాలను ఇటీవల సందర్శించారు తిప్పావఝుల కుమార్. 'అక్కడకు వచ్చిన పర్యాటకులతో ముచ్చటించినప్పుడు సంచారం వారి జీవితాలను ఎంతగా ప్రభావితం చేసిందో తెలిసింది. సంచారంపై మక్కువను మరింత పెంచింది' అంటూ ఆ సంగతులు పంచుకుంటున్నారిలా...

చూస్తే.. ఫిదా

అనంత సౌందర్యం.. వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్

సమున్నత హిమాలయాలు విశ్వరహస్యాన్ని తనలో దాచుకున్నట్లు గంభీరంగా ఉంటాయి. అందుకే వాటి అందాలను ఎన్ని సార్లు చూసినా తనివి తీరదు. అక్టోబర్ - ఏప్రిల్ మాసాల మధ్య హిమాలయాలన్నీ మంచుదుప్పటి కప్పుకుని ...

కన్యల్లా అల్లుకుంటాయి. ఆ మంచుపర్వతాల నుంచి జలపాతాలు గలగలా ప్రవహిస్తూ వుంటాయి. దారిలో వున్న అరుదైన వృక్షాలను, శిలలను ముద్దాడుతూ ప్రవహించే ఆ జలపాతాల అందాలు వర్ణనాతీతం. ఆకాశాన్ని తాకే హిమాలయాలు.. శ్రావణ జల్లుల్లో తడిసిన దేవదారు వృక్షాలు... నవ రాగాలను పలికిస్తూ పారే జలపాతాల అందాలకు..... అరుదైన పూలసోయగాలు తోడైతే ఆ దృశ్యాన్ని వర్ణించేందుకు ...

అనంత సౌందర్యసీమ

ప్రపంచ వారసత్వ కేంద్రం

ఓ మహాద్భుతం



ప్రకృతి ఆస్వాదన వరం





పుష్పవనానికి ఇదీ దారి



సూద్, మెడోస్వీట్ వంటి హిమాలయాల్లో మాత్రమే పుష్పించే అరుదైన పూలకు ఈ వ్యాలీ నిలయం. శ్రావణమాసంలో ఎక్కువశాతం పూలు వికసిస్తాయని, అప్పుడు వ్యాలీ సర్వాంగ సుందరంగా ఉంటుందంటారు స్థానికులు. పుష్పావతీ నదిని దాటుకుని, దట్టమైన అడవిని అధిగమిస్తే అదురైన కోటానుకోట్ల పుష్పాలు మనకు స్వాగతం పలుకుతాయి.

"నేస్తం.. పద పోదాం.! ప్రపంచాన్ని చుట్టొద్దాం.! సంచారం కోసం మరో జన్మ వుందంటావా ఏం? నిండు నూరేళ్లు జీవించినా ఈ తరుణం మరి రాదు... పద పోదాం.! ప్రపంచాన్ని చుట్టొద్దాం!"

- రాహుల్ సాంకృత్యాయన్.



హిమదేవాలయం

ఇన్నాళ్లు తెలియదు



ఛాన్స్ దొరికితే సంచారమే





ఎనిమిది గంటలు జిమ్‌లోనే!

... నుంచి ప్రత్యేకంగా ట్రైనర్‌ని పిలిపించుకొని వర్కవుట్లు చేస్తోంది. జూబ్లీ హిల్స్‌లోని తన ఇల్లు, జిమ్ తప్ప మరో చోటికి ఆమె వెళ్లడం లేదు. రోజుకి ఎనిమిది గంటలు జిమ్‌లోనే అనుష్క గడుపుతోందంటే ఆమె ఎంత సీరియస్‌గా వర్కవుట్లు చేస్తోందో ఊహించుకోవచ్చు.

అనుష్క


ఆ 'మేడమ్'.. కావ్యా మాధవన్!

ఫిబ్రవరి 17న మలయాళీ నటి భావనపై దాడి కేసులో ప్రధాన నిందితుడు పల్సర్ సుని.. 'మేడమ్' పేరు వెల్లడించాడు. అందరూ ఊహిస్తున్నట్లే ఆమె.. నటుడు దిలీప్ భార్య కావ్యా మాధవన్. ఈ నేరం వెనుక ఉన్న 'మేడమ్' ఉన్నారని ఇదివరకు సుని చెప్పిన విషయం తెలిసిందే. బుధవారం ఎర్నాకుళం కోర్టుకు తీసుకువెళ్లినప్పుడు అక్కడ రిపోర్టర్లతో మాట్లాడుతూ "మా మేడమ్ కావ్య. ఈ విషయం ఇదివరకు మీకు చెప్పలేదా?" అని అడిగాడు. మొదట "నేను దొంగని కదా? ఒక దొంగ చెప్పే విషయాల్ని ఎందుకు వింటున్నారు?" అని ప్రశ్నించిన అతను ఆ తర్వాత కావ్యకు సంబంధించిన అతి ముఖ్యమైన అంశాన్ని బయటపెట్టాడు. నటిపై దాడికి పథక రచన చేసిన ఆరోపణపై దిలీప్ అరెస్టయిన తర్వాత కూడా సుని ఎవరో తనకు తెలీదని కావ్య చెప్పింది. అంతకు ముందు ఆమె కారు డ్రైవర్‌గా సుని పనిచేశాడనే సమాచారం బయటకు వచ్చింది. దిలీప్ సూచన మేరకే సునికి రూ. 25,000 ఇచ్చానని ఇదివరకే కావ్య పోలీసులకు వెల్లడించినట్లు సమాచారం. 'మేడమ్' తనకు డబ్బులిచ్చారనీ, అయితే భావనపై దాడికి సంబంధించి ఆ డబ్బును ఇస్తున్నట్లు ఆమెకు తెలీదనీ అప్పట్లో సుని తెలిపాడు. ఈ నేరం వెనుక ఉన్న 'మేడమ్' పేరును ఆగస్ట్ 16న వెల్లడిస్తానని కూడా అతను చెప్పాడు. అయితే ఆ రోజు వ్యక్తిగతంగా అతను కోర్టుకు హాజరు కాలేదు. అప్పట్నించీ ఆ 'మేడమ్' ఎవరనే దానిపై మీడియాలో ఊహాగానాలు వెల్లువెత్తాయి. బుధవారం ఆమెవరో బహిర్గతం చేశాడు సుని.



కావ్యా

మానవాళికి మహోపకారి



లైఫ్ లెసన్

తన జీవితాన్నంతా పరిశోధనలకు అంకితం చేసిన లూయిూ పాశ్చర్ 1895లో గుండెపోటుతో మరణించాడు.

• ఆకెళ్ల రాఘవేంద్ర

డైలీ సుడోకు - 167

ఎలా పూరించాలి?

సుడోకు- 166 సమాధానం

నీ ఆలోచనలోనే లోపం

నివేదన



మీకు మీరే డాక్టర్

ఆరోగ్యానికి నెచ్చెలి



నయా హవా

నాలుక మెరుస్తోంది!



కౌన్సెలింగ్

అతి బరువుతో మతిమరుపా?

స్థూలకాయం, బొజ్జ వంటి సమస్యల వల్ల ఇతర సమస్యలు రావడంతో పాటు మతి మరుపు వచ్చే అవకాశాలు కూడా ఉన్నాయని ఇటీవల ఎక్కడో చదివాను. ఇదెంత వరకు నిజం? స్థూలకాయుల జాబితాలో నేనూ ఉన్నాను కాబట్టి ఈ వాక్యాలు నన్ను అమితంగా కలవరపెడుతున్నాయి. నిజంగానే స్థూలకాయం వల్ల మతి మరుపు వస్తుందా? ఈ వివరాలు తెలుసుకోవాలని ఉంది?

- ఎన్ . రవికిశోర్, ఖమ్మం

కడుపులో పేరుకుపోయే కొవ్వుతో ఇతర సమస్యలతో పాటు, మెదడు మీద కూడా భారం పడుతుంది. అంతిమంగా ఇది మతిమరుపునకు దారి తీసే ప్రమాదం ఉంది. మౌలికంగా, మెదడులోని జ్ఞాపకశక్తి కేంద్రమైన హిప్పోక్యాంపస్, కొవ్వుల జీవక్రియల్లో పాలు పంచుకునే కాలేయం, ఈ రెండూ పీ, పీఏఆర్ అల్ఫా అనే ప్రొటీన్‌ను వినియోగించుకోవడానికి పోటీ పడుతుంటాయి. అయితే, కడుపులో పేరుకున్న కొవ్వును ఖర్చుచేయడానికి కాలేయం ...



- డాక్టర్ ఎల్. శివకుమార్

జనరల్ ఫిజీషియన్



నాగచైతన్య, రాధాకృష్ణ, శర్వానంద్

చినబాబు పుట్టినరోజు..

రెండు కొత్త చిత్రాలు

'ప్రేమమ్', 'బాబు బంగారం' చిత్రాలతో తెలుగు చిత్రరంగంలో తన విజయవంతమైన ప్రయాణాన్ని ప్రారంభించిన సితార ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ తాజాగా మరో రెండు సినిమాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ సంస్థకు ఇది అనుబంధ సంస్థ. అందుకే ఆ సంస్థ అధినేత ఎస్. రాధాకృష్ణ (చినబాబు) పుట్టినరోజు (ఆగస్ట్ 31) సందర్భంగా ఆ రెండు చిత్రాల వివరాలు వెల్లడించారు నిర్మాత సూర్యదేవర నాగవంశి. 'అక్కినేని నాగచైతన్య హీరోగా మారుతి దర్శకత్వంలో ఒక చిత్రాన్ని, శర్వానంద్ హీరోగా సుధీర్‌వర్మ దర్శకత్వంలో మరో చిత్రాన్నీ నిర్మించనున్నాం. ఈ రెండు చిత్రాలూ త్వరలోనే మొదలవుతాయి. వీటికి సంబంధించిన పూర్తి వివరాలు త్వరలోనే ప్రకటిస్తాం' అని చిత్ర సమర్పకుడు పీడీవీ ప్రసాద్ చెప్పారు.



ఎన్టీఆర్

'అందుకే రద్దు చేశాం'

-కల్యాణ్‌రామ్

ఎన్టీఆర్ హీరోగా ఆయన సోదరుడు కల్యాణ్‌రామ్ ఎన్టీఆర్ ఆర్ట్స్ బేనరుపై నిర్మిస్తున్న 'జై లవకుశ' చిత్రం ఆడియో వేడుకని వచ్చే నెల మూడున భారీగా నిర్వహించడానికి ప్లాన్ చేశారు. అయితే భారీ వర్షసూచనతో పాటు, వినాయక నిమజ్జనం ఏర్పాట్లలో పోలీస్ శాఖ నిమగ్నమై ఉండటంతో అభిమానుల భద్రతకి ప్రాధాన్యం ఇస్తూ డైరెక్ట్‌గా మార్కెట్‌లోకి విడుదల చేయాలనే నిర్ణయం తీసుకొన్నట్లు చిత్ర నిర్మాత కల్యాణ్‌రామ్ చెప్పారు. అయితే సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లో అభిమానుల మధ్య చిత్రం ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఎన్టీఆర్ త్రిపాత్రాభినయం చేస్తున్న ఈ చిత్రానికి సంబంధించి ఇప్పటివరకూ విడుదల చేసిన 'జై', 'లవకుమార్' టీజర్లకు సోషల్ మీడియాలో రికార్డ్ స్థాయిలో వ్యూస్ వచ్చినట్లు చిత్ర యూనిట్ వర్గాలు వెల్లడించాయి. రాశీ ఖన్నా, నివేదా థామస్ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి దేవిశ్రీప్రసాద్ సంగీత దర్శకుడు, కె.ఎస్.రవీంద్ర (బాబీ) దర్శకుడు.

'శాలిని' భయపెడుతుంది!



అర్చన

"పల్లెటూరి నుంచి సిటీకి వచ్చిన యువకులకు ఎన్ని రకాల కష్టాలుంటాయి? వారికి ఇల్లు ఎవరు అద్దెకిస్తారు? నానా తిప్పలు పడి ఓ ఇంటిని అద్దెకు తీసుకుంటే.. అందులో దెయ్యం ఉంటే పరిస్థితి ఏంటి?" అనే అంశాలు ప్రధానంగా రూపొందిన చిత్రం 'శాలిని'. స్వర్ణ ప్రొడక్షన్స్ నిర్మించింది. అమోఘ్ దేశపతి, అర్చన, శ్రేయవ్యాస్ కీలక పాత్రధారులు. షెరాజ్ దర్శకుడు. సాయి వెంకట్ సమర్పకుడు. పి.వి.సత్యనారాయణ నిర్మాత. దర్శకనిర్మాతలు మాట్లాడుతూ "మా సినిమా ఆద్యంతం భయపెడుతుంది. థ్రిల్ కలిగిస్తుంది. ప్రేమ, వినోదం పుష్కలంగా ఉంటాయి" అని చెప్పారు. 80 థియేటర్లలో సెప్టెంబర్ 2న విడుదల చేస్తున్నట్టు సాయివెంకట్ తెలిపారు.

హైదరాబాద్ టు పొల్లాచ్చి

'జయ జానకి నాయక' చిత్రం తర్వాత బెల్లంకొండ శ్రీనివాస్ నటిస్తున్న మరో భారీ చిత్రం షూటింగ్ కోసం పొల్లాచ్చి సిద్ధమవుతోంది. 15 రోజుల పాటు అక్కడే జరిగే షూటింగ్ కోసం విండ్ టర్బైన్స్‌తో భారీ విలేజ్ సెట్‌ని రూపొందించారు. కీలక సన్నివేశాలతో పాటు పీటర్ హెయిన్స్ సారథ్యంలో ఓ భారీ యాక్షన్ ఎపిసోడ్‌ని చిత్రీకరిస్తామని నిర్మాత అభిషేక్ నామా చెప్పారు. శ్రీవాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో పూజా హెగ్డే కథానాయిక. 'బలమైన కథ, కథనాలతో టెక్నికల్‌గా హైస్టాండర్డ్స్‌తో ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది. మా దర్శకుడు శ్రీవాస్ ఎంత సమయం వెచ్చించి ఈ స్క్రిప్ట్ సిద్ధం చేశారు. తెలుగులో ఇది ఓ డిఫరెంట్ ఫిల్మ్‌గా నిలిచిపోతుంది. ఇప్పటికి దాదాపు నలభై శాతం చిత్రీకరణ పూర్తయింది. ఆడియన్స్‌కు థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వడం కోసం యూనిట్ కష్టపడుతోంది' అన్నారు అభిషేక్ నామా.



శ్రీనివాస్, పూజా హెగ్డే

నోట్ల రద్దు ఫలం 1%



రద్దైన నోట్లలో 99% బ్యాంకుల్లోకే!

- బ్యాంకుల్లో జమ కాని వెయ్యి నోట్లు 8.9 కోట్లు
- మార్చి 31కి 588.2 కోట్ల పాత, కొత్త 500 నోట్లు
- అదే సమయానికి 328.5 కోట్ల 2000 నోట్లు
- కొత్త నోట్ల ముద్రణ ఖర్చు రూ.7965 కోట్లు
- 2016-17లో 7.62 లక్షల నకిలీ నోట్ల గుర్తింపు

న్యూఢిల్లీ, ఆగస్టు 30: ప్రతిపక్షాల నుంచి సామాన్య ప్రజల దాకా.. ఎన్నాళ్ల నుంచో ఎదురుచూస్తున్న నోట్ల రద్దు వివరాలను ఆర్బీఐ తన 2016-17 వార్షిక నివేదిక ద్వారా వెల్లడించింది. 2016 నవంబరు 8 నాటికి దేశంలో చలామణిలో ఉన్న కరెన్సీ విలువ రూ.15.44 లక్షల కోట్లు కాగా.. వెనక్కి తిరిగి వచ్చిన నోట్ల విలువ రూ.15.28 లక్షల కోట్లు అని పేర్కొంది. అంటే.. ప్రభుత్వానికి నికరంగా మిగిలింది కేవలం రూ.16,050 కోట్లు మాత్రమే. అంటే దాదాపుగా ఒక శాతం మాత్రమే! ఆ నివేదికలో ఇంకా ఏముందంటే..

- నోట్ల రద్దు సమయానికి చలామణీలో ఉన్న రూ.1000 నోట్లలో 98.6% నోట్లు.. రద్దు తర్వాత బ్యాంకుల్లో జమ అయ్యాయి. మొత్తం చలామణీలో ఉన్న 632.7 కోట్ల వెయ్యి రూపాయల నోట్లలో 8.9 కోట్ల నోట్లు తప్ప మిగిలినవన్నీ వెనక్కి వచ్చాయి. అంటే, ప్రభుత్వం వద్దకు రాకుండా ఉండిపోయిన వెయ్యి రూపాయల నోట్ల విలువ రూ.8,900 కోట్లు.
- వెయ్యి నోట్ల లెక్కను ఈ నివేదికలో పేర్కొన్న ఆర్బీఐ.. నోట్ల రద్దు తర్వాత తమ వద్దకు తిరిగి వచ్చిన రూ.500 నోట్ల లెక్క తేల్చలేదు. కానీ, ఈ ఏడాది మార్చి 31 నాటికి మొత్తం 588.2 కోట్ల పాత, కొత్త రూ.500 నోట్లు చలామణిలో ఉన్నట్లు నివేదికలో వెల్లడించింది. గత ఏడాది అదే సమయానికి (2016, మార్చి 31) మొత్తం 1570.7 కోట్ల రూ.500 నోట్లు మార్కెట్లో ఉన్నట్టు పేర్కొంది.
- 2017 మార్చి 31 నాటికి 328.5 కోట్ల రూ.2000 నోట్లు చలామణీలో ఉన్నాయి. ఆ నోట్ల విలువ.. అప్పటికి దేశంలో చలామణీలో ఉన్న మొత్తం కరెన్సీ విలువలో దాదాపు 50 శాతం.
- 2015-16 ఆర్థిక సంవత్సరంలో నోట్ల ముద్రణకు అయిన ఖర్చు రూ.3,421 కోట్లు కాగా.. 2016-17 ఆర్థిక సంవత్సరంలో నోట్ల ముద్రణకు అయిన ఖర్చు రూ.7,965 కోట్లు.
- 2016-17 ఆర్థిక సంవత్సరంలో దేశంలో 7.62 లక్షల నకిలీ కరెన్సీ నోట్లను ఆర్బీఐ గుర్తించింది. అంతకుముందు ఏడాదితో పోలిస్తే ఇది 20.4 శాతం ఎక్కువ. 2015-16 ఆర్థిక సంవత్సరంలో గుర్తించిన నకిలీ నోట్ల సంఖ్య.. 6.32 లక్షలు.
- 2016-17లో ప్రతి 10 లక్షల రూ.500 నోట్లల్లో సగటున 7.1 నోట్లు నకిలీవి. ప్రతి 10 లక్షల రూ.1000 నోట్లలో సగటున 19.1 నోట్లు నకిలీవి. 2015-16 ఆర్థిక సంవత్సరంలో ఈ సంఖ్య చాలాతక్కువ. ఆ ఏడాది ప్రతి 10 లక్షల రూ.500 నోట్లలో సగటున 2.4 నోట్లు మాత్రమే నకిలీవి. ప్రతి 10 లక్షల రూ.1000 నోట్లలో సగటున 5.8 నోట్లు నకిలీవి. అంటే గత ఆర్థిక సంవత్సరంలో నకిలీ నోట్ల చలామణి కూడా బాగా పెరిగినట్టు.
- 2016-17 ఆర్థిక సంవత్సరంలో ఆర్బీఐ ఆదాయం 23.56 శాతం మేర తగ్గగా.. ఖర్చు మాత్రం 107.84 శాతం మేర పెరిగింది. మొత్తంగా చూస్తే ఆ ఆర్థిక సంవత్సరంలో మిగులు రూ.306.59 బిలియన్లు (30,659 కోట్ల రూపాయలు). అంతకు ముందు ఆర్థిక సంవత్సరం ఆర్బీఐ మిగులు.. రూ.65,876 కోట్ల రూపాయలు కావడం గమనార్హం. అంటే.. అంతకు ముందటి ఏడాదితో పోలిస్తే 53.46 శాతం తగ్గుదల.

వచ్చింది నల్లధనమే కావచ్చు

- నోట్ల రద్దు లక్ష్యం డబ్బు లాక్కోవడం కాదు
- నల్లధనాన్ని వెలికితీయడం.. నకిలీ నోట్లకు అడ్డుకట్ట
- ఆర్థిక వ్యవస్థలో నగదును తగ్గించడం
- ఉగ్రవాదుల ఆర్థిక మూలాలపై దెబ్బ కొట్టడం
- 18 లక్షల ఖాతాలపై ఆదాయపన్ను శాఖ దృష్టి
- తదుపరి లక్ష్యం ఎన్నికల్లో నల్లధనానికి అడ్డుకట్ట

న్యూఢిల్లీ, ఆగస్టు 30: రద్దయిన పెద్ద నోట్లలో దాదాపు 99% మేర మళ్లీ బ్యాంకింగ్ వ్యవస్థలోకి వచ్చాయంటూ ఆర్బీఐ తన వార్షిక నివేదికలో పేర్కొనడం పట్ల కేంద్ర ప్రభుత్వం స్పందించింది. రద్దు ప్రకటన అనంతరం డిపాజిట్ అయిన పెద్ద నోట్లలో గణనీయమైన భాగం లెక్కల్లో వెల్లడించని సొమ్ము/నల్లధనం కావచ్చని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ అభిప్రాయపడ్డారు. పెద్ద నోట్ల రద్దు లక్ష్యం వాటిని ప్రజల నుంచి స్వాధీనం చేసుకోవడం కాదని.. నల్లధనాన్ని వెలికితీయడం, నకిలీ నోట్లను నిర్మూలించడం, ఉగ్రవాదుల ఆర్థిక మూలాలపై దెబ్బ కొట్టడం, పెద్దమొత్తంలో నగదుతో నడిచే భారత ఆర్థిక వ్యవస్థను నగదు రహితం దిశగా మళ్లించడమేనని ఆయన వివరించారు. నోట్ల రద్దు నేపథ్యంలో.. అంతకు ముందు దాఖలు చేసిన పన్ను రిటర్నులతో సంబంధం లేకుండా పెద్ద మొత్తంలో నగదు జమ చేసినవారి గుట్టు రట్టు అయిందని, అలాంటి 18 లక్షల ఖాతాలపై ఆదాయ పన్ను శాఖ దృష్టిసారించిందని గుర్తుచేశారు. "నల్లధనానికి అడ్డుకట్ట వేసేందుకు, దేశంలో పన్ను విస్తృతిని పెంచడానికి మేం ప్రయత్నించాం. దానికి తగ్గట్టుగానే నోట్ల రద్దు అనంతరం ప్రత్యక్ష పన్ను పరిధిని విస్తరణ మొదలైంది" అన్నారు. ఎన్నికల్లో నల్లధనం వినియోగాన్ని అడ్డుకోవడమే తాము చేపట్టబోయే తదుపరి చర్య అని చెప్పారు. ఛత్తీస్‌గఢ్, జమ్ముకశ్మీర్ రాష్ట్రాల్లో తీవ్రవాదులు, వేర్పాటువాదులకు నోట్ల రద్దు.. డబ్బు లేకుండా చేసిందన్నారు. ఆర్బీఐ నివేదిక నేపథ్యంలో విమర్శల వర్షం కురిపించిన కేంద్ర మాజీ మంత్రి చిదంబరం పేరు ప్రస్తావించకుండా.. ఆయనను ఎద్దేవా చేశారు. "నల్లధనంపై తమ హయాంలో ఒక్క చర్య కూడా తీసుకోనివారు ఈ నోట్ల రద్దు ఉద్దేశాన్ని అర్థం చేసుకోలేకపోయారు" అని విమర్శించారు.



ఆర్‌బీఐ సిగ్గుపడాలి

- ఈ ఆర్థికవేతలకు నోబెల్ ఇవ్వాలి.. కేంద్ర మాజీ మంత్రి చిదంబరం ఎద్దేవా
- నోట్ల రద్దు జాతి వ్యతిరేక చర్య: సీపీఎం.. ఇదో పెద్ద కుంభకోణం: మమతా బెనర్జీ



న్యూఢిల్లీ, ఆగస్టు 30: రద్దయిన పాత నోట్లలో 1% తిరిగి రాలేదని ఆర్‌బీఐ చేసిన ప్రకటనపై కేంద్ర మాజీ మంత్రి చిదంబరం బుధవారం ట్విట్టర్‌లో ధ్వజమెత్తారు. నల్లధనాన్ని తెలుపు చేయడానికే మోదీ ప్రభుత్వం నోట్లరద్దు నిర్ణయం తీసుకుందా అని ప్రశ్నించారు. 'ఈ నిర్ణయం వెనుక ఉన్న ఆర్థికవేత్తలకు నోబెల్ బహుమతి ఇవ్వాలి' అని ఎద్దేవాచేశారు. రద్దుతో ప్రభుత్వానికి వచ్చిన సొమ్ము 16 వేల కోట్లయితే కొత్త నోట్ల ముద్రణతో ఆర్‌బీఐ రూ.21 వేల కోట్లు నష్టపోయిందని తెలిపారు. ఇందుకు కేంద్ర బ్యాంకు సిగ్గుపడాలన్నారు. నోట్ల రద్దు పెద్ద విపత్తు అని కాంగ్రెస్ నేత రణదీప్ సూర్జెవాలా ట్వీట్ చేశారు. అవినీతిపరులు రూ.కోట్లు ఆర్జిస్తే 104 మంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయారని అన్నారు. నోట్ల రద్దు సంస్థాగతంగా ఆర్‌బీఐకి ఉన్న ప్రతిష్ఠను దెబ్బతీసిందని, ప్రపంచంలో భారత్ విశ్వసనీయత దెబ్బతిందని, ఇందుకు ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నోట్ల రద్దు జాతి వ్యతిరేక చర్యని, ఇందుకు దేశం మోదీ ప్రభుత్వాన్ని క్షమించదని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. ఒక శాతం నోట్లు తిరిగి లేదని ఆర్‌బీఐ చెప్పడం చూస్తే ఇదో పెద్ద కుంభకోణంగా కనబడుతోందని పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ అన్నారు.

విఫల సందేశం

రద్దయిన నోట్లలో చాలావరకూ బ్యాంకింగ్ వ్యవస్థలోకి వచ్చాయంటే..

- నల్లధనం పెద్దగా నగదు రూపంలో లేదు.
- నల్లధనస్వాములు ప్రభుత్వం కన్నా చాలా తెలివైనవారు
- ప్రభుత్వం ఆశించినంతగా నల్లధనం వెనక్కి రాలేదు
- ప్రభుత్వం తన నిర్ణయాన్ని సమర్థించుకోవడానికి మున్ముందు ఐటీ దాడులను తీవ్రతరం చేయొచ్చు



అందరూ పాసయ్యారా?

ఈ ఏడాది జూన్ 30నాటికి బ్యాంకుల్లో జమ చేసిన పాత పెద్ద నోట్ల విలువ

రూ.15.28 లక్షల కోట్లు

నోట్ల రద్దు ప్రకటించేనాటికి చలామణిలో ఉన్న 500, 1000 నోట్ల విలువ

రూ.15.44 లక్షల కోట్లు

బ్యాంకింగ్ వ్యవస్థలోకి రాని మొత్తం


రూ.16 వేల కోట్లు.



సర్కారుకు లాటరీ తగల్లేదు!

రద్దయిన నోట్లలో 5% వెనక్కి రాకపోతే ప్రభుత్వానికి మిగిలే సొమ్ము	77 వేల కోట్లు
10 శాతం నోట్లు వెనక్కి రాకపోతే ప్రభుత్వానికి మిగిలే సొమ్ము	1.5 లక్షల కోట్లు
20 శాతం నోట్లు వెనక్కి రాకపోతే ప్రభుత్వానికి మిగిలే సొమ్ము	3 లక్షల కోట్లు
25 శాతం నోట్లు వెనక్కి రాకపోతే ప్రభుత్వానికి మిగిలే సొమ్ము	4 లక్షల కోట్లు

విఫలమంటే ఒప్పుకోను



నల్లధనం తెలుపుగా మారింది. నల్లధనానికి బాధ్యులెవరో తెలిసిపోయింది. వారు పన్నులు చెల్లించక తప్పదు. మిగులు ధనం రానంత మాత్రాన నోట్ల రద్దు విజయవంతం కాలేదంటే నేను అంగీకరించను. బ్యాంకింగ్ వ్యవస్థలోకి డబ్బు వచ్చి చేరింది. ప్రజలు నగదు రహిత విధానంలోకి మళ్లుతున్నారు. ఇదెంతో మంచిది!

– రామ సుబ్రమణ్యం గాంధీ, ఆర్బీఐ మాజీ డిప్యూటీ గవర్నర్

పన్ను వసూళ్లు పెరిగాయి!



నోట్ల రద్దు వల్ల తక్షణ ప్రయోజనాలు లేవు. కానీ, ఇప్పుడంతా సజావుగా ఉంది. పన్ను చెల్లింపులు మెరుగయ్యాయి. ఆర్బీఐ సమాచారంపై రంధ్రాన్వేషణ తప్పు. దీర్ఘకాలిక ప్రభావాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి, సంఘటిత రంగంలో నోట్ల రద్దు ప్రభావం బాగుంది'

–సిద్ధార్థ సన్యాల్, బర్‌క్లేస్‌లో ముఖ్య ఆర్థిక వేత్త.

మోదీ.. నల్లధనం ఏదీ?

(మొదటి పేజీ తరువాయి)

4 లక్షల కోట్లు నల్లధనమేనని అప్పట్లో అంచనా కట్టారు. ఈ మొత్తం బ్యాంకులదాకా రాదని... అదంతా మిగిలినట్లేనని భావించారు ఈ మొత్తాన్ని ఆర్బీఐ డివిడెండ్ రూపంలో సర్కారుకు అందజేస్తుందని లెక్కలు వేశారు. ఈ లెక్కలను ప్రభుత్వం స్వయంగా సుప్రీంకోర్టుకు విన్నవించింది. ఇప్పుడా లెక్కలన్నీ ఘోరంగా తప్పాయి. ప్రభుత్వానికి మిగిలింది 16వేల కోట్లు మాత్రమే! రద్దయిన నోట్లలో దాదాపు 99 శాతం బ్యాంకింగ్‌లోకి తిరిగి వచ్చిందంటే, ఆర్థికవేత్తలు, ప్రభుత్వపెద్దలు అంచనావేసిన స్థాయిలో ఆర్థిక రంగంలో నల్లధనం నగదు రూపంలో లేదని భావించాలి. లేదా 500, 1000 రూపాయల నోట్ల రూపంలోని నల్లధనాన్ని అక్రమార్కులు విజయవంతంగా ఆర్థిక రంగంలోకి ప్రవేశపెట్టారని అనుకోవాలి. ఇందులో ఏది నిజమైనా సర్కారు ఘోర వైఫల్యాన్నే అది సూచిస్తుంది. తప్పుడు అంచనాతో ప్రభుత్వం పెద్ద నోట్లను రద్దు చేసి ఉంటే ప్రజలకూ, ఆర్థిక రంగానికి జరిగిన నష్టానికి ప్రభుత్వం జవాబు చెప్పాల్సి ఉంటుంది.

ఇదేమి విజయం?

'పెద్దనోట్ల రద్దు వల్ల మొత్తం డబ్బులు బ్యాంకింగ్ వ్యవస్థలోకి వచ్చాయి' అని కేంద్రం సమర్థించుకోవచ్చు. కానీ... దీని కోసం నోట్ల రద్దువంటి సంచలన ప్రయోగం చేయనక్కర్లేదు. ఒకేసారి కోట్ల మంది భారతీయులను 'రోడ్లపైకి' లాగక్కర్లేదు. స్వచ్ఛంద ఆదాయ వెల్లడిలాంటి పథకాలను మళ్లీ మళ్లీ ప్రకటించవచ్చు. "ఫలానా తేదీ నుంచి పెద్దనోట్లు చెల్లవు. . ఆ తర్వాత ఐటీ, సీబీఐ దాడులతో విరుచుకుపడతాం. మీదగ్గరున్న లెక్కల్లేని సొమ్మును జమ చేయండి. 35 శాతం పన్నుతో వదిలేస్తాం" అని చెబితే ఇంతకంటే ఎక్కువ ఆదాయం వచ్చేదని, ప్రజలకు కష్టాలు కూడా తప్పేవని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.

వచ్చిందీ... పాయె!

'గంప లాభం చిల్లి తీసింది' అని సామెత! నోట్ల రద్దుతో జరిగిందిదే. ఆర్బీఐ లెక్కల ప్రకారం పెద్దనోట్ల రద్దువల్ల ప్రభుత్వానికి మిగిలింది 16,050 కోట్లు. కానీ... కొత్త 500, 2000 ముద్రణకు అయిన ఖర్చు సుమారు 8వేల కోట్లు! వాటి రవాణా, ఇతర ఏర్పాట్లకోసం మరో 2వేల దాకా ఖర్చయింది. అంటే... 16వేల కోట్లు మిగిలితే, 10వేల కోట్లు ఖర్చయిపోయాయన్న మాట! బ్యాంకుల సిబ్బంది శ్రమ, ప్రజల కష్టాలకు విలువ కట్టలేం. ఇక... మాజీ మంత్రి చిదంబరం లెక్క ప్రకారం కేంద్రం కొత్త నోట్ల ముద్రణ కోసం 21వేల కోట్లు ఖర్చు చేసింది. వెరసి... హళ్లికి హళ్లి, సున్నకు సున్న అన్న మాట!

'క్యాష్ లెస్' ఎక్కడ!

నోట్ల రద్దు తర్వాత నగదు రహిత లావాదేవీలంటూ హడావుడి సృష్టించారు. ఏటీఎంలను నింపకుండా, బ్యాంకుల్లో విత్‌డ్రాకు అనుమతించకుండా... డబ్బులు దొరక్కుండా చేసి జనానికి నరకం చూపించారు. ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత రావడంతో 'క్యాష్ లెస్' నినాదాన్ని కాస్తా.. 'లెస్ క్యాష్'గా మార్చారు. కొన్నాళ్లకు అది కూడా పోయింది. ఇప్పుడు అన్నిచోట్లా పుష్కలంగా నగదు అందుబాటులో ఉంటోంది. వెరసి... నగదు రహితమూ ప్రయోజన రహితంగానే మారినట్లే!

ఉగ్రవాదంపై ప్రభావం!?

'పెద్దనోట్లను రద్దు చేసిన వెంటనే కశ్మీర్‌లో రాళ్లు రువ్వడం ఆగిపోయింది' అని కేంద్రం ప్రకటించింది. అది ఎంత నిజమో... నోట్ల రద్దు జరిగిన వారానికే ఉగ్రవాదుల చేతికి కొత్త 2వేల నోట్లు దక్కడమూ అంతే నిజం! భద్రతా సిబ్బంది నిఘా పెరగడం, మిలిటెంట్లపై విరుచుకుపడటంవల్లే కశ్మీర్‌లో ఉగ్రవాదానికి కళ్లెం పడుతోంది!

నకిలీ కరెన్సీ మాటేమిటి?

పాత నోట్ల రద్దు వల్ల మార్కెట్‌లో చలామణిలో ఉన్న నకిలీ కరెన్సీ మొత్తం మాయమైపోతుందని ప్రధాని మోదీ ప్రకటించారు. ఇది మాత్రం అక్షరాలా నిజమైంది! అయితే... కేవలం నకిలీ కరెన్సీ అంతానికి ఇంత కసరత్తు చేయనక్కర్లేదన్నది నిపుణుల మాట! దశలవారీగా పాత నోట్లను రద్దు చేసి... వాటి స్థానంలో అత్యాధునిక భద్రతా ప్రమాణాలతో కొత్తనోట్లను ప్రవేశపెడితే సరిపోయేదని వీరు అభిప్రాయపడుతున్నారు. ఇక... అవినీతిపరులు కొత్త నోట్లను లంచాల రూపంలో తీసుకుంటూనే ఉన్నారు. మొత్తంగా చూస్తే... పెద్దనోట్ల రద్దుతో 'నల్లధనం నియంత్రణ' అనే ప్రాథమిక ఉద్దేశం అస్సలు నెరవేరలేదు. మిగిలిన ప్రయోజనాలూ పాక్షికంగానో, స్వల్పంగానో నెరవేరాయి. అందుకే... ఇది భారతదేశ చరిత్రలో అతిపెద్ద విఫల ప్రయోగంగా నిలిచిపోయిందని విపక్షాలు విమర్శిస్తున్నాయి.

షాక్‌లు ఆగవు!

"పెద్దనోట్ల రద్దు వల్ల ప్రభుత్వం ఆశించిన ప్రయోజనాలు లభించలేదు. పైగా... దీనివల్ల దీర్ఘకాలంలో అనేకరకాలుగా నష్టం జరుగుతుంది. ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో జీడీపీ వృద్ధిరేటు అంతకుముందుతో ఏడాదితో పోల్చితే... 7.9 నుంచి 6.1కు తగ్గింది. పారిశ్రామిక ఉత్పత్తుల్లో వృద్ధి తగ్గింది. నోట్ల రద్దు ఇచ్చిన 'షాక్'లు ఇంతటితో ఆగవు!"

- కౌశిక్ బసు, కార్నెల్ యూనివర్సిటీ ప్రొఫెసర్. (ఈ ఏడాది జూన్ 30నాటి అభిప్రాయమిది. ఆయన యూపీఏ హయాంలో భారత ముఖ్య ఆర్థిక సలహాదారుగా పని చేశారు.)



మోదీ అప్పుడో మాట.. జైట్లీ ఇప్పుడో మాట

న్యూఢిల్లీ, ఆగస్టు 30: ప్రధాని నరేంద్ర మోదీ గత ఏడాది నవంబరు ఎనిమిదిన చేసిన టీవీల్లో చేసిన చరిత్రాత్మక ప్రసంగం ఇంకా మన స్మృతిపథం నుంచి చెరగిపోలేదు. ఆనాడు ప్రధాని తన కఠిన నిర్ణయం వెనుక ఉద్దేశాలను, సాధించదలచుకున్న లక్ష్యాలను జాతికి వివరించారు. మెజారిటీ ప్రజలు భావోద్వేగంతో స్పందించారు. చిత్తశుద్ధితో దేశాన్ని బాగుచేసే ప్రయత్నంగా స్వీకరించారు. తాజాగా ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ మాత్రం ప్లేటు ఫిరాయించారు. ప్రజలు పెద్ద నోట్ల రద్దు ఉద్దేశాన్ని సరిగ్గా అర్థం చేసుకోలేదని తేల్చారు. రద్దయిన నోట్లన్నీ వెనక్కి రావడంతో తమ ఉద్దేశం జనం దగ్గర నుంచి డబ్బులు లాక్కోవడం కాదంటున్నారు. భారత్ ప్రధానంగా నగదు ఆధార ఆర్థిక వ్యవస్థ అని, దాన్ని మార్చడమే తమ లక్ష్యమని చెబుతున్నారు. నల్లధనాన్ని రూపుమాపడం, ఉగ్రవాదులకు, నక్సలైట్లకు నిధుల వరదను ఆపడం, పన్నుల విస్తృతిని పెంచుకోవడం ఇతర లక్ష్యాలని అంటున్నారు. ఆర్థిక మంత్రి చెప్పిన ప్రధాన లక్ష్యం క్యాష్‌లెస్‌ను ప్రధాని నాడు ప్రస్తావించలేదు. కేవలం నగదు లావాదేవీల వల్లే అవినీతి పెరుగుతోందని మాత్రమే అన్నారు. విచ్చలవిడిగా నగదు చెలామణి వల్లే హవాలా, నల్లధనం, ఆయుధ అక్రమ వ్యాపారాలు సాగుతున్నాయని వ్యాఖ్యానించారు. ఉక్కు పిడికిలిని బద్దలు కొట్టేందుకే పెద్ద నోట్లను రద్దు చేస్తున్నామన్నారు. ఆర్థిక మంత్రి బుధవారం ప్రకటనతో ప్రభుత్వం అసలు ఉద్దేశాలు బయటపడ్డాయి.

కలపడం కాదు... చావుదెబ్బతీసింది!

పెద్ద నోట్ల రద్దు తర్వాత, ఇప్పుడూ ప్రభుత్వం చెబుతున్న మరో మాట... అవ్యవస్థీకృత, వ్యవస్థీకృత రంగాలను సమీకృతం చేశామని! అవ్యవస్థీకృత రంగానికి చెక్ పెట్టేందుకు ఆర్థిక రంగంలో నగదు లావాదేవీలను పూర్తిగా తగ్గించి... డిజిటల్ చెల్లింపుల్లోకి మళ్లించడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. పెద్ద నోట్ల రద్దును దీనికి ఒక అవకాశంగా ఉపయోగించుకొంది. నోట్ల రద్దుకు ముందు ఆర్థిక రంగంలో చలామణిలో ఉన్న నగదు విలువ (అన్ని డినామినేషన్లలో ఉన్న కరెన్సీ నోట్లను కలుపుకొని) 16.41 లక్షల కోట్ల రూపాయలు. కాగా ప్రస్తుతం చలామణిలో ఉన్న నగదు విలువ 13.10 లక్షల కోట్లు. ఇందులో 2000 రూపాయల నోట్ల వాటానే 50 శాతం. అంటే... చలామణిలోని నగదు విలువ దాదాపు 20 శాతం తగ్గింది. అవ్యవస్థీకృత రంగాన్ని ఇది చావు దెబ్బతీసింది. దాని ప్రభావం జీడీపీ గణాంకాల్లోనూ కనిపించింది. 2016-17 ఆఖరు త్రైమాసికంలో వృద్ధి రేటు 6.1 శాతానికి పడిపోయిన విషయం తెలిసిందే.

కుంభకోణం లేదంటారా!?

డిసెంబర్ 31 గడువు ముగిసిన తర్వాత కూడా పెద్ద మొత్తంలోనే రద్దయిన నోట్లు బ్యాంకుల్లో డిపాజిట్ అయి ఉంటాయన్న అనుమానాలు ఉన్నాయి. కరెన్సీ నోట్లను బ్యాంకులో జమచేసినప్పుడు వాటి విలువనే ఖాతాదారుల పద్దులో వేస్తారు. పాత నోటా కొత్త నోటా అన్న వివరాలు ఉండవు. ఈ వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆర్‌బీఐ ఆదేశించలేదు కూడా. ప్రజల నుంచి ఒత్తిడిని సాకుగా తీసుకొని నిదానంగా లెక్కలు తేల్చే వెసులుబాటును బ్యాంకులకు కల్పించారు. దీనినే అవకాశంగా తీసుకొని నల్లధనాన్ని గడువు తర్వాత కూడా జమచేసి ఉంటారన్న ఆరోపణలు వస్తున్నాయి. పెద్ద నోట్ల రద్దుకంటే ఇప్పుడు ఆర్‌బీఐ విడుదల చేసిన వివరాలే సర్కారు విశ్వసనీయతకు అతిపెద్ద సవాలుగా మారాయి.

ఎయిరిండియా విభాగంపై బర్డ్ గ్రూప్ ఆసక్తి



న్యూఢిల్లీ: ఎయిరిండియాకు చెందిన గ్రౌండ్ హ్యాండ్లింగ్ కార్యకలాపాల అనుబంధ సంస్థ ఎయిరిండియా ట్రాన్స్‌పోర్ట్ సర్వీసెస్ లిమిటెడ్ (ఎఐఎటిఎస్ఎల్) కొనుగోలుకు ఏవియేషన్ సర్వీసుల సంస్థ బర్డ్ గ్రూప్ ఆసక్తిని కనబరిచింది. ఈ మేరకు ఆ సంస్థ ప్రభుత్వానికి ఆసక్తి వ్యక్తీకరణ లేఖ రాసిందని పౌర విమానయాన శాఖ కార్యదర్శి ఆర్ఎన్ చౌబే తెలిపారు. ఇండిగో గ్రూప్ తర్వాత ఒక ఎయిరిండియా అనుబంధ విభాగం కొనుగోలు కోసం ఆసక్తిని వ్యక్తీకరించిన సంస్థ ఇదే. బర్డ్ గ్రూప్ ప్రతినిధి కూడా ఈ విషయం ధ్రువీకరించారు. ఎఐఎటిఎస్ఎల్ నిర్వహించే కార్యకలాపాలకు, తమ వ్యాపార నమూనాకు మధ్య చక్కని అనుసంధానం ఉన్నందు వల్ల తాము ఆ విభాగం కొనుగోలుకు ముందుకు వచ్చినట్టు బర్డ్ గ్రూప్ ప్రతినిధి తెలిపారు. ఎయిరిండియాలో పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియ ప్రారంభించిన తర్వాత అనుబంధ సంస్థల్లో వాటాల విక్రయం చేపట్టవలసిందిగా తాము కోరినట్టు ఆయన చెప్పారు. సాధారణ ఏవియేషన్ సర్వీసులతోపాటు గ్రౌండ్ హ్యాండ్లింగ్ నుంచి కార్గో నిర్వహణ సర్వీసుల వరకు వివిధ కార్యకలాపాలపై బర్డ్ గ్రూప్‌నకు మంచి పట్టుంది. తమకు అనుభవం, బలం ఉన్న ఈ రంగాల్లో మాత్రమే ఆసక్తి ప్రకటిస్తున్నామని, మొత్తం కంపెనీ కొనుగోలుపై తమకు ఎలాంటి ఆసక్తి లేదని ఆ ప్రతినిధి చెప్పారు. ఈ ప్రతిపాదనపై ప్రభుత్వ స్పందన కోసం తాము ఎదురు చూస్తున్నట్టు ఆయన తెలిపారు.

వాటాల విక్రయంపై త్వరలో నిర్ణయం

ఎయిరిండియాలో పెట్టుబడుల ఉపసంహరణపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ తెలిపారు. ఎయిరిండియాలో వాటాల కొనుగోలుకు ఇప్పటికే రెండు సంస్థలు ఆసక్తి ప్రకటించినందు వల్ల త్వరలోనే నిర్ణయం ప్రకటిస్తామని ఆయన అన్నారు. దీర్ఘకాలంగా భారీ నష్టాలు భరిస్తూ రుణాల ఊబిలో కూరుకుపోయిన ఎయిరిండియాలో వ్యూహాత్మక వాటాల విక్రయం విధివిధానాలపై జైట్లీ సారథ్యంలోని మంత్రుల బృందం కసరత్తు చేస్తోంది. ఎయిరిండియాలో వాటాల విక్రయానికి జూన్‌లో కేంద్ర కేబినెట్ సూత్రప్రాయంగా అంగీకారం తెలిపిన విషయం విదితమే. ఎయిరిండియాపై 52 వేల కోట్ల రూపాయల పైబడి రుణభారం ఉంది. 2012 సంవత్సరంలో యుపిఎ ప్రభుత్వం ప్రకటించిన 30 వేల కోట్ల రూపాయల బెయిల్ ఔట్ ప్యాకేజీపై ప్రస్తుతం మనుగడ సాగిస్తోంది.

9900 వద్ద అప్రమత్తం
టెక్ వ్యూ

నిఫ్టీ బలమైన అప్‌ట్రెండ్‌లో ప్రారంభమైనా కీలక నిరోధం 9900 వరకు వెళ్లినా సుదీర్ఘ కన్సాలిడేషన్ తర్వాత ఈ స్థాయికి దిగువన క్లోజయింది. గత రెండ్రోజులుగా ఈ స్థాయి వద్ద నిలదొక్కుకోలేకపోవడం అమ్మకాల ఒత్తిడికి సంకేతం. కొద్దిరోజులుగా పరిమిత పరిధిలో సైడ్‌వేస్‌లోనే కదలాడుతోంది.

గురువారం స్థాయిలివే...

నిరోధం: 9900 మద్దతు: 9850

- మరింత అప్‌ట్రెండ్ కోసం ఇండెక్స్ 9900 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 10000. విఫలమైతే అప్రమత్త ట్రెండ్ సంకేతం ఇస్తుంది.
- మైనర్ మద్దతు స్థాయి 9850కన్నా దిగజారితే మైనర్ కరెక్షన్‌గా భావించాలి. ప్రధాన మద్దతు స్థాయి 9800. అంత కన్నా దిగువన స్వల్పకాలిక కరెక్షన్ ఏర్పడుతుంది.
- బ్యాంక్ నిఫ్టీ 24500 వద్ద ప్రతిఘటన ఎదుర్కొంటోంది. అంతకన్నా బలంగా క్లోజయినప్పుడే స్వల్పకాలిక అప్‌ట్రెండ్‌లో ప్రవేశిస్తుంది.

■ వి.సుందర్ రాజా

స్క్రిప్ ఆధారిత కదలికలు
ఆస్ట్రో వ్యూ

తిథి: భాద్రపద శుద్ధ దశమి **నక్షత్రం:** మూల

రోహిణి, హస్త, శ్రవణం నక్షత్ర జాతకులు, మకర, వృషభ రాశులవారు అప్రమత్తంగా ఉండాలి.

నిఫ్టీ: 9884.40 (+88.35)

ట్రెండ్ మార్పు వేళలు: 3.20

ధోరణి: గ్రహగతులను బట్టి నిలకడగా ప్రారంభమై 10.45 వరకు మెరుగ్గా ట్రేడవుతూ 10.50 నుంచి ఒంటి గంట వరకు నిస్తేజంగా మారవచ్చు. తిరిగి 3.10 వరకు మెరుగ్గా ట్రేడయి చివరిలో తిరిగి నిస్తేజంకావచ్చు.

ట్రేడింగ్ వ్యూహం: నిఫ్టీ ఫ్యూచర్స్ 10.45 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి)కన్నా దిగువన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో షార్ట్ పొజిషన్లు తీసుకుని 12.45 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 1.15 తర్వాత ఎటిపి కన్నా పైకి వస్తే లాంగ్ పొజిషన్లు తీసుకుని 3 గంటల సమయానికి క్లోజ్ చేసుకోవాలి.

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

నిరోధ స్థాయిలు: 9925, 9960

మద్దతు స్థాయిలు: 9845, 9790

గమనిక: ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి
www.thefinanciala strologer.blogspot.in

బులియన్

బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	ప్రొద్దుటూరు	ముంబై	చెన్నై
24 క్యారెట్లు	30,570	30,350	30,230	--	--
క్రితం ముగింపు	30,730	30,600	30,400	29,915	--
22 క్యారెట్లు	29,960	28,300	28,130	--	28,240
క్రితం ముగింపు	30,120	28,500	28,200	29,765	28,490
వెండి (కిలో)	40,750	41,000	40,800	--	--
క్రితం ముగింపు	40,250	41,300	40,800	40,030	--

విప్రో బైబ్యాక్‌కు గ్రీన్ సిగ్నల్

న్యూఢిల్లీ: ఐటి సర్వీసుల రంగంలో మూడో పెద్ద కంపెనీ విప్రో షేర్‌హోల్డర్లు 11 వేల కోట్ల రూపాయల బైబ్యాక్ ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు. బెంగళూరు కేంద్రంగా పని చేస్తున్న విప్రో ఈ బైబ్యాక్‌కు సెప్టెంబరు 15వ రికార్డు తేదీగా ప్రకటించింది. కంపెనీ చేతిలో ఉన్న మిగులు ఇన్వెస్టర్లకు పంచేందుకు కార్పొరేట్ కంపెనీలు షేర్ల బైబ్యాక్‌ను నిర్వహిస్తాయి. ఒక్కో షేరు 320 రూపాయల ధరకు 34.38 లక్షల షేర్లను బైబ్యాక్ చేయనున్నట్టు విప్రో గత నెలలో ప్రకటించింది. మొత్తం ఈ బైబ్యాక్ విలువ 11 వేల కోట్ల రూపాయలు. ఈ మేరకు కంపెనీ ప్రతిపాదించిన ప్రత్యేక తీర్మానానికి పోస్టల్ బ్యాలెట్, ఇ-ఓటింగ్ విధానంలో షేర్‌హోల్డర్లు ఆమోదం ప్రకటించినట్టు కంపెనీ బిఎస్ఇకి తెలిపింది. సోమవారం నాడు జరిగిన ఈ ఓటింగ్‌లో 99.68 శాతం మంది బైబ్యాక్‌కు మద్దతు ప్రకటించినట్టు పేర్కొంది. బుధవారం బిఎస్ఇలో విప్రో షేరు స్వల్పలాభంతో 291.65 రూపాయల వద్ద ముగిసింది. ఈ ఏడాది జూన్ 30వ తేదీ నాటికి విప్రో చేతిలో 5432 కోట్ల రూపాయల నగదు, నగదు సమాన ఆస్తుల నిల్వలున్నాయి. 31,772 కోట్ల రూపాయల పెట్టుబడులతో కలిపితే మొత్తం విలువ 37,204 కోట్ల రూపాయలు. ఐటి కంపెనీల్లో టిసిఎస్ వద్ద 43 వేల భారీ నిల్వలుండగా ఆ కంపెనీ ఇప్పటికే 16 వేల కోట్ల రూపాయల బైబ్యాక్‌ను నిర్వహించింది. రెండో పెద్ద కంపెనీ ఇన్ఫోసిస్ ఇటీవలే 13 వేల కోట్ల బైబ్యాక్ ప్రకటించింది. ఈ నవంబరులోనే దీన్ని పూర్తి చేస్తారు.

ఇన్‌సైడర్ ట్రేడింగ్‌లో సెబి జరిమానా

2015 సంవత్సరంలో నిర్వహించిన విప్రో షేర్ల విక్రయాన్ని ప్రకటించడంలో జాప్యం చేసినందుకు ఆ కంపెనీ ఉద్యోగి సందీప్ భట్నాగర్‌కు సెబి రెండు లక్షల రూపాయల జరిమానా విధించింది. అయితే ఇప్పుడు భట్నాగర్ విప్రో ఉద్యోగా, కాదా అన్న విషయం సెబి ఆదేశంలో పేర్కొనలేదు. ఇన్‌సైడర్ ట్రేడింగ్ నిషేధ నిబంధనలు పాటించకపోయినందుకు ఈ జరిమానా విధించినట్టు ప్రకటించింది. 2015 జులై 27వ తేదీన విప్రో అనుమతి పొందిన అనంతరం భట్నాగర్ 2237 షేర్లను 12,77,998 రూపాయలకు అదే ఏడాది ఆగస్టు మూడో తేదీన విక్రయించినట్టు సెబి గుర్తించింది. అమ్మకం విలువ 10 లక్షలు దాటినందు వల్ల ఆ షేర్ల విక్రయంపై రెండు ట్రేడింగ్ దినాల్లో విప్రోకి సమాచారం అందించవలసి ఉంటుంది. ఆ ప్రకారం ఐదో తేదీకల్లా సమాచారం అందించాల్సి ఉండగా 10వ తేదీన ఆయన ప్రకటన చేసినట్టు సెబి దర్యాప్తులో తేలింది.

మార్కెట్‌కు జిఎస్‌టి ఊపిరి



ముంబై: దేశంలో జిఎస్‌టి ప్రారంభం అద్భుతంగా ఉన్నదని, రికార్డు స్థాయిలో పన్ను రాబడులు వచ్చాయని ఆర్థికమంత్రి చేసిన ప్రకటన బుధవారం మార్కెట్‌కు ఊపిరులూదింది. దీనికి తోడు ఉత్తర కొరియా వ్యవహారంపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ఆచితూచి వ్యవహరించే ధోరణి కూడా మార్కెట్ వర్గాల ఆందోళనలను చల్లార్చింది. పరిస్థితులు కాస్తంత సానుకూలం కావడంతో ప్రపంచ మార్కెట్లు కూడా కోలుకోవడం, జిఎస్‌టిపై ఆర్థికమంత్రి ప్రకటన వంటి పరిణామాల నేపథ్యంలో స్టాక్ ఇండెక్స్‌లో మంగళవారం నాటి భారీ నష్టాలను కొంతమేరకు పూడ్చుకోగలిగాయి. మొత్తం మీద సెన్సెక్స్ 258.07 పాయింట్లు లాభపడి 31,646.46 పాయింట్ల వద్ద ముగియగా నిఫ్టీ ఒక దశలో 9900 పాయింట్ల కీలక స్థాయిని దాటినా ముగింపు సమయానికి 88.35 పాయింట్ల లాభంతో 9884.40 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఆర్ఐఎల్, ఐటిసి, ఎల్ అండ్ టి, హెచ్‌డిఎఫ్‌సి స్ర్కిప్‌లు లాభపడ్డాయి. మెటల్, మైనింగ్ కౌంటర్లలో కొనుగోళ్ల జోరు కనిపించింది. మెటల్ షేర్లలో జెఎస్‌డబ్ల్యు స్టీల్, జిందాల్ స్టీల్ అండ్ పవర్, హిందుస్తాన్ జింక్, హిండాల్కో, వేదాంత, ఎన్ఎండిసి, నాల్కో, కోల్ ఇండియా, టాటా స్టీల్, సెయిల్ షేర్లు బాగా లాభపడ్డాయి. ఇన్వెస్టర్ల సంపద 1,54,494 కోట్ల రూపాయల మేరకు పెరిగింది. ఆర్ఐఎల్ షేరు 2.12 శాతం లాభపడి 1564.15 రూపాయలకు చేరింది. సెబి గణాంకాల ప్రకారం దేశీయ సంస్థలు మంగళవారం 1391.33 కోట్ల రూపాయల విలువ గల షేర్లు కొనుగోలు చేయగా ఎఫ్‌పిఐలు 1459.64 కోట్ల రూపాయల విలువ గల షేర్లు విక్రయించారు.

భారత్ ఐపిఒ ధర రూ.195-205

శ్రేయి ఫైనాన్షియల్ అనుబంధ సంస్థ భారత్ రోడ్ నెట్‌వర్క్ జారీ చేయనున్న పబ్లిక్ ఇష్యూలో షేరు ధర శ్రేణిని 195-205 రూపాయలుగా ప్రకటించింది. సెప్టెంబర్ 6 నుంచి 8వ తేదీ వరకు ఈ ఇష్యూ మార్కెట్లో ఉంటుంది. 2.93 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయానికి పెడుతున్నట్టు కంపెనీ ప్రకటించింది.

మాస్ మార్కెట్‌కు మారుతి ఎరీనా

● **షోరూమ్‌ల రీబ్రాండింగ్**

న్యూఢిల్లీ: ఆధునిక కస్టమర్ల అభిరుచులకు అనుగుణంగా తన షోరూమ్‌లలో మార్పులుచేర్పులు చేపట్టాలని మారుతి సుజుకీ నిర్ణయించుకుంది. డిజిటల్ టెక్నాలజీ ద్వారా కస్టమర్లకు మరింత చేరువ కావాలనుకుంటోంది. ఇందులో భాగంగా ఇప్పటికే ఉన్న రిటైల్ షోరూమ్‌లను మారుతి సుజుకీ ఎరీనాగా రీబ్రాండ్ చేస్తోంది. 2020నాటికి వార్షికంగా 20 లక్షల కార్లను విక్రయించాలన్నది మారుతి లక్ష్యం. ఇందులో భాగంగానే ఇప్పటికే నెక్సా పేరుతో ప్రత్యేక షోరూమ్‌లను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. వీటి ద్వారా ప్రీమియం సెగ్మెంట్లో తెచ్చిన కార్లను విక్రయిస్తోంది. ఇప్పుడు మాస్ మార్కెట్ మోడళ్ల కోసం ఎరీనా బ్రాండ్‌ను ఆవిష్కరించింది. విడతల వారీగా షోరూమ్‌ల మార్పు ఉంటుందని, వచ్చే మూడు నుంచి ఐదేళ్ల కాలంలో మొత్తం షోరూమ్‌లు అరీనా బ్రాండ్ కిందకు మారిపోతాయని మారుతి సుజుకీ మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ కెనిచి అయుకవా తెలిపారు. 2018 మార్చి నాటికి 80 మారుతి సుజుకీ అరీనా షోరూమ్‌లను ఏర్పాటు చేయాలనుకుంటున్నామని చెప్పారు.



1 నిమిషం.. 9 కార్ల అమ్మకం

ప్రస్తుతం మారుతికి దేశంలోని 1,683 నగరాల్లో 2,050 షోరూమ్‌లున్నాయి. ప్రతి నిమిషానికి తొమ్మిది కార్లను కంపెనీ విక్రయిస్తోంది. అంతేకాకుండా రోజుకు 1.26 లక్షల కస్టమర్లతో కలిసి పనిచేస్తోంది. మారుతి సుజుకీ ఎరీనా పారదర్శకతను మరింతగా పెంచుతుందని, కస్టమర్ల సంతోషాన్ని మెరుగుపరుస్తుందని అయుకవా తెలిపారు. డిజిటల్ టెక్నాలజీని అందిపుచ్చుకోవడం వల్ల మరింత సౌకర్యవంతంగా ఉంటుందని, ఎక్కువ సమాచారాన్ని కస్టమర్లకు అందివ్వడానికి ఆస్కారం ఉంటుందని ఆయన చెప్పారు. పారదర్శకతను పెంచడంతోపాటు వినియోగదారులకు మెరుగైన సర్వీసులను అందించే అవకాశం లభిస్తుందన్నారు. కారును కొనుగోలు చేసే ముందు 75 శాతం మంది ఆన్‌లైన్ ద్వారా పరిశోధనా చేస్తున్నారని, ఇలాంటి వారిని దృష్టిలో ఉంచుకుని నూతన వెబ్‌సైట్‌ను ఆవిష్కరించినట్టు ఆయన చెప్పారు.

బిఎస్ఎన్ఎల్ వెల్‌కమ్ ఆఫర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సర్కిల్‌లో బిఎస్ఎన్ఎల్ 'వెల్‌కమ్ ఆఫర్'ను అందుబాటులోకి తెచ్చింది. ఈ ఆఫర్‌లో భాగంగా కొత్త వినియోగదారులు, మొబైల్ నెంబర్ పోర్టబులిటీ ద్వారా బిఎస్ఎన్ఎల్‌కు మారిన వారు 350 ఎంబిల డేటాను ఉచితంగా పొందవచ్చు. 30 రోజుల్లోపు దీన్ని వినియోగించుకోవాల్సి ఉంటుందని సంస్థ తెలిపింది.

రెండు ఎఫ్‌డిఐ ప్రతిపాదనలకు ఆమోదం

న్యూఢిల్లీ: సింగిల్ బ్రాండ్ రిటైల్ రంగానికి సంబంధించిన రెండు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్‌డిఐ) ప్రతిపాదనలకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ బుధవారంనాడు ఆమోద ముద్ర వేసింది. డైసన్ ఇంటర్నేషనల్, ఎంఎం రిటైల్ ప్రైవేట్ లిమిటెడ్‌లు ఈ అనుమతులను అందుకున్నాయి.

కెవిబి తొలి గ్రామీణ డిజిటల్ కేంద్రం ప్రారంభం

కోయంబత్తూర్: ప్రైవేటు రంగంలోని కరూర్ వైశ్యా బ్యాంక్ (కెవిబి) తమిళనాడు రాష్ట్రంలో ఉన్న ఎరోడ్ జిల్లాలోని ఒక గ్రామంలో తొలి డిజిటల్ సెంటర్‌ను ప్రారంభించింది. ఈ గ్రామంలో ఇప్పటి వరకు బ్యాంకింగ్ సేవలు అందుబాటులో లేవు. ఈ ఊరిలో ఏర్పాటు చేసిన సెంటర్‌లో క్యాష్ రీసైక్లర్ మెషిన్, పాస్‌బుక్ ప్రింటర్, టాబ్లెట్లు, హైస్పీడ్ వైఫై కనెక్టివిటీ సదుపాయం వంటివి ఉన్నాయి. క్యాష్ రీ సైక్లర్ మిషన్ ద్వారా డబ్బులను జమ చేయడంతోపాటు అవసరమైనప్పుడు విత్‌డ్రా చేసుకోవచ్చు. టాబ్లెట్లను ఉపయోగించుకుని ప్రజలు సొంతంగా బ్యాంకింగ్ సర్వీసులను వినియోగించుకోవచ్చు.

సెప్టెంబరు 7-9 తేదీల్లో హైదరాబాద్‌లో అగ్రిటెక్స్ సదస్సు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సెప్టెంబరు 7-9 తేదీల్లో ఐదో ఎడిషన్ అగ్రిటెక్స్‌కు హైదరాబాద్ వేదికకానుంది. తెలంగాణ ప్రభుత్వ సహకారంతో కెన్స్ ఎగ్జిబిషన్.. హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ఈ సదస్సును నిర్వహించనుంది. మూడు రోజులపాటు జరిగే ఈ సదస్సులో వ్యవసాయం, డెయిరీ, ఫుడ్ ప్రాసెసింగ్, ఆక్వా రంగాల్లో వస్తున్న కొత్త ట్రెండ్స్, అభివృద్ధి గురించి వివరించనున్నారు. ఇన్నోవేషన్, స్టార్టప్స్‌పై ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించనున్నారు. ఇక్రిశాట్, జాన్ డీర్, తెలంగాణ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ, తెలంగాణ వ్యవసాయ, హార్టికల్చర్ శాఖ, ఆంద్రా సిస్టమ్స్, కాటన్ కనెక్ట్, హెచ్‌జిటి గ్లోబల్ సంస్థలు అగ్రిటెక్స్‌లో పాల్గొననున్నాయి.

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.15 — నెక్ (100 గుడ్లు)



హైదరాబాద్	355.00	వరంగల్	357.00
విజయవాడ	359.00	చెన్నై	397.00
గోదావరి	359.00	నమక్కల్	387.00
బెంగళూరు	382.00	చిత్తూరు	390.00
విశాఖపట్నం	362.00	ముంబై	400.00

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	87.00	గోదావరి	92.00
కరీంనగర్	87.00	విజయవాడ	92.00
వరంగల్	87.00	గుంటూరు	92.00
మహబూబ్‌నగర్	87.00	ఒంగోలు	94.00
కర్నూలు	87.00	చిత్తూరు	96.00
విశాఖపట్నం	85.00	నెల్లూరు	96.00

బిఎస్ఇలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు BSE

ACI INFOCOM 5.16(5.43)5200
ADITYA SPIN. 8.03(8.4)469
AGRO TECH FO 544.5(540.05)333
AISHWARYA TE 4.75(4.75)890
ALPHAGEO (I) 770.35(759.45)1287
ALU FLUORIDE 67.25(66.7)18346
AMAR RAJA BA 782.95(764.2)262485
ANDHRA BANK 52(51.7)124036
ANDHRA CEMEN 11.95(9.96)629136
ANDHRA PETRO 30.6(30.5)21378
ANJANI PORTL 289.95(241.65)169264
ASTRA MICRO 126.05(124.7)9497
AUROB.PHARMA 735.85(731.45)121619
AVANTEL LTD 255.15(252.05)1823
AVANTI FEEDS 1869.7(1824.7)11331
B.N.RATHI SE 33(33.35)552
BALAJI AMINE 309.95(309.75)3513
BAMBINO AGRO 203.85(194.15)1382
BARTRONICSIN 14(13.75)10814
BHAGIRA.CHEM 179.9(183)7609
BHAGYA INL 23.65(21.45)31866
BHARATFIN 877.8(861.2)97305
BNR UDYOG 55.1(61.2)189008
CAMBRIDGE 79.9(79.35)16673
CAT TECHN. .68(.66)400
CCHHL 13.17(13.03)9878
CCL PRODUCTS 279.35(275.05)349
CELESTIAL 23.3(23.8)22269
CIL SECURITS 29(29.55)180
COROM INTER 437.1(435.75)7930
CUBEX TUBING 16.3(16.35)2936
CYIENT 528.6(527.5)983
DANLAW TECH. 47.4(48)321
DECAN CEMENT 1116(1119.2)738
DHAN ROTO SP 19.9(19)3608
DIAMONPOWER 21.15(20.75)3806
DIVI'S LAB. 701.95(686.45)316587
DIVYA.GRANIT 103.55(103.1)2357
DQ ENT 12.44(12.32)8215
DR.REDDY'S 2040.35(2043.55)31448
EMPEE SUGARS 5.35(5.1)2190
EVEREST ORG. 100(100.1)167
FACOR ALLOYS 3.8(3.79)104749
FIRSTOBJ 15.85(15.1)5323
GATI LTD. 113.75(113.5)49214
GAYATRI BIO 7.7(7.73)8070
GAYATRI PROJ 178.75(177.7)3398
GENNEX LAB 3.78(3.79)76355
GMR INFRASTR 17.15(16.8)1999644
GODAVARI DRU 36.65(37)60
GOLDST INFRA 158.45(150.95)457434
GOLDSTONE EN 10.79(10.45)22400
GRANULES (I) 127.85(126.25)62363
GVK POWERINF 12.29(12.07)487242
HBL P SYS 49.45(47.6)162740
HERITGFOOD 1519.7(1462.9)10106
I.C.S.A. IND 2.56(2.65)10030
INCAP LTD. 53.55(51.7)955
IPAPPM 296.25(291.45)2530
IVRCL LTD 4.36(4.35)622920
KAKATIYA CEM 361.85(342.7)9627
KALLAM SPG. 31.05(31.1)28544
KAVERI SEED 550.25(540.35)34229
KCP LTD 105.55(103.6)23310
KERNEX MICRO 34.3(34.75)1763
KNR CONST 211(209.4)7205
KREBS BIOCHM 94.35(93.25)1129
LANCO INFRA .82(.84)3876080
LOKESH MACH 80.95(79.1)20309
MADHUCON PRJ 27.3(28)41605
MOLD-TEK TEC 52.75(52.95)17180
MOSCHIP SEMI 46.45(45.4)67192
MSR INDIA 34.95(33.35)6197
N C L IND. 237.4(234.8)18824
NAGAR.AGRICH 35.4(35.1)12486
NATCO PHARM 721.35(719.65)27890
NCC 85.1(84.2)177125
NEHA INTER. 5.1(5.01)7437
NETTLINX LTD 81.7(83.85)21060
NEULAND LAB. 1249.9(1226.25)110
NIHAR INFO 15.1(15)1150
NILE LTD. 602.65(600)6726
NTL 4.05(4.02)2800
OIL COUNTRY 43.75(44.2)1170
PADMALAYA TE 6.92(7.03)55601
PALRED 97(92.5)5730
PANYAM CEMEN 61.55(59.35)12045
PENNAR STEEL 64.95(60.8)414321
PFL INFOTECH 5.77(5.77)1426
PHYTOCHEM I. 46.9(46.55)371
PITTI LAMIN. 59.1(59.9)17581
POKARNA LTD 1263.1(1260.4)737
PRAJAY ENGS. 9.04(9.04)6813
PREMIER EXPL 441.55(441.6)2544
PRISM CEMENT 109.05(109.2)12172
RAIN 143.2(139.4)206622
RAJ PACKAGIN 54.35(54.65)4352
RAJVIR IND 42.25(40.65)1660
REG.CERAMIC 5.26(5.42)760
RESTILE CER. 4.62(5.09)520
SAGAR CEM. 845(811.75)1833
SAMKRG PIST. 259.6(259)5818
SAMPRE NUTRI 42(42.25)345
SANGHI IND. 84.95(82.85)65528
SATVAH.ISPAT 46.2(42.55)97501
SAVEN TECHNO 22.5(22.7)2189
SIBAR AUTO 13.4(14)1562
SMPL 1.55(1.58)8750
SMS PHARMACE 77.25(77.05)3333
SREE RAYALA 127.05(122.6)5711
STEEL EXCH 81.6(82)90811
SUJANA INDUS .89(.92)22751
SURANATP 4.6(4.58)1000
SURYACHAKRA 1.15(1.14)20942
SURYAMBA SP 67.5(63)2215
SURYAVA SPIN 8.87(9.33)1428
SURYLAK.COTT 93.2(93.1)8056
SUVEN LIFE S 162.1(163.45)29644
TAJ GVK HOTL 155.35(150.95)5718
TANLA 32.8(32.65)30080
TCI INDUS. 1535.4(1612)2
TRANSCORP IN 21.7(20.65)23206
TRANSGENE BI 2.37(2.49)5506
TRANSPORT CO 283.45(281.6)6770
USHER AGRO 6.39(6.52)21901
VICEROY HOTE 18.55(18.65)37599
VIJAY TEXTIL 65.7(65.15)45381
VIMTA LABS 130.05(130)6929
VIRAT CRANE 37.95(36.25)1350
VIRINCHI 90.6(82.4)284849
VISAKA IND. 679.35(617.25)200687
VISTA PHARMA 30.3(31.85)80065
VIVIMED LABS 99.25(99.7)142155
VST INDUS. 2706.2(2709.7)165
WATERBASE 116.05(113.9)135872
XLENERGY 1.63(1.69)5800
YBRANTDIGI 6.22(5.78)1850572
ZEN TECH 50.25(49.6)22656
ZENOTECH 47.3(47.4)706

ఎన్ఎస్ఇ-500 NSE
షేర్ల ప్రస్తుత, క్రితం ముగింపు ధరలు, వాణిజ్య పరిమాణం వరుసగా

AARTIDRUGS 515.15(511.7)7394
AARTIIND 844.7(824.4)24958
ABAN 177.25(174.95)655794
ABB 1348.6(1351.25)22051
ABFRL 169.5(167.9)153608
ABGSHIP 10.85(11.1)10955
ACC 1811.2(1801.5)206085
ADANIENT 128.15(118.95)16432031
ADANIPORTS 389.75(383.3)2979277
ADANIPOWER 32.15(29.8)24058760
ADANITRANS 124.5(117.7)725841
AEGISCHEM 190(189)114628
AHLUCONT 282.6(282.45)12253
AIAENG 1292.15(1301.35)138366
AJANTPHARM 1192.35(1196.05)213141
AKZOINDIA 1799.9(1795.95)1867
ALBK 67.95(67.1)1497701
ALLCARGO 169.3(167.95)161278
ALOKTEXT 2.95(2.9)1749186
AMARAJABAT 781.85(763.65)911418
AMBUJACEM 280.15(275)1271563
AMTEKAUTO 26(25.7)604923
ANANTRAJ 55.45(54.55)546039
ANDHRABANK 52.15(51.8)848950
APARINDS 772.95(762.75)8982
APLLTD 506.45(507.1)14075
APOLLOHOSP 1092.5(1077.05)409962
APOLLOTYRE 248.35(249.15)3302942
ARVIND 366.1(359.25)1639098
ASHIANA 161.85(163.4)36074
ASHOKA 191.25(187)1905576
ASHOKLEY 107.3(105.05)7845394
ASIANPAINT 1153.35(1151.7)674280
ASTRAL 679.95(671.95)44587
ASTRAZEN 910.95(897.25)7558
ATUL 2098.15(2076.5)14862
AUROPHARMA 735.2(731.05)1878114
AVANTIFEED 1865.35(1825.15)75268
AXISBANK 503.9(503.6)3972126
BAJAJ-AUTO 2750.55(2726.6)147597
BAJAJCORP 385.9(384.1)29426
BAJAJELEC 342.15(337.1)120624
BAJAJFINSV 5489.65(5442.95)139515
BAJAJHIND 14.55(14.55)3142735
BAJAJHLDNG 2962.05(2970.8)59314
BALKRISIND 1560.15(1547.4)58624
BALLARPUR 13.8(12.95)2826435
BALMLAWRIE 240.6(237.2)50394
BALRAMCHIN 169.35(168.85)1283988
BANKBARODA 139.45(140.05)11604114
BANKINDIA 143(141.65)2367920
BASF 1495.4(1488.85)6223
BATAINDIA 687.05(675.75)933126
BBTC 932.7(891.65)238722
BEML 1735.75(1726.15)1325072
BERGEPAINT 242(244)1230924
BFUTILITIE 372.25(325.1)2414958
BGRENERGY 134.45(132.1)104848
BHARATFIN 878.1(861.35)1788030
BHARATFORG 1143.9(1129.1)404234
BHARTIARTL 429(428.1)2153282
BHEL 127.75(126.85)2458131
BHUSANSTL 70.35(68.05)925249
BIOCON 343.8(342.55)1248928
BIRLACORPN 959(957.5)39071
BLISSGVS 168.35(168.1)73165
BLUEDART 4191.55(4210.15)1190
BLUESTARCO 755.15(750.15)151227
BOMDYEING 104.45(93.7)27471624
BOSCHLTD 22465.2(21693.35)8896
BPCL 520.95(504.1)4117206
BRFL 135.3(132.6)37998
BRIGADE 264.55(263.2)17770
BRITANNIA 4241.35(4172.6)101234
CADILAHC 504.3(498.6)1270280
CANBK 339.3(337.45)921928
CANFINHOME 2799.45(2696.4)106658
CAPF 724.6(702.5)613985
CARERATING 1519.3(1535.35)13168
CASTEXTECH 5.6(5.8)1819815
CASTROLIND 389.95(384.3)616482
CCL 279.2(277.65)11333
CEATLTD 1661.6(1653.55)384747
CENTRALBK 83.95(77.95)5486323
CENTURYPLY 251.15(253.9)229898
CENTURYTEX 1216.15(1204.05)325092
CERA 2872.1(2948.3)10386
CESC 1021.05(999.2)1836407
CHAMBLFERT 146.45(147.8)895940
CHENNPETRO 431.65(424.05)1634794
CHOLAFIN 1182.25(1147.25)170505
CIPLA 566.35(568.9)596376
CLNINDIA 571.9(567.15)34281
COALINDIA 241.8(238.25)3263209
COLPAL 1105.2(1096.8)180346
CONCOR 1311.35(1259.9)449887
COROMANDEL 438.45(435.8)69863
CORPBANK 45.2(45.1)101489
COX&KINGS 262.2(262.4)92081
CRISIL 1875.15(1883.4)55609
CUB 159(159.15)268622
CUMMINSIND 932.8(902.25)325916
CYIENT 530.15(528.4)38788
DABUR 314.35(309.25)790493
DALMIABHA 2690.85(2679.9)62929
DBCORP 370(375.55)123922
DBREALTY 36.85(36.05)204441
DCBBANK 189.95(186.4)1158152
DCMSHRIRAM 400.65(397.65)89410
DEEPAKFERT 377.35(371.25)182008
DELTACORP 188.25(185.05)3311141
DEN 89.25(87.95)134321
DENABANK 30.9(30.85)387117
DHANUKA 685(694.25)25203
DHFL 503.4(493.4)4406197
DISHTV 80.25(79.2)1576765
DIVISLAB 702.6(687.45)1072727
DLF 183.05(181.6)8982352
DREDGECORP 582.5(581.85)59443
DRREDDY 2038.9(2042.05)401449
DYNAMATECH 2261.05(2154.5)2904
ECLERX 1264.95(1264.05)13005
EDELWEISS 242(240.1)1731389
EICHERMOT 30984(30859.15)27311
EIDPARRY 321.05(316.45)128710
EIHOTEL 134(133.65)52133
ELECTCAST 29.1(28.45)137519
ELGIEQUIP 220.85(220)2050
EMAMILTD 1080.5(1075.65)40228
ENGINERSIN 156.7(156.2)1265131
EROSMEDIA 200.7(198.05)315916
ESCORTS 621.1(603.95)857368
ESSDEE 30.05(30.15)28102
ESSELPACK 279.85(265.05)264952
EVEREADY 295.5(297.5)19808
EXIDEIND 196.4(195.55)2613774
FCONSUMER 49.8(48)10290259
FDC 165.7(164.95)60813
FEDERALBNK 108.7(107.75)4091593
FINCABLES 530.1(528.2)38340
FINPIPE 606.8(610.7)41620
FLFL 360.15(359.5)91983
FORTIS 154.4(143.9)10455461
FSL 38.15(36.2)7212026
GAIL 381(379)1315332
GATI 113.45(113.3)294226
GDL 223.9(226.2)392121
GEPIL 655.25(652.65)6348
GESHIP 388.75(387.1)59828
GET&D 385.85(377.35)139060
GILLETTE 5346(5265)2856
GLAXO 2425.8(2435.8)7679
GLENMARK 616.6(615.05)477024
GLOBOFFS 33.1(33.1)42090
GMDCLTD 140.3(137.95)589282
GMRINFRA 17.2(16.85)23081553
GODFRYPHLP 1038.95(1032)170814
GODREJCP 926(915.1)366079
GODREJIND 620.25(601.95)397893
GODREJPROP 568.6(540.6)529730
GPPL 128.3(127.85)122368
GRANULES 127.6(126.1)1109714
GREAVESCOT 149.75(149.95)101257
GREENPLY 274(275.25)27997
GRINDWELL 400.85(401.3)8842
GRUH 506.05(500.35)77580
GSFC 146.2(140.5)4642023
GSKCONS 5396.05(5349.85)7062
GSPL 193.4(191.95)301790
GUJFLUORO 737(739.3)90489
GUJGASLTD 771.05(780.1)95790
GULFOILLUB 800.8(796.7)6223
GVKPIL 12.2(12.1)1656612
HATHWAY 33(33)22004
HAVELLS 485.2(481.25)503207
HCC 34.55(33.85)2477037
HCL-INSYS 47.75(47.95)1752435
HCLTECH 849.2(852.55)1693925
HDFC 1759.05(1727.8)2399821
HDFCBANK 1768.55(1746.15)673580
HDIL 62.25(60.3)12794288
HEIDELBERG 123.9(124.2)49475
HEROMOTOCO 3988.1(3945.7)261951
HEXAWARE 273.95(270.05)553226
HFCL 16.9(17)3205015
HIMATSEIDE 328.05(316.1)94087
HINDALCO 236.35(227.3)12685001
HINDCOPPER 62.15(61.25)469105
HINDPETRO 485.95(466.95)7197590
HINDUNILVR 1204.3(1190.45)666156
HINDZINC 295.35(284.1)1822670
HMT 33.3(33.3)3741
HMVL 268.3(270.75)6854
HONAUT 13060.9(13119.95)931
HOTELEELA 20.7(20.4)146564
HSIL 378.1(374)26068
HTMEDIA 90.2(90.25)107098
IBREALEST 229.3(224.6)6628779
IBULHSGFIN 1208(1202.3)1196811
ICICIBANK 300.3(299.5)8552010
ICRA 3891.65(3866.5)336
IDBI 55.3(55.45)4861705
IDEA 88(87.45)3125061
IDFC 54.6(54.05)1792508
IFBIND 716.9(700.2)3021
IFCI 23.8(23.6)2336032
IGARASHI 1003.55(995.4)7694
IGL 1256.85(1241.55)304413
IIFL 620.55(614.2)218871
IL&FSTRANS 79.55(80.35)225916
INDHOTEL 115(114.75)417368
INDIACEM 173.75(171)4258257
INDIANB 290.3(289.5)760461
INDOCO 192.4(190.3)24962
INDUSINDBK 1655.8(1643.3)379651
INEOSSTYRO 904.65(905.75)3883
INFRATEL 384.75(380.3)838089
INFY 926.65(927.45)8074832
INGERRAND 804.6(798.2)7277
INOXLEISUR 247.2(242.05)172200
INOXWIND 133.3(133.1)310348
INTELLECT 105.75(104.95)153179
IOB 22.8(22.6)385529
IOC 452.85(434.5)8748458
IPAPPM 296.3(290.4)14663
IPCALAB 416.25(415.25)275487
IRB 213.5(210.75)929859
ITC 282(280.25)6534233
J&KBANK 80.25(78.35)554972
JAGRAN 173(171.3)6897123
JAICORPLTD 82.55(78.6)1218488
JBCHEPHARM 279.15(281.3)139267
JBFIND 162.1(159.45)55219
JCHAC 1960.85(1947.05)5374
JETAIRWAYS 560.5(545.7)2409777
JINDALPOLY 373.95(367.6)40701
JINDALSTEL 137.15(131.4)6543595
JISLJALEQS 97.45(96)2415464
JKCEMENT 1010.8(997.05)11316
JKIL 195(193.95)150766
JKLAKSHMI 416.95(414.05)50962
JKTYRE 144.1(143.4)616536
JMFINANCIL 126.8(126.35)434750
JPASSOCIAT 23.9(21.25)189259365
JPINFRATEC 16.85(16.05)6642703
JPPOWER 6(5.9)3756952
JSWENERGY 66.6(65.35)6994365
JSWHL 1805.4(1770.3)4633
JUBILANT 692.35(699.55)229122
JUBLFOOD 1366.05(1344.85)1157869
JUSTDIAL 376.75(362.1)1654951
JYOTHYLAB 380.45(382.75)47146
KALPATPOWR 376.8(347.4)2057417
KANSAINER 473.45(473.65)36332
KEC 316.95(312.05)1956484
KESORAMIND 139.3(136.95)330602
KIRLOSENG 376.1(376.1)11350
KITEX 232(231.5)34547
KOLTEPATIL 157.2(159.7)128047
KOTAKBANK 971.35(964.4)997329
KPIT 117.45(116.15)514255
KRBL 470.2(459.15)85351
KSCL 551.65(540.05)481206
KSK 6.85(7.65)1742815
KTKBANK 150.15(147.9)1106762
KWALITY 150(152.35)1074536
L&TFH 197.1(189.65)16613568
LAKSHVILAS 173.7(174.7)535982
LAOPALA 471.5(459.7)46749
LAXMIMACH 6064.75(6038.5)1496
LICHSGFIN 663.9(659)1208591
LITL .8(.8)23706385
LT 1139.65(1130.05)895791
LUPIN 988(989.3)700248
M&M 1358.15(1376.95)1055176
M&MFIN 425.35(411.4)2002080
MAGMA 173.65(175.2)142659
MAHINDCIE 237.8(239.9)50376
MAHLIFE 435(435.15)14252
MANAPPURAM 95.75(92.75)7613406
MANPASAND 809.25(817.15)27670
MARICO 314.75(312.65)1029028
MARKSANS 40.1(39.55)1076557
MARUTI 7557.45(7521.5)471048
MAYURUNIQ 361.4(359.75)27696
MCDOWELL-N 2555.55(2563.55)161317
MCLEODRUSS 176.4(174.75)40569
MERCK 1178.55(1191.35)9883
MHRIL 362.55(364.9)22656
MINDACORP 107.1(106.7)75447
MINDTREE 462.1(472.1)310351
MMTC 56.3(55.5)448849
MOIL 362(358.75)160648
MONSANTO 2479.65(2468.95)3692
MOTHERSUMI 309.25(303.8)3480614
MOTILALOFS 1220.55(1219.5)103762
MPHASIS 612.25(609.6)75861
MRF 62944.75(62907.95)5035
MRPL 132.65(126.4)3957323
MTNL 19.45(19.25)872285
MUTHOOTFIN 463.05(453.6)425997
NATCOPHARM 720.95(722.7)393719
NATIONALUM 69.45(67.95)1802468
NAUKRI 940.25(934.05)105786
NAVKARCORP 194.75(189.7)30568
NCC 85.05(84.35)1794393
NETWORK18 49.55(48.9)299245
NHPC 29.05(29)4562755
NIITTECH 502.25(498.25)326487
NITINFIRE 3.75(3.8)1036477
NLCINDIA 93.4(91.4)147622
NMDC 126.5(121.8)6223495
NTPC 167.95(168.4)20715128
OBEROIRLTY 375(371.85)81691
OFSS 3425.25(3456.5)23457
OIL 292.05(289.2)736505
OMAXE 202.9(202.5)620156
ONGC 158.4(157.25)5219322
ORIENTBANK 126.1(124.45)1706625
ORIENTCEM 151.65(149.05)61964
ORISSAMINE 1863.25(1907.45)17821
PAGEIND 17578(17319.5)8056
PARSVNATH 20.05(19.3)127794
PCJEWELLER 354.55(350.4)2173888
PEL 2716.5(2657.15)115790
PERSISTENT 616.6(620.5)33218
PETRONET 226.8(222.95)4378939
PFC 123.5(120.7)3697716
PFIZER 1797.9(1806.85)10887
PFS 38.85(37.8)1056776
PGHH 8294.95(8246.45)9065
PHOENIXLTD 522.5(523.35)25106
PIDILITIND 831.3(827.25)228155
PIIND 721(713.1)359205
PNB 142.5(141)4286281
POLARIS 243.9(242)30596
POWERGRID 215.6(215.3)5238874
PRAJIND 68.45(67.4)135164
PRESTIGE 268.6(263.15)279588
PRISMCEM 109.1(109.45)151536
PTC 115.9(114.25)1651960
PUNJLLOYD 18.95(18.8)791912
PURVA 72.45(70.9)83370
PVR 1309.95(1261.5)184144
RADICO 168.25(161.5)1413688
RAIN 143.1(139.75)929938
RAJESHEXPO 739.2(731.35)477889
RALLIS 227.25(228.3)213850
RAMCOCEM 693.9(685.65)329377
RAMCOSYS 380.95(353.35)106307
RATNAMANI 879(866.85)60023
RAYMOND 763.05(756.2)528353
RCF 95.9(95.1)2810319
RCOM 22.7(22.55)13658571
RDEL 54(53.5)853792
RECLTD 166.9(164.45)4723805
REDINGTON 148(146.1)302111
RELAXO 505.55(505.55)19984
RELCAPITAL 779.9(769.5)4144080
RELIANCE 1564.1(1532.15)2362387
RELINFRA 507(498.2)3291052
RENUKA 17.05(16.9)1504125
REPCOHOME 649.6(639.05)182753
RIIL 428(414.2)269867
RKFORGE 554.1(554.5)28794
ROLTA 54.25(53)472746
RPOWER 40.4(39.75)1537725
RTNPOWER 5.9(5.85)1093964
RUCHISOYA 18.75(19.65)1331016
SADBHAV 279.65(275.1)146433
SADBHIN 101.7(101.75)5662
SAIL 61.8(61.05)3036384
SANOFI 3969.9(3962.75)16758
SBIN 276.6(277)7648702
SCHAEFFLER 4257.55(4149.1)17690
SCHNEIDER 120.3(120.25)61089
SCI 97.95(95.2)2008904
SHARDACROP 453.8(452.4)7675
SHILPAMED 605.95(589.45)20319
SHK 243.35(242.3)96663
SHOPERSTOP 362.35(354.6)98338
SHREECEM 17699.55(17363.15)20413
SHRIRAMCIT 2104.8(2124.75)4815
SIEMENS 1276.85(1273.1)113266
SIMPLEXINF 488.25(483.4)2539
SINTEX 30.8(29.85)18827998
SITINET 24.8(24.8)85811
SJVN 31.35(31.2)680280
SKFINDIA 1511(1499.35)131429
SMLISUZU 981.9(966.7)28323
SNOWMAN 50.7(50.6)248939
SOBHA 384.8(376.75)56789
SOMANYCERA 796.35(793.95)15913
SONATSOFTW 159.3(157.85)106009
SOUTHBANK 27.9(27.55)5118467
SPARC 392.6(384.5)354373
SREINFRA 122.85(120.9)1215402
SRF 1476.95(1464.2)97478
SRTRANSFIN 975.3(971.6)247068
STAR 911.1(906.85)242978
STCINDIA 158.05(155.85)104161
SUNDARMFIN 1600.75(1607.35)91850
SUNDRMFAST 403.45(400.2)108282
SUNPHARMA 484.25(481.8)2523480
SUNTV 704.15(701.4)797134
SUPREMEIND 1160.35(1165.05)37517
SUVEN 162.4(163.45)111453
SUZLON 16.45(16.25)36461208
SWANENERGY 146.75(145.85)384812
SYMPHONY 1247.2(1255.2)8446
SYNDIBANK 65(64.55)677002
SYNGENE 442.3(448.4)47638
TAKE 139.75(137.2)139690
TATACHEM 588.85(586.6)598100
TATACOFFEE 135.8(132.55)527978
TATACOMM 652.45(648)556505
TATAELXSI 1657.35(1646.2)158726
TATAGLOBAL 197.05(190.35)7173447
TATAMOTORS 378.5(376.1)3734824
TATAMTRDVR 220.85(220.25)1649635
TATAPOWER 77.65(76.95)2203355
TATASPONGE 806.6(789)125645
TATASTEEL 638.65(630.2)3524171
TBZ 107.25(104.1)224926
TCS 2484.55(2470.85)485391
TECHM 425.75(431.75)2380800
TECHNO 359.4(350.1)14054
TEXRAIL 90.15(88.4)197934
THERMAX 882.95(891.45)7372
THOMASCOOK 216.3(214.75)304582
TIDEWATER 5718.25(5699.5)401
TIMKEN 722.2(718)29383
TITAN 611.6(600.45)977962
TNPL 331.65(330.95)56359
TORNTPHARM 1209.65(1217.1)125346
TORNTPOWER 211.9(210.4)1049800
TREEHOUSE 15(14.85)26278
TRIDENT 99.4(93.85)6847785
TRITURBINE 134.75(131.3)15414
TTKPRESTIG 6357.15(6304.85)1258
TTML 6.65(6.55)748313
TV18BRDCST 37.2(36.15)3975702
TVSMOTOR 610.55(594.55)2623217
TVSSRICHAK 3306.6(3308.15)2995
TVTODAY 243(244.15)87500
UBL 801.65(802.1)217702
UCOBANK 30.85(31)338117
UFLEX 420.35(409.75)204582
ULTRACEMCO 4013.05(3931.6)415975
UNICHEMLAB 242.25(241.95)18272
UNIONBANK 136.55(134.75)2149784
UNITECH 7.4(7.35)13232007
UPL 839.85(840.15)1179595
VAIBHAVGBL 547.35(519.15)18230
VAKRANGEE 502.2(478.45)1319316
VEDL 305.55(299.05)7689067
VIDEOIND 18.15(18.05)848941
VIJAYABANK 69.65(68.6)1021930
VINATIORGA 1020.8(1012)35964
VIPIND 220.65(216.2)691005
VOLTAS 523.2(520.05)1053566
VRLLOG 331.2(331.65)15970
VSTIND 2711(2711.05)718
VTL 1199.6(1187.05)43584
WABAG 606.3(607.2)73164
WABCOINDIA 5430.7(5451.75)3432
WELCORP 138.5(134.2)884648
WELSPUNIND 77.75(75.8)361833
WHIRLPOOL 1180.25(1176.7)24334
WIPRO 291.2(290.75)1837382
WOCKPHARMA 611.45(601.45)1055826
WONDERLA 340.15(338.95)53647
YESBANK 1752.1(1721.55)1972851
ZEEL 520.35(518.25)1662465
ZEELEARN 42.05(42.15)82918
ZENSARTECH 782.55(782.65)4580
ZYDUSWELL 864.8(862.55)1386

ఆంధ్రజ్యోతి బిజినెస్
నిజామాబాద్
గురువారం 31 ఆగస్టు 2017

▲ 258.07	▲ 88.35	▶▶ -	▶▶ -	▲ రూపాయి Vs డాలర్	▼ ముడి చమురు
సెన్సెక్స్ 31646.46	నిఫ్టీ 9884.40	బంగారం (ముంబై) 29,915 10 గ్రాములు (99.9 స్వచ్ఛత)	వెండి 40,030 కిలో (రూపాయల్లో)	64.01	51.60 బ్యారల్ ధర (డాలర్లలో..)



పివి సింధుతో ఫ్రాంకో అనుంజిటో, కంపెనీ ప్రతినిధులు

బ్రిడ్జ్‌స్టోన్‌కు పివి సింధు ప్రచారం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): రియో ఒలింపిక్స్ బాడ్మింటన్ రజత పతక విజేత పివిసింధును జపాన్ టైర్ల తయారీ కంపెనీ 'బ్రిడ్జ్‌స్టోన్' తమ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకుంది. బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, సిఇఒ ఫ్రాంకో అనుంజిటో ఈ విషయం చెప్పారు. బ్రిడ్జ్‌స్టోన్ భారత్‌లో బ్రాండ్ అంబాసిడర్‌ను నియమించడం ఇదే మొదటిసారి. 'పట్టుదల, సంకల్ప బలంతో రాణిస్తూ సింధు నేటి యువతకు ఆదర్శంగా నిలిచారు. ఒలింపిక్స్ క్రీడల కోసం మా కంపెనీ నినాదంగా తీసుకున్న 'చేజ్ యువర్ డ్రీమ్స్' నినాదానికి ఈ లక్షణాలు సరిగ్గా సరిపోతాయి. ఆటలో గెలిచేందుకు పట్టుదలతో ఆమె చేసే పోరాటం మా బ్రాండ్ లక్ష్యాలకు చేరువగా ఉంటుంది. అందుకే సింధుని మా బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంచుకున్నాం' అన్నారు. సింధు కూడా బ్రిడ్జ్‌స్టోన్ ఇండియా కంపెనీ తనను భారత్‌లో బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంచుకోవడంపై సంతోషం వ్యక్తం చేశారు. 'బ్రిడ్జ్‌స్టోన్ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించడం గౌరవంగా భావిస్తున్నా. కంపెనీకి భారత్‌లో తొలి బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రచారం చేయడం మరింత ఆనందంగా ఉంది' అన్నారు. వచ్చే ఒలింపిక్స్‌లో బాడ్మింటన్‌లో భారత్‌కు స్వర్ణ పతకం సాధించడమే తన లక్ష్యమన్నారు. ఇందుకోసం ఇంకా కష్టపడతానని చెప్పారు. క్రీడా జీవితం తర్వాతే ఉద్యోగంపై దృష్టి పెడతానన్నారు.

విస్తరణ కోసం రూ.1,940 కోట్లు

వచ్చే ఐదేళ్లలో భారత్‌లో తమ ఉత్పత్తి సామర్థ్య విస్తరణ కోసం 30.4 కోట్ల డాలర్లు (సుమారు రూ.1,940 కోట్లు) ఖర్చు చేయనున్నట్టు బ్రిడ్జ్‌స్టోన్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కజుటొషి ఒయామా చెప్పారు. దీంతో ప్రస్తుతం 25,000గా ఉన్న టైర్ల రోజువారీ ఉత్పత్తి సామర్థ్యం 40,000కు చేరుకుంటుందని తెలిపారు. చైనా టైర్ల దిగుమతిపై ప్రభుత్వం విధించిన యాంటీ డంపింగ్ డ్యూటీని సమర్థించారు. దీని వల్ల చౌక దిగుమతులకు తెరపడి దేశీయ కంపెనీలకు మేలు జరుగుతుందన్నారు.

కార్లకు సుంకాల పోటు

లగ్జరీ కార్లపై మరింత సెస్.. కేంద్ర కేబినెట్ ఆమోదం



న్యూఢిల్లీ: దేశంలో లగ్జరీ కార్లు, ఎస్‌యువిలు, హైబ్రిడ్ మోటారు వాహనాల ధర మరింత పెరగబోతోంది. ఇందుకోసం ప్రస్తుతం వీటిపై 15 శాతంగా ఉన్న జిఎస్‌టి సెస్ 25 శాతానికి పెరగనుంది. ఈ వాహనాలపై ప్రస్తుతం విధిస్తున్న 28 శాతం జిఎస్‌టికి ఇది అదనం. పార్లమెంట్ సమావేశంలో లేకపోవడంతో ఆర్డినెన్స్ ద్వారా ఇందుకోసం జిఎస్‌టి (రాష్ట్రాలకు నష్టపరిహారం) చట్టం, 2017ని సవరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర కేబినెట్ బుధవారం ఈ ఆర్డినెన్స్ జారీకి ఆమోద ముద్ర వేసింది. జూలై 1 నుంచి జిఎస్‌టి అమల్లోకి వచ్చాక సామాన్యులు ఉపయోగించే కొన్ని వస్తువులపై పన్నుల భారం తగ్గి, సంపన్నులు ఉపయోగించే లగ్జరీ కార్లు, ఎస్‌యువిల ధర తగ్గడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. దీంతో వీటిపై విధించే సెస్ మరింత పెంచాలని కేంద్ర ఆర్థిక మంత్రి జైట్లీ అధ్యక్షతన ఈ నెల 5న జరిగిన జిఎస్‌టి మండలి సిఫారసు చేసింది.

'పన్ను రేట్లలో ఏమైనా ఉపశమనం ఇవ్వాల్సి వస్తే సంపన్నులకు బదులు, సామాన్యులు ఉపయోగించే వస్తువులకు ఇవ్వాలి. కోటి రూపాయలు పెట్టి కారు కొన్న వ్యక్తి పన్నుల రూపంలో మరో రూ.20 లక్షలు భరించడం పెద్ద కష్టమేం కాదు' అని జైట్లీ చెప్పారు. దీంతో ఆర్డినెన్స్ ద్వారా చట్టాన్ని సవరించేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. అయితే ఎప్పటి నుంచి దీన్ని అమలు చేయాలనే విషయాన్ని వచ్చే నెల 9న హైదరాబాద్‌లో జరిగే సమావేశంలో జిఎస్‌టి మండలి నిర్ణయిస్తుంది.

కొన్నిటిపైనే భారం : ప్రభుత్వం

జిఎస్‌టికి ముందు లగ్జరీ కార్లు, ఎస్‌యువిలు, హైబ్రిడ్ వాహనాలపై గరిష్ఠంగా 52 నుంచి 54.72 శాతం వరకు పన్నుల భారం ఉండేది. జిఎస్‌టితో అది 43 శాతానికి తగ్గింది. దీంతో కంపెనీలు లగ్జరీ కార్లు, ఎస్‌యువిల ధరలను మోడల్‌ను బట్టి రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు తగ్గించాయి. దీంతో ఇటీవల ఈ వాహనాల అమ్మకాలూ పుంజుకున్నాయి. ఇంతలోనే సెస్ మరింత పెంచాలని ప్రభుత్వం నిర్ణయించడం, ఆటోమొబైల్ కంపెనీలను నిరాశ పరిచింది. అయితే సెస్ పెంపు భారం మొత్తం 12 విభాగాలకు చెందిన వాహనాల్లో, కేవలం రెండు విభాగాలకు చెందిన వాహనాలపైనే ఉంటుందని ప్రభుత్వం చెబుతోంది. 'ఈ పెంపు ప్రభావం కొన్ని రకాల వాహనాలకు మాత్రమే పరిమితం. అన్నిటికి కాదు' అని జైట్లీ చెప్పారు.

రెవిన్యూ సెక్రటరీ హస్ముఖ్ అధియా కూడా ఇదే విషయం స్పష్టం చేశారు. గతంలో ఎక్సైజ్ డ్యూటీ, వ్యాట్ అధికంగా ఉన్న వాహనాలు, లగ్జరీ తరగతికి చెందిన వాహనాలపై మాత్రమే ఈ పెంపు ప్రభావం ఉంటుంది. ఇతర వాహనాలు, కార్లపై పన్ను భారం పెంచే యోచన లేదు' అన్నారు.

ఈ కార్లపై సెస్ భారం ఉండదు !

నాలుగు మీటర్ల కంటే తక్కువ పొడవు ఉండి 1,200 సిసి ఇంజన్ ఉండే పెట్రోల్ కార్లపై ప్రస్తుతం జిఎస్‌టికి తోడు ఒక శాతం మాత్రమే సెస్ విధిస్తున్నారు. ఇదే పొడవు ఉండి 1,500 సిసి ఇంజిన్ ఉండే కార్లపై మాత్రం మూడు శాతం సెస్ అమల్లో ఉంది. ఇపుడు ఆర్డినెన్స్ ద్వారా సెస్ పెంచినా ఆ ప్రభావం ఈ శ్రేణికి చెందిన కార్లపై ఉండదని సమాచారం. అధికార వర్గాలు కూడా ప్రస్తుతం 15 శాతం సెస్ పరిధిలో ఉన్న వాహనాలపైనే ఆర్డినెన్స్ ద్వారా సెస్సును 25 శాతానికి పెరుగుతుందని చెబుతున్నాయి. దీంతో ఎంట్రీ లెవల్ కార్ల ధరల్లో ఏ మాత్రం మార్పు ఉండకపోవచ్చని భావిస్తున్నారు. లగ్జరీ కంపెనీలు మాత్రం కేబినెట్ నిర్ణయంపై ఆందోళన వ్యక్తం చేశాయి. దీంతో ఈ వాహనాల అమ్మకాలు మరింత దెబ్బతినే ప్రమాదం ఉందని పేర్కొన్నాయి.

మంగళగిరి ఎయిమ్స్‌పై ప్రధాని ఆరా

ఎపి, తెలంగాణ సహా పలు రాష్ట్రాల్లో రైల్వేలు, రోడ్లు, విద్యుత్, ఆయిల్ పైప్‌లైన్ల వంటి 17 రంగాలకు చెందిన ప్రాజెక్టుల అమలు తీరుతెన్నులను ప్రధాని మోదీ బుధవారం రాష్ట్రాల ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. మంగళగిరిలో ఏర్పాటు చేస్తున్న ఎయిమ్స్ ఆస్పత్రి గురించి ప్రధాని అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిఎస్‌టి అమలుపై నెలకొన్న భయాలు నిరాధారమని తేలిపోయినట్టు ప్రధాని చెప్పారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని మరింత మంది వ్యాపారులు, వ్యాపార సంస్థలు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వచ్చే నెల రోజుల్లో చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.



ఈ నిర్ణయంతో లగ్జరీ కార్ల పరిశ్రమ వృద్ధి రేటు పడిపోతుంది. ఆరు నెలల తర్వాత జిఎస్‌టి ప్రభావాన్ని సమీక్షించి ప్రభుత్వం నిర్ణయం తీసుకుని ఉంటే బాగుండేది.

- రోలాండ్ ఫోల్గర్, ఎండి, సిఇఒ, మెర్సిడెజ్ బెంజ్ ఇండియా



లగ్జరీ కార్లు, ఎస్‌యువిలపై ఇప్పటికే పన్నుల భారం చాలా ఎక్కువగా ఉంది. సెస్ భారం మరింత పెంచాలని ప్రభుత్వం నిర్ణయించడం లగ్జరీ కార్ల పరిశ్రమకు దెబ్బ. దీని వల్ల జిఎస్‌టికి పూర్వం ఉన్న ధరల కంటే ఎక్కువగా ధరలు పెంచాల్సి వస్తుంది.

- రాహిల్ అన్సారి, హెడ్, ఆడి ఇండియా



ఎప్పుడు, ఎంత మొత్తం ఏ ప్రాతిపదికన సెస్ పెంచుతారనేది అత్యంత ముఖ్యం. దీనిపై ఇప్పటికే ప్రభుత్వానికి మా అభిప్రాయం తెలియజేశాం. ప్రభుత్వ తుది నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నాం.

- పవన్ గోయెంకా, ఎండి, మహీంద్రా అండ్ మహీంద్రా

ఇక ఎగవేతదారుల పప్పులుడకవ్

- ఇన్వాయిస్‌లో తేడా వచ్చినా పట్టేస్తాం: అరుణ్ జైట్లీ

న్యూఢిల్లీ: పన్నుల ఎగవేతదారుల ఆటలు ఇక సాగవని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ హెచ్చరించారు. జిఎస్‌టి రిటర్న్‌ల్లో పేర్కొన్న వ్యాపారానికి, ఇన్వాయిస్‌ల్లో పేర్కొన్న వ్యాపారానికి మధ్య తేడా ఉంటే వారి పని పడతామని తేల్చి చెప్పారు. నయానో, భయానో అందరూ సక్రమంగా పన్నులు చెల్లించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. అప్పటికీ పద్ధతి మార్చుకోకపోతే ఎగవేతదారులపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. పన్నుల ఎగవేతను అరికట్టేందుకు గత రెండు మూడు సంవత్సరాల్లో ప్రభుత్వం అనేక చర్యలు తీసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. తమ ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యలు కొంత మందిని విస్మయ పరిచాయన్నారు. జిఎస్‌టితో పరోక్ష పన్నులతో పాటు ప్రత్యక్ష పన్నులు చెల్లించే వారి సంఖ్య విస్తృతం అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. 'ప్రస్తుతం జిఎస్‌టి కింద ఎవరికి వారు స్వచ్ఛందంగానే నిబంధనలు పాటించేలా ప్రయత్నిస్తున్నాం. అయితే బిల్లులు పరిశీలించాక వీరు వెల్లడించిన విషయాల్లో ఎంత నిజం ఉందనేది తెలుస్తుంది' అన్నారు. జిఎస్‌టి రిటర్న్‌లు, బిల్లుల మధ్య తేడా ఉంటే అలాంటి వ్యాపారులను ప్రశ్నించక తప్పదన్నారు. జిఎస్‌టి కింద ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ (ఐటిసి) పొందాలంటే వ్యాపారులు ఇన్వాయిస్‌ల్లో వ్యాపార లావాదేవీల మొత్తాన్ని పూర్తిగా పేర్కొనాలి. జిఎస్‌టి ద్వారా పన్నుల రేటుతో పాటు, పాటించాల్సిన నిబంధనలూ సరళీకృతం చేసినట్టు జైట్లీ చెప్పారు. ఇన్ని చేసినా ఇంకా ఎవరైనా పన్నులు ఎగవేయాలని చూస్తే వారిపై కొరడా ఝుళిపించక తప్పదన్నారు. టెక్నాలజీ సాయంతో ఎవరు పన్నులు ఎగవేస్తోంది తేలిగ్గా తెలిసిపోతుందన్నారు. పన్నుల ఎగవేతతో దేశం ఏటా లక్షల కోట్ల ఆదాయం నష్టపోతున్నట్టు చెప్పారు. పన్నుల చెల్లింపుకు సంబంధించి మన ప్రజల ఆలోచనా విధానంలో మార్పు రావాల్సిన అవసరముందన్నారు. మరింత మందిని పన్నుల పరిధిలోకి తీసుకొచ్చేందుకు చట్టాల్లోనూ మార్పు అవసరమన్నారు. పాత పెద్ద నోట్ల రద్దుతో ఐటి రిటర్న్‌లు ఫైల్ చేసే వారి సంఖ్య చెప్పుకోదగ్గ స్థాయిలో పెరిగినట్టు ఆర్థిక మంత్రి చెప్పారు.



ఓ పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ

ఆధార్ లింక్ చేయకపోతే ఐటీ రిటర్న్స్ దాఖలు చేయనట్లే

న్యూఢిల్లీ (ఆంధ్రజ్యోతి): ఐటి రిటర్న్స్ దాఖలు చేసి ఆధార్‌కార్డ్ అనుసంధానం చేయలేదా.. అయితే మీరు దాఖలు చేయనట్లే లెక్కని కేంద్ర తేల్చిచెప్పింది. దాంతో ఐటీఆర్ దాఖలు చేయడంతోపాటు ఆధార్ కూడా కీలకంగా మారింది. ఈ ప్రక్రియకు ఆగస్టు 31 వరకు అవకాశముంది. ఎక్కువ మందిలో ఆధార్ లింక్ చేయకపోతే ఏమవుతుంది..?

- ఐటీఆర్ దాఖలుచేసి ఆధార్ అనుసంధానం చేయకపోతే దాన్ని ఐటీ శాఖ పరిగణనలోకి తీసుకోదు. పైగా ఐటీఆర్ దాఖలు చేయని వారి జాబితాలో వీరిని చేర్చుతారు
- అలాంటి వారికి ఐటీఆర్ సెక్షన్ 142(1) ప్రకారం నోటీసులు జారీ చేస్తారు. దానికి రూ.5వేలు ఫెనాల్టీ వేస్తారు
- ఆదాయపన్నుతో చేసుకునే క్లైములను చేసుకోలేరు. నష్టాలు, పెట్టుబడి, బిజినెస్ నష్టాలను క్యారీ ఫార్వర్డ్ చేసుకోలేరు.
- ఎవైనా రిఫండ్స్ వచ్చేవి ఉంటే వాటిని మంజూరు చేయరు
- కొన్ని క్యాటగిరీ వారికి వెసుబాటు ఉంటుంది
- ఎన్నారైలు, 80 ఏళ్లకు పైబడిన వారు, అస్సాం, మేఘాలయ, జమ్ము కశ్మీర్ ప్రజలకు కొంత వెసులు బాటు ఉంటుంది.

పెట్రోల్‌పై పన్నులను తగ్గించేది లేదు



న్యూఢిల్లీ: పెట్రోల్, డీజిల్‌పై పన్నులను తగ్గించేది లేదని కేంద్ర ప్రభుత్వం తేల్చి చెప్పింది. గత రెండు నెలల్లోనే పెట్రోల్ ధర లీటర్ 6 రూపాయల మేర పెరిగింది. ప్రజలపై భారాన్ని తగ్గించేందుకు పెట్రోలియం ఉత్పత్తులపై పన్ను రేట్లను తగ్గించాలని కొద్దికాలంగా డిమాండ్ వస్తోంది. ప్రస్తుతం దేశీయ మార్కెట్లో పెట్రోలియం ఉత్పత్తుల రేట్లను అంతర్జాతీయ మార్కెట్ రేట్లకు అనుగుణంగా ఏ రోజుకారోజు సవరిస్తున్న విషయం తెలిసిందే. గతంలో రేట్ల సవరణ ప్రతి పదిహేను రోజులకోసారి చేపట్టేవారు. జూన్ 16 నుంచి రోజువారి సమీక్ష, సవరణలు చేపట్టారు. రోజువారి సమీక్ష మొదలైన తర్వాతనే పెట్రోల్ ధర లీటర్‌కు 6 రూపాయల మేర పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్లో రేట్లు పెరిగిన కారణంగానే ధరలను పెంచుతున్నట్టుగా పెట్రోలియం మార్కెటింగ్ కంపెనీలు చెబుతున్నాయి. దేశంలో అన్ని రకాల సర్వీసులు, సరుకులను జిఎస్‌టి పరిధిలోకి తెచ్చినప్పటికీ, పెట్రోలియం ఉత్పత్తులను మాత్రం పక్కనబెట్టారు. దీనివల్ల కూడా వీటిపై పన్నుల భారం తగ్గలేదు. ఆగస్టు 2014 తర్వాత పెట్రోల్ ధరలు ఇప్పుడు మళ్లీ గరిష్ఠ స్థాయిని తాకాయి. డీజిల్ ధర కూడా లీటర్ 3.65 రూపాయల మేర పెరిగింది. పెట్రోలియం ఉత్పత్తులను జిఎస్‌టి పరిధిలోకి తెస్తే రేట్లు గణనీయంగా తగ్గే అవకాశం ఉంటుంది. జిఎస్‌టి గరిష్ఠ రేటు 28 శాతం కాగా పెట్రోలియం ఉత్పత్తులపై పన్నుల భారం దాదాపు 35 శాతం వరకు ఉంది.

నిజానికి అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు పడిపోయిన సమయంలోనూ ప్రభుత్వం మార్కెట్ ధర తగ్గకుండా అదనంగా ఎక్సైజ్ సుంకాన్ని వడ్డించింది. 2015 నవంబర్ నుంచి 2016 జనవరి మధ్య ఎక్సైజ్ సుంకాన్ని ఐదుసార్లు పెంచింది. లీటర్ పెట్రోల్‌పై 4.02 రూపాయల మేర లీటర్ డీజిల్‌పై 6.97 రూపాయల మేర ఎక్సైజ్ సుంకాన్ని పెంచారు. అంతకుముందు మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తల్లో కూడా 2014 నవంబర్-2015 జనవరి మధ్య కూడా ఎక్సైజ్ సుంకాన్ని ప్రభుత్వం పెంచింది. లీటర్ పెట్రోల్‌పై 7.75 రూపాయలు, డీజిల్‌పై 6.5 రూపాయల మేర అదనపు భారం పడింది. వెరసి మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్రోల్‌పై 11.77 రూపాయలు, డీజిల్‌పై 13.47 రూపాయల మేర ఎక్సైజ్ సుంకాన్ని పెంచారు. దీనివల్ల ప్రభుత్వ రాబడి అదనంగా 20 వేల కోట్ల రూపాయల మేర పెరిగింది. ప్రస్తుతం పన్నుల ధరలను తగ్గించేంత తీవ్ర పరిస్థితి ఇంకా రాలేదని పెట్రోలియం శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమం సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ అన్నారు. పెట్రోలియం ఉత్పత్తులను జిఎస్‌టి పరిధిలోకి తేవాలన్న ప్రతిపాదనకు తాము సుముఖంగా ఉన్నట్టు ఆయన చెప్పారు.

అపోలో హాస్పిటల్స్‌కు అవార్డుల పంట

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఇటీవల మనీలాలో జరిగిన ఆసియాన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ అవార్డుల్లో భాగంగా అపోలో హాస్పిటల్స్‌కు వివిధ కేటగిరీల్లో ఏడు అవార్డులు లభించాయి. కస్టమర్ సర్వీస్, క్లినికల్ సర్వీసుల్లో మెరుగుదల, హాస్పిటల్ మేనేజ్‌మెంట్ అండ్ గవర్నెన్స్‌లో ఇన్నోవేషన్స్‌కు సంబంధించి చేపట్టిన వివిధ ప్రాజెక్టులు, ప్రోగ్రాములకు సంబంధించి ఈ అవార్డులు దక్కాయి. గత ఏడాదిలో జరిగిన ఆసియాన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ హెల్త్‌కేర్ ఎక్సలెన్స్ అవార్డుల్లో భాగంగా 11 కేటగిరీల్లో 13 అవార్డులు, రెండు గ్రాండ్ అవార్డులను అపోలో హాస్పిటల్స్ సొంతం చేసుకుంది. సిఎస్‌ఆర్ నుంచి కస్టమర్ సర్వీస్, నర్సింగ్ ఎక్సలెన్స్, క్లినికల్ సర్వీసెస్ ఇంప్రూమెంట్, బయోమెడికల్ సదుపాయాల్లో మెరుగుదల వంటి విభాగాల్లో అత్యుత్తమ స్థాయిలో నిలిచినట్టు అపోలో హాస్పిటల్స్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి తెలిపారు.

ఐసిఐసిఐ బ్యాంకుతో ఎన్‌టిపిసి ఒప్పందం

న్యూఢిల్లీ: ఎన్‌టిపిసి 3,000 కోట్ల రూపాయల టర్మ్ లోన్‌కు సంబంధించి ఐసిఐసిఐ బ్యాంకు తో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సొమ్మును మూలధన వ్యయం కోసం వినియోగించనున్నట్టు తెలిపింది. 15 ఏళ్ల కాలపరిమితి ఉండే టర్మ్ లోన్ కోసం మంగళవారంనాడే ఒప్పందం కుదిరినట్టు పేర్కొంది. 2016-17 సంవత్సరంలో 3,845 మెగావాట్ల విద్యుత్ సామర్థ్యం ఉన్న ప్రాజెక్టులను ఎన్‌టిపిసి ప్రారంభించింది.

ఈ ఏడాది వృద్ధి 7.3 శాతం

- ఆర్‌బిఐ అంచనా

ముంబై: స్థూల విలువ జోడింపు (జివిఎ) ఆధారంగా లెక్కించే ఆర్థిక కార్యకలాపాల వేగం ఈ ఏడాది 7.3 శాతం వరకు ఉంటుందని ఆర్‌బిఐ అంచనా వేసింది. గత ఏడాది ఇది 6.6 శాతం ఉంది. ఈ ఏడాది ఆర్థిక రంగంలో రిస్కులు సమతూకం అయ్యాయని పేర్కొంది. కాగా ద్రవ్యోల్బణం ఈ ఏడాది ప్రథమార్థంలో 2 నుంచి 3.5 శాతం, ద్వితీయార్థంలో 3.5 నుంచి 4.5 శాతం మధ్యలో ఉంటుందని అంచనా వేసింది. పెట్టుబడుల పునరుద్ధరణ, తయారీ, వాణిజ్య రంగాల పునరుజ్జీవంతో 2017-18లో అంతర్జాతీయ వృద్ధిరేటు పుంజుకుంటుందని ఆర్‌బిఐ వార్షిక నివేదికలో తెలిపింది. దేశీయ ఆర్థిక రంగం స్థితిగతులు సానుకూలంగా ఉండడం కూడా ఈ ఏడాది ఆర్థిక కార్యకలాపాల జోరు పెరిగేందుకు దోహదపడే అంశమని పేర్కొంది.

ఆర్థిక రంగంలో నగదు సరఫరాను నిరంతరాయంగా పెంచుకుంటూ పోవడం వల్ల వినియోగదారుల విచక్షణాపూర్వకమైన వ్యయాలు పెరుగుతాయని అంచనా వేసింది. ప్రధానంగా నగదు లావాదేవీలు అధికంగా జరిగే రంగాల్లో ఇది మరింతగా ఉంటుందని తెలిపింది.

రూ. 9.8 కోట్ల బకాయిలు ఇప్పించిన ఇండస్ట్రియల్ కౌన్సిల్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలకు రావాల్సిన సుమారు రూ.9.8 కోట్లకు పైగా బకాయిలను ఇండస్ట్రియల్ ఫెసిలిటేషన్ కౌన్సిల్ ఇప్పించింది. ఈ పరిశ్రమల ఉత్పత్తులను వినియోగించుకుని బకాయిలు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్న సంస్థలపై ఫిర్యాదులు వచ్చాయి. రాష్ట్ర పరిశ్రమల శాఖ కమిషనర్ అహ్మద్ నదీం ఆధ్వర్యంలో ఏర్పాటైన ఇండస్ట్రియల్ ఫెసిలిటేషన్ కౌన్సిల్ వీటిని పరిశీలించి ప్రతివాదులు విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. తమకు బకాయిలు ఇప్పించాలని కోరూతూ 122 సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల యజమానులు ఫిర్యాదు చేశారు. ఇందులో సుమారు పది సంస్థలకు సంబంధించి దాదాపు రూ9.8 కోట్లకు పైగా బకాయిలు చెల్లించేందుకు ఆయా సంస్థల ప్రతినిధులు అంగీకారం తెలిపినట్టు కౌన్సిల్ కార్యదర్శి, పరిశ్రమల శాఖ అదనపు కమిషనర్ ఆర్‌బి దేవానంద్ తెలిపారు.

త్వరలో 'యాద్రో' ఆభరణాలు



- తిరుపతి వెంకన్న ప్రతిమలు తెచ్చే యోచన

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): పోర్సిలెయిన్‌తో లగ్జరీ హోమ్ డెకరేషన్ వస్తువులు తయారు చేసే స్పెయిన్ సంస్థ 'యాద్రో' నగల వ్యాపారంలోకి ప్రవేశిస్తోంది. కంపెనీ సిఇఒ నికిల్ లాంబా ఈ విషయం చెప్పారు. హిందూ దేవతా ప్రతిమల్లో భాగంగా త్వరలో తిరుపతి వేంకటేశ్వర స్వామి ప్రతిమలను కూడా తీసుకు వచ్చే ఆలోచన ఉందని ఆయన తెలిపారు. వీటిని కూడా పోర్సిలెయిన్‌తోనే తయారు చేస్తారు. వినాయక చవితి, దీపావళి పండగలను దృష్టిలో ఉంచుకుని స్పిరిట్ ఆఫ్ ఇండియా సీరిస్‌లో భాగంగా 1800 ప్రత్యేక వినాయక ప్రతిమలను తీసుకువచ్చినట్టు చెప్పారు. అత్యంత కళాత్మక నైపుణ్యంతో తయారు చేసిన వీటి ధర ఒక్కోటి రూ.4.5 లక్షలని తెలిపారు. యాద్రో తయారు చేసే అన్ని ప్రతిమలను సిలికా వంటి ఖనిజాలతో తయా రు చేసిన పోర్సిలెయిన్‌తో స్పెయిన్‌లో నిపుణులైన కళాకారులతో తయారు చేయిస్తోంది. ఒక్కో ప్రతిమ తయారీకి 6-12 నెలల సమయం పడుతుందని లాంబా చెప్పారు. హిందూ దేవతా ప్రతిమలకు అమెరికా, యూరప్ దేశాల్లోని ప్రవాస భారతీయుల నుంచి మంచి డిమాండ్ ఉన్నట్టు తెలిపారు. జపాన్, అమెరికా తర్వాత భారత్ తమకు అతిపెద్ద మార్కెట్ అన్నారు. స్పెయిన్‌లో తయారయ్యే ఈ ప్రతిమలను 120కిపైగా దేశాల్లో యాద్రో మార్కెట్ చేస్తోంది. లగ్జరీ హోమ్ డెకరేషన్ ప్రతిమల ధర రూ.3,900 నుంచి రూ.1.65 కోట్ల వరకు ఉంటుందని లాంబా తెలిపారు. కార్నివాల్ ఆఫ్ వెనిస్ పేరుతో తయారు చేసిన ఒక్కో ప్రతిమ ధర రూ.1.65 కోట్లని చెప్పారు.

సులభతర వ్యాపారంపై నీతి ఆయోగ్ సర్వేతో సంబంధం లేదు

- కేంద్ర ప్రభుత్వం స్పష్టీకరణ

న్యూఢిల్లీ (ఆంధ్రజ్యోతి): దేశంలో సులభతర వ్యాపారం నిర్వహించడంపై (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) నీతి ఆయోగ్ - ఐడిఎఫ్‌సి సంయుక్తంగా విడుదల చేసిన నివేదిక అధికారికమైనది కాదని, దానితో తమకు సంబంధం లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. సర్వే తప్పుల తడకగా ఉందని ఆక్షేపించింది. పరిశోధన కోసమే సర్వే అని నివేదికలో ఉందని, అందులో ఉన్న అంశాలు ప్రభుత్వం, నీతి ఆయోగ్ అభిప్రాయాలు కావని తెలిపింది. సర్వేకు ప్రపంచ బ్యాంకు అనుసరించిన పద్ధతి, ప్రస్తుత సర్వేకు ఐడిఎఫ్‌సి సంస్థ అనుసరించిన పద్ధతిలో చాలా తేడా ఉందని పేర్కొంది.

సర్వేలో ఏముందంటే..

సులభతర వ్యాపారంపై ప్రపంచ బ్యాంకు సర్వే నివేదికకు, నీతి ఆయోగ్ నివేదికకు మధ్య చాలా వ్యత్యాసం ఉంది. దేశంలో వ్యాపార సంస్థ ఏర్పాటు చేయడానికి 26 రోజుల సమయం పడుతుందని 2016 ప్రపంచ బ్యాంకు నివేదిక తేల్చగా... తాజా సర్వే 118 రోజులని పేర్కొంది. భూకేటాయింపునకు సగటున 156 రోజుల సమయం తీసుకుంటున్నారని నివేదికలో ఉంది. అంతేకాకుండా సులభతర వ్యాపారం చేయడంలో తమిళనాడు ముందుందని, ఆ రాష్ట్రంలో కంపెనీ ఏర్పాటుకు 63 రోజులు పడుతోందని వివరించింది. ఆయా రాష్ట్రాల్లో నిర్మాణ, పర్యావరణ, అటవీ అనుమతులకు చాలా రోజులు వేచి ఉండాల్సి వస్తుందని తెలిపింది. అయితే ప్రపంచ బ్యాంకు సర్వే ఫలితాలకు, ఈ సంస్థ సర్వే ఫలితాలకు భారీగా వ్యత్యాసం ఉండడంతో కేంద్ర ప్రభుత్వం దీన్ని వ్యతిరేకించింది.

నీతి ఆయోగ్ కూడా సర్వేలో భాగస్వామిగా ఉంది కాబట్టి ఇది ప్రభుత్వ సర్వే అన్న సంకేతాలు వెళ్తాయన్న నేపథ్యంలో సర్వేతో ప్రభుత్వానికి, నీతి ఆయోగ్‌కు సంబంధం లేదని స్పష్టం చేసింది.

కోల్ ఇండియా తాత్కాలిక సిఎండిగా మిశ్రా

- నేడు సుతీర్థ భట్టాచార్య పదవీ విరమణ

మంచిర్యాల (ఆంధ్రజ్యోతి): కోల్ ఇండియా చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సుతీర్థ భట్టాచార్య గురువారంనాడు పదవీ విరమణ చేయనున్నారు. ఆయన స్థానంలో ప్రస్తుతం కంపెనీ డైరెక్టర్ పర్సనల్‌గా ఉన్న ఆర్‌ఆర్ మిశ్రాకు అదనపు బాధ్యతలను అప్పగించనున్నారు. ఈ మేరకు ఆదేశాలు వెలువడ్డాయి. కొత్త చైర్మన్ నియామకం జరిగే వరకు మిశ్రా కొనసాగుతారు. భట్టాచార్య రాష్ట్రంలో కీలకమైన శాఖల్లో కార్యదర్శి, ప్రిన్సిపల్ కార్యదర్శి హోదాల్లో పనిచేశారు. సింగరేణి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా, విద్యుత్ శాఖ, ఇరిగేషన్ విభాగం, నిజాం షుగర్స్‌లోనూ పనిచేశారు. కాగా భట్టాచార్య పదవీ విరమణ కాకముందే బొగ్గుగని కార్మికుల పదోవేతన ఒప్పందం జరగాలని పట్టుదలతో ఉన్నారు.

టీచర్ పోస్టులు భర్తీ చేస్తారా.. పార్టీ పెట్టమంటారా..?



- **ప్రభుత్వానికి ఆర్.కృష్ణయ్య సవాల్**

చాదర్‌ఘాట్/హైదరాబాద్: రాష్ట్రం ఏర్పడక ముందు 25 వేల టీచర్ పోస్టులు భర్తీ చేస్తామన్న కేసీఆర్ సర్కారు ఇదిగో డీఎస్సీ, అదిగో డీఎస్సీ అంటూ మూడున్నరేళ్లగా జాప్యం చేస్తోందని ఎల్బీ నగర్ ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్య విమర్శించారు. 40 వేల టీచర్ పోస్టుల భర్తీకి తక్షణమే నోటిఫికేషన్ జారీ చేస్తారా..? లేకుంటే ఈ పోస్టుల కోసం పోటీ పడుతున్న 5 లక్షల మంది నిరుద్యోగులతో పార్టీ పెట్టి ఎన్నికల్లో పోటీ చేయాలా? అని ప్రభుత్వానికి సవాల్ విసిరారు. టీచర్ పోస్టుల భర్తీకి సెప్టెంబరు 12లోపు నోటిఫికేషన్ జారీ చేయకుంటే రాష్ట్ర వ్యాప్త ఆందోళన చేపట్టాలని బీఎడ్, డీఎడ్, భాషా పండితుల సమావేశం నిర్ణయించింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కృష్ణయ్య మాట్లాడుతూ.. 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని రాష్ట్రం ఏర్పడక ముందు చెప్పిన కేసీఆర్.. మొదటి అసెంబ్లీ సమావేశంలో తాను నిలదీస్తే 1.07 ఉద్యోగాలన్నారని మాట మార్చారన్నారు. 40 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయాలంటే 25 వేల పోస్టులే అన్నారని, చివరికి 8,977 టీచర్ పోస్టులకే నోటిఫికేషన్ ఇస్తామంటున్నారన్నారు. పైగా డీఎస్సీని మూడున్నర ఏళ్లలో 24 సార్లు వాయిదా వేశారన్నారు.

'డేరా' భూమిలో ఎర్ర జెండా..!



చిట్యాల: నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెల్మినేడులో డేరా స్వచ్ఛ సౌదా ఆశ్రమంలోని 9.29 ఎకరాల అసైన్డ్ భూముల్లో జి.నాగయ్య ఆధ్వర్యంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బుధవారం ఎర్ర జెండాలు పాతారు. ఆశ్రమంలోని డేరాబాబా ఫ్లెక్సీలను, పాటల సీడీలను దహనం చేశారు. ఈ భూములను పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. తర్వాత తహసీల్దార్ విశాలాక్షి ఆధ్వర్యంలో ప్రభుత్వ అధికారులు వచ్చి ఇది ప్రభుత్వ భూమి అంటూ బోర్డు పెట్టారు.

ప్రాజెక్టులకు జలకళ

- **పెరుగుతున్న ఎస్సారెస్పీ నీటిమట్టం**
- **జూరాలకు వరద**
- **శ్రీశైలం పైనా చిగురిస్తున్న ఆశలు**



కడెం ప్రాజెక్టు వరద గేటు ఎత్తడంతో గోదావరిలోకి వెళుతున్న నీరు

ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్: ఇటీవల కురిసిన వర్షాలకు పలుప్రాజెక్టులు జలకళ సంతరించుకుంటున్నాయి. పొరుగు రాష్ట్రాల్లో కురిసిన వర్షాలతో వరద కొనసాగుతోంది. శ్రీరాంసాగర్ నీటిమట్టం క్రమేపీ పెరుగుతోంది. గడిచిన రెండు రోజులుగా 30వేల క్యూసెక్కులకు పైగా వరదనీరు వచ్చి చేరుతోంది. ఇదే రీతిలో వరద వస్తే నీటి నిల్వ 40 టీఎంసీలు దాటుతుందని ఎస్సారెస్పీ అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో ఖరీఫ్‌లో నీటివిడుదల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.ఎస్సారెస్పీ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు కాగా ప్రస్తుతం 1072.40 టీఎంసీలకు చేరింది. ప్రాజెక్టులో 90 టీఎంసీల కెపాసిటీ ఉండగా ప్రస్తుతం 34 టీఎంసీలకు చేరింది. నిర్మల్ జిల్లా కడెం ప్రాజెక్టులోకి వరద నీరు రాక కొనసాగుతోంది. 7911 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరడంతో ఒక గేటు ఎత్తి 10,800 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలారు. ఎగువ భాగాన కురిసిన భారీ వర్షాలతో భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం క్రమేపీ పెరుగుతోంది. నీటిమట్టం బుధవారం సాయంత్రానికి 25 అడుగులకు చేరుకుంది. మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలంలోని నీల్వాయి ప్రాజెక్టు మత్తడి దూకుతుండగా, గొర్లపల్లి వాగుపై నిర్మించిన తాత్కాలిక వంతెన మునిగిపోయింది. కృష్ణానది పైనున్న ప్రాజెక్టుల్లోకి భారీగా వరద నీరు చేరుతోంది. ఆల్మట్టి నుంచి 30 వేల క్యూసెక్కులు విడుదల చేశారు. ఆ నీరు నారాయణపూర్ అక్కడి నుంచి జూరాల చేరుతుంది. జూరాల ప్రాజెక్టు నీటి నిల్వసామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా, 6.187 టీఎంసీల నీరు ఉన్నది. మహారాష్ట్రలోని భీమా నదిపై ఉన్న ఉజ్జయినిలోకి భారీగా వరదనీరు చేరడంతో గేట్లు ఎత్తివేశారు. ఉజ్జయిని నుంచి 40 వేల క్యూసెక్కులు విడుదల చేసినట్లు ఇరిగేషన్ సీఈ ఖగేందర్ తెలిపారు. 45 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉజ్జయిని నుంచి జూరాలకు నీరు చేరడానికి 24 గంటల సమయం పట్టే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఆ నీటిని వచ్చినట్లుగా శ్రీశైలానికి వదలాల్సిన పరిస్థితి ఉంటుంది. రెండు రోజుల్లోగా జూరాలకు లక్ష క్యూసెక్కుల వరద వచ్చే అవకాశం ఉంది.

తెలుగు రాష్ట్రాలు అప్రమత్తంగా ఉండాలి

- **భారీ వర్షాల నేపథ్యంలో కేంద్రం హెచ్చరిక**

న్యూఢిల్లీ, ఆగస్టు30(ఆంధ్రజ్యోతి): ఎగువ రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గోదావరి, కృష్ణ నదుల్లో వరద నీరు పోటెత్తే అవకాశముందని రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తంగా ఉండాలని కేంద్ర జలవనరుల శాఖ హెచ్చరించింది. గోదావరి బేసిన్‌లో మహారాష్ట్రలోని పలు జిల్లాల్లో వర్షాలు పడుతుండడంతోపాటు ఛత్తీస్‌గఢ్‌లోని ఇంద్రావతి నదికి వరద పోటెత్తుతున్న నేపథ్యంలో తెలంగాణలోని నిజామాబాద్, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి జిల్లాలు, ఏపీలోని తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలపై ప్రభావం ఉండవచ్చని పేర్కొంది. కృష్ణా బేసిన్‌లో మహారాష్ట్రలోని పలు జిల్లాల్లో వర్షాలు ఎక్కువ కురుస్తున్నాయని, ఈ ప్రభావం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌పై ఉంటుందని వెల్లడించింది. ఈ మేరకు రెండు ప్రభుత్వాలు అప్రమత్తమై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

తిండి, నీళ్లు కరువై జీవచ్ఛవంలా మృత్యువుతో పోరాడుతున్న అనాథ వృద్ధురాలు



గార్ల, ఆగస్టు 30: భర్త ఎప్పుడో చనిపోయాడు.. అవసాన దశలో ఇద్దరు పిల్లలైనా ఆదుకుంటారనుకుంటే వారినీ దేవుడు తీసుకెళ్లిపోయాడు. దీంతో నా అనేవారు లేని స్థితిలో ఊరు చివర ఓ పాడుబడిన ఇంట్లో రెండునెలలుగా తీవ్ర అనారోగ్య సమస్యలతో నానా అవస్థలు. వంటచేసుకునే శక్తి లేక.. పట్టెడన్నం పెట్టేవారూ లేక.. కనీసం ఎలావున్నావమ్మా అంటూ మాటమాత్రంగా పలకించేవారూ లేక జీవచ్ఛవంలా పడివున్న వైనం!! మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం మర్రిగూడెం పంచాయతీ మూడుతండాలోని వృద్ధురాలు జర్పుల భారతి దీన గాథ ఇది! ఆమెకు భర్త ఇద్దరు సంతానం. వారంతా చనిపోవడంతో భారతి ఒంటరిగానే జీవిస్తోంది. రెండు నెలలుగా భారతి తీవ్ర అనారోగ్యంతో చిక్కిశల్యమైంది. కనీసం ఆస్పత్రిలో చేర్పించే వారు లేక పాడుబడిన ఇంట్లోనే కటిక నేలపై పడిఉంది. ఊరి చివర ఇల్లు కావడంతో ఆవైపు ఎవరూ వెళ్లడం లేదు. కొన్నాళ్లుగా తిండి, నీళ్లు లేక భారతి ఆరోగ్యం పూర్తిగా క్షీణించి అస్థిపంజరంలా మారింది. నోట మాట కూడ రావడంలేదు. కనీసం గ్రామాల్లో తిరిగే ఏఎన్ఎంలు కూడా పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి వృద్ధురాలిని ఆస్పత్రికి తరలించి వైద్యం అందించాలని ప్రజలు కోరుతున్నారు.

టీచర్లు మందలించారని.. విద్యార్థిని ఆత్మహత్య

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 30: జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కోజన్ కొత్తూర్‌కు చెందిన తోట సాత్విక(14) అలియాస్ సోని అనే 10వ విద్యార్థిని టీచర్లు మందలించారని బుధవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మధ్యాహ్నం ముగ్గురు ఉపాధ్యాయులు ప్రేమ వ్యవహారంపై విద్యార్థినిని మందలించినట్లు సమాచారం. మనస్తాపం చెంది సాయంత్రం ఇంటికి వచ్చి ఉరేసుకుంది.

తిరుమలలో వీఐపీలకు బ్రేక్!

- **ప్రొటోకాల్ మేరకే ఎల్-1 దర్శనాలు**
- **టీటీడీ నిర్ణయానికి సీఎం అనుమతి**
- **అదనంగా 9వేల మందికి దర్శనం**

తిరుమల: తిరుమలేశుడి దర్శనం కోసం వీఐపీల సిఫారసులకు దాదాపుగా బ్రేకు పడింది. వీఐపీలకు తప్ప.. వారి సిఫారసులకు ప్రాధాన్యం తగ్గిస్తూ టీటీడీ రెండు నెలలుగా చేస్తున్న ప్రయత్నాలకు సీఎం ఆమోద ముద్ర లభించడంతో బ్రేక్ దర్శనాల్లో మరింత కోతకు రంగం సిద్ధమైంది. టీటీడీ ఈవోగా సాంబశివరావు ఉన్న సమయంలో జేఈవో శ్రీనివాసరాజు వీఐపీ బ్రేక్ దర్శనాలను ఎల్(లిస్ట్)1, ఎల్2, ఎల్3 గా విభజించారు. కానీ ప్రొటోకాల్ వీఐపీలతో పాటూ ప్రజాప్రతినిధులు కూడా తాము సిఫారసు చేసేవారికందరికీ ఎల్1 కేటాయించాలని ఒత్తిడి తెచ్చారు. రెండు నెలల కింద మనవడి అక్షరాభ్యాసం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుమలకు వచ్చినపుడు టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, జేఈవో శ్రీనివాసరాజు ఈ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆయన అనుమతితో ప్రొటోకాల్ వర్తించే వీఐపీలకు మాత్రమే ఎల్1 బ్రేక్ దర్శనం కేటాయించడం మొదలుపెట్టారు. ఇటీవలి దాకా ఎల్1 కింద దాదాపు 500 నుంచి 1000 మందిని అనుమతించేవారు. ప్రతి 10 మందికీ కులశేఖరపడిలో హారతి, శఠారి ఇస్తే కనీసం రెండు నిమిషాలు పడుతుంది. గంట నుంచి గంటన్నర సమయం ఎల్1కే కేటాయించాల్సి వచ్చేది. ప్రొటోకాల్ వర్తించే వారికి మాత్రమే ఎల్1 ను పరిమితం చేయడంతో ఈ సంఖ్య రోజుకు 100-150కి తగ్గిపోయింది. 20 నిమిషాల నుంచి అరగంటలోపే వీరందరికీ సంతృప్తికరమైన దర్శనం కల్పించగలుగుతున్నారు. ఇక ఎల్2, ఎల్3 కింద సిఫారసు లేఖలతో వచ్చే ప్రముఖులను, ఇతరులను అనుమతిస్తున్నారు. ఈ సంఖ్యను కూడా పరిమితం చేయడంతో ప్రస్తుతం 1000కి మించడంలేదు. ఈ మార్పులతో సాధారణ భక్తులకు అదనంగా రెండు గంటలకు పైగా దర్శనం కల్పించే అవకాశం పెరిగింది. అంటే దాదాపు తొమ్మిది వేల మంది అదనంగా దర్శనం చేసుకుంటున్నారు. భక్తుల్లో సంతృప్తి పెరగడంతో ప్రభుత్వం కూడా ఈ మార్పులకు పచ్చ జెండా ఊపింది. మంచి ఫలితాలివ్వడంతో అధికారులూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వరంగల్ ఎన్ఐటీలో డ్రగ్స్ కలకలం

- **విద్యార్థుల వద్ద మాదకద్రవ్యాలు లభ్యం**



నిందితులతో డిప్యూటీ కమిషనర్

వరంగల్ అర్బన్ క్రైం, ఆగస్టు 30: వరంగల్ ఎన్ఐటీలో డ్రగ్స్ కలకలం రేగింది. నిట్‌లో ఇద్దరి వద్ద ఎల్ఎస్డీ డ్రగ్స్ లభించాయి. బుధవారం వారిని అరెస్టు చేయగా.. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సురేష్ రాథోడ్ విలేకరులకు వివరాలు వెల్లడించారు. హైదరాబాద్‌కు చెందిన జి.ద్విజి, వై.రమేష్ వరంగల్ ఎన్ఐటీలో 2012లో చేరారు. కొన్ని సబ్జెక్టులు మిగిలిపోవడంతో నిట్‌లోనే వేర్వేరు గదుల్లో ఉంటూ చదువుకుంటున్నారు. కాగా, ద్విజి.. డార్క్ వె బ్‌సైట్ ద్వారా మాదకద్రవ్యాలను ఆర్డర్ చేసి తెప్పించుకునేవాడు. కొరియర్‌లో వచ్చిన మత్తుపదార్థాలను హైదరాబాద్‌లో తీసుకుని తన స్నేహితుడు రమేష్‌కు ఇచ్చేవాడు. అతను స్థానిక విద్యార్థులకు, బయటి వ్యక్తులకు విక్రయించేవాడు. సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్, ఎక్సైజ్ సిబ్బంది తనిఖీలు చేపట్టారు. వారినుంచి ఎల్ఎస్డీ డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరినీ అదుపులోకి తీసుకుని విచారించగా ఇటీవల ఐదుగురు విద్యార్థులకు డ్రగ్స్‌ను విక్రయించినట్టు తెలిపారని డీసీ సురేష్ రాథోడ్ వెల్లడించారు. లోతుగా దర్యాప్తు చేస్తున్నామని, దోషులు ఎవరైనా వదిలేది లేదని హెచ్చరించారు. పట్టుకున్న మత్తుపదార్థాల విలువ రూ.15వేల వరకు ఉంటుందని చెప్పారు.

రైలు కింద పడి కానిస్టేబుల్ ఆత్మహత్య



మిర్యాలగూడ అర్బన్, ఆగస్టు 30 : మిర్యాలగూడ పట్టణంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న తంగెళ్లపల్లి శ్రీనివాసాచారి (49) అనే పోలీస్ కానిస్టేబుల్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం వాటర్ ట్యాంక్ తండా వద్ద ఈ ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. మంగళవారం విధులకు హాజరయ్యేందుకు ఇంటి నుంచి వెళ్లిన శ్రీనివాసాచారి ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు బంధువులు చెబుతున్నారు. సంఘటన స్థలం వద్ద లభించిన సూసైడ్ నోట్‌లో తన మానసిక పరిస్థితి, అనారోగ్య సమస్యలే ఆత్మహత్యకు కారణమని రాశాడు.

ఆగస్టులోనూ వర్షాభావమే

- **21% తక్కువ వర్షపాతం.. ఖరీఫ్‌లో సాగు విస్తీర్ణం 86%**
- **రికార్డు స్థాయిలో పత్తి సాగు.. వ్యవసాయశాఖ తాజా నివేదిక**

హైదరాబాద్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆగస్టు నెలలోనూ వర్షాభావం కొనసాగింది. వ్యవసాయ శాఖ బుధవారం విడుదల చేసిన నివేదిక ప్రకారం ఈ నెలలో వర్షపాతం సాధారణం కంటే 21% తక్కువ నమోదైంది. వ్యవసాయ సీజన్ ప్రారంభ మాసం జూన్‌లో 47% అధికంగా వర్షాలు కురిశాయి. జూలై నెలలో సాధారణం కంటే 40% తక్కువ వర్షాలు పడ్డాయి. ఈ నెల రెండో వారం వరకూ రాష్ట్రంలో వర్షాభావం కొనసాగడంతో రాష్ట్రవ్యాప్తంగా అనేక చోట్ల పంటలు వాడిపోవడం ప్రారంభించాయి. అయితే, మూడో వారం నుంచి తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, అక్కడక్కడా భారీ వర్షాలూ కురవడంతో తేరుకున్నాయి. అయినా సాధారణ వర్షపాతం మాత్రం నమోదు కాలేదు. ఈ నెల 30 నాటికి 162.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 21% తక్కువగా 128.9 మిల్లీ మీటర్లే నమోదైంది. కుమరంభీం, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల్, పెద్దపల్లి, రాజన్న, మెదక్ జిల్లాల్లో వర్షాభావం కొనసాగుతోంది.

11% ఎక్కువ సాగైన పత్తి..

సాగు విస్తీర్ణంలో పత్తి పంట రికార్డులు సృష్టిస్తోంది. బుధవారం నాటికి రాష్ట్రంలో రైతులు అన్ని పంటలు కలిపి 37.30 లక్షల హెక్టార్లలో సాగు చేయగా ఒక్క పత్తినే 50% అంటే 18.61 లక్షల హెక్టార్లలో సాగు చేశారు. 2012-13లో 18.13 లక్షల హెక్టార్లలో పత్తిని సాగు చేసిన రైతులు ఈసారి ఆ రికార్డును అధిగమించారు. కాగా.. ఖరీఫ్ సాధారణ సాగులో 86% మాత్రమే వివిధ పంటలు సాగయ్యాయి. పత్తి మాత్రం 11% ఎక్కువగా సాగైంది. వరి సాగులో లోటు లేదు.

'సీపీఎస్' ధర్నాను విజయవంతం చేయండి

- **ఉపాధ్యాయ, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కమలాకర్ పిలుపు**
- **రేపు సామూహిక సెలవు : ఉద్యోగ సంఘాలు**
- **ఉద్యోగుల ఆందోళనకు మద్దతు : తమ్మినేని**



కమలాకర్

బోడుప్పల్/నాంపల్లి/హైదరాబాద్:సీపీఎస్(కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం)ను రద్దు చేయాలన్న డిమాండ్‌తో చేపట్టనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కమలాకర్ పిలుపునిచ్చారు. ఫీర్జాదిగూడలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సీపీఎస్ విధానం ఉద్యోగుల పాలిట శాపంగా మారిందన్నారు. ఈ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్న డిమాండ్‌తో ఉప్పల్ బస్‌డిపో సమీపంలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ వద్ద శుక్రవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు ధర్నా చేస్తామన్నారు. తెలంగాణలోని 31 జిల్లాల నుంచి ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలన్నారు. కాగా, ప్రపంచ బ్యాంక్ ఒత్తిళ్లకు తలొగ్గి 2004లో కేంద్ర ప్రభుత్వం సీపీఎస్ విధానం తీసుకొచ్చిందని, దానిని రద్దు చేయాలన్న డిమాండ్‌తో టీఎన్జీవో సంఘం చేస్తున్న పోరాటం అద్వితీయమని రాష్ట్రశాసనమండలి చైర్మన్ కె.స్వామిగౌడ్ తెలిపారు. నాంపల్లిలోని తెలంగాణ ఉద్యోగభవన్‌లో టీఎన్జీవో కేంద్ర సంఘం ఉపాధ్యక్షురాలు శైలజాదేవి ఆత్మీయ అభినందన కార్యక్రమంలో ఆయనమాట్లాడారు. కార్యక్రమంలో టీఎన్జీవో కేంద్రసంఘం అధ్యక్షుడు కె.రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.రాజేందర్, జి.దేవీప్రసాదరావు పాల్గొన్నారు. కాగా, ఉద్యోగులకు శాపంగా మారిన సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు సెప్టెంబర్ 1న సామూహిక సెలవు పెట్టి చేపట్టనున్న ఆందోళనకు తమ పార్టీ మద్దతు ప్రకటిస్తోందన్నారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఉద్యోగుల పాలిట టెన్షన్ స్కీమ్‌గా మారిందని ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్రంలోని లక్షా 20 వేల ఉద్యోగులకు దీని వల్ల అన్యాయం జరుగుతోందన్నారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసే అధికారం రాష్ట్రాలకు ఉందని, వెంటనే సీపీఎస్ విధానం నుంచి వైదొలగాలని డిమాండ్ చేశారు. అలాగే, సీపీఎస్ రద్దు డిమాండ్‌తో సెప్టెంబర్ 1న సామూహిక సెలవు పెట్టినట్లు పీఆర్‌టీయూ టీఎస్ అధ్యక్షుడు పి.సరోత్తంరెడ్డి, ప్రధాన కార్యదర్శి చెన్నకేశవరెడ్డి తెలిపారు. సీపీఎస్ రద్దు ఉద్యమానికి మద్దతు ఇస్తున్నట్లు తెలంగాణ గవర్నమెంట్ కాలేజీ గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సంజీవయ్య, ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి వెల్లడించారు.

పీఎస్‌యూల్లో క్రీమీలేయర్!

- **కొన్ని పదవుల్లోని వారికి ఓబీసీ రిజర్వేషన్ వర్తించదు**
- **కేంద్ర కేబినెట్ నిర్ణయం...చిన్న ఉద్యోగులకు ఊరట**

న్యూఢిల్లీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఓబీసీ రిజర్వేషన్లలో క్రీమీలేయర్ విధానాన్ని ప్రభుత్వరంగ సంస్థలకూ(పీఎస్‌యూలు) వర్తింపజేసింది. ప్రభుత్వ ఉద్యోగాల్లో క్రీమీలేయర్ వర్తించే గ్రూప్ ఏ, గ్రూప్ బీ పోస్టులకు సమానమైన హోదాగల పీఎస్‌యూ ఉద్యోగాలను గుర్తించింది. 24 ఏళ్లుగా ఇలాంటి వర్గీకరణ చేయకపోవడం వల్లే పీఎస్‌యూ ఉద్యోగాలకు క్రీమీలేయర్ వర్తించదంటూ రాజ్యాంగ పదవుల్లో, ఉన్నతోద్యోగాల్లో ఉన్నవారి పిల్లలు ఓబీసీ రిజర్వేషన్లను అడ్డం పెట్టుకొని ప్రభుత్వరంగ సంస్థల్లో కీలక పోస్టులు కొట్టేస్తున్నారు. పీఎస్‌యూల్లో ఉన్నత పదవుల్లోని వారు కూడా తాము క్రీమీలేయర్ కేటగిరీ కిందకు రాబోమంటూ తమ పిల్లలకు పీఎస్‌యూల్లో, ప్రభుత్వరంగ ఆర్థిక సంస్థల్లో ఓబీసీ కోటా కింద ఉద్యోగాలను ఇప్పించుకుంటున్నారు. దాంతో ఓబీసీల్లోని కింది వర్గాల వారికి తీరని అన్యాయం జరుగుతోంది. ఈ నేపథ్యంలో పీఎస్‌యూల్లో ఎవరు క్రీమీలేయర్ కిందకు వస్తారో వివరిస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని బుధవారం కేంద్ర క్యాబినెట్ సంచలన నిర్ణయం తీసుకుంది. దీంతో చిన్న ఉద్యోగుల పిల్లలకు పీఎస్‌యూల్లో మరిన్ని ఉద్యోగాలు లభించే అవకాశాలు మెరుగయ్యాయి. పీఎస్‌యూలతో పాటు బ్యాంకింగ్, ఆర్థికరంగ సంస్థలు, బీమా రంగాలలో ఓబీసీ ఉద్యోగాలకు క్రీమీలేయర్‌ను వర్తింపజేయాలని క్యాబినెట్ తీర్మానించినట్లు ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ విలేకరులకు వెల్లడించారు. పీఎస్‌యూల్లో ఏఏ పోస్టులు గ్రూప్ ఏ, గ్రూప్ బి పోస్టులతో సమానంగా ఉంటాయో కూడా కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇటీవలే క్రీమీలేయర్ పరిధిని రూ.6 లక్షల నుంచి రూ.8లక్షలకు పెంచారు. ఓబీసీ వర్గీకరణ కోసం ప్రత్యేకంగా కమిషన్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఓబీసీ కమిషన్‌కు రాజ్యాంగ హోదా కల్పించే బిల్లును పార్లమెంటులో పెట్టారు. ఓబీసీ క్రీమీలేయర్ అంశాన్ని తేల్చాలని 1992లో సుప్రీంకోర్టు కేంద్రాన్ని ఆదేశించింది. 1993లో కేంద్రం నియమించిన ప్రత్యేక కమిటీ పీఎస్‌యూల్లో ఏయే హోదాల వారిని క్రీమీలేయర్ పరిధిలోకి చేర్చాలో ప్రభుత్వమే తేల్చాలని చెప్పింది. 24 ఏళ్లపాటు నాన్చిన కేంద్ర ప్రభుత్వం బుధవారం నిర్ణయం తీసుకుంది.

వక్ఫ్ బోర్డులో యూఎస్ కాన్సులేట్ బృందం

- **ధ్రువపత్రాల జారీ విధానాన్ని పరిశీలించేందుకే..**

హైదరాబాద్, ఆగస్టు30(ఆంధ్రజ్యోతి): ముస్లిం వివాహాల రికార్డులను భద్రపరిచే విధానంతో పాటు ధ్రువ ప్రతాల జారీ ప్రక్రియను పరిశీలించేందుకు అమెరికా కాన్సులేట్ జనరల్ కార్యాలయ అధికారులు బుధవారం వక్ఫ్‌బోర్డును సందర్శించారు. ఇటీవలి కాలంలో అమెరికా వీసాల కోసం ముస్లిం యువతీయువకులు వక్ఫ్‌బోర్డు జారీ చేసిన ధ్రువపత్రాలను సమర్పిస్తున్నారని హైదరాబాద్‌లో అమెరికా కాన్సులేట్ ముఖ్య అధికారి డొనాల్డ్ ములిగన్ తెలిపారు. అయితే కొంతమంది బోగస్ పత్రాలను సమర్పిస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, అందుకే వీటి జారీ విధానాన్ని తెలుసుకునేందుకు తమ బృందంతో వక్ఫ్ బోర్డు కార్యాలయానికి వచ్చామని తెలిపారు. జిల్లాల్లో గుర్తింపు పొందిన ఖాజీలు.. ముస్లిం యువతీ-యువకుల పెళ్లికి సంబంధించిన సమగ్ర వివరాలతో పత్రాలను జారీ చేస్తారని తెలంగాణ వక్ఫ్ బోర్డు చైర్మన్ మహ్మద్ సలీం వారికి వివరించారు.

పదవీ విరమణ ప్రయోజనాలు పెంచండి

- **మంత్రి తుమ్మలకు అంగన్‌వాడీ సంఘం వినతి**

హైదరాబాద్, ఆగస్టు30 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు పదవీ విరమణ ప్రయోజనాలు పెంచాలని రాష్ట్ర అంగన్‌వాడీ సంఘం నాయకులు మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావును కోరారు. ఈ విషయమై వారు బుధవారం మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఉద్యోగ విరమణ సమయంలో టీచర్లకు రూ.2లక్షలు, ఆయాలకు రూ.లక్ష అందేలా చూడాలని విన్నవించారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌తో చర్చించి సమస్యను పరిష్కరిస్తానని మంత్రి తుమ్మల హామీ ఇచ్చినట్లు అంగన్‌వాడీ రాష్ట్ర ఇన్‌చార్జ్ నల్లా భారతి తెలిపారు.

వచ్చే నెలలో నేషనల్ ఆయిల్‌సీడ్స్ కిసాన్ మేళా

హైదరాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ సీడ్స్ రిసెర్చ్(ఐసీఏఆర్) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 10, 11 తేదీల్లో నేషనల్ ఆయిల్ సీడ్స్ కిసాన్ మేళా(ఎన్ఓకేఎం) నిర్వహించనున్నట్లు ఐసీఏఆర్ డైరెక్టర్ ఎ.విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. రాజేంద్రనగర్‌లోని ఐసీఏఆర్ ప్రధాన క్యాంపస్‌లో ఈ మేళా జరుగుతుందని పేర్కొన్నారు. రైతులకు మేలు చేకూర్చేందుకు నిర్వహిస్తున్న మేళాలో ఎన్జీవోలు, ట్రేడర్లు, విత్తన సంస్థలు, డీలర్లు, వ్యవసాయాధికారులు, సైంటిస్టులు పాల్గొంటారని వివరించారు.

28 మంది ఎక్సైజ్ ఎస్సైలకు పదోన్నతులు

హైదరాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని 28 మంది ఎక్సైజ్ ఎస్సైలకు ఇన్‌స్పెక్టర్లుగా ప్రభుత్వం పదోన్నతులు కల్పించింది. ఆరో జోన్‌లో 23 మంది, ఐదో జోన్‌లో ఐదుగురు ఎస్సైలకు ఈ పదోన్నతులు కల్పించారు. ఈమేరకు బుధవారం ఎక్సైజ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

సంపూర్ణ యుద్ధసన్నద్ధత!

- **2019 డిసెంబరు 31కల్లా సైన్యం ఆధునికీకరణ: జైట్లీ**

న్యూఢిల్లీ, ఆగస్టు 30: భారత సైన్యంలో పెద్దఎత్తున సంస్కరణలు తెచ్చేందుకు కేంద్రప్రభుత్వం సమాయత్తమైంది. పూర్తిస్థాయిలో యుద్ధసన్నద్ధతే లక్ష్యంగా 2019 డిసెంబరు 31కల్లా సైనిక బలగాల ఆధునికీకరణను పూర్తిచేయాలని, ఉన్న వనరులన్నిటినీ సంపూర్ణంగా సద్వినియోగం చేసుకోవాలని నిర్ణయించింది. సైనికేతర విధుల్లో ఉన్న 57 వేల మంది సైనికులు, అధికారులు, ఇతర ర్యాంకులవారినీ తిరిగి సైనిక విధుల్లో మోహరించనున్నట్లు ప్రకటించింది. సైనిక బలగాల్లో అగ్రస్థాయి నుంచి దిగువ స్థాయి వరకు యుద్ధ సన్నద్ధత పెంచడం, రక్షణ వ్యయాన్ని (టూత్ టు టెయిల్ నిష్పత్తిలో) సమతూకంతో నిర్వహించేందుకు రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ డీబీ షెకాత్కర్ నేతృత్వంలో నిరుడు మే నెలలో నియమించిన కమిటీ గత డిసెంబరులో తన నివేదిక సమర్పించింది. సంస్థాగత మార్పులకు సంబంధించి 99 సిఫారసులు చేసింది. ఆర్మీతో విస్తృత సంప్రదింపుల అనంతరం వాటిలో 65 సిఫారసులను రక్షణ శాఖ ఆమోదించిందని రక్షణ-ఆర్థిక శాఖల మంత్రి అరుణ్ జైట్లీ బుధవారమిక్కడ విలేకరులకు తెలిపారు. స్వాతంత్ర్యానంతరం తొలిసారి ఆర్మీలో భారీ స్థాయిలో సంస్కరణల ప్రక్రియ ప్రారంభమైందని చెప్పారు. దశలవారీగా వీటిని చేపడతామని తెలిపారు. బుధవారం నాటి కేబినెట్ భేటీలో.. సంస్కరణల నిర్ణయాన్ని తెలియజేశామన్నారు.

టూత్ అండ్ టెయిల్ రేషియో అంటే..

యుద్ధరంగంలో ఉండే సైనికుడిని టూత్(పన్ను)గా.. అతడికి చేసే సరఫరాలను, సహాయ సిబ్బందిని 'టెయిల్ (తోక)'గా సైనిక పరిభాషలో పేర్కొంటారు. సంస్కరణల తొలిదశలో 57 వేల ఆఫీసర్, జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్లు, ఇతర ర్యాంకుల అధికారులు, సివిల్ సిబ్బందిని పునర్వ్యవస్థీకరిస్తారు. 39 సైనిక వ్యవసాయ క్షేత్రాల మూసివేత, సిగ్నల్స్ ఎస్టాబ్లిష్‌మెంట్లను పూర్తిస్థాయిలో వినియోగించుకోవడం, శాంతియుత ప్రదేశాల్లో ఆర్మీ పోస్టల్ కార్యాలయాల ఏర్పాటు, మౌలిక వర్క్‌షాపుల పునర్వ్యవస్థీకరణ.. తొలి దశ సంస్కరణల్లో భాగంగా ఉంటాయని రక్షణ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది.

ప్రో కబడ్డీలో నేటి మ్యాచ్‌లు

టైటాన్స్ X తమిళ్ తలైవాస్
రాత్రి 8.గం

యూ ముంబా X జైపూర్
రాత్రి 9.గం



'బెటర్ లక్ నెక్ట్స్ టైమ్'!

● పీవీ సింధుకు కేసీఆర్ సత్కారం ● ప్రత్యేక కానుకలు అందించిన మంత్రి కేటీఆర్



హైదరాబాద్, (ఆంధ్రజ్యోతి): ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో రజతం సాధించిన పీవీ సింధును ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అభినందించారు. ప్రగతి భవన్‌లో బుధవారం తనను కలిసిన సింధు, గోపీచంద్‌లను ముఖ్యమంత్రి శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఫైనల్లో ఓడిపోయినా మంచి ప్రతిభ కనబరిచిందని సింధును కొనియాడిన సీఎం.. 'బెటర్ లక్ నెక్ట్స్ టైం' 'ఆల్ ద బెస్ట్' అని ఆమె వెన్ను తట్టారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ సింధుకి ప్రత్యేక కానుకలు అందజేశారు. చేనేత శాలువాలతో పాటు ప్రత్యేకంగా నేయించిన పోచంపల్లి చీరలను సీఎం కేసీఆర్ ద్వారా సింధుకు కేటీఆర్ అందించారు. వీటితోపాటు ఓ వెండి జ్ఞాపికను బహూకరించారు. దీనికి సంబంధించిన ఫొటోలను ఆయన ట్విటర్ ద్వారా పంచుకున్నారు. ఒలింపిక్స్‌లో రజతం సాధించిన సింధుకు ఇప్పటికే స్థలంతో పాటు నగదు ప్రోత్సహకాన్ని తెలంగాణ ప్రభుత్వం అందించిన సంగతి తెలిసిందే. కార్యక్రమంలో హైదరాబాద్ మేయర్ బొంతు రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బంగ్లాదేశ్ చరిత్ర సృష్టించింది..తొలి టెస్ట్‌లో ఆసీస్‌పై సంచలన విజయం సాధించింది..తద్వారా టెస్ట్‌ల్లో ఆ జట్టుపై తొలి విక్టరీ నమోదు చేసింది..ఈ గెలుపుతో యావత్ బంగ్లా ఆనందోత్సాహాల్లో మునిగి తేలుతోంది..సాక్షాత్తూ దేశ ప్రధాని షేక్ హసీనా హాజరై ప్రోత్సహిస్తుండగా ముష్ఫికర్ సేనలో ఉత్సాహం ఇనుమడించింది.. ఉత్కంఠ రేపిన నాలుగో రోజు ఆటలో బంగ్లా విజృంభించింది..సెంచరీ వీరుడు డేవిడ్ వార్నర్, కెప్టెన్ స్టీవ్ స్మిత్, మాక్స్‌వెల్‌లకు బ్రేకులేసి చారిత్రక విజయం అందుకుంది.

బంగ్లా సంచలన విజయం

● షకీబల్ ఆల్‌రౌండ్ షో
● తొలి టెస్ట్‌లో ఆసీస్ చిత్తు

ఢాకా : బంగ్లాదేశ్ క్రికెట్‌లో బుధవారం ఓ మరిచిపోలేని రోజు. ఆల్‌రౌండర్, 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ షకీబల్ హసన్ అద్భుతంగా రాణించిన వేళ ఆ జట్టు మొదటి టెస్ట్‌లో 20 పరుగుల తేడాతో పటిష్ఠ ఆస్ట్రేలియాను చిత్తుచేసింది. తద్వారా రెండు టెస్ట్‌ల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలో నిలిచింది. షకీబల్ (5/85) తన లెఫ్టామ్ స్పిన్‌తో తిప్పేయడంతో ఆసీస్ రెండో ఇన్నింగ్స్‌లో 244 పరుగులకు కుప్పకూలింది. బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 260, రెండో ఇన్నింగ్స్‌లో 221 పరుగులు చేసింది. ఆస్ట్రేలియా మొదటి ఇన్నింగ్స్‌లో 217 పరుగులకు ఆలౌటైంది. 265 పరుగుల లక్ష్య ఛేదనలో మూడోరోజు ఆట ఆఖరికి ఆసీస్ స్కోరు 109/2. క్రీజులో ఉంది మేటి బ్యాట్స్‌మన్ వార్నర్ (75 బ్యాటింగ్), కెప్టెన్ స్మిత్ (25 బ్యాటింగ్). బుధవారం ఆ జట్టు విజయానికి కావాల్సింది కేవలం 156 పరుగులు. చేతిలో చాలినన్ని వికెట్లు. ఇంకేం విజయం కంగారూలదే అని అందరి అంచనా. ఈ నేపథ్యంలో వార్నర్ కూడా బాధ్యతాయుతంగా ఆడుతూ 121 బంతుల్లో టెస్ట్‌ల్లో 19వ సెంచరీ పూర్తి చేశాడు. స్మిత్‌తో కలిసి మూడో వికెట్‌కు 130 పరుగులు జోడించాడు. ఈ ఇద్దరూ ఆసీస్‌ను గెలుపు దిశగా నడిపించారు. ఈ దశలో..112



వార్నర్ శతకం వృథా

పరుగులు చేసిన వార్నర్, స్మిత్ (37)లను అవుట్ చేయడం ద్వారా షకీబల్ బంగ్లాదేశ్‌ను రేస్‌లోకి తెచ్చాడు. ఇక లంచ్ తర్వాత కొద్దిసేపటికే గ్లెన్ మాక్స్‌వెల్ (14)నూ షకీబల్ పెవిలియన్ కు చేర్చడంతో ఆసీస్ 198/8తో ఓటమి ముంగిట నిలిచింది. కానీ పాట్ కమిన్స్ (33 నాటౌట్) రెచ్చిపోయి మెహిదీ హసన్ ఓవర్లో మూడు ఫోర్లు, రెండు సిక్సర్లు బాది ఆసీస్‌ను గెలుపుదిశగా మళ్లించాడు. దాంతో బంగ్లా జట్టులో టెన్షన్. కానీ మరో స్పిన్నర్ తైజుల్ ఇస్లామ్..హాజెల్‌వుడ్‌ను అవుట్ చేసి ఆసీస్ ఇన్నింగ్స్‌కు ముగింపు పలికాడు. ఇప్పటివరకూ 101 టెస్ట్‌లాడిన బంగ్లాకిది పదో విజయం. ఇరు జట్ల మధ్య రెండో టెస్ట్ వచ్చేనెల 4నుంచి చిట్టగాంగ్‌లో జరగనుంది. రెండో టెస్ట్‌కు బంగ్లాదేశ్ ఇదే జట్టును ప్రకటించింది.

మహీ 'ట్రిపుల్'

● 300వ వన్డే ఆడనున్న ధోనీ ● ప్రయోగాలకు సిద్ధమైన భారత్
● ప్రపంచకప్ బెర్త్ కోసం శ్రీలంక ● నాలుగో మ్యాచ్ నేడు

మ. 2:30 నుంచి సోనీ సిక్స్, డీడీ నేషనల్‌లో



ధోనీ

టెస్టు సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసేశాం.. ఐదు వన్డేల సిరీస్‌ను ఇప్పటికే 3-0తో చేజిక్కించుకున్నాం..! ఇంకేముంది మిగిలిన 2 వన్డేలకు ప్రాధాన్యం లేనట్టే..! అందరి మదిలోనూ ఇదే భావన..! కానీ.. శ్రీలంకతో నాలుగో వన్డేకు ఓ ప్రత్యేకత ఉంది..! టీమిండియా మిస్టర్ కూల్ మహేంద్ర సింగ్ ధోనీకిది వన్డేల్లో 300వ మ్యాచ్. అలాగే ఇప్పటికే సిరీస్ నెగ్గిన నేపథ్యంలో కోహ్లీ సేన ప్రయోగాలకు సిద్ధమైంది. అయితే శ్రీలంక మాత్రం 2019 వన్డే వరల్డ్‌కప్‌లో డైరెక్ట్ ఎంట్రీ కోసం పోరాడుతోంది..!

కొలంబో: శ్రీలంక పర్యటనలో జోరు ప్రదర్శిస్తోన్న భారత జట్టు మరో సమరానికి సిద్ధమైంది. ఐదు వన్డేల సిరీస్‌లో భాగంగా.. గురువారం జరిగే నాలుగో మ్యాచ్‌లో ఆతిథ్య లంకతో భారత్ తలపడనుంది. ఇప్పటికే సిరీస్‌ను దక్కించుకున్న కోహ్లీ సేన రిజర్వ్ బెంచ్ బలాన్ని పరీక్షించనుంది. కాగా.. ఈ మ్యాచ్‌తో మాజీ కెప్టెన్ ధోనీ 300 వన్డేల క్లబ్‌లో చేరనున్నాడు. వన్డే క్రికెట్‌లో అత్యుత్తమ ఫినిషర్లలో ఒకడిగా గుర్తింపు పొందిన ధోనీ భారత్ తరపున ఈ ఘనత సాధించిన ఆరో ఆటగాడిగా, ఓవరాల్‌గా 20వ వాడిగా రికార్డుల కెక్కనున్నాడు. భారత్ నుంచి అతనికంటే ముందు సచిన్ (463), ద్రావిడ్ (344), అజరుద్దీన్ (334), గంగూలీ (311), యువరాజ్ (304) మాత్రమే ట్రిపుల్ సెంచరీ మార్కు దాటారు. కాగా.. ఇప్పటికే సిరీస్ కోల్పోయి ఒత్తిడిలో పడిన శ్రీలంకకు వరల్డ్‌కప్ బెర్త్ రూపంలో మరో సవాల్ ఎదురుకానుంది. 2019 ప్రపంచకప్‌నకు నేరుగా అర్హత సాధించాలంటే ఐసీసీ ర్యాంకింగ్స్‌లో టాప్-8లో నిలవాలి. అంటే ప్రస్తుతం ఎనిమిదో స్థానంలో ఉన్న లంక దాన్ని నిలబెట్టుకోవాలన్నమాట. కాబట్టి ఈ సిరీస్‌లో రెండు మ్యాచ్‌లు తప్పక గెలవాలి. ఇప్పటికే సిరీస్ ఓటమితో డీలాపడిన లంక స్టాండ్ ఇన్ కెప్టెన్ కపుగెదర గైర్హాజరీతో మరింత బలహీనపడింది. మలింగ ఈ మ్యాచ్‌లో లంకను నడిపిస్తాడు.

కుల్దీప్, మనీష్‌కు చాన్స్..: ఈ మ్యాచ్‌లో రిజర్వ్ ఆటగాళ్లకు అవకాశమిస్తామని కెప్టెన్ కోహ్లీ ఇప్పటికే స్పష్టం చేశాడు. రహానే, మనీష్ పాండే, కుల్దీప్, శార్దూల్ ఠాకూర్‌లకు ఇప్పటి వరకూ అవకాశం రాలేదు. ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ కేదార్ ఘోరంగా విఫలమయ్యాడు. అతని స్థానంలో మనీష్‌ను బరిలోకి దించనున్నారు. పేసర్ శార్దూల్ కూడా నెట్స్‌లో ఆకట్టుకుంటున్నాడు. భువీ స్థానంలో అతనికి అవకాశం దక్కవచ్చు. ఇక కుల్దీప్ ఈ మ్యాచ్‌లో ఆడేది ఖాయంగా కనిపిస్తోంది. అదే జరిగితే చాహల్‌కు విశ్రాంతి తప్పదు. రహానెను ఆడించాలని భావిస్తే రాహుల్ వైదొలగాల్సి ఉంటుంది.

జట్లు (అంచనా)

భారత్: ధవన్, రోహిత్, కోహ్లీ (కెప్టెన్), రాహుల్ /రహానె, మనీష్ పాండే, ధోనీ (వికెట్‌కీపర్), హార్దిక్, అక్షర్ పటేల్, కుల్దీప్, భువనేశ్వర్ /శార్దూల్, బుమ్రా.

శ్రీలంక: డిక్‌వెలా (వికెట్‌కీపర్), మునవీర, కుశాల్ మెండిస్, తిరిమన్నె, మాథ్యూస్, సిరివర్దన, తిసార పెరీర, అకిల ధనంజయ, మలింగ (కెప్టెన్), చమీర, విశ్వ ఫెర్నాండో.

పిచ్/వాతావరణం

పిచ్‌పై కొద్దిగా పచ్చిక కనిపిస్తోంది. పేసర్లకు అదనపు బౌన్స్ లభిస్తుంది. మ్యాచ్‌కు వానగండం పొంచి ఉంది. మధ్యాహ్నం, సాయంత్రం ఇక్కడ జల్లులు కురిసే అవకాశం ఉంది.

కెర్బర్‌కు షాక్

● నడాల్, ఫెడెక్స్ ముందంజ ● యూఎస్ ఓపెన్



కెర్బర్



కెర్బర్‌ను చిత్తుచేసిన ఒసాకా

న్యూయార్క్: యూఎస్ ఓపెన్‌లో పెను సంచలనం నమోదైంది. డిఫెండింగ్ చాంప్ ఏంజెలిక్ కెర్బర్‌కు జపాన్ టీనేజర్ నవోమి ఒసాకా షాకిచ్చింది. పురుషుల సింగిల్స్‌లో టాప్ సీడ్ నడాల్, రోజర్ ఫెడరర్ శుభారంభం చేశారు. తొలి రౌండ్ మ్యాచ్‌లో 6వ సీడ్ కెర్బర్ (జర్మనీ) 3-6, 1-6తో నవోమి ఒసాకా చేతిలో వరుస సెట్లలో ఓడి ఇంటిముఖం పట్టింది. 19 ఏళ్ల ఒసాకా టాప్-10 ప్లేయర్లపై నెగ్గడం కెరీర్‌లో ఇదే మొదటిసారి. అయితే గత ఏడాది ఇదే స్టేడియంలో మాడిసన్ కీస్ (అమెరికా)తో మ్యాచ్‌లో చివరి సెట్‌లో ఆధిక్యంలో నిలిచి నెగ్గాల్సిన ఒసాకా.. ఒత్తిడికి గురై పరాజయం పాలైంది. అయితే ఇప్పుడు మాత్రం చేదు జ్ఞాపకాలను అధిగమించానని చెబుతోంది. తొలిసెట్ ఆరంభంలో ఇద్దరూ తమ సర్వీసులను నిలబెట్టుకోవడంతో 3-3తో సమంగా నిలిచారు. అయితే ఎనిమిదో గేమ్‌లో కెర్బర్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన ఒసాకా 5-3తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అదే జోరులో 6-3తో నెగ్గింది.

ఇక రెండో సెట్‌లో జపాన్ ప్లేయర్ మరింత ఆత్మవిశ్వాసంతో చెలరేగిపోయింది. తొలి గేమ్‌లోనే కెర్బర్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన ఒసాకా.. రెండో గేమ్‌లోనూ నెగ్గి 2-0తో ముందంజ వేసింది. అయితే మూడో గేమ్‌లో సర్వీస్‌ను నిలబెట్టుకున్న కెర్బర్ 1-2తో నిలిచింది. ఫుల్ జోష్‌లో ఉన్న ఒసాకా.. వరుసగా గేమ్‌లు నెగ్గి 6-1తో సెట్‌తోపాటు మ్యాచ్‌నూ కైవసం చేసుకుంది. ఒసాకా 22 విన్నర్లు సంధించింది. కెర్బర్ 23 అనవసర తప్పిదాలు చేసింది. కాగా, ఫ్రెంచ్ ఓపెన్ విజేత జెలెనా వోస్తపెంకో (లాత్వియా) 6-2, 1-6, 6-1తో అర్రుబారెన్ (స్పెయిన్)పై, 15వ సీడ్ మాడిసన్ కీస్ (అమెరికా) 6-3, 7-6 (6)తో ఎలిస్ మెర్టెన్స్ (బెల్జియం)పై గెలిచి రెండో రౌండ్‌కు చేరుకున్నారు. బార్బరా స్ట్రికోవా (చెక్), విక్‌మేయర్ (బెల్జియం), 4వ సీడ్ ఎలినా స్విటోలినా (ఉక్రెయిన్) కూడా ముందంజ వేశారు. కెనడా భామ బౌచర్డ్ తొలి రౌండ్‌లోనే ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించింది.

ఫెడెక్స్ కష్టంగా..: పురుషుల సింగిల్స్‌లో స్విస్ స్టార్ ప్లేయర్ ఫెడరర్ తొలి రౌండ్ మ్యాచ్‌లో అమెరికా టీనేజర్ ఫ్రాన్సిస్ టియాఫోతో ఐదు సెట్లపాటు పోరాడాల్సి వచ్చింది. 3వ సీడ్ ఫెడరర్ 4-6, 6-2, 6-1, 1-6, 6-4తో ఫ్రాన్సిస్‌పై చెమటోడ్చి నెగ్గాడు. కాగా, స్పెయిన్ బుల్ రఫెల్ నడాల్ సునాయాసంగా రెండో రౌండ్‌కు చేరుకున్నాడు. నడాల్ 7-6 (6), 6-2, 6-2తో లజోవిక్‌ను వరుస సెట్లలో ఓడించాడు. 6వ సీడ్ థీమ్ (ఆస్ట్రియా) 6-4, 6-1, 6-1తో అలెక్స్ డి మినార్ (ఆస్ట్రేలియా)పై గెలిచాడు. 15వ సీడ్ థామస్ బెర్డిచ్ (చెక్), ఇవాన్ కార్లోవిచ్ రెండో రౌండ్‌కు చేరుకున్నారు.

● ప్రేక్షకులతో రఫా

ష్.. గప్‌చుప్..!

స్పెయిన్ బుల్ రఫెన్ నడాల్.. న్యూయార్క్ ప్రేక్షకులను గప్‌చుప్‌గా ఉండమన్నాడు. వరల్డ్ నెం:1 నడాల్ యూఎస్ ఓపెన్ తొలి రౌండ్‌లో సెర్బియన్ డుసన్ లజోవిక్‌తో తలపడ్డాడు. అయితే వర్షాల కారణంగా ఆర్థర్ యాషే స్టేడియం కప్పు మూసి మరీ మ్యాచ్‌ను నిర్వహించారు. అయితే 24 వేల మంది కెపాసిటీ ఉన్న స్టేడియం పైకప్పు మూయడంతో ప్రేక్షకుల గోల ప్రతిధ్వనించింది. ఈ నేపథ్యంలో ప్రేక్షకులను నిశ్శబ్దంగా ఉండాలని నడాల్ కోరాడు. 'గొడవ ఎక్కువగా ఉంది. కనీసం బంతి కొట్టిన శబ్దాన్ని కూడా వినలేకపోయా. రూఫ్ కింద ఆడేటప్పుడు ప్రేక్షకులు నిశ్శబ్దాన్ని పాటించాల్సిన అవసరం ఉంద'ని రఫా అన్నాడు. గత ఏడాది ఆండీ ముర్రే కూడా ఇలాగే ఫిర్యాదు చేశాడు.

గ్రాండ్‌స్లామ్ గుర్తులు.. ఇలా..!

ముంబై: ముంబైలో కురిసిన భారీ వర్షానికి అంతా అతలాకుతలమైంది. అయితే, ఓ ఇంట్లో లోపలికి నీరు రాకుండా టవల్స్‌ను అడ్డంగా పెట్టిన దృశ్యమిది. వీటిని మాజీ టెన్నిస్ ప్లేయర్ మహేష్ భూపతి ఆస్ట్రేలియన్, వింబుల్డన్, ఫ్రెంచ్ ఓపెన్, యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్‌ల్లో పాల్గొన్నందుకు గుర్తుగా దాచుకున్నాడు. కానీ, భారీ వర్షానికి ఇంట్లోకి నీరు రాకుండా భూపతి భార్య, బాలీవుడ్ నటి లారా దత్తా వీటిని అడ్డుగా పెట్టి ఆ ఫొటో సహా ట్వీట్ చేసింది. దీనికి భూపతి.. ఏంటి వేళాకోళంగా ఉందా? ఇందు కోసం ఎంతగా కష్టపడ్డానో తెలుసా? అంటూ ట్వీట్లతోనే సమాధానం చెప్పాడు.



ఫిక్సింగ్ స్కామ్‌లో షర్జీల్‌పై ఐదేళ్ల నిషేధం



కరాచీ: స్పాట్ ఫిక్సింగ్ స్కామ్‌లో బ్యాట్స్‌మన్ షర్జీల్ ఖాన్‌పై పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) అవినీతి వ్యతిరేక ట్రైబ్యునల్ ఐదేళ్ల నిషేధం విధించింది. ఫిబ్రవరిలో జరిగిన పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్)లో షర్జీల్ ఫిక్సింగ్‌కు పాల్పడినట్టు ట్రైబ్యునల్ తేల్చింది. అయితే ఐదేళ్ల నిషేధాన్ని రెండు దశల్లో అమలు చేయనున్నారు. తొలి రెండున్నరేళ్లు బ్యాన్ కొనసాగుతుంది. తర్వాత అతడి నడవడిక ఆధారంగా సమీక్షించి నిర్ణయం తీసుకుంటారు. పాకిస్థాన్ తరపున షర్జీల్ ఒక టెస్ట్, 25 వన్డేలు, 25 టీ20లకు ప్రాతినిధ్యం వహించాడు. షర్జీల్‌తోపాటు ఖలీద్ లతీఫ్‌పై కూడా ఫిక్సింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. షర్జీల్‌పై జీవితకాల నిషేధం విధించాలని పీసీబీ గట్టిగా వాదించింది.

యు ముంబా విజయం



ప్రత్యర్థి రైడర్‌ను పట్టేసిన ముంబా ఆటగాళ్లు

ముంబై : ప్రొ.కబడ్డీ లీగ్‌లో సొంతగడ్డపై పరాజయ పరంపరకు యు ముంబా ఎట్టకేలకు బ్రేకులు వేసింది. వరుసగా మూడు మ్యాచ్‌ల్లో ఓటమి చవిచూసిన ఆ జట్టు బుధవారం జరిగిన జోన్-ఏ కీలక మ్యాచ్‌లో 38-32 స్కోరుతో హరియాణా స్టీలర్స్‌ను చిత్తుచేసింది. కెప్టెన్ అనూప్ కుమార్ (8) ముంబైని ముందుండి నడిపించగా సీనియర్ ప్లేయర్ కుల్దీప్‌సింగ్ (7) యువ ఆటగాళ్లు శ్రీకాంత్ జాదవ్ (6), కాశీలింగ్ అడ్కే (4) మద్దతుగా నిలిచారు. హరియాణా జట్టులో వికాస్ కండోల (9), వజీర్ సింగ్ (7) సత్తా చాటినా గెలిపించలేకపోయారు. తొలి హాఫ్‌లో చెత్తగా ఆడడం, డిఫెన్స్ విఫలమవడం హరియాణా ఓటమికి కారణమయ్యాయి. ఇక ఇరు జట్లు చెరో 21 రైడ్ పాయింట్లు సాధించినా..టాకిల్ పాయింట్లలో ముంబా (14)..హరియాణా (7)పై ఆధిక్యం ప్రదర్శించింది. ప్రథమార్థం ముగిసే సరికి ముంబా 20-15 ఆధిక్యంలో నిలిచింది. ద్వితీయార్థంలో హర్యానా పుంజుకున్నా..చివరి ఐదు నిమిషాల్లో ముంబా డిఫెన్స్ దుర్భేద్యంగా మారడంతో పాయింట్లు రాబట్టలేకపోయిన ఆ జట్టుకు పరాజయం తప్పలేదు.

సఫారీ ప్రధాన కోచ్‌గా గిబ్సన్!



కేప్‌టౌన్: వెస్టిండీస్ మాజీ ఆల్‌రౌండర్ ఒటిస్ గిబ్సన్ దక్షిణాఫ్రికా క్రికెట్ జట్టు ప్రధాన కోచ్‌గా నియమితుడయ్యాడు. అతనితో క్రికెట్ సౌతాఫ్రికా (సీఏ) 2019 వన్డే ప్రపంచ కప్ వరకు ఒప్పందం కుదుర్చుకుంది. ప్రస్తుతం ఇంగ్లండ్ జట్టుకు బౌలింగ్ కోచ్‌గా పని చేస్తున్న గిబ్సన్‌కు వచ్చే నెలలో రస్సెల్ డోమింగో స్థానంలో కోచ్ బాధ్యతలు చేపట్టనున్నాడు. బార్బడోస్‌కు చెందిన గిబ్సన్ వెస్టిండీస్ తరఫున రెండు టెస్ట్‌లు, 15 వన్డేలు మాత్రమే ఆడాడు. అయితే అతను కెరీర్‌లో 177 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో 5604 పరుగులు, 659 వికెట్లు తీశాడు. 'కోచ్‌గా అతని రికార్డు మమ్మల్ని ఆకట్టుకుంది. గిబ్సన్ సౌతాఫ్రికాను కూడా అద్భుతంగా నడిపిస్తాడని భావిస్తున్నాం. అతని కోచింగ్‌లో స్వదేశంలో భారత్, ఆస్ట్రేలియాలతో జరిగే సిరీస్‌ల్లో దక్షిణాఫ్రికా మెరుగైన ప్రదర్శన చేస్తుందని ఆశిస్తున్నామ'ని సీఏ ఒక ప్రకటనలో తెలిపింది.

ఢీ అంటే ఢీ

'ఏంటి... డోక్లాం మీ భూభాగమా?'

..చైనా ప్రభుత్వ కౌన్సిలర్ (మంత్రికి ఎక్కువ, ఉప ప్రధానికి తక్కువ) యాంగ్ జీచి సూటిగా అడిగిన ప్రశ్న ఇది!

'ఎక్కడ వివాదాస్పద భూభాగం ఉన్నా అది ఆటోమేటిక్‌గా చైనాదే అవుతుందా?'

..యాంగ్ జీచికి మన జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ అంతే ఘాటుగా చెప్పిన సమాధానమిది!!

దాదాపు రెండున్నర నెలలపాటు కొనసాగిన డోక్లాం ప్రతిష్టంభనకు పరిష్కారం కనుగొనే క్రమంలో ఇరుదేశాలూ జరిపిన చర్చల్లో ఒక దశలో చోటుచేసుకున్న వాడివేడి వాగ్వాదమిది!!



- తొలుత జిన్‌పింగ్‌తో మోదీ సమావేశం
- ఆ వెంటనే దోవల్‌తో ప్రధాని చర్చలు
- చైనా స్టేట్ కౌన్సిలర్‌తో దోవల్ భేటీ
- డోక్లాంతో మీకేంటని ప్రశ్నించిన చైనా
- వివాదాస్పదమంతా మీదే అవుతుందా?
- సూటిగా నిలదీసిన భద్రతా సలహాదారు
- తప్పనిసరి పరిస్థితుల్లో తగ్గిన చైనా
- భారత్, చైనా మధ్య సయోధ్య కుదిరిందలా!

న్యూఢిల్లీ, ఆగస్టు 30: డోక్లాం సెగ చల్లారే దిశగా జరిగిన ఒప్పందానికి ముందు చాలా కసరత్తు జరిగింది. ప్రధాని నరేంద్ర మోదీ జీ-20 సదస్సు సందర్భంగా చైనా ప్రధాని జి జిన్‌పింగ్‌తో జూలై 7న జర్మనీలో సమావేశమైనప్పుడే ఈ కసరత్తుకు బీజం పడింది. అత్యంత విశ్వసనీయ వర్గాల కథనం ప్రకారం... "ఈ వివాదం మరింత ముదరొద్దు. ఇప్పుడు నెలకొన్న ఉద్రిక్తత ఘర్షణగా మారొద్దు. పరస్పర సహకారంతో మనమిద్దరం చాలా లబ్ధి పొందాల్సి ఉంది. ఈ వివాదాన్ని జాతీయ భద్రతా సలహాదారుల స్థాయిలో పరిష్కరించుకుందాం" అని జిన్‌పింగ్‌కు స్పష్టం చేశారు. అందుకు జిన్‌పింగ్ కూడా అంగీకరించారు. జీ-20 సదస్సు నుంచి తిరిగి వచ్చిన వెంటనే, జాతీయ భద్రతా సలహాదారు (ఎన్‌ఎస్‌ఏ) దోవల్, ఇతర బృందంతో మోదీ భేటీ అయ్యారు. "డోక్లాం వివాదానికి పరిష్కార మార్గాలు అన్వేషించండి. ఇది ఘర్షణ దశకు చేరొద్దు. అదే సమయంలో... డోక్లాంలో యథాతథ స్థితిపై వెనక్కి తగ్గొద్దు. భయపెట్టో, బలవంతంగానో అక్కడ పరిస్థితి మార్చాలనుకుంటే కుదరదు" అని స్పష్టమైన సూచనలు చేశారు. ఆ తర్వాత... భారత విదేశాంగ శాఖ కార్యదర్శి ఎస్.జైశంకర్, చైనాలో భారత రాయబారి విజయ్ గోఖలే ఆ దేశ ప్రతినిధులతో పలు దఫాలు చర్చలు జరిపారు. చివరికి... జూలై 27న అజిత్ దోవల్ రంగంలోకి దిగారు. చైనా స్టేట్ కౌన్సిలర్ యాంగ్ జీచితో బీజింగ్‌లో సమావేశమయ్యారు. డోక్లాంతో మీకేం సంబంధం అన్నట్లుగా జీచి మాట్లాడారు. 'అది మీ భూభాగమా?' అని సీరియస్‌గా ప్రశ్నించారు. అంతే సూటిగా. "వివాదాస్పద భూభాగాలన్నీ మీవైపోతాయా?" అని దోవల్ అడిగారు. "భూటాన్ రక్షణ బాధ్యత మాదే. డోక్లాం భూటాన్‌లో అంతర్భాగం" అని తేల్చిచెప్పారు. గతంలో డోక్లాంను తమకు ఇచ్చేస్తే అందుకు బదులుగా ఉత్తరం వైపున 500 చదరపు కిలోమీటర్ల భూభాగాన్ని ఇస్తామని చైనా స్వయంగా భూటాన్‌కు 'ఆఫర్' ఇచ్చిందని గుర్తు చేశారు. "డోక్లాంను భూటాన్ మీకు అప్పగించలేదు. ఆ వివాదం అలాగే ఉంది. అక్కడ యథాతథ స్థితి కొనసాగాలి. అందుకే... డోక్లాం నుంచి ఇద్దరం ఒకేసారి వైదొలగుదాం! సమస్యకు ఇదే పరిష్కారం" అని యాంగ్ జీచితో దోవల్ చెప్పారు. భారత వైఖరి స్పష్టంగా తేలిపోవడం... తమ బెదిరింపులకు లొంగకపోవడంతో డోక్లాం నుంచి చైనా వెనక్కితగ్గక తప్పలేదు.



బుధవారం కురిసిన భారీ వర్షాలకు జలమయమైన ముంబై రహదారులు

తేరుకుంటున్న ముంబై

- తగ్గిన వర్షం.. నెమ్మదిగా సాధారణ పరిస్థితులు
- నిరాశ్రయుల కోసం సహాయక చర్యలు
- సామూహిక వంటశాలల ఏర్పాటు
- వర్షాలకు ఇద్దరు పిల్లలు సహా నలుగురు మృతి

ముంబై, ఆగస్టు 30: అసాధారణ విపత్తు నుంచి ముంబై తేరుకుంటోంది. గత రెండ్రోజులుగా ధారాపాతంగా కురిసిన వర్షం కాస్త శాంతించింది. నిన్నటిదాకా కొన్ని ప్రాంతాల్లో రోడ్లపై నడుం దాకా పోటెత్తిన వరద నీరు మోకాళ్ల స్థాయికి తగ్గింది. స్తంభించిన రోడ్డు, రైలు, విమాన సర్వీసుల్లో కదలిక వచ్చింది. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలకు బుధవారం మహారాష్ట్ర సర్కారు సెలవు ప్రకటించింది. భారీ వర్షాలతో రాత్రంతా ఆఫీసుల్లోనే ఉండిపోయిన వేలాది మంది ఉదయం ఇళ్లకు వెళుతూ కనిపించారు. అటు వరద బాధిత ప్రాంతాల్లో నేవీ, ఎన్డీఆర్ఎఫ్ అధికారులు సహాయ చర్యలు ముమ్మరం చేశారు. బీఎంసీ అధికారులు ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు భారీ వర్షం కారణంగా రోడ్లపై మునిగిన వాహనాలను తొలగించారు. బాధిత ప్రజల ఆకలి తీర్చేందుకు సామూహిక వంటశాలలు, ఆహార కేంద్రాలను ఏర్పాటు చేశారు. భారీ వర్షాలకు స్వరం కోల్పోయిన పేదల కోసం పలుచోట్ల వసతి ఏర్పాట్లు చేశారు. లోతట్టు ప్రాంతాల్లో ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా గజ ఈతగాళ్లను మోహరించారు.ఎక్కడికక్కడ వైద్య బృందాలనూ ఏర్పాటు చేశారు. మంగళవారం నగరవ్యాప్తంగా 31.6 సెంటీ మీటర్ల వర్షం కురిసింది. 2005 జూలై 26వ తేదీన 94.4 సెంటీమీటర్ల వర్షం కురిసిన తర్వాత ముంబైలో ఇదే అత్యధిక వర్షపాతం అని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు.

భారీ వర్షాలకు ఇళ్లు కూలడంతో వేర్వేరు ఘటనల్లో ఇద్దరు చిన్నారులు సహా నలుగురు మరణించారు. మంగళవారం బంధువుతో కలిసి ఇంటికి వెళుతున్న మూడేళ్ల బాలిక వాఘోబా కిండ్ ప్రాంతంలో బైక్ స్కిడ్ కావడంతో కింద పడి వరద నీటిలో కొట్టుకుపోయింది. అనంతరం బాలిక మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పాల్‌ఘర్, వీరర్, వసాయి ప్రాంతాల్లో నాలాలో పడి మరో ముగ్గురు కొట్టుకుపోయారు. వీరి మృతదేహాల కోసం గాలింపు కొనసాగుతోంది. వరద ఉధృతికి ఎలిఫెంట్‌స్టోన్ ప్రాంతంలో ఓ వైద్యుడు గల్లంతయ్యాడు. సుప్రసిద్ధ 'డబ్బావాలా' సంస్థ బుధవారం తన సేవలను రద్దు చేసింది. నిరాశ్రయులు తన అధికారిక బంగళాలో ఆశ్రయం పొందవచ్చని రాష్ట్ర మంత్రి గిరీశ్ బాపట్ ప్రకటించారు. మరోవైపు శివారు ప్రాంతాల్లో భారీ వర్షం పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

టెక్సాస్ గజగజ

5వ రోజూ అదే వర్ష బీభత్సం.. వరద ఉగ్రరూపం

- భారతీయ విద్యార్థి మృతి
- హ్యూస్టన్‌లో భారతీయుల కష్టాలు
- అలమటిస్తున్న విద్యార్థులు
- లూసియానాపై హార్వే పడగ

హ్యూస్టన్, ఆగస్టు 30: అమెరికా చరిత్రలోనే అత్యంత విధ్వంసక తుఫాన్-హార్వే విలయ తాండవంతో టెక్సాస్ అతలాకుతలమైంది. క్షణక్షణం భయం భయంగా గడుపుతోంది. హార్వే ప్రభావంతో టెక్సాస్, హ్యూస్టన్ సహ పలు ప్రాంతాలు వరుసగా అయిదో రోజూ వర్ష బీభత్సం కొనసాగడంతో గజగజ వణికిపోయాయి. మృతుల సంఖ్య 30కి చేరగా, వేలాది మంది నిరాశ్రయులయ్యారు. టెక్సాస్‌లోని సరస్సులో మునిగిపోతుండగా పోలీసులు కాపాడిన భారత విద్యార్థి సునీల్ భాటియా (24, జైపూర్) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతనితో పాటు రక్షించిన విద్యార్థిని శాలిని సింగ్ (25) పరిస్థితి విషమంగా ఉంది. ఇంకా వేర్వేరు ప్రాంతాల నుంచి వరదల్లో గల్లంతైన వారి సమాచారం అధికారులకు అందుతుండడంతో మృతుల సంఖ్య పెరగవచ్చని ఆందోళన వ్యక్తమవుతోంది. తుఫాన్‌గా బలహీనపడిన హార్వే తాజాగా టెక్సాస్-లూసియానా సరిహద్దులో రెండోసారి తీరాన్ని తాకింది. దీంతో పశ్చిమ లూసియానాలో గంటకు 72 కిలో మీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, 13 నుంచి 25 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదయ్యే ప్రమాదం ఉందని జాతీయ హరికేన్ కేంద్రం హెచ్చరించింది. టెక్సాస్‌లో రోడ్లు నదులను తలపిస్తూ పొంగి ప్రవహిస్తుండడగా.. ఇళ్లు నీట మునిగాయి. సుమారు 13 లక్షల మంది హార్వే విలయంతో ప్రభావితమయ్యారు. అమెరికాలో నాలుగో పెద్ద నగరమైన హ్యూస్టన్‌లోనూ, దాని చుట్టుపక్కల నివసిస్తున్న లక్ష మందికిపైగా ప్రవాస భారతీయులు వరదల్లో నానా కష్టాలు పడుతున్నారు. హ్యూస్టన్ యూనివర్సిటీలో చిక్కుకున్న సుమారు 200 మంది భారతీయ విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వందలాది మంది భారతీయ విద్యార్థులు నివసిస్తున్న ప్రాంతం జల దిగ్బంధంలో చిక్కుకోవడంతో ఆహారం, నీళ్లు లేక అలమటిస్తున్నారు. వీరికి హ్యూస్టన్‌లో భారత కాన్సుల్ జనరల్ రే ఆధ్వర్యంలో సహాయం అందించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. 250 మందికిపైగా భారతీయ విద్యార్థులు నివసిస్తున్న అపార్ట్‌మెంట్ల సముదాయాన్ని ఆయన వరద నీటిలోనే వెళ్లి సందర్శించారు. టెక్సాస్ చుట్టుపక్కల తుఫాన్ ప్రభావం లేని ప్రాంతాలకు చెందిన ప్రవాస భారతీయులు పెద్ద మనసుతో బాధితులకు సహాయం అందిస్తున్నారు. భారతీయ వ్యాపార సంస్థలు, ధార్మిక సంఘాలు నిరాశ్రయులకు ఆశ్రయం కల్పిస్తున్నాయి. భారత సంతతి వైద్యులు, నర్సులు సోషల్ మీడియా ద్వారా అవసరమైన వారికి సేవలు అందిస్తున్నారు.



మంగళవారం టెక్సాస్‌లోని వరద ప్రభావిత ప్రాంతాల సందర్శనకు వెళ్లినప్పుడు ఫస్ట్ లేడీ మెలానియా ట్రంప్ వేషధారణ ఆడంబరంగా ఉండడంపై విమర్శలు వెల్లువెత్తాయి. స్కై-హై హీల్స్, మిలిటరీ-స్టైల్ గ్రీన్ బాంబర్ జాకెట్, బ్లాక్ క్రాప్డ్ ప్యాంట్ ధరించిన ఆమె.. జుట్టు విరబోసుకోవడాన్ని నెటిజన్లు తూర్పారబట్టారు.



వరద విజృంభిస్తుండడంతో కింగ్‌వుడ్ ప్రాంతంలోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న దృశ్యం

శిక్షణ పొందని
టీచర్లకు శిక్షణ కోర్సు

- కేంద్ర, రాష్ట్ర విద్యాశాఖల సంయుక్త డిప్లొమా
- కోర్సులో ప్రవేశాలకు సెప్టెంబరు 15 చివరి తేదీ
- 2019 వరకు శిక్షణ పొందకపోతే అనర్హులే



హైదరాబాద్/న్యూఢిల్లీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): శిక్షణ పొందకుండానే ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్న ఉపాధ్యాయులకు శుభవార్త. వీరికి శిక్షణ ఇచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డి.ఈఎల్.ఈడీ) కోర్సును అందిస్తున్నాయి. విద్యాహక్కు చట్టం-2009 ప్రకారం ఎలిమెంటరీ పాఠశాల స్థాయిలో బోధన చేస్తున్న ఉపాధ్యాయులందరూ కచ్చితంగా ఉపాధ్యాయ శిక్షణ కోర్సు చేసి ఉండాలి. కోర్సు పూర్తి చేయని వారు 2019 మార్చి 31 తర్వాత ఉపాధ్యాయ వృత్తికి అనర్హులవుతారు. వారిని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యాబోధనకు అనుమతించరు. సార్వత్రిక దూర విద్యా విధానంలో అందించే ఈ కోర్సు కాల వ్యవధి రెండు సంవత్సరాలు ఉంటుంది. ఈ కోర్సులో ప్రవేశానికి 2017 సెప్టెంబరు 15ను చివరి తేదీగా నిర్ణయించారు. కాగా 12వ తరగతిలో 50% మార్కులతో ఉత్తీర్ణత సాధించినవారు ఈ కోర్సు చేసేందుకు అర్హులు. 50% మార్కులు లేని ఉపాధ్యాయులు ఆన్ డిమాండ్ ఎగ్జామినేషన్ (ఓడీఈ) ద్వారా మార్కులు పెంచుకునేందుకు దరఖాస్తు చేయవచ్చు. పూర్తి వివరాల కోసం సుల్తాన్ బజార్‌లోని శ్రీకృష్ణ దేవరాయ తెలుగు భాషా నిలయంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ (ఎన్ఐఓఎస్) కార్యాలయంలో సంప్రదించవచ్చు లేదా ఠీఠీఠీ.ఞౌటఛి.జీ వెబ్‌సైట్ ద్వారా లేదా 040-24752859, 24750712 నెంబర్లకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని ఎన్ఐఓఎస్ ప్రాంతీయ సంచాలకులు అనిల్ కుమార్ సూచించారు.

అక్టోబరు 2 నుంచి శిక్షణ..

టీచర్లకు శిక్షణను విద్యారంగంలో అతి పెద్ద సంస్కరణగా కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. 2019 మార్చి నాటికి 11 లక్షల మంది టీచర్లకు శిక్షణ ఇవ్వాలని కేంద్ర మానవ వనరుల శాఖ నిర్ణయించింది. గాంధీ జయంతిని పురస్కరించుకుని అక్టోబరు 2 నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. దేశవ్యాప్తంగా ఆరు లక్షల మంది ప్రభుత్వ టీచర్లు, ఐదు లక్షల మంది ప్రైవేటు పాఠశాలల టీచర్లకు శిక్షణ ఇవ్వనున్నారు. వాస్తవానికి విద్యాహక్కు చట్టం ప్రకారం 2015 నాటికే ప్రాథమిక విద్యలో టీచర్లంతా డిప్లొమా కోర్సు పూర్తి చేసి శిక్షణ తీసుకోవాల్సి ఉంది. కానీ, గడువులోపు ఆ ప్రక్రియ పూర్తి కానందున ఇటీవల జరిగిన పార్లమెంటు సమావేశాల్లో చట్టాన్ని సవరించి 2019కి పొడిగించారు.10 భాషల్లో 9 కోర్సులను టీచర్లకు బోధించనున్నారు. శిక్షణ ఇవ్వడానికి 1080 మంది లెక్చరర్లను ఎంపిక చేయనున్నారు. ఆన్‌లైన్ ద్వారా శిక్షణ ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో పాటు 24 సెలవు దినాల్లో వర్క్‌షాప్‌లను నిర్వహిస్తారు. రెండు దశల్లో శిక్షణ ఇవ్వడానికి అధికారులు ప్రణాళిక రచిస్తున్నారు. మొదటి దశ శిక్షణ ఈ ఏడాది అక్టోబరు 2న ప్రారంభమై వచ్చే ఏడాది జూన్‌లో ముగుస్తుంది. రెండో దశ శిక్షణ 2018 జూలైలో మొదలై 2019 మార్చికి పూర్తవుతుంది.



మోదీ విదేశీ పర్యటన..

ఆ తరువాతే కేబినెట్ విస్తరణ?

న్యూఢిల్లీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ చైనా, మయన్మార్ పర్యటనల అనంతరమే కేంద్ర కేబినెట్ విస్తరణ జరిగే అవకాశాలున్నాయి. నిజానికి పార్లమెంటు సమావేశాలు ముగిసిన వెంటనే కొత్త గవర్నర్ల నియామకం, మంత్రివర్గ విస్తరణ చేపట్టాలనుకున్నా.. అనేక కారణాల వల్ల జాప్యమైంది. డేరా బాబా వివాదం, బిహార్‌లో వరదలు, డోక్లాం వివాదం తదితర అంశాల వల్ల విస్తరణను వాయిదా వేశారు. కేబినెట్‌లో చేరాలనుకున్న అన్నాడీఎంకెకు దినకరన్ రూపంలో కొత్త తలనొప్పులు రావడంతో ఎన్డీఏలో ఆ పార్టీ చేరడం కూడా మరింత ఆలస్యమవుతోంది. కేబినెట్ పునర్వ్యవస్థీకరణపై మోదీ, అమిత్‌షా పలు మార్లు భేటీ అయి కసరత్తు చేశారు. మంత్రి వర్గంలోకి ఎవర్ని తీసుకోవాలి? పార్టీ సేవలకు ఎవర్ని పంపాలో చర్చించారు. సెప్టెంబర్ 3నుంచి 5 వరకు చైనాలో జరుగుతున్న బ్రిక్స్ సదస్సులో మోదీ పాల్గొంటారు. ఆ తర్వాత 5-7 తేదీల మధ్య మయన్మార్‌లో పర్యటిస్తారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ 1, 2 తేదీల్లో తిరుమలలో పర్యటిస్తున్నారు. సెప్టెంబర్ రెండో వారంలో బీజేపీ కార్యనిర్వాహక సమావేశాలు జరగనున్నాయి.

మీరూ అధికార పార్టీయేగా?

- అన్నా డీఎంకే ఎమ్మెల్యేలతో గవర్నర్
- 'రగడ' మీ పార్టీ అంతర్గత వ్యవహారం
- విశ్వాస పరీక్షకు విద్యాసాగర్‌రావ్ నో



చెన్నై, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): తమిళనాట పళని స్వామి ప్రభుత్వానికి గొప్ప ఊరట లభించింది. పళని ప్రభుత్వానికి విశ్వాస పరీక్ష నిర్వహించాలన్న విపక్షాల డిమాండ్‌ను ఇన్‌చార్జ్ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్ రావ్ నిర్ద్వంద్వంగా తోసిపుచ్చారు. అనిశ్చితికి కారణమైన 19 మంది ఎమ్మెల్యేలు అధికార పార్టీలోనే ఉన్నారని, వారెవరూ వేరే పార్టీలోకి వెళ్లిపోలేదని, ఈ పరిస్థితిలో సీఎంను విశ్వాస పరీక్ష కోరలేనని స్పష్టం చేశారు. దీంతో ప్రస్తుతానికి పళని ప్రభుత్వం ఊపిరి పీల్చుకున్నట్టయింది. దివంగత సీఎం జయలలిత మరణానంతరం రాష్ట్రంలో సీఎం సీటుకోసం జరిగిన నాటకీయ పరిణామాల నేపథ్యంలో మాజీ సీఎం పన్నీర్ సెల్వం పార్టీ నుంచి బయటకు వచ్చారు. అయితే, ఇటీవల ప్రస్తుత సీఎం పళనిస్వామి, పన్నీర్ వర్గాలు కలిసిపోవడంతో రాజకీయ అనిశ్చితికి తెరపడిందని అందరూ భావించారు. అయితే, 19 మంది పళని వర్గం ఎమ్మెల్యేలు ఆయనపై తమకు విశ్వాసం లేదంటూ గవర్నర్‌కు ఫిర్యాదు చేయడంతో రాజకీయం మళ్లీ వేడెక్కింది. అదే సమయంలో అన్నాడీఎంకే నుంచి బహిష్కరణకు గురైన శశికళ, దినకరన్ వర్గానికి ఈ 19 మంది మద్దతివ్వడం, రాజధానికి దూరంగా దినకరన్ ఆధ్వర్యంలోని రిసార్టులో ఉండడంతో పళని ప్రభుత్వంపై విపక్షాలు మూకుమ్మడి దాడి పెంచాయి. ప్రభుత్వానికి చాలినంత బలం లేదని, ఈ పరిస్థితిలో విశ్వాస పరీక్షకు ఆదేశించాలని గవర్నర్‌పై ఒత్తిడి పెంచాయి. అయితే, దినకరన్ వర్గంగా ఉన్న 19 మంది అధికార పార్టీ నుండి వైదొలగలేదని, మరే పార్టీలోనూ చేరలేదని, అదంతా అన్నాడీఎంకే అంతర్గత వ్యవహారంగానే పరిగణిస్తున్నానని ఇన్‌చార్జ్ గవర్నర్ పేర్కొన్నారు. ఈ మేరకు సీపీఎం కార్యదర్శి జి. రామకృష్ణన్, సీపీఐ కార్యదర్శి ముత్తరసన్, డీపీఐ అధినేత తిరుమావళవన్, మణిదనేయ మక్కల్‌కట్చి నేత జవహిరుల్లా బుధవారం రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌ను కలుసుకున్నారు. గవర్నర్‌తో సమావేశమైన అనంతరం మీడియాతో మాట్లాడుతూ... ఎడప్పాడి ప్రభుత్వం మెజారిటీ కోల్పోయినట్లు తాను భావించడం లేదని గవర్నర్ పేర్కొన్నారని వివరించారు. అందువల్ల డీఎంకే నేత స్టాలిన్ నాయకత్వంలో గురువారం రాష్ట్రపతిని కలుసుకోబోతున్నట్టు పేర్కొన్నారు.

ఈపీఎస్, ఓపీఎస్ వైదొలగాలి: దినకరన్

అన్నాడీఎంకేలో సంక్షోభం సమసిపోయేందుకు సీఎం ఈపీఎస్, డిప్యూటీ సీఎం ఓపీఎస్‌లు పదవుల నుంచి తప్పుకోవాలని ఆ పార్టీ వెలివేత డిప్యూటీ ప్రధాన కార్యదర్శి దినకరన్ డిమాండ్ చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. తన వర్గానికి చెందిన 19 మంది ఎమ్మెల్యేలు అందజేసిన లేఖలపై గవర్నర్ తగు చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నట్టు చెప్పారు. దినకరన్ హీరో విశాల్‌తో భేటీ అయ్యారు. విశాల్‌కి నాయకత్వ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయని, ఆయన రాజకీయాల్లో రావాలనుకుంటే తాను ఆహ్వానిస్తానని పేర్కొన్నారు.

కేంద్రానిదీ అదేమాట

ఎడప్పాడి ప్రభుత్వం విషయంలో కేంద్రానిదీ గవర్నర్ మాటగానే వినిపిస్తోంది. బుధవారం లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ తంబిదురై, తమిళనాడు మంత్రులు డి.జయకుమార్, తంగమణి, సీవీ షణ్ముగం, రాజ్యసభ సభ్యుడు మైత్రేయన్‌లు కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను ఢిల్లీలో కలుసుకున్నారు. బలనిరూపణకి ఎడప్పాడిని గవర్నర్ ఆదేశించే అవకాశం లేదని ఈ సందర్భంగా రాజ్‌నాథ్ వారికి స్పష్టం చేశారు.



పీఎస్ఎల్వీ-సీ39 ప్రయోగం నేడే

శ్రీహరికోట, ఆగస్టు 30: ఇస్రో 41వ సారి పీఎస్ఎల్వీ ప్రయోగానికి సిద్ధమైంది. నావిక్ మిషన్‌లో భాగంగా 2013 నుంచి 2016 వరకు 7 నావిగేషన్ ఉపగ్రహాలను రోదసిలోకి పంపింది. 2013 జూలై 1న ప్రయోగించిన తొలి నావిగేషన్ ఉపగ్రహంలో లోపం తలెత్తింది. దాని స్థానంలో 'ఐఆర్ఎన్ఎస్ఎస్-1హెచ్'ని ప్రవేశపెడుతోంది. 'షార్' నుంచి గురువారం రాత్రి 7గంటలకు పీఎస్ఎల్వీ-సీ39ని ప్రయోగించనున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt. Ltd., at the Aamoda press at Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: K. Srinivas, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307, RNI NO: AP TEL /2004/12975 .Managing Director : Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.